

'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 325

బుధవారం 7-8-2024



మను.. భోజనమే చేయలేదు

భారత షూటర్ మనుభాకర్ ఒలింపిక్స్ సన్నద్ధతపై కథనం - 11లో



నిఫ్టీ 24 వేల దిగువకు..

ఆరంభ లాభాలు ఆవిరి.. సూచీలకు మూడో రోజూ నష్టాలు - 13లో

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



రాష్ట్రపతికి ఫిజీ పౌర పురస్కారం

రాష్ట్రపతి ముర్మును ఫిజీ ప్రభుత్వం తమ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'కంపానియన్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఫిజీతో గౌరవించింది.

వివరాలు 6లో ▸



ఒక్క రోజు నా కుర్చీలో కూర్చోండి

వారం ముందే కేసును విచారించాలని కోరిన న్యాయవాదిపై సుప్రీంకోర్టు సీజే జస్టిస్ డీవై చంద్రచూడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

వివరాలు 6లో ▸



బ్రిటన్ వలస రగడ తీవ్రతరం

బ్రిటన్‌లోకి అక్రమంగా వలసలు పెరిగాయంటూ కొనసాగుతున్న మితవాద గ్రూపుల ఆందోళనలు పెల్లుబికాయి.

వివరాలు 6లో ▸



నా రన్నింగ్‌మేట్ టిమ్

డెమొక్రటిక్ పార్టీ తరఫున ఉపాధ్యక్ష అభ్యర్థిగా టిమ్ వాల్జ్‌ను ఎంపిక చేస్తున్నట్లు అమెరికా అధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్ ప్రకటించారు.

వివరాలు 6లో ▸

'కడుపు'పై కొట్టారు

రాష్ట్ర వ్యాప్తంగా చిరుద్యోగులను తొలగిస్తూ సరికొత్త పాలన

టీడీపీ నేతల బెదిరింపులకు తలొగ్గుతున్న అధికార గణం

- ఖాళీ అయిన స్థానంలో తమ వారిని నియమించాలని అధికారులకు అల్టిమేటం
- కొత్త నియామకాలకు ముడుపులు దండుకుంటున్న టీడీపీ నేతలు
- 2.65 లక్షల మంది వలంటీర్లను ఇప్పటికే పక్కన పెట్టిన ప్రభుత్వం
- పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండే కార్మికులు వేలాది మంది తొలగింపు
- ఇప్పటికే 2,360 మంది ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లతో బలవంతపు రాజీనామా
- టీడీపీ నేతల వేధింపులతో నలుగురు ఫీల్డ్ అసిస్టెంట్ల ఆత్మహత్య
- నైట్ వాచ్‌మెన్లు, స్కూళ్లలో మరుగుదొడ్లు శుభ్రం చేసే కార్మికులపై కూడా వేటు
- ఏళ్ల తరబడి పని చేస్తున్న రేషన్ డీలర్లతో రాజీనామాలు..అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల రాజీనామాలకు ఒత్తిడి
- వైద్య ఆరోగ్య శాఖలో నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన అభ్యర్థులకు బ్రేక్
- కూటమి నేతల తీరుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు

10లో



ఎన్నికల ముందు..

'వనరుల కల్పన, కొత్త ఉద్యోగాలు, కొత్త పరిశ్రమల ద్వారా భారీ సంఖ్యలో యువతకు ప్రభుత్వ కొలువులతో పాటు విస్తృత ఉపాధి అవకాశాలకు బాటలు వేస్తాం.. సంపద సృష్టించి పంచుతాం' అని కూటమి పార్టీ నేతలు ప్రచారం చేశారు.

గద్దెనెక్కాక..

మాట మార్చేశారు. కొత్త ఉద్యోగాల సంగతి దేవుడెరుగు.. చేస్తున్న చిన్న చిన్నఉద్యోగాలను సైతం అన్యాయంగా ఊడగొడుతున్నారు. చిన్న జీతం తీసుకునే చిరుద్యోగుల పొట్ట గొడుతూ 'తమ్ముళ్ల' జేబులు నింపుకోమంటున్నారు. చివరకు స్కూళ్లలో మరుగుదొడ్లు శుభ్ర పరిచే వర్కర్లను సైతం వదలకుండా అడ్డగోలుగా తీసేసి.. ముడుపులు ఇచ్చిన వారిని నియమిస్తున్నారు.

అన్ని జిల్లాల్లోనూ అక్రమ తొలగింపు పర్వం యథేచ్ఛగా కొనసాగుతోంది. 'ఓట్లేసి గెలిపిస్తే కడుపుపై కొట్టారు' అని బాధితులు కన్నీటిపర్యం తమవుతున్న దృశ్యాలు ఊరూరా కనిపిస్తున్నాయి.

మా చావుకు టీడీపీ వాళ్లే కారణం 10లో నంద్యాల జిల్లా సొదరదిన్నె వెలుగు వీఓఏ సూసైడ్ లెటర్

టీడీపీ నేతల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ నేత శ్రీనివాసరావును పరామర్శిస్తున్న వైఎస్ జగన్



జనాగ్రహాన్ని తట్టుకోలేరు

సీఎం చంద్రబాబుకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ హెచ్చరిక

భయపెడదాం అనుకుంటే మిమ్మల్ని బంగాళాఖాతంలో కలిపేస్తారు

ఈ విధ్వంసాలు, హత్యాకాండతో ఏం సాధించాలి అనుకుంటున్నారు?

- కక్షలు, కార్పణ్యాలు, తీర్పుకోమని గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం కాదా?
- ఇది తప్పుడు సంప్రదాయం.. ఇకనైనా పద్ధతి మార్చుకో
- గ్రామ స్థాయి నుంచి రాష్ట్రమంతా భయానక వాతావరణం
- మీ అండ చూసుకొని మీవాళ్లు కిరాతకాలు, దారుణాలు చేస్తున్నారు
- హామీలు, పాలన గురించి ఎవరూ మాట్లాడకూడదనే ఇదంతా..
- రేపు మా ప్రభుత్వం వచ్చాక మా కార్యకర్తలు బుద్ధి చెప్పే సంప్రదాయానికి బీజం వేస్తున్నారు

2లో

9న నంద్యాల జిల్లాకు వైఎస్ జగన్ 2లో

న్యూస్‌రీల్

విద్యార్థినులకు 'ప్రత్యేక' సెలవు



రాష్ట్రంలోనే తొలిసారిగా విశాఖలోని దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ విద్యార్థినులకు నెలలో ఒక రోజు నెలసరి సెలవును ప్రకటించింది. ఈ విద్యా సంవత్సరం నుంచే ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్టు వర్సిటీ అధికారులు ప్రకటించారు.

వివరాలు 3లో ▸

విశాఖ స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికకు నోటిఫికేషన్



ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు కేంద్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. నామినేషన్ల దాఖలుకు ఈ నెల 13 వరకు గడువిచ్చింది. 30వ తేదీన పోలింగ్ నిర్వహించనుంది.

వివరాలు 2లో ▸

నేత.. మళ్లీ గుండెకోత!



చేనేతకు మళ్లీ చేయూత కరువైంది. వైఎస్ జగన్ తన పాలనలో చేనేత రంగానికి సంక్షేమ రంగులు అద్దితే.. చంద్రబాబు మరోసారి అబద్ధపు హామీల అల్లికలతో దగా చేస్తున్నారంటూ నేతన్నలు వాపోతు న్నారు. నేడు జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

వివరాలు 5లో ▸

రాజకీయ హత్యలతో రాష్ట్రం అట్టుడుకుతోంది



రాజకీయ హత్యలతో రాష్ట్రం అట్టుడికి పోతోందని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలను నెరవేర్చడం కుదరదని కలెక్టర్ల సమావేశంలో చంద్రబాబు పరోక్ష సంకేతాలు ఇచ్చారని మండిపడ్డారు.

వివరాలు 3లో ▸

కూటమి 'స్మార్ట్' నాటకం!

ఏది నిజం?

రివర్స్ టెండరింగ్, న్యాయ సమీక్షతో అత్యంత పారదర్శకంగా స్మార్ట్ మీటర్ల టెండర్లు

- కేంద్రం మార్గదర్శకాలు.. విద్యుత్ నియంత్రణ మండలి అనుమతితోనే మొత్తం ప్రక్రియ
- టెండర్ నిబంధనల మేరకే బిల్లులు చెల్లించిన విద్యుత్ పంపిణీ సంస్థలు
- ప్రతి పైసా ప్రభుత్వమే భరిస్తుందని జీఓ 22తో స్పష్టం చేసిన గత సర్కార్
- నిర్ణీత సమయంలో ఎంత సామగ్రినైనా తనిఖీ చేసే సామర్థ్యం విద్యుత్ వ్యవస్థకు ఉంది
- ప్రతి పరికరం నాణ్యత, సంఖ్య లెక్కించాకే బిల్లులు సమర్పించిన కన్‌స్ట్రక్షన్ విభాగం అధికారులు



- వాటి ఆధారంగానే అకౌంట్స్ విభాగంలో టెండర్ నిబంధనల మేరకు బిల్లులు మంజూరు
- వాస్తవాలు ఇంత స్పష్టంగా ఉన్నా గత సర్కారుపై బురద జల్లడమే పనిగా ఈనాడు తప్పుడు రాతలు

4లో



..అదే కల్లోలం

బంగ్లాదేశ్‌లో కొనసాగుతున్న హింస | దేశవ్యాప్తంగా లూటీలు, విధ్వంసం

పార్లమెంటు రద్దు, త్వరలో ఎన్నికలు.. తాత్కాలిక ప్రభుత్వాధినేతగా యూనస్

బంగ్లాదేశ్‌లో ప్రధాని హసీనా రాజీనామాకు, పలాయనానికి దారితీసిన కార్చిచ్చు ఇంకా చల్లారలేదు. దేశవ్యాప్తంగా దమనకాండ కొనసాగింది. హిందువులను లక్ష్యం చేసుకుని అల్లరి మూకలు రెచ్చిపోయాయి. గత 24 గంటల్లో కనీసం 100 మంది ఘర్షణలకు బలయ్యారు. పార్లమెంటు రద్దుతో ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమమైంది.

6లో

సినీ హీరోను కొట్టి చంపిన మూకలు

హోటల్‌కు నిప్పు

24 మంది సజీవ దహనం

ఇప్పటిదాకా **440** దాటిన మృతులు

బ్రిటన్ నిరాకరణ

పరిశీలనలో గల్ఫ్ దేశాలు, ఫిన్లాండ్ 6లో

చైనా, ఐఎస్ఐ **హస్తం?**

హసీనాను దించేందుకు పక్కాగా పావులు

ఇవాంజూక్






'దారి'దోపిడీకి ముఖ్యనేత పన్నాగం

ఐదేళ్లలో రూ. 8,500 కోట్లు కొల్లగొట్టేందుకు కుట్ర 2లో

- రోడ్ల నిర్మాణ బాధ్యత నుంచి తప్పుకొన్న ప్రభుత్వం
- పీపీపీ విధానంలో 27 రోడ్ల నిర్మాణానికి ఆమోదం
- టోల్ ఫీజుల రూపంలో దోచేందుకు రంగం సిద్ధం
- అస్మదీయులకే కాంట్రాక్టులు.. ఐదేళ్ల పాటు వసూళ్లు
- రూ. 4 వేల కోట్లతో నిర్మాణం.. రూ.12,500 కోట్ల ఆర్జన
- వాహనదారులపై భారీగా టోల్ భారం

రాష్ట్రంలో మరిన్ని విమానాశ్రయాలు, ఎయిర్ స్ట్రిప్‌లు

ముఖ్యమంత్రి చంద్రబాబు



రాష్ట్రంలో మరో 12 నుంచి 14 చోట్ల ఎయిర్‌పోర్టులు, ఎయిర్‌స్ట్రిప్‌లు నిర్మించాలన్నది ప్రభుత్వ ఆలోచన అని సీఎం చంద్రబాబు చెప్పారు. ముందుగా కుప్పం, దగదర్తి, నాగార్జున సాగర్, మూలపేటలో వీటిని నిర్మిస్తామన్నారు. అనంతపురం జిల్లా తాడిపత్రి, కాకినాడ జిల్లా తునిలో కూడా వీటి నిర్మాణాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఏపీ ఏవియేషన్ కార్పొరేషన్‌ను జీఏడీ పరిధిలోకి తేవాలన్నారు.

- వివరాలు 5లో



విజయీ వినేశ్ తిరంగా ప్యారా!

12లో

విశ్వ క్రీడల్లో తమ 'పట్టు'ను నిలబెట్టుకుంటూ వరుసగా ఐదో ఒలింపిక్స్‌లో రెజ్లింగ్ క్రీడాంశంలో భారత్‌కు పతకం ఖరారైంది. మహిళల ఫ్రీస్టయిల్ 50 కేజీల విభాగంలో వినేశ్ ఫొగాట్ ఫైనల్లోకి ప్రవేశించింది. 50 కేజీల ఈవెంట్‌లో వినేశ్ వరుసగా మూడు బౌట్‌లలో విజయం సాధించి స్వర్ణ-రజత పోరుకు అర్హత సాధించింది. సెమీ ఫైనల్లో వినేశ్ 5-0తో పాన్ అమెరికన్ గేమ్స్ చాంపియన్ యుస్నెలిస్ గుజ్మాన్ లోపెజ్‌పై గెలిచింది. మరోవైపు జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ఫైనల్స్‌కు అర్హత సాధించాడు. తొలి ప్రయత్నంలోనే జావెలిన్‌ను 89.34 మీటర్ల దూరం విసిరిన క్వాలిఫై అయ్యాడు. హాకీ సెమీఫైనల్‌లో 3-2 తేడాతో భారత్ జర్మనీ చేతిలో ఓడిపోయింది.

క్లుప్తంగా...

9న నంద్యాల జిల్లాకు వైఎస్ జగన్

సుబ్బరాయుడి కుటుంబానికి పరామర్శ

సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, విజయవాడ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 9న నంద్యాల జిల్లాలో పర్యటించనున్నారు. నంద్యాల జిల్లా మహానంది మండలం సీతారామాపురంలో గత శనివారం అర్ధరాత్రి టీడీపీ మూకల చేతిలో దారుణహత్యకు గురైన వైఎస్సార్‌సీపీ నేత పసుపులేటి సుబ్బరాయుడు కుటుంబాన్ని పరామర్శించనున్నారు. రాష్ట్రంలో పూర్తిగా దిగజారిన శాంతి భద్రతలు, రెండు నెలలుగా కొనసాగుతున్న దారుణ పరిస్థితి, జరుగుతున్న హత్యలు, హత్యాయత్నాలు, దాడులను.. మరోసారి యావత్ దేశం దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు వైఎస్ జగన్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా, జగ్గయ్యపేట మండలం, నవాబ్‌పేటలో టీడీపీ మూకల చేతిలో గాయపడి, విజయవాడ సన్‌రైజ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పార్టీ నాయకులు శ్రీనివాసరావు, గోపి, రామకృష్ణను పరామర్శించిన అనంతరం, అక్కడే మీడియాతో మాట్లాడిన వైఎస్ జగన్ ఈ విషయాలు వెల్లడించారు.

విశాఖ స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికకు నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు మంగళవారం కేంద్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. మంగళవారం నుంచే నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కూడా ప్రారంభమైంది. నామినేషన్ల దాఖలుకు 13 వరకు గడువిచ్చింది. 14న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. నామినేషన్ల ఉపసంహరణకు 16వ తేదీ వరకు గడువిచ్చింది. ఈ నెల 30వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ నిర్వహించనుంది.

సీఐ, ఎస్ఐల సస్పెన్షన్



సీఐ శివకుమార్‌రెడ్డి


ఎస్ఐ నాగేంద్రప్రసాద్

మహానంది: నంద్యాల జిల్లా సీతారామాపురంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు సుబ్బరాయుడు హత్య ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు రూరల్ సీఐ శివకుమార్‌రెడ్డి, మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ డీఐజీ కోయ ప్రవీణ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులిచ్చారు.

మధ్యవర్తులను సంప్రదించవద్దు

భక్తులకు టీటీడీ విజ్ఞప్తి



తిరుమల: ఆన్‌లైన్‌లో దర్శన టికెట్లను బుక్ చేసుకునేందుకు మధ్యవర్తులను సంప్రదించవద్దని టీటీడీ భక్తులకు మరోసారి విజ్ఞప్తి చేసింది. ఇటీవల జరిపిన పరిశీలనలో 545 మంది యాజర్ల ద్వారా దాదాపు రూ.14,449 అనుమానిత శ్రీవాణి లావాదేవీలు జరిగినట్లు టీటీడీ గుర్తించింది. అటువంటి వాటిని బ్లాక్ చేసి వారికి మెసేజ్ ఫార్వార్డ్ చేసింది. కొంతమంది వినియోగదారులు 225 శ్రీవాణి టికెట్లను బుక్ చేసుకున్నారు. ఈ అనుమానిత వ్యక్తులు దర్శనానికి వచ్చినప్పుడల్లా టీటీడీ విజిలెన్స్ విభాగం తనిఖీలు చేస్తోంది. దర్శనం, సేవలు, వసతి బుకింగ్‌లలో నకిలీ ఐడీలతో దర్శనానికి వచ్చే యాత్రికులను కూడా టీటీడీ విజిలెన్స్ విభాగం గుర్తిస్తోంది. అందువల్ల యాత్రికులు మధ్యవర్తుల వద్దకు వెళ్లవద్దని, ఆన్‌లైన్ లేదా కరెంట్ బుకింగ్ ద్వారా దర్శనం టికెట్లను బుక్ చేసుకోవాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. అవకతవకలకు పాల్పడే వారిపై టీటీడీ క్రిమినల్ చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేసింది.

ప్రతి ఎకరాకూ నీళ్లు

మంత్రి నిమ్మల రామానాయుడు



సాక్షి, అమరావతి: ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. ఆయన మంగళవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని జలాశయాలన్నీ కళకళలాడుతున్నాయన్నారు. శ్రీశైలం ప్రాజెక్టులో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి శ్రీశైలం కుడి కాలువ, తెలుగుగంగ, గాలేరు–నగరితోపాటు హంద్రీ–నీవా, కేసీ కాలువ ద్వారా రాయలసీమ సాగు, తాగు నీటి అవసరాలు తీర్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. వరద నీరు వృథాగా సముద్రంలోకి పోకుండా అన్ని రిజర్వాయర్లను పూర్తిగా నీటితో నింపుతామన్నారు. శ్రీశైలం, నాగార్జున సాగర్, పులిచింతల, పట్టిసీమ నుంచి నీటిని తీసుకుని కృష్ణా డెల్టాకు పూర్తి స్థాయిలో నీటిని అందిస్తున్నామని చెప్పారు. ప్రకాశం బ్యారేజ్ నుంచి కృష్ణా డెల్టా కాలువలకు పూర్తిస్థాయిలో నీటిని అందించాలని జారీ చేసిన ఆదేశాల అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎస్ఈ ప్రసాద్‌బాబును ఈఎన్‌సీకి సరెండ్ చేశామని చెప్పారు.

జనాగ్రహాన్ని తట్టుకోలేరు


తనను చూసేందుకు వచ్చిన అశేష జనవాహినికి అభివాదం చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సీఎం చంద్రబాబుకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ హెచ్చరిక

- మా ప్రభుత్వం వచ్చాక మా కార్యకర్తలు బుద్ధి చెప్పే సంప్రదాయానికి బీజం వేస్తున్నారు
- మీ ప్రభుత్వంపై అతి వేగంగా వ్యతిరేకత పెరుగుతోంది
- స్కూళ్లు, చదువులు, ఆస్పత్రులను నిర్వీర్యం చేస్తున్నారు
- హామీలిచ్చిన రైతులు, తల్లులు, విద్యార్థులు అందర్నీ మీరు మోసం చేశారు
- మాకు ఓటు వేశారని నంద్యాలలో ఏకంగా చంపేశారు
- శుక్రవారం అక్కడికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తా
- ఈ దారుణాలను హైకోర్టు, సుప్రీంకోర్టుల దృష్టికి తీసుకెళ్తాం
- దేశంలోని ప్రధాన రాజకీయ పక్షాల దృష్టికి ఇప్పటికే తీసుకెళ్లాం
- ఇన్ని అన్యాయాలు జరుగుతుంటే రాష్ట్రపతి పాలన ఎందుకు విధించకూడదు?
- సుప్రీంకోర్టు జడ్జిగా పని చేసిన గవర్నర్ జోక్యం చేసుకోవాలని కోరుతున్నాం
- విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పార్టీ కార్యకర్తలకు జగన్ పరామర్శ

రాష్ట్రపతి పాలన విధించాలి..

ఈ అరాచక పాలనపై మేం కచ్చితంగా హైకోర్టు తలుపు తడతాం. అవసరమైతే సుప్రీంకోర్టును కూడా ఆశ్రయిస్తాం. రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయమైన ఘటనలు, ఇక్కడి పరిస్థితిని అన్ని రాజకీయ పార్టీలకు వివరించాం. రాష్ట్రంలో జరుగుతున్న ఈ అన్యాయాలు, అఘాయిత్యాలను వివరించి రాష్ట్రపతి పాలన ఎందుకు విధించకూడదు? అని న్యాయస్థానాలకు నివేదిస్తాం.

గవర్నర్ గారికి విన్నపం..

ఈ విషయంలో జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉందని గవర్నర్‌కు విన్నవిస్తున్నాం. మీరు గతంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పని చేశారు. మీరు రాష్ట్రంలో ఉండగా, మీ కళ్ల ముందే ఇవన్నీ జరుగుతున్నాయి. మీరు కచ్చితంగా జోక్యం చేసుకోవాలని ఈ సందర్భంగా గవర్నర్ గారికి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం.

సాక్షి ప్రతినిధి, విజయవాడ: విధ్వంసాలు, హత్యాకాండతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఏం సాధించాలనుకుంటున్నారో చెప్పాలని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలదీశారు. కక్షలు, కార్పణ్యాలు తీర్చుకోమని చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం వల్లే రాష్ట్రం రావణ కాష్టంలా మారిందని మండిపడ్డారు. గ్రామ స్థాయి నుంచి భయానక వాతావరణం సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. ఇలా చేస్తే ప్రజలు భయపడతారనుకోవద్దని, వారి ఆగ్రహం చవిచూడక తప్పదని హెచ్చరించారు. సీఎం చంద్రబాబు పద్ధతి మార్చుకుని పాలనపై దృష్టి సారించాలని హితవు పలికారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం నవాబ్‌పేటలో టీడీపీ మూకల చేతిలో తీవ్రంగా గాయపడి విజయవాడ సన్‌రైజ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనివాసరావు, గోపి, రామకృష్ణను మంగళవారం సాయంత్రం వైఎస్ జగన్ పరామర్శించారు. ఘటన వివరాలు తెలుసుకున్నారు. బాధితులు, వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం అక్కడే మీడియాతో మాట్లాడారు.


విజయవాడ సన్ రైజ్ ఆస్పత్రిలో వైఎస్సార్‌సీపీ నేత దేవిశెట్టి రామకృష్ణను పరామర్శిస్తున్న వైఎస్ జగన్..


మీడియాతో మాట్లాడుతున్న వైఎస్ జగన్

ఆధిపత్యం చాటుకునేందుకు

నవాబ్‌పేటలో మా పార్టీ నేతలపై అత్యంత దారుణంగా దాడి చేశారు. కేవలం ఆధిపత్యం చాటుకునేందుకు పథకం ప్రకారం దాదాపు 20 మంది కలిసి అతి దారుణంగా కర్రలతో కొట్టడంతో తీవ్ర గాయాల పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మీ అండ చూసుకొని మీవాళ్లు కిరాతకాలు, దారుణాలు చేస్తున్నారు. దీనివల్ల మీరేం సాధిస్తారని చంద్రబాబును అడుగుతున్నా.

బాబుపై చాలా వేగంగా వ్యతిరేకత

మీరు చేసే ఈ కిరాతకాలు, దారుణాల వల్ల ప్రజలు భయపడతారనుకుంటున్నారా? ఎవరూ భయపడరు. జనాగ్రహానికి చంద్రబాబును, టీడీపీని బంగాళాఖాతంలో కలిపే పరిస్థితికి దారి తీస్తుంది. సాధారణంగా కొత్త ప్రభుత్వం వస్తే ఆ ప్రభుత్వం మీద వ్యతిరేకత రావడానికి కాస్తో కూస్తో టైమ్ పడుతుంది. కానీ మొట్టమొదటిసారిగా చూస్తున్నాం. చంద్రబాబు మీద వ్యతిరేకత అన్నది చాలా వేగంగా పెరుగుతోంది. ముఖ్యమంత్రి అనే వ్యక్తి పరిపాలన మీద దృష్టి పెట్టాల్సింది పోయి ఏం చేస్తున్నాడనేది తనను తాను ప్రశ్నించుకోవాలి.

అందరినీ మోసం చేశారు..

వ్యవసాయ సీజన్ మొదలు కావడంతో పొలం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కానీ రైతులకు మేనిఫెస్టోలో చెప్పిన రూ.20 వేల పెట్టుబడి సాయాన్ని ఇవ్వకుండా చంద్రబాబు ఎగ్గొట్టేశాడు. అన్నదాతలను మోసం చేశాడు. స్కూళ్లు తెరవడంతో ఇప్పుడు పిల్లలంతా బడికి పోతున్నారు. రాష్ట్రంలో ఎంత మంది పిల్లలు బడికి పోతున్నారో అందరికీ తెలుసు. ఆ తల్లులను దారుణంగా మోసం చేస్తూ చంద్రబాబు వారికి ఇస్తానన్నది (తల్లికి వందనం) ఎగ్గొట్టేశాడు. ప్రతి పిల్లాడిని అడిగి మరీ నీకు 15 వేలు, నీకు 15 వేలు, నీకు 15 వేలు ఇస్తామని నమ్మబలికి వారిని మోసం చేశాడు. ప్రతి అక్కచెల్లెమ్మనూ మోసం చేశాడు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతికి, ప్రతి అక్కచెల్లెమ్మకూ నెలకు రూ.1,500 చొప్పున ఇస్తామని చెప్పి మోసం చేశాడు. ఈరోజు ఫీజు రీయింబర్స్‌మెంట్(రెండు విడతలు) తీసుకోవాల్సిన పిల్లలకు ఇంతవరకు ఫీజులు రాలేదు. పిల్లలు చదువుకోలేని పరిస్థితి, ఫీజులు కట్టలేని దుస్థితి నెలకొంది. కాలేజీ యాజమాన్యాలు ఫీజులు కట్టాలని అడుగుతున్న పరిస్థితులను ఈరోజు చూస్తున్నాం. పిల్లలకు వసతి దీవెన ఎగ్గొట్టేశారు. అక్క చెల్లెమ్మలకు రావాల్సిన సున్నా వడ్డీ కూడా ఎగ్గొట్టేశాడు.

ప్రజలంతా అడుగుతున్నారు..

ఇవన్నీ కూడా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఉన్నప్పుడు, జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు క్రమం తప్పకుండా క్యాలెండర్ ప్రకటించి మరీ అమలు చేస్తూ వచ్చిన పరిస్థితి మీరంతా చూశారు. అమ్మ ఒడి, రైతు భరోసా, విద్యాదీవెన, వసతి దీవెన, సున్నా వడ్డీ, మత్స్యకార భరోసా.. ఇవన్నీ ఈరోజు మాకెందుకు ఇవ్వడంలేదని ప్రజలంతా అడుగుతున్నారు.

ప్రశ్నించకూడదనే..

పిల్లల గురించి పట్టించుకోకుండా స్కూళ్లను, చదువులను నిర్వీర్యం చేస్తూ.. ఆస్పత్రులను నిర్వీర్యం చేస్తూ.. ఏ ఒక్కరూ మిమ్మల్ని ప్రశ్నించకూడదని, రోడ్డెక్కకూడదని భయాందోళనలకు గురి చేయాలనే ఉద్దేశంతో గ్రామస్థాయి నుంచి మీ కక్షలు, కార్పణ్యాలు తీర్చుకోవాలని గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ చంద్రబాబు భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు.

ఇది తప్పుడు సంప్రదాయం..

మళ్లీ మళ్లీ చెబుతున్నా చంద్రబాబుకు. మీరు చేస్తున్నది తప్పుడు సంప్రదాయం. ఇది కనుక కొనసాగిందంటే.. మీ ప్రభుత్వం చాలా వేగంగా తుడిచి పెట్టుకుపోతుంది. ఆ తరవాత మా ప్రభుత్వం వస్తుంది. అప్పుడు మేము వారించినా మా కార్యకర్తలు వినే పరిస్థితి ఉండదు. వారంతా టీడీపీ వారికి బుద్ధి చెప్పే విధంగా ఈరోజు చంద్రబాబు బీజం వేస్తున్నారు.

మరోసారి చెబుతున్నా

చంద్రబాబుకు మరోసారి చెబుతున్నా... ఈ తప్పుడు సంప్రదాయాలు ఇకనైనా ఆపండి. ఇవి పెద్దవై వృక్షాలు అయ్యాయంటే ఆపడం ఎవరి తరం కాకుండా పోతుంది. ఇప్పటికే లా అండ్ ఆర్డర్ పూర్తిగా గాడి తప్పింది. ఏం జరుగుతుందో మీకే తెలియని దారుణ పరిస్థితుల్లోకి వెళ్తోంది. ఒక్క వైఎస్సార్‌సీపీ కార్యకర్తలే కాదు. మా పార్టీని అభిమానించే వారే కాదు. చివరకు మహిళల మీద కూడా అఘాయిత్యాలు పెరిగాయి. చిన్న పిల్లల మీద కూడా అఘాయిత్యాలు పెరిగాయి. రౌడీయిజం పెరిగిపోయింది. ఇష్టం వచ్చినట్లుగా ఎవరికి తోచినట్లుగా వారు వ్యవహరిస్తున్నారు.

యావత్ దేశం దృష్టికి..

మొన్న నంద్యాలలో ఓటు వేశారని మా పార్టీ నేతను ఏకంగా చంపేసిన ఘటనను మీరంతా చూశారు. శుక్రవారం నేను అక్కడికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తా. ఆ ఘాతుకాన్ని రాష్ట్రం, యావత్ దేశం దృష్టికి తీసుకొస్తాం.

ఆస్పత్రి వద్ద భారీగా జనసందోహం..

వైఎస్ జగన్ పార్టీ నేతలను పరామర్శించేందుకు వస్తున్నట్లు తెలియడంతో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీగా తరలి వచ్చారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచే సన్‌రైజ్ ఆస్పత్రి సమీపంలో పెద్ద ఎత్తున గుమికూడారు. పోలీసు బందోబస్తు తగినంత లేకపోవడంతో అక్కడి వచ్చిన వారిని నియంత్రించడం సాధ్యం కాలేదు. జగన్ అతికష్టం మీద ఆస్పత్రిలోకి వెళ్లాల్సి వచ్చింది. మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, మండలిలో ప్రతిపక్షనేత లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, అరుణ్‌కుమార్, రుహుల్లా, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్, పశ్చిమ నియోజక వర్గ ఇన్‌చార్జి ఆసిఫ్, పార్టీ నేత గౌతంరెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గన్నవరం ఎయిర్‌పోర్టులో పోలీసుల ఆంక్షలు

నిరసనగా గేటు వద్ద బైఠాయించిన వెలంపల్లి

సాక్షి, అమరావతి: గన్నవరం విమానాశ్రయంలో పోలీసులు ఎన్నడూ లేని రీతిలో ఆంక్షలు విధించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం బెంగళూరు నుంచి గన్నవరం విమానాశ్రయానికి చేరుకోనుండటంతో స్వాగతం పలికేందుకు వచ్చిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. ఎయిర్ పోర్టు ప్రధాన గేటు వద్ద మాజీ మంత్రులు, ఎమ్మెల్సీ కార్లలో ఉన్న వారిని సైతం దించేశారు. పోలీసుల తీరుకు నిరసనగా మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ ఎయిర్ పోర్టు ప్రధాన గేటు వద్ద బైఠాయించారు.

పులిచింతల గేట్ల ఎత్తివేత

- ప్రాజెక్టులోకి 3.71 లక్షల క్యూసెక్కుల ప్రవాహం
- దిగువకు 1.08 లక్షల క్యూసెక్కులు విడుదల

సాక్షి, అమరావతి/అచ్చంపేట /విజయపురిసౌత్ /శ్రీశైలం ప్రాజెక్ట్ : నాగార్జున సాగర్ నుంచి కృష్ణా జలాలు పెద్ద మొత్తంలో వస్తుండటంతో పులిచింతల ప్రాజెక్టు సగం నిండింది. వరద ప్రవాహం కొనసాగుతుండటంతో పులిచింతల గేట్లు ఎత్తి, ప్రకాశం బ్యారేజీకి నీటిని విడుదల చేస్తున్నారు. పులిచింతల ప్రాజెక్టు పూర్తి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు. మంగళవారం సాయంత్రం 6 గంటలకు పులిచింతలలోకి 3,71,605 క్యూసెక్కుల ప్రవాహం చేరుతుండగా.. ప్రాజెక్టులో 157.48 అడుగుల్లో 22.75 టీఎంసీలను నిల్వ చేస్తూ దిగువకు 1,08,895 క్యూసెక్కులను వదిలేస్తున్నారు. ఇక్కడ మంగళవారం ఉదయం 6 గంటలకు 10.65 టీఎంసీలున్న నిల్వ సాయంత్రం 6 గంటలకు 22.74 టీఎంసీలకు చేరింది. అంటే 12 గంటల్లోనే 12 టీఎంసీలకు పైగా జలాలు ప్రాజెక్టులోకి వచ్చాయి. సాగర్ నుంచి వరద కొనసాగుతుండటంతో నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రకాశం బ్యారేజి గేట్లు కూడా బుధవారం ఎత్తివేయనున్నారు. బ్యారేజ్ నుంచి కృష్ణా డెల్టాకు విడుదల చేయగా మిగులుగా ఉన్న జలాలను సముద్రంలోకి వదిలేయనున్నారు.


పులిచింతల ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

సాగర్ కుడి, ఎడమ కాల్వలకు నీటి పెంపు

సాగర్ ఆయకట్టుకు నీరందించే కుడి ఎడమ కాల్వలకు నీటిని పెంచారు. కుడి కాల్వకు 8,144 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 8,193 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

శ్రీశైలంలోకి 3.71 లక్షల క్యూసెక్కులు

శ్రీశైలం ప్రాజెక్టులోకి వరద ఉధృతి కొనసాగుతోంది. ప్రాజెక్టులోకి 3.71 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. 883.2 అడుగుల్లో 205.66 టీఎంసీలను నిల్వ చేస్తూ.. పది గేట్లను 12 అడుగుల మేర ఎత్తి, కుడి, ఎడమ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ దిగువకు 3.72 లక్షల క్యూసెక్కులను వదులుతున్నారు. బ్యాక్‌వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 25 వేల క్యూసెక్కులు, మల్యాల ఎత్తిపోతలకు 254 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2.400 క్యూసెక్కులు వదిలారు. సాగర్‌లోకి 3.14 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. 585.10 అడుగుల్లో 297.72 టీఎంసీలను నిల్వ చేస్తూ 22 గేట్లను పది అడుగుల మేర ఎత్తి, ప్రధాన కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ దిగువకు 3.36 లక్షల క్యూసెక్కులను వదిలేస్తున్నారు.

వైఎస్ జగన్ క్యాంప్ ఆఫీస్‌లో మీడియా రూమ్ ప్రారంభం



సాక్షి, అమరావతి: ప్రభుత్వ చర్యలు పేదలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని శాసనమండలిలో ప్రతిపక్ష నేత లేళ్ల అప్పిరెడ్డి విమర్శించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్ క్యాంప్ కార్యాలయంలో మీడియా రూమ్‌ను మంగళవారం లేళ్ల అప్పిరెడ్డి, మేరుగు నాగార్జున, వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు మండపాటి శేషగిరిరావు ప్రారంభించారు. అప్పిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ శ్రేణులను నరికి చంపుతున్నా హోం మంత్రికి చీమ కుట్టినట్లు కూడా లేదని విమర్శించారు.

'దారి'దోపిడీకి ముఖ్యనేత పన్నాగం

ఐదేళ్లలో రూ. 8,500 కోట్లు కొల్లగొట్టేందుకు కుట్ర

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో భారీ 'దారి దోపిడీ'కి టీడీపీ కూటమి ముఖ్యనేత పన్నాగం పన్నారు. రాబోయే ఐదేళ్లలో ఏకంగా రూ. 8,500 కోట్లు కొల్లగొట్టేందుకు స్కెచ్ వేశారు. ప్రతిపక్షంలో ఉన్నన్నాళ్లు రోడ్లు అధ్వానంగా ఉన్నాయంటూ గగ్గోలు పెట్టిన ఆయన అధికారంలోకి రాగానే రోడ్ల నిర్మాణం ముసుగులో అడ్డగోలు దోపిడీకి తెరతీశారు. దోపిడీ కోసం పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్(పీపీపీ) విధానాన్ని తెరపైకి తెచ్చారు. తొలుత 27 రాష్ట్ర ప్రధాన రహదారులు, జిల్లా ప్రధాన రహదారులను పీపీపీ విధానంలో నిర్మించేందుకు ఆమోదించారు. తమ బినామీల నిర్మాణ సంస్థలకు కాంట్రాక్టులు కట్టబెట్టి.. రూ. 4 వేల కోట్లతో రోడ్లను నిర్మించి, ఆపై ఐదేళ్లలో రూ.12,500 కోట్లు టోల్ ఫీజుల వసూలు చేయనున్నారు. నికరంగా రూ. 8,500 కోట్లు కొల్లగొట్టేందుకు కుట్ర పన్నారు. రాష్ట్రంలో వాహనదారులపై భారీగా ఆర్థిక భారం మోపుతూ.. బినామీ కాంట్రాక్టర్ల రూపంలో వేల కోట్ల రూపాయలు కొల్లగొట్టేందుకు ముఖ్యనేత పన్నాగం ఇది.



రోడ్ల నిర్మాణ బాధ్యత నుంచి తప్పుకున్న ప్రభుత్వం

జాతీయ రహదారులను నిర్మించే కేంద్ర ప్రభుత్వం మాత్రమే ఇప్పటివరకు టోల్ ఫీజులను వసూలు చేస్తోంది. రాష్ట్ర, జిల్లా ప్రధాన రహదారులను అన్ని రాష్ట్రాలు తమ ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్నాయి. ఇప్పుడు ఈ విధానానికి టీడీపీ కూటమి ప్రభుత్వం స్వస్తి పలికింది. పీపీపీ విధానాన్ని తెరపైకి తెచ్చింది. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమేరకు నిర్ణయించారు. అందుకోసం రాష్ట్రంలోని 27 రహదారులను ఎంపిక చేశారు. కలెక్టర్లు, ఎస్పీలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలోనూ చంద్రబాబు ఆ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. మొదటగా 14 రోడ్లను నిర్మిస్తామన్నారు. అనంతరం మిగిలిన రోడ్ల నిర్మాణాన్ని చేపడతామన్నారు. ఆరోడ్లపై వాహనదారుల నుంచి టోల్ వసూలు చేస్తామన్నారు. దశలవారీగా రాష్ట్రంలోని అన్ని రహదారులను పీపీపీ విధానంలోనే నిర్మించాలన్నది టీడీపీ కూటమి ప్రభుత్వ ఉద్దేశం.

టోలుతో భారీ దోపిడీకి కుట్ర..

పీపీపీ విధానంలో 1,778 కి.మీ. ఉన్న 27 రహదారులను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నామమాత్రంగా టెండర్ల ప్రక్రియ నిర్వహించి ఆ రోడ్ల నిర్మాణ కాంట్రాక్టులను ముఖ్య నేత బినామీ, సన్నిహిత సంస్థలకే కట్టబెడతారన్నది బహిరంగ రహస్యం. గతేడాది ఆర్ అండ్ బి శాఖ కి.మీ.కు గరిష్ఠంగా రూ. 2 కోట్లు చొప్పున టెండర్లు ఖరారు చేసిన విషయం తెలిసిందే. ఆ రేట్ల ప్రకారం చూస్తే మొత్తం 1,778 కి.మీ.కు రూ. 3,556 కోట్లు ఖర్చవుతుంది. ఈ ఏడాదిలో మెటీరియల్ ధరలు కాస్త పెరిగాయని భావించినా మొత్తం మీద రూ. 4 వేల కోట్లకు మించదు. జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) 2023–24లో వసూలు చేసిన టోల్ ఫీజుల నిష్పత్తిలో లెక్కిస్తే.. రాష్ట్ర ప్రభుత్వం నిర్మించనున్న 1,778 కి.మీ. రోడ్ల నుంచి ఏడాదికి రూ. 2,500 కోట్ల వరకు టోల్ ఫీజుల రూపంలో వసూలు అవుతుంది. ఆ ప్రకారం ఐదేళ్లకు రూ. 12,500 కోట్లు టోల్ ఫీజుల రూపంలో వసూలు చేస్తారన్నది సుస్పష్టం. అంటే ముఖ్యనేత బినామీ సంస్థలు కేవలం రూ. 4 వేల కోట్లు వెచ్చించి.. ఐదేళ్ల పాటు టోల్ ద్వారా రూ. 12,500 కోట్లు వాహనదారుల నుంచి కొల్లగొట్టనున్నారు. నికరంగా ఐదేళ్లలో ముఖ్య నేత జేబులోకి రూ. 8,500 కోట్లు చేరనుంది.

వాహనదారులపై భారీ ఆర్థికభారం

పీపీపీ విధానంలో నిర్మించనున్న ఆ 27 రోడ్లపై ప్రయాణించే వాహనదారులపై భారీ ఆర్థికభారం పడనుంది. ఆ మార్గంలో ప్రయాణించే ఆర్టీసీ బస్సుల నుంచి కూడా టోల్ ఫీజు వసూలు చేస్తారు. దాంతో ఆర్టీసీ చార్జీలు కూడా పెంచుతారు. వాహనదారులు ఆ విధంగా ఐదేళ్లలో ఏకంగా రూ.12,500 కోట్లు భరించాల్సి ఉంటుంది. అదే ఆ 27 రోడ్లను ప్రభుత్వ నిధులతో నిర్మిస్తే ప్రజలపై టోల్ ఫీజుల భారం పడదు. నాబార్డ్ తదితర బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని రోడ్లు నిర్మించవచ్చు. ప్రభుత్వం దశలవారీగా బ్యాంకు రుణాలను తీర్చవచ్చు. అలా చేస్తే ముఖ్యనేతకు ఏం ప్రయోజనం..? పీపీపీ విధానంలో తమ బినామీ కాంట్రాక్టు సంస్థల ద్వారా రోడ్లను నిర్మిస్తేనే కదా ఆయన జేబులు నిండేది.

పీపీపీ విధానంలో నిర్మించాలని నిర్ణయించిన రోడ్లు

1) కళింగపట్నం నుంచి శ్రీకాకుళం మీదుగా పార్వతీపురం	15) గుంటూరు - పర్చూరు,
2) గార నుంచి ఆమదాలవలస మీదుగా బత్తిలి	16) నరసరావుపేట - సత్తెనపల్లి
3) చిలకపాలెం నుంచి రాజాం మీదుగా అంతర్రాష్ట్ర రాయగడ రోడ్	17) వాడరేవు నుంచి నరసరావుపేట మీదుగా పిడుగురాళ్ల రోడ్
4) భీమునిపట్నం నుంచి చోడవరం మీదుగా తుని	18) కావలి నుంచి ఉదయగిరి మీదుగా సీతారాంపురం రోడ్
5) విశాఖపట్నం నుంచి ఎస్.కోట మీదుగా అరకు	19) నెల్లూరు - సైదాపురం రోడ్
6) కాకినాడ - జొన్నాడ	20) గూడూరు నుంచి రాపూరు మీదుగా రాజంపేట రోడ్
7) రాజమహేంద్రవరం నుంచి మారేడుమిల్లి మీదుగా భద్రాచలం	21) మైదుకూరు - తాటిచెర్ల రోడ్
8) అమలాపురం - బొబ్బర్లంక 9) రాజవరం - పొదలాడ	22) పులివెందుల నుంచి ధర్మవరం మీదుగా దమజిపల్లి రోడ్
10) ఏలూరు - కైకలూరు	23) చాగలమర్రి నుంచి వేంపల్లి మీదుగా రాయచోటి రోడ్
11) ఏలూరు నుంచి చింతలపూడి మీదుగా మేడిశెట్టివారిపాలెం	24) అనంతపురం నగరంలో రింగ్ రోడ్
12) భీమవరం నుంచి కైకలూరు మీదుగా గుడివాడ	25) సోమందేపల్లి నుంచి హిందూపూర్ బైపాస్ మీదుగా తుమకుంట
13) గుడివాడ - కంకిపాడు (విజయవాడ)	26) అనంతపురం - చెన్నై రహదారిలో కదిరి రింగ్ రోడ్
14) విజయవాడ నుంచి ఆగిరిపల్లి మీదుగా నూజివీడు	27) కాలవగుంట - పెనుమూరు నెంద్రగుంట రోడ్

సినిమా చెట్టుకు పునరుజ్జీవం!?



తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామంలో కూలిపోయిన సినిమాల చెట్టుగా ప్రసిద్ధికెక్కిన భారీ నిద్ర గన్నేరు వృక్షానికి మళ్లీ జీవం పోసేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. అమెరికాలోని వాషింగ్టన్‌లో ఉన్న ఓ పర్యావరణ ప్రేమికుడు ఈ చెట్టు చరిత్రను తెలుసుకుని దానికి జీవం పోసేందుకు అయ్యే ఖర్చులు తాను భరిస్తానని ముందుకొచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. – కొవ్వూరు

వికసించిన బ్రహ్మకమలం

హిమాలయ పర్వతాల్లో కనిపించే.. సంవత్సరానికి ఒక్కసారి మాత్రమే వికసించే అరుదైన పుష్పం బ్రహ్మ కమలం అన్నమయ్య జిల్లా కలకడ మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీ యర్రయ్యగారిపల్లెలో మంగళవారం రాత్రి విచ్చుకుంది. ఆకులే పువ్వుగా రూపాంతరం చెందే ఈ మొక్కను ఆర్‌కె స్టూడియో యజమాని రామకృష్ణ, లక్ష్మీప్రసన్న దంపతులు తమ ఇంట్లో పెంచుతున్నారు. బ్రహ్మ కమలాన్ని స్థానికులు ఆసక్తిగా చూశారు. – కలకడ



ఘనంగా 'స్నేహానికి స్వర్ణోత్సవం'

తిరుపతి ఎస్వీ వైద్య కళాశాల 1974వ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన 'స్నేహానికి స్వర్ణోత్సవం' కార్యక్రమం మంగళవారం ముగిసింది. దేశ విదేశాలలో ఉన్నత స్థాయిలో స్థిరపడిన నాటి విద్యార్థులు హాజరై సందడి చేశారు. అమెరికాలో స్థిరపడిన ప్రముఖ న్యూరాలజిస్ట్, దర్శక నిర్మాత, సినీ హీరో హరినాథ్ పోలిచెర్ల చేసిన శ్రీకృష్ణ ఏకపాత్రాభినయం అలరించింది. పూర్వ వైద్య విద్యార్థుల భవన నిర్మాణానికి హరినాథ్ 25 వేల డాలర్లు విరాళంగా ఇచ్చారు. ఆయన్ను జీవిత సాఫల్య పురస్కారంతో సన్మానించారు. డాక్టర్ రవీంద్రనాథ్, డాక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. –తిరుపతి తుడా



గుంటూరులో టీడీపీ ఎమ్మెల్యే 'విధ్వంస' రచన

శిలాఫలకాన్ని కూల్చేసిన తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్



శిలాఫలకాన్ని ధ్వంసం చేస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

నెహ్రూనగర్: గుంటూరు తూర్పు నియోజకవర్గం 54వ వార్డు రాజీవ్‌గాంధీనగర్‌లో గత వైఎస్సార్‌సీపీ పాలనలో అభివృద్ధి చేసిన పనుల వివరాలను తెలియజేస్తూ ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని మంగళవారం టీడీపీ తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మలాట్ తీసుకుని పగలగొట్టడంపై చర్చనీయాంశంగా మారింది. కూటమి అధికారంలోకి వచ్చిన రోజుల వ్యవధిలోనే ఇదే వార్డులో మూడు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ధ్వంసం చేసిన నేపథ్యంలో స్థానిక కార్పొరేటర్ మల్లవరపు రమ్య అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికి పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. తాజాగా స్వయంగా ఎమ్మెల్యేనే శిలాఫలకాన్ని ధ్వంసం చేయడాన్ని చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. కాగా, ఈ ప్రాంతాన్ని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ నూరిఫాతిమా, డిప్యూటీ మేయర్ డైమండ్‌బాబు, ఇతర కార్పొరేటర్లు, పార్టీ నేతలు పరిశీలించారు.

పెండింగ్ జీతాలు విడుదల చేయండి

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, నైట్ వాచ్‌మెన్‌లకు పెండింగ్ జీతాలు చెల్లించాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేశ్‌బాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఏపీ మానవ వనరుల శాఖ మంత్రి లోకేశ్‌కు లేఖ రాశారు. పాత జీతాలు విడుదలతో పాటు కొత్తగా వేతనాలు పెంచాలని కోరారు.

పాత, కొత్తవాళ్లు కలిసి పనిచేయాలి

ఐదుగురు విశాఖ కార్పొరేటర్లను జనసేనలోకి ఆహ్వానించిన పవన్



సాక్షి, అమరావతి: గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన ఐదుగురు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ మంగళవారం జనసేన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. విశాఖకు చెందిన వివిధ పార్టీల నాయకులు మరికొందరు కూడా పవన్ సమక్షంలో జనసేనలో చేరారు. మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఉప ముఖ్యమంత్రిగా నేను బాధ్యతలు చేపట్టిన అనంతరం జనసేనలో ఇవే మొట్టమొదటి చేరికలు. నాకు ఇష్టమైన విశాఖపట్నం నుంచి జనసేనలో చేరికలు మొదలుకావడం ఆనందంగా ఉంది. కొత్తగా పార్టీలో చేరిన నాయకులు రాజకీయంగా ఎదిగేందుకు అనువైన వాతావరణం ఉంటుంది. పాత, కొత్త నాయకులు అందరూ కలిసి పనిచేయాలి. భవిష్యత్‌లో విశాఖపట్నం కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి విజయం సాధించాలి' అని అన్నారు. విశాఖపట్నంలో కాలుష్య సమస్యలతోపాటు రియల్ ఎస్టేట్ పరంగా కొత్త నిర్మాణాల అంశంలో ఎదురవుతున్న ఇబ్బందులను మంత్రిగా తాను, కార్పొరేటర్లు కలిసి పరిష్కరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. కాగా, మంగళవారం సాయంత్రానికి 12 లక్షలకు పైగా జనసేన సభ్యత్వాలు నమోదయ్యాయని తెలియజేస్తూ ఆ పార్టీ నాయకులు పవన్‌కు అభినందనలు తెలిపారు. ఎమ్మెల్సీ హరిప్రసాద్, ఎమ్మెల్యే వంశీ శ్రీనివాస్, జనసేన పార్టీ కార్యక్రమాల నిర్వహణ విభాగం కన్వీనర్ కళ్యాణం శివ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఇన్ పార్లమెంట్

లోక్‌సభ

ప్రత్యేక హోదా హామీ నెరవేర్చాలి

వైఎస్సార్‌సీపీ ఎంపీ అవినాష్‌రెడ్డి డిమాండ్



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా డిమాండ్‌పై మరోసారి వైఎస్సార్‌సీపీ పార్లమెంటు వేదికగా గళమెత్తింది. మంగళవారం ఆర్థిక బిల్లుపై వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రత్యేక హోదా ఇవ్వాలని ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలుమార్లు ప్రధాని నరేంద్రమోదీని కలిసి విజ్ఞప్తి చేశారని గుర్తు చేశారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీల ప్రకారం కడపలో స్టీల్‌ప్లాంటు, రైల్వే జోన్ ఏర్పాటు చేయాలన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. బడ్జెట్ కేటాయింపు అసంతృప్తికి దోహదపడేలా ఉందని, మధ్య తరగతిపై ఆర్థిక ఒత్తిడి పడే అవకాశం ఉందన్నారు.

ఏపీ ప్రజలు మోసపోతారనుకోవడం లేదు

కేంద్ర బడ్జెట్‌లో చెప్పిన రుణం, గ్రాంట్లు చూసి ఆంధ్రప్రదేశ్ ప్రజలు మోసపోతారని తాను భావించడం లేదని టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని వెనుకబడిన జిల్లాలకు గ్రాంట్లు ఇస్తామని బడ్జెట్ సమయంలో కేంద్రం చెప్పిందంతా అరచేతిలో వైకుంఠం చూపడమేనని మహువా మొయిత్రా ఆరోపించారు. లోక్‌సభలో ఆర్థిక బిల్లుపై చర్చలో ఆమె మాట్లాడారు. బడ్జెట్‌లో ఏపీకి ఒనగూడిందేమీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

రాజ్యసభ

ఎఫ్‌సీఐల ద్వారా క్వింటాలు బియ్యం రూ.2800కు రిజర్వు

వైఎస్సార్‌సీపీ సభ్యుడు విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రమంత్రి సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ : ఎఫ్‌సీఐ డిపోల నుంచి ప్రైవేటు వ్యాపారులు/వ్యాపారవేత్తలు/ వ్యక్తులు బియ్యం అమ్మకం నిమిత్తం క్వింటాలు ధర రూ.2800 రిజర్వు చేసినట్లు ఆహార వినియోగదారుల వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జయంతిభాయ్ బంభానియా తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు విజయసాయిరెడ్డి ప్రశ్నకు రాజ్యసభలో మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

కోచింగ్ సెంటర్ల నియంత్రణకు ప్రైవేటు బిల్లు..

కోచింగ్ సెంటర్లలో కనీస వసతులు ఉండేలా నియంత్రణ కోరుతూ పార్లమెంటులో ప్రైవేటు మెంబరుబిల్లు ప్రవేశపెడతా అని వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. 'విద్యా సంస్థల మాదిరి అవి కూడా నిబంధనలకు కట్టుబడి ఉండాలి. విద్యార్థులకు ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలి. భద్రత నిబంధనలు పాటించాలి. వాటిపై ఫిర్యాదులు చేసే యంత్రాంగం ఉండాలి' అని ఎంపీ విజయసాయిరెడ్డి ఎక్స్‌లో పోస్టు చేశారు.

విశాఖ పోర్టు సామర్థ్య వినియోగం పెంపు..

విశాఖపట్నం పోర్టు సామర్థ్య వినియోగం పెరుగుతున్నదని కేంద్ర నౌకాయాన శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ తెలిపారు. 2020–21లో 52 శాతం ఉండగా 2023–24 ఏప్రిల్–జూన్ నాటికే 59.1 శాతం సాధించిందని వైఎస్సార్‌సీపీ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. గడిచిన ఐదేళ్లలో పోర్టులో రూ.1354.73 కోట్లతో 26 ప్రాజెక్టులు చేపట్టగా 15 ప్రాజెక్టులు పూర్తయ్యాయని మరో 11 వివిధ దశల్లో ఉన్నాయని కేంద్రమంత్రి తెలిపారు.



ఐటీ చట్టం సవరించాలి..



ఐటీ చట్టాన్ని సవరించాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ పిల్లి సుభాష్‌చంద్ర బోస్ పేర్కొన్నారు. వాట్సాప్, సోషల్ మీడియా, యూట్యూబ్‌ల ద్వారా వ్యక్తుల క్యారెక్టర్ డ్యామేజీ చేస్తుండడంతో ఆత్మహత్యలకు దారి తీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక ప్రస్తావన ద్వారా ఈ అంశాన్ని సభ దృష్టికి తీసుకొచ్చారు.

రాజకీయ హత్యలతో రాష్ట్రం అట్టుడుకుతోంది

- లోకేశ్ రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది
- హత్యలు చేయడంలో టీడీపీ నేతలు ఆరితేరిపోయారు
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆగ్రహం



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: గత ప్రభుత్వంలో వేసిన అభివృద్ధి శిలాఫలకాలను టీడీపీ ఎమ్మెల్యేలు ధ్వంసం చేస్తున్నారు. అధికారం ఎవ్వరికీ శాశ్వతం కాదు. ఎవరైతే శిలాఫలకాలను కూల్చివేస్తారో.. మళ్లీ వాళ్లేతోనే నిర్మింపజేస్తాం. టీడీపీ నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు కృషి చేయాలి. లేకపోతే ప్రజలకు అండగా నిలిచి.. పోరాటం చేస్తాం' అని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. ఆయన మంగళవారం నెల్లూరులో మీడియాతో మాట్లాడారు. రాజకీయ హత్యలతో రాష్ట్రం అట్టుడికిపోతోందని.. లోకేశ్ రెడ్‌బుక్ రాజ్యాంగం నడిపిస్తున్నాడని కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. 'ఎన్నికల హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చడం కుదరదని కలెక్టర్ల సమావేశంలో చంద్రబాబు పరోక్ష సంకేతాలు ఇచ్చారు. మైసూర్ బోండాలో మైసూర్‌లాగా.. ఉచిత ఇసుకలో ఉచితం కన్పిస్తోంది. ఉచిత ఇసుక ఇస్తున్నట్లు చంద్రబాబు రోజూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారు. ఆ ఉచిత ఇసుక ఎక్కడ దొరుకుతుందో చంద్రబాబుకే తెలియాలి. టీడీపీ మూకలు మాత్రం ఇసుక రేవుల్లో పడి ఇష్టారాజ్యంగా దోచేస్తున్నాయి. రాష్ట్రంపై రూ.14 లక్షల కోట్ల అప్పు భారం ఉందంటూ రచ్చ చేసిన చంద్రబాబు.. గవర్నర్ ప్రసంగంలో మాత్రం రూ.10 లక్షల కోట్ల అప్పు ఉందని చెప్పించారు. ఇష్టారీతిన హామీలు ఇచ్చినప్పుడు గుర్తుకు రాలేదా అప్పుల గురించి? అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న ఎమ్మెల్యేలు చెప్పినట్లుగా నడుచుకోవాలని కలెక్టర్లు, ఎస్పీలకు చెప్పడం ద్వారా చంద్రబాబు కూడా అవినీతికి వంతపాడుతున్నారు. దాడులు, అవినీతి, అక్రమాల్లో టీడీపీ నేతలు ఆరితేరిపోయారు' అని కాకాణి ధ్వజమెత్తారు.

విద్యార్థినులకు 'ప్రత్యేక' సెలవు

- దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీలో అమలు
- రాష్ట్రంలోనే మొదటిసారి విద్యార్థినులకు నెలసరి సెలవు
- నెలలో ఒక రోజు తీసుకునే అవకాశం
- ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు



దామోదర సంజీవయ్య లా యూనివర్సిటీ

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: రాష్ట్రంలోనే తొలిసారిగా విశాఖలోని దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ (డీఎస్‌ఎన్‌ఎల్‌యూ) విద్యార్థినులకు నెలలో ఒక రోజు నెలసరి సెలవును ప్రకటించింది. కేవలం మెయిల్ ద్వారా ఈ ప్రత్యేక సెలవు తీసుకునే అవకాశం విద్యార్థినులకు కల్పించింది. ప్రస్తుత (2024–25) విద్యా సంవత్సరం నుంచే ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్టు యూనివర్సిటీ అధికారులు ప్రకటించారు. నెలసరి సమయాల్లో మహిళల్లో వచ్చే కొన్ని ఆరోగ్యపరమైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. నెలసరి సమయాల్లో ఆరోగ్య సమస్యలతో విద్యార్థినులు కాలేజీకి వెళ్లడంలేదు. ప్రత్యేకంగా సెలవు కావాలంటే మెడికల్ సర్టిఫికెట్ సమర్పించాలి. ఈ నేపథ్యంలోనే ప్రత్యేక సెలవు కోరుతూ యూనివర్సిటీ విద్యార్థినులు గత విద్యా సంవత్సరంలోనే రిజిస్ట్రార్ ముందు ఈ ప్రతిపాదన పెట్టారు. జనవరిలో ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది.

దేశంలో 8 యూనివర్సిటీల్లో అమలు

ఇప్పటికే దేశంలోని 7 యూనివర్సిటీల్లో ఈ విధానం అమల్లో ఉంది. రాయిపూర్‌లోని హిదయతుల్లా నేషనల్ లా యూనివర్సిటీ, ముంబై, ఔరంగాబాద్‌ల్లో ఉన్న మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీలు, భోపాల్‌లోని నేషనల్ లా ఇన్‌స్టిట్యూట్ యూనివర్సిటీ, జబల్‌పూర్‌లోని ధర్మశాస్త్ర నేషనల్ లా యూనివర్సిటీ, హైదరాబాద్‌లోని నల్సార్, అసోంలోని నేషనల్ లా యూనివర్సిటీ అండ్ జ్యుడిషియల్ అకాడమీల్లో ఈ విధానం అమలవుతోంది. దామోదరం సంజీవయ్య నేషనల్ లా వర్సిటీ ఎనిమిదోది.

కానిస్టేబుల్ రాత పరీక్ష అభ్యర్థుల సమస్యలు తీర్చండి

రాష్ట్ర హోంమంత్రికి ఏపీ నిరుద్యోగ జేఏసీ విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గతేడాది నిర్వహించిన పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్ష అభ్యర్థులకు న్యాయపరమైన సమస్యలు తొలగించి, ఐదు గ్రేస్ మార్కులు వేయాలని హోంమంత్రి వంగలపూడి అనితకు ఏపీ నిరుద్యోగ జేఏసీ విజ్ఞప్తి చేసింది. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో జేఏసీ అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ హోంమంత్రికి వినతి పత్రం అందజేశారు. వివిధ ప్రభుత్వ శాఖల్లోని ఖాళీ పోస్టులకు నోటిఫికేషన్లు ఇచ్చి ఏపీపీఎస్సీ, ఏపీ డీఎస్సీ ఉద్యోగ వయోపరిమితి 47 సంవత్సరాలకు పెంచాలన్నారు. గ్రూప్–2 మాదిరిగానే, గ్రూప్–1 అభ్యర్థులకు మెయిన్స్ పరీక్ష రాసేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 20 లక్షల ఉద్యోగాలకు త్వరలోనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, అకాడమీ పుస్తకాలను ఉచితంగా అభ్యర్థులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయాల్లో అన్ని బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలు పూర్తి చేయాలని కోరారు.

ఎన్‌ఆర్‌ఐ కోటా సీట్ల భర్తీకి దరఖాస్తులు

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరంలో ఎన్‌ఆర్‌ఐ, ఇన్ లై ఆఫ్ ఎన్‌ఆర్‌ఐ కోటాలో ఎమ్మెస్సీ, ఎంటెక్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నోటిఫికేషన్‌ను ఈ నెల 9వ తేదీన జారీ చేస్తున్నారని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తాము పూర్తి చేసిన దరఖాస్తులను వ్యక్తిగతంగా కానీ, పోస్టులో కానీ ఈ నెల 31వ తేదీ సాయంత్రం నాలుగు గంటల లోపు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, పరిపాలన విభాగం, లాంఫాం, గుంటూరు–522034 అడ్రస్‌కు అందజేయాలని కోరారు. మరిన్ని వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్‌జీఆర్‌ఏయూ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు.

12 నుంచి హెచ్‌ఐవీపై అవగాహన సదస్సులు

సాక్షి, అమరావతి: హెచ్‌ఐవీ/ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తిపై సమాజంలో అవగాహన పెంచాలని రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఏపీశాక్స్) ఏపీడీ డాక్టర్ సరస్వతి సూచించారు. దీన్లో భాగంగా ఈనెల 12 నుంచి 2 నెలల పాటు రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహించనున్నామన్నారు. ఏపీ శాక్స్ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ శాఖలతో రాష్ట్ర స్థాయి జాయింట్ వర్కింగ్ గ్రూప్ కమిటీ సమావేశం విజయవాడలో మంగళవారం నిర్వహించారు. డాక్టర్ సరస్వతి మాట్లాడుతూ వంద మంది కన్నా ఎక్కువ సంఖ్యలో పనిచేస్తున్న సంస్థల్లో ఒక కంప్లైంట్ అధికారిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అవగాహన సదస్సుల నిర్వహణలో 18లైన్ డిపార్ట్‌మెంట్లు సహకరించేందుకు ముందుకు రావడం హర్షణీయమన్నారు. అందరి సహకారంతో 2030 నాటికి వ్యాధి వ్యాప్తి సున్నా శాతానికి తీసుకువస్తామన్నారు. ఐఈసీ, జేడీ డాక్టర్ మంజుల మాట్లాడుతూ.. ప్రతి జిల్లాలో ఒక అంబుడ్స్‌మెన్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

దళిత మృత వీరుల కుటుంబాలకు అన్యాయం

- సీపీఎం రాష్ట్ర కార్యవర్గదర్శి సభ్యురాలు డి.రమాదేవి
- చుండూరు రక్త క్షేత్రం వద్ద సంస్మరణ సభ

చుండూరు (భట్టిప్రోలు): మూడున్నర దశాబ్దాలు కావస్తున్నా చుండూరు దళిత మృత వీరుల కుటుంబాలకు న్యాయం జరగకపోవడం విచారకరమని ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ధోరణే కారణమని సీపీఎం రాష్ట్ర కార్యవర్గదర్శి సభ్యురాలు డి.రమాదేవి ధ్వజమెత్తారు. మంగళవారం బాపట్ల జిల్లా చుండూరులోని దళిత మృత వీరుల పేరుతో రక్తక్షేత్రం వద్ద సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మృత వీరుల సమాధుల వద్ద సీపీఎం, కేవీపీఎస్, దళిత, బహుజన, ప్రజా సంఘాల నాయకులు నివాళులర్పించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. జాలాది మోజెస్ అధ్యక్షతన జరిగిన సభలో రమాదేవి మాట్లాడుతూ అగ్రవర్ణాల దాడిలో చనిపోయిన వీరుల కుటుంబాలకు ప్రభుత్వాలు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం దళితుల మధ్య చిచ్చుపెట్టి పేదలను నిర్లక్ష్యం చేస్తుందన్నారు. బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తుందని మండిపడ్డారు. కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎ.మాల్యాద్రి, దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు మేళం భాగ్యారావు, వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్‌జే విద్యాసాగర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి.కృష్ణమోహన్, వివిధ సంఘాల నాయకులు బి.అగస్టీన్, శ్రీమన్నారాయణ, దళిత నాయకులు చార్వాక, రోజన్‌బాబు పాల్గొన్నారు.

చిరికివానిపాలెం టూ పారిస్

గతేడాది ఏషియన్ పారా క్రీడల్లో మెరిసిన చిరికివానిపాలెం క్రీడా ఆణిముత్యం మరోమారు అంతర్జాతీయ వేదికపై తన సత్తా చాటేందుకు ఉవ్విళ్లూరుతున్నాడు. ఈ నెల 28 నుంచి ప్రారంభమయ్యే పారిస్ పారా ఒలింపిక్స్ పోటీలకు ఏపీ నుంచి ఎంపికైన ఏకైక పారా క్రీడాకారుడు కాగా, అక్కడ జేగంట మోగించి క్రీడా చరిత్రలో తన పేరు లిఖించుకోవడానికి కఠోర సాధన చేస్తున్నాడు.

పారా ఒలింపిక్స్ పోటీలకు రొంగలి రవి

- బెంగళూరులోని షాట్‌పుట్ విభాగంలో ప్రతిభ చూపి అర్హత
- ఏపీ నుంచి ఎంపికైన ఏకైక పారా క్రీడాకారుడు
- ఈ నెల 28 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు 'పారా' పోటీలు



సిల్వర్ పతకాన్ని సాధించిన రవి

కె.కోటపాడు: పారిస్‌లో ఈ నెల 28 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు నిర్వహించే పారా ఒలింపిక్స్ పోటీలకు కె.కోటపాడు మండలం వారాడ శివారు చిరికివానిపాలేనికి చెందిన రొంగలి రవి ఎంపికయ్యాడు. గత నెల 16, 17 తేదీల్లో బెంగళూరులోని కంఠీరవ స్టేడియంలో పారా క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చాటి షాట్‌పుట్ ఎఫ్–40 విభాగంలో పాల్గొనున్నాడు. ఇండియా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న 38 మంది పారా క్రీడాకారుల్లో ఏపీ నుంచి రవి మాత్రమే ఉండటం గమనార్హం.

ఏషియన్ పారా క్రీడా పోటీల్లో సిల్వర్ మెడల్

చైనాలో గతేడాది అక్టోబరులో జరిగిన ఏషియన్ పారా గేమ్స్‌లో పారా క్రీడాకారుడు రవి సిల్వర్ మెడల్ సాధించాడు. అప్పట్లో అతడిని ప్రధాని నరేంద్రమోదీ అభినందించారు. స్వగ్రామం చిరికివానిపాలెంలో అప్పటి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

చిన్నప్పటి నుంచి క్రీడలపై ఆసక్తి

చిన్నప్పటి నుంచి రవి చదువుతో పాటు క్రీడలపై ఆసక్తిని చూపేవాడు. ఒకటి నుంచి పదో తరగతి వరకు భీమిలీ ఏఎంజీ పాఠశాలలో చదివాడు. పదిలో 9.0 గ్రేడింగ్‌తో ఉత్తీర్ణత సాధించాడు. ఎస్.కోటలో ఇంటర్ చదివి 933 మార్కులు, డిగ్రీలో 7.8 గ్రేడింగ్‌తో ఉత్తీర్ణత సాధించాడు. చదువుకున్న రోజుల్లో తనకు దివ్యాంగత్వం ఉన్నా, తోటి స్నేహితులతో క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనేవాడు.



ఆర్థిక స్థోమత లేకపోవడంతో అథ్లెటిక్స్ వైపు...

తల్లిదండ్రులు దేముడుబాబు, మంగ వ్యవసాయం చేస్తుంటారు. వీరి ఆర్థిక స్థోమత అంతంత మాత్రంగానే ఉండడంతో రవికి ఎంతో ఇష్టమైన బ్యాడ్మింటన్ విభాగం నుంచి అథ్లెటిక్స్ వైపు మళ్లాడు. షాట్‌పుట్, జావెలిన్‌త్రో విభాగాల్లో పాల్గొంటూ ప్రతిభ చాటుతున్నాడు. క్రీడా కోటాలో భాగంగా 2023లో ఇన్‌కం టాక్స్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగాన్ని పొందాడు. ఈ నేపథ్యంలో పారిస్‌లో పారా ఒలింపిక్స్ పోటీలకు ఎంపికైనట్టు తెలుసుకున్న గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పతకాన్ని సాధించి, దేశానికి తిరిగి రావాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



చైనా పోటీల్లో రవితోపాటు పారా క్రీడాకారులను అభినందిస్తున్న ప్రధాని మోదీ

సాధించిన పతకాలు ఇవే..

- 2015లో బెంగళూరులో జరిగిన జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో బ్రాంజ్, డబుల్స్‌లో సిల్వర్ మెడల్ సాధించాడు.
- 2016లో ఢిల్లీలో పారా బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీల్లో సింగిల్, డబుల్స్ విభాగాల్లో బ్రాంజ్ మెడల్
- 2017లో హైదరాబాద్‌లో పారా బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీల్లో డబుల్స్‌లో సిల్వర్ మెడల్
- 2017లో హర్యానాలో జరిగిన 18వ పారా చాంపియన్ షిప్ అథ్లెటిక్స్ పోటీల్లో ఎఫ్–40 షాట్‌పుట్, జావలెన్‌త్రోలో గోల్డ్ మెడల్
- 2020లో బెంగళూరులో 3వ పారా అథ్లెటిక్స్ పోటీల్లో షాట్‌పుట్, జావలెన్‌త్రోలో గోల్డ్‌మెడల్
- 2021లో దుబాయ్‌లో 13వ ఫజీ పారా అథ్లెటిక్ చాంపియన్ షిప్ పోటీల్లో షాట్‌పుట్, జావెలెన్‌త్రోలో 4వ స్థానం
- 2022లో పార్చుగల్‌లో ఐవర్ వరల్డ్ అథ్లెటిక్స్ పోటీల్లో షాట్‌పుట్, జావలెన్‌త్రోలో సిల్వర్ మెడల్స్ సాధించాడు.

పతకాన్ని సాధిస్తాను

దేశం నుంచి ప్రాతినిధ్యం వహించి పారా ఒలింపిక్స్‌లో పతకాన్ని సాధించాలన్నదే నా కల. నా తల్లిదండ్రులు వ్యవసాయ పనులు చేస్తూ అండగా నిలబడ్డారు. గ్రామస్తులు, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రెసిడెంట్ జి.కోటేశ్వరరావు, సెక్రటరీ రామస్వామి అందించిన ప్రోత్సాహంతోనే పారిస్ క్రీడల్లో పాల్గొనేలా శిక్షణ పొందగలిగాను. తప్పనిసరిగా షాట్‌పుట్ ఎఫ్–40 విభాగంలో పతకాన్ని సాధిస్తాను.

– రొంగలి రవి, పారా క్రీడాకారుడు, చిరికివానిపాలెం గ్రామం



విశ్వమంతా ఒక సహజీవనమనీ,
పరస్పర ఆధారితమనీ మనం గ్రహించినప్పుడు
ఒక గొప్ప ప్రపంచాన్ని మనం నిర్మించగలం.
– బుద్ధదాన భిక్కు (బౌద్ధ ధర్మం)

సాక్షి
బుధవారం, 7 ఆగస్టు 2024

విష ప్రచారపు కోరల్లో...

చేతిలోని కత్తిని మంచికి వాడవచ్చు, చేయాలనుకుంటే చెడు కూడా చేయవచ్చు. మరి, ప్రపంచాన్ని చేతిలోకి తీసుకొచ్చిన స్మార్ట్‌ఫోన్‌నీ, అందులోని సోషల్ మీడియా వేదికల్నీ ఇప్పుడు మనం దేనికి వాడుతున్నట్టు? దాని దుర్వినియోగం , విషప్రచారం తాలూకు విపరిణామాల ఫలితం యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) ప్రత్యక్షంగా అనుభవిస్తోంది. అస్తవ్యస్తమైన ఆర్థిక వ్యవస్థ, విభిన్న వర్గాల మధ్య అనుమానాలు సహా ఇప్పటికే అనేక సమస్యలతో సతమతమవుతున్న బ్రిటన్ సోషల్ మీడియా సాక్షిగా తీవ్రతర మితవాద బృందాల అసత్య ప్రచారం వల్ల అల్లర్లు, దహనాలతో అట్టుడుకుతోంది. మనసును కదిలించే ముగ్గురు పసిపిల్లల పాశవిక హత్య కారణంగా వారం క్రితం మొదలైన ఈ హింసాత్మక నిరసనల్ని అదుపు చేయడానికి పాలనా యంత్రాంగం కిందా మీదా అవుతోంది. చివరకు యూకేలో 'అంతర్యుద్ధం అనివార్యం' అంటూ వ్యాపారవేత్త ఎలాన్ మస్క్ లాంటి వాళ్ళు దుందు డుకు వ్యాఖ్యలు చేస్తుంటే, బ్రిటన్ కొత్త ప్రధాని కీర్ స్టార్మర్ ఖండించాల్సిన పరిస్థితి. ఇటీవలే పగ్గాలు పట్టిన లేబర్ పార్టీ ప్రభుత్వానికి తాజా పరిణామాలు సవాలుగా మారాయి.

ఇంగ్లండ్ వాయవ్య ప్రాంతంలోని సౌత్‌పోర్ట్‌లో జూలై 29న ఓ డ్యాన్స్ క్లాస్‌లో ముక్కుపచ్చలారని ముగ్గురు చిన్నారులపై ఓ ఆగంతకుడు కత్తితో దాడి చేసి చంపిన దారుణ సంఘటన చివరకు దేశమంతటా కార్చిచ్చుకు దారి తీయడం నమ్మశక్యం కాని నిజం. దాడి చేసిన వ్యక్తి వలసదారు, మైనారిటీ మతస్థుడు, గత ఏడాదే ఒక చిన్న పడవలో బ్రిటన్‌లో ప్రవేశించాడు అంటూ అంతర్జాలంలో అసత్యాలు ప్రచారమయ్యాయి. అదే అదనుగా వలసదారులకూ, ముస్లిమ్‌లకూ వ్యతిరేకంగా నిరస నలు చేయాలంటూ తీవ్రతర మితవాద బృందాలు సామాజిక మాధ్యమ వేదికలైన 'ఎక్స్' వగైరాల్లో పిలుపునిచ్చాయి. నిజానికి, పిల్లలపై కత్తి దాడికి పాల్పడింది ముస్లిమ్ వలసదారు కాదనీ, రువాండాకు చెందిన తల్లితండ్రులకు జన్మించిన ఓ 17 ఏళ్ళ క్రైస్తవ టీనేజర్ అనీ అధికారులు గుర్తించారు. ఆ పసిపాపల్ని చంపడమే కాక, గతంలోనూ కనీసం పదిసార్లు ఆ కుర్రాడు హత్యాయత్నాలకు పాల్పడి నట్టు పోలీసులు గుర్తించారు. అరెస్టు కూడా చేశారు. అయితే, నిజం ఇంటి గడప దాటే లోపల అబద్ధం ఊరంతా షికారు చేసింది. హంతకుడి గురించి పుకార్లు, విద్వేష నిరసనల పిలుపులు విస్తృతంగా విషాన్ని విరజిమ్మాయి. సోషల్‌మీడియా లోని వివాదాస్పద ఇన్‌ఫ్లుయెన్సర్ల తప్పుడు కథనాలతో మసీదులు, శరణార్థులకు నీడనిచ్చిన హోటళ్ళే లక్ష్యంగా దాడులు సాగాయి. చివరకు గడచిన దశాబ్ద కాలం పైచిలుకుగా యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)లో ఎన్నడెరుగని స్థాయిలో అల్లర్లు, దహనకాండ, లూటీలకు ఆజ్యం పోశాయి. జూలై 30 నుంచి దేశవ్యాప్తంగా సాగుతున్న ఘర్షణల్లో ఇప్పటికి కనీసం 400 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయినా పరిస్థితులు చక్కబడలేదు. చివరకు లండన్‌లోని భారత హైకమిషన్ సైతం బ్రిటన్‌కు వచ్చే భారత జాతీయులు జాగ్రత్తగా ఉండాలని మంగళవారం సూచనలు జారీ చేయాల్సి వచ్చింది. నైజీరియా, మలేసియా, ఇండొనేషియా సహా పలు దేశాలు అదే పని చేశాయి.

ప్రపంచమంతటా సత్వర సమాచార, వ్యాఖ్యా ప్రసారానికి ఉపయోగపడాల్సిన వాట్సప్ మొదలు 'ఎక్స్' దాకా సోషల్ మీడియా వేదికలన్నీ తుంటరుల చేతిలో అదుపు లేని ఆయుధాలుగా మారడం విషాదం. వాటిలోని విద్వేషపూరిత అసత్యాలు, రెచ్చగొట్టే మాటలకు ఎవరు, ఎక్కడ, ఎలా అడ్డుకట్ట వేయగలరో అర్థం కాని పరిస్థితి. బ్రిటన్‌లో సాంకేతిక శాఖ మంత్రి సైతం గూగుల్, ఎక్స్, టిక్‌టాక్, మెటా సంస్థల ప్రతినిధులతో సమావేశమై, అసత్య సమాచారం వ్యాపించకుండా ఆపడంలో ఆ సంస్థల బాధ్యతను మరోసారి నొక్కిచెప్పాల్సి వచ్చింది. అసలు అలాంటి అంశాలను తొలగించే బాధ్యత, భారం ఆ యా సోషల్ మీడియా సంస్థలదేనని బ్రిటన్ సర్కార్ కొంత కాలంగా ఒత్తిడి పెట్టాలని చూస్తోంది. తాజా ఘర్షణలతో ప్రభుత్వం ఆగి, తన వంతుగా తానూ బాధ్యత తీసుకోక తప్పదు. నిజానికి, 'బ్రెగ్జిట్' తర్వాత నుంచి బ్రిటీషు సమాజం నిలువునా చీలిపోయింది. ఈ చీలిక లకు మునుపటి కన్జర్వేటివ్ పార్టీ ప్రభుత్వాలు హ్రస్వ దృష్టితో అనుసరించిన విధానాలు తోడయ్యే సరికి పెను ప్రభావం పడింది. అన్నీ కలసి తాజా దాడులుగా విస్ఫోటించాయి.

ఈ హింసను అదుపు చేసి, శాంతిభద్రతల్ని పునరుద్ధరించడం స్టార్మర్ సర్కారుకు సవాలే. కానీ, తీవ్రతర మితవాదులు రేపుతున్న విద్వేషం, విదేశీయుల పట్ల వైముఖ్యానికి కళ్ళెం వేయడం అసలు సిసలు ఛాలెంజ్. మొత్తం వచ్చిన ఓట్ల రీత్యా బ్రిటన్ తాజా ఎన్నికల్లో తీవ్రతర మితవాద రాజకీయ పార్టీ 'రిఫార్మ్ యూకే' మూడోస్థానంలో నిలిచింది. అంటే, దేశంలోని రాజకీయ, ఆర్థిక అనిశ్చితుల మధ్య దానికి ఆ మేరకు మద్దతుందన్న మాట. అదే సమయంలో పాలనలో మార్పు కోరిన జనం బ్రిటన్ పునర్నిర్మాణ వాగ్దానం చూసి స్టార్మర్‌కు ఓటేశారు. పాత పాలన సమస్యలకు తోడు ప్రస్తుత పరిస్థితుల్లో వలసలు, మితవాద జనాకర్షక విధానాల లాంటి సంక్లిష్ట అంశాలపై ఆయన ఆచితూచి అడుగేయక తప్పదు. చరిత్రలో వలసరాజ్య పాలనకు పేరొందిన బ్రిటన్‌లో ఇప్పుడు వలసదారులపై రచ్చ రేగడమే వైచిత్రి. పొట్ట చేతబట్టుకొని శరణు కోరి వచ్చినవారినే అన్నిటికీ కారణమని నిందించడం, అకారణ శత్రుత్వం వహించడం బ్రిటన్‌కు శోభనివ్వదు. అసత్య కథనాల పట్ల జనచైతన్యంతో పాటు జనజీవన స్రవంతిలో వలసజీవులు కలిసిపోయే విధానాలకు ప్రభుత్వం ప్రాధాన్యమివ్వడం ముఖ్యం. వాటివల్లే అపోహలు, ప్రతికూలభావాలు పోతాయి. విధ్వంసకారులపై కఠిన చర్యలు తీసు కుంటూనే సరైన నాయకత్వం, సహానుభూతితో వ్యవహరించాలి. మతవైరాలకు తావివ్వక న్యాయం, సమానత్వానికి నిలబడడమే ఇప్పుడు బ్రిటన్ మరింత పటిష్ఠంగా ముందుకు నడవడానికి మార్గం.

ఇన్ బాక్స్
పాడుబడ్డ 'బంగ్లా'తో జాగ్రత్త!

భారత్ పొరుగుదేశం, మిత్రదేశం అయిన బంగ్లాదేశ్‌లో తీవ్ర అస్థిరత్వం నెలకొంది. కొన్ని నెలలుగా పౌరుల ఆందోళనలు కొనసాగి, ప్రభుత్వపు నిర్వాకంతో తీవ్రరూపం దాల్చి, చివరకు ప్రధాని షేక్ హసీనా దేశం విడిచి పారి పోయేంతగా గాడి తప్పాయి. ప్రస్తుతం అధ్యక్షుడి కోరిక మేరకు సైన్యం తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు దిశగా వివిధ పక్షాలతో, విద్యార్థి నాయకులతో సంప్రతింపులు జరుపుతోంది. పొరుగుదేశం రాజకీయ, పాలనా అస్థిరత్వంలో ఉండడం భారత్‌కు చేటు. పాకిస్తాన్, చైనాలు, స్థానిక భారత్ వ్యతిరేక సమూహాల్ని మచ్చిక చేసుకుని ఆ దేశంలో పరపతి పెంచుకొనే అవకాశాల్ని మెరుగు పర్చుకుంటాయి. ఆ స్థితి కలుగకుండా మంచి స్నేహ సంబంధాల్ని కొనసాగించ డానికి మన దేశం చాలా జాగ్రత్తగా అడుగులు వేయాల్సి ఉంది.

ఎందుకంటే ఇప్పుడు గద్దె దిగిన షేక్ హసీనా ప్రభుత్వం మన దేశంతో మిత్రత్వం నెరిపింది. ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడ్డాయి. వాణిజ్యం, దౌత్యం బల పడ్డాయి. అయితే ఆమె అక్కడ నియంతలా వ్యవహరించి చెడ్డ పేరు తెచ్చుకున్నారు. ప్రజాబలాన్ని దూరం చేసుకుని, రాజకీయ వ్యతిరేకుల్ని అణిచివేసి, ఉద్యమాలపై ఉక్కుపాదం మోపి, చివరకు తానే దేశం విడిచి పారిపోయే స్థితి తెచ్చుకున్నారు. కాబట్టి ఆమె (అవామీ లీగ్ పార్టీ) వ్యతిరేకులకు మన దేశం కూడా వ్యతిరేకంగానే కన బడుతుంది. వచ్చేది ఏ ప్రభుత్వమైనా, సైనిక పాలన అయినా మన దేశంతో వారి సంబంధాలు సానుకూలంగా ఉండేటట్లు చూసుకోవాలి. సరిహద్దుల నుండి అధిక సంఖ్యలో శరణార్థులు చొరబడే అవకాశం ఉంది. భారత్‌కు వ్యతిరేకంగా ఆ దేశాన్ని వాడుకోవడానికి పొంచి ఉన్న అంతర్జాతీయ శక్తులను కూడా ఓ కంట కనిపెట్టుకుని ఉండాలి. ఎలాంటి సందేహం లేకుండా భారత్‌ను నమ్మ దగిన మిత్రునిగా బంగ్లాదేశ్ ప్రజలు, రాజకీయ పక్షాలు మున్ముందు కూడా భావించాలంటే అది సరైన దౌత్యనీతి తోనే సాధ్యం.

– డా. డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ, పార్వతీపురం

కూటమి స్మార్ట్ నాటకం

రివర్స్ టెండరింగ్, న్యాయ సమీక్షతో అత్యంత పారదర్శకంగా స్మార్ట్ మీటర్ల టెండర్లు

కేంద్రం మార్గదర్శకాలు..విద్యుత్ నియంత్రణ మండలి అనుమతితోనే మొత్తం ప్రక్రియ

సాక్షి, అమరావతి: వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు అమర్చే కాంట్రాక్టును దక్కించుకున్న సంస్థకు గత ప్రభుత్వంలో అడ్డగోలుగా చెల్లింపులు జరిగాయంటూ 'స్మార్ట్ దోపిడీపై ఆడిట్' శీర్షికన ఓ అసత్య కథనాన్ని సీఎం చంద్రబాబు డైరెక్షన్‌లో ఈనాడు సోమవారం ప్రచురించింది. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) మార్గదర్శకాలకు అనుగుణంగా, న్యాయ సమీక్ష ద్వారా అనుమతి పొందిన టెండర్లపై అడ్డగోలుగా అసత్యాలు అచ్చేసింది. జరగని దోపిడీపై ఆడిట్‌కు ఎన్డీయే ప్రభుత్వం సిద్ధమవుతోందంటూ చెప్పుకొచ్చింది. నిజానికి వ్యవసాయ విద్యుత్ మోటార్లకు స్మార్ట్ మీటర్లు అమర్చే టెండర్లు, ఆ టెండర్లు దక్కించుకున్న సంస్థకు బిల్లులు చెల్లింపుల్లో గత ప్రభుత్వం, విద్యుత్ సంస్థలు అత్యంత పారదర్శకంగా వ్యవహరించాయి. ఇందులో ఎలాంటి దాపరికం, నిబంధనల ఉల్లంఘన జరగలేదు. రైతులకు ఎప్పటికీ పగటి పూటే 9 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను హక్కుగా ఇచ్చేందుకు జరుగుతున్న యత్నాన్ని టీడీపీ మొదటి నుంచీ వ్యతిరేకించడమే పనిగా పెట్టుకుంది. స్మార్ట్ మీటర్లకు సంబంధించిన లెక్కలన్నీ పక్కాగా ఉన్నాయని, అన్నీ నిబంధన మేరకే జరిగాయని ఇంధన శాఖ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. అలాంటప్పుడు గత ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తే తప్పేముంది? అసలు ఈనాడు, చంద్రబాబు బాధేమిటో అర్థం కాదు. బిల్లులు చెల్లిస్తే చెల్లించేశారంటూ ఏడుపు..! చెల్లించకపోతే ఇంకా చెల్లించలేదంటూ గగ్గోలు పెట్టడం ఎల్లో మీడియా, కూటమి ప్రభుత్వానికి పరిపాటిగా మారింది.

ఇంత పెద్ద వ్యవస్థలో తనిఖీ కష్టమా?

నిర్ణీత సమయంలో ఎంత సామగ్రినైనా తనిఖీ చేసే సామర్థ్యం రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ వ్యవస్థకు ఉంది. విద్యుత్ సంస్థలకు రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకూ ఉద్యోగులున్నారు. ఇలాంటి తనిఖీల కోసమే ప్రతి విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లో కన్‌స్ట్రక్షన్ విభాగం ఉంటుంది. అందులోని అధికారులు స్టోర్స్‌కి మెటీరియల్ రాగానే స్వయంగా పరిశీలిస్తారు. ప్రతి పరికరం నాణ్యత ప్రకారం ఉందోలేదో తనిఖీ చేస్తారు. పరికరాల సంఖ్య కూడా లెక్కిస్తారు. ఈ వివరాలన్నీ నమోదు చేసుకున్న తరువాత మాత్రమే బిల్లులను అకౌంట్స్ విభాగానికి సమర్పిస్తారు. కన్‌స్ట్రక్షన్ విభాగం నుంచి వచ్చిన బిల్లుల ఆధారంగా టెండర్‌లో పొందుపరిచిన నిబంధనలకు అనుగుణంగా అకౌంట్స్ విభాగం అధికారులు బిల్లులు మంజూరు చేస్తారు. స్మార్ట్ మీటర్ల విషయంలో ఈ ప్రక్రియ మొత్తం పూర్తిగా, సక్రమంగా జరిగింది. అందువల్లే డిస్కంలు బిల్లులు చెల్లించాయి.

న్యాయ సమీక్షకు టెండర్లు..

ఏ సంస్థ అయినా స్మార్ట్ మీటర్ల బిడ్లలో పాల్గొనేలా నిబంధనలున్నాయి. స్మార్ట్ మీటర్ల టెండర్లను ఆహ్వానిస్తూ డిస్కంలు తెలుగు, ఇంగ్లీషు దినపత్రికల్లో ప్రకటన కూడా జారీ చేశాయి. ప్రధానంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు టెండర్లలో అక్రమాలను అరికట్టడానికి విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. రివర్స్ టెండరింగ్, న్యాయ సమీక్ష అనే విధానాలను ప్రవేశపెట్టి పక్కాగా అమలు చేశారు. ఈ వినూత్న నిర్ణయాలతో రూ.100 కోట్లు దాటిన ప్రతి టెండర్ న్యాయ సమీక్షకు వెళుతుంది. అక్కడ వెబ్‌సైట్‌లో 14 రోజుల పాటు ప్రజలకు అందుబాటులో టెండర్ డాక్యుమెంట్లను ఉంచి ప్రజల నుంచి అభ్యంతరాలను, సలహాలు, సూచనలను తీసుకుంటారు. అదంతా ముగిసిన తరువాతే అనుమతి లభిస్తుంది. స్మార్ట్ మీటర్ల టెండరు ప్రక్రియ ఏపీ–ఈ–ప్రొక్యూర్మెంట్, జెమ్ పోర్టల్ ద్వారా జరిగింది. ఎంపిక అత్యంత పారదర్శకంగా జరిగింది. అందువల్ల ఏదైనా సంస్థ పూర్తి అర్హతలతో పారదర్శకంగా నిబంధనల ప్రకారం కాంట్రాక్టులు, ప్రాజెక్టులు పొందితే దానికి లబ్ధి చేకూర్చేలా నిబంధనలు మార్చేశారనడంలో అర్థం లేదు. ఒకసారి టెండర్ ఖరారయిన తరువాత అందులోని నిబంధనలు మార్చకూడదు. అలాంటిదేమీ ఇక్కడ జరగలేదు. గతేడాది పిలిచిన టెండర్ నిబంధనలే ఈ ఏడాదీఉండాలని, ఒక టెండర్‌లో ఉన్నట్లుగానే మరో టెండర్‌లో నిబంధనలు పెట్టాలని ఏ చట్టం చెబుతుందో ఈనాడుకే తెలియాలి.

అసమర్థత కప్పిపుచ్చుకునేందుకే..

'అలవిగాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 'సూపర్ సిక్స్' పథకాలను అమలు చేయలేక కుప్పిగంతులు వేస్తోంది. ప్రజలను ఏమార్చేందుకు అబద్ధాలు, మోసాలతో మాయా నాటకాన్ని మొదలుపెట్టింది. అందులో భాగంగా ఏపీలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ తమకు గిట్టని అధికారులపై కక్ష సాధిస్తోంది. వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులకు తెగబడుతోంది. హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తోంది. మరోవైపు తన చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకు ప్రభుత్వ విభాగాల్లో డబ్బులు లేవంటూ శ్వేతపత్రాల పేరుతో కాలం వెళ్లదీస్తోంది. తప్పుడు లెక్కలు చూపిస్తూ ఖజానా ఖాళీగా ఉందంటూ బేలతనాన్ని ప్రదర్శిస్తోంది. తాను అమలు చేయాల్సిన పథకాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు గత ప్రభుత్వంలో అవినీతి జరిగిందంటూ దుష్ప్రచారం చేస్తోంది. ఈ క్రమంలోనే స్మార్ట్ మీటర్ల టెండర్లపై ఎల్లో మీడియాతో కలిసి విషం చిమ్ముతోంది"

ఏది నిజం?

రివర్స్ టెండరింగ్‌తో 15.75 శాతం తగ్గిన ధర

వ్యవసాయానికి పగటిపూట 9 గంటలు నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించడం, మీటర్లు కాలిపోకుండా, రైతులు ప్రమాదాల బారిన పడకుండా కాపాడటంతోపాటు మోటార్, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల భద్రతను దృష్టిలో పెట్టుకుని స్మార్ట్ మీటర్లను రక్షణ పరికరాలతో ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం ఆదేశించింది. ఈ–ప్రొక్యూర్‌మెంట్ ద్వారా డిస్కంలు టెండర్లను పిలిచాయి. ఎల్ 1గా నిలిచిన కాంట్రాక్టర్‌కు టెండర్‌ను అప్పగించాయి. అయితే టెండర్ ధర అధికంగా రావటాన్ని గమనించిన గత ప్రభుత్వం టెండర్ల ప్రక్రియను రద్దు చేయాలని ఆదేశించింది. దీంతో తొలి టెండర్ రద్దు అయింది. అనంతరం రివర్స్ టెండరింగ్ ద్వారా టెండర్ల ధర మొదటిసారి కంటే 15.75 శాతం తగ్గింది. తద్వారా ప్రజాధనాన్ని ఆదా చేశారు. ఇక మీటర్ గ్యారంటీ సమయం 10 ఏళ్లకు పెరిగింది. నిర్వహణ సమయం పెంచడం వల్ల డిస్కంలకు వ్యయంలో 2 శాతం ఆదా అవుతుంది. అంటే డిస్కంలకు ఆర్థికంగా కొన్ని కోట్ల రూపాయలు మిగులుతాయి. అదీగాక ప్రతి టెండర్ నిబంధన న్యాయ సమీక్షకు వెళ్లింది. ఆ తరువాతే ఖరారైంది. అంతేకాకుండా ఏపీఈఆర్‌సీ అనుమతి కూడా పొందింది. ఇందులో ఎలాంటి ఉల్లంఘనగానీ, ఒకరికి ఉద్దేశపూర్వకంగా మేలు చేయడంగానీ లేదు.

నిబంధన మేరకే బిల్లులు..

గుత్తేదారు సంస్థ బిల్లులు పంపడమే ఆలస్యం డిస్కంలు చకచకా రూ.1,828 కోట్లు చెల్లించాయని సమాచారమంటూ ఈనాడు చెప్పుకొచ్చింది. వ్యవసాయ స్మార్ట్ మీటర్లకు అయ్యే ఖర్చులో ప్రతి పైసాను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందని నాడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 'జి.ఓ.ఎం.ఎస్. 22, తేదీ:01.09.2020' ద్వారా స్పష్టం చేసింది. అందుకు అనుగుణంగానే డిస్కంలు టెండర్లు పిలిచాయి. తాము కాంట్రాక్టు సంస్థకు చెల్లించిన డబ్బును తిరిగి తమకు ఇవ్వాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరాయి. అందుకు గత ప్రభుత్వం అంగీకరించింది. ఈలోగా ఎన్నికల కోడ్ రావడంతో ఆ ప్రక్రియ ఆగింది. కూటమి ప్రభుత్వంగానీ ఈనాడుగానీ గుర్తుంచుకోవాల్సిన మరో విషయం ఏమిటంటే.. కాంట్రాక్టర్‌తో పని చేయించుకుని బిల్లులు చెల్లించాల్సిన బాధ్యత ప్రాథమికంగా డిస్కంలదే. ఆ తర్వాత ప్రభుత్వం నుంచి నిధులు వస్తాయి. ఇందులో ఏ తప్పూ లేదు. ఇదేమీ కొత్తగా జరిగిందీ కాదు. సంక్షేమ పథకాల ద్వారా వివిధ వర్గాలకు విద్యుత్ రాయితీలు అందించే ప్రభుత్వం ఆ మొత్తాన్నీ ముందుగా డిస్కంలు భరిస్తే, ఆ తర్వాత రీయింబర్స్‌మెంట్ చేస్తుంటుంది. 2014–19 మధ్య టీడీపీ హయాంలో రైతులకు ఉచిత విద్యుత్‌కు సంబంధించిన ఖర్చును డిస్కంలు ముందుగా భరించాయి. ఆ బకాయిలు రూ.8,845 కోట్లు కాగా వాటిని ఇవ్వకుండా నాడు చంద్రబాబు ఎగవేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆ మొత్తం బకాయిలను చెల్లించింది.

రాష్ట్రపతి అవార్డు అందుకున్న సంస్థపై ఎందుకీ కక్ష?

మూడు డిస్కమ్‌ల పరిధిలో వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్ల కాంట్రాక్టు పొందిన షిర్డీ సాయి సంస్థ చిన్న సంస్థ ఏమీ కాదు. 25 ఏళ్లుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను తయారు చేస్తూ సుదీర్ఘ అనుభవం, సామర్థ్యం ఉన్న కంపెనీగా పేరు పొందింది. ట్రాన్స్‌ఫార్మర్ల తయారీలో 2022కిగానూ ప్రతిష్టాత్మక రాష్ట్రపతి అవార్డు కూడా దక్కించుకుంది. ఎనర్జీ కన్జర్వేషన్ (ఇంధన పొదుపు) అవార్డును కేంద్రం నుంచి రెండు సార్లు అందుకుంది. అండర్ స్టాండింగ్ ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ (పీఎల్ఐ) స్కీమ్‌కు కూడా ఈ సంస్థ అర్హత సాధించింది.

స్మార్ట్ మీటర్లతో జవాబుదారీతనం

ఒకప్పుడు వ్యవసాయ విద్యుత్తు సర్వీసులకు మీటర్ల ద్వారా వినియోగం జరిగేది. ఆ తర్వాత మోటార్ హార్స్ పవర్ ప్రాతిపదికన వినియోగాన్ని లెక్కించడంతో మీటర్ల వాడకం తగ్గింది. విద్యుత్ సంస్థలు కెపాసిటర్లను విడతలవారీగా వినియోగదారులకు అందించినప్పటికీ కాలక్రమేణా వాటిని రైతులే తీసేశారు. దీంతో సరఫరాలో హెచ్చుతగ్గులు వచ్చి ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ మోటార్లు కాలిపోతున్నాయి. ఇలాంటి సమస్యలను తీర్చడంతో పాటు విద్యుత్ పంపిణీ నష్టాల తగ్గింపు, పారదర్శకత కోసం స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. రైతు ఖాతాలో నెలవారీ వినియోగ చార్జీలను డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) ద్వారా ప్రభుత్వం జమ చేసేలా రైతుల బ్యాంకు ఖాతాలను కూడా సేకరించింది. రైతులే ఆ మొత్తాన్ని డిస్కంలకు చెల్లించడం ద్వారా జవాబుదారీతనం పెరుగుతుందని భావించింది.

నాణ్యమైన విద్యుత్

స్మార్ట్ మీటర్లతో పాటు అనుబంధ పరికరాలైన పీవీసీ వైరు, ఎంసీబీ, కెపాసిటర్, మీటరు బాక్సులను ఏర్పాటు చేస్తున్నారు. ఏటా సగటున 45,098 వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. వాటి మరమ్మతుల కోసం ఏటా రూ.102 కోట్ల వ్యయాన్ని డిస్కంలు భరించాల్సి వస్తోంది. వీటివల్ల ఆ ఖర్చు తప్పుతుంది. కెపాసిటర్లను అమర్చడం ద్వారా నాణ్యమైన ఓల్టేజ్‌తో రైతులకు విద్యుత్ సరఫరా చేయవచ్చు.



కేంద్రమే చెప్పింది

కేంద్ర ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వ శాఖ ప్రతిపాదిత రీ వ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ (ఆర్‌డిఎస్ఎస్)లో భాగంగా స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు దేశంలోని అనేక రాష్ట్రాలతో జరుగుతోంది. 'ఆర్డీఎస్ఎస్'లో భాగంగా 2025 మార్చి నాటికి దేశం అంతటా అన్ని రాష్ట్రాలూ స్మార్ట్ విద్యుత్ మీటర్లు పెట్టాలని కేంద్రం ఇచ్చిన ఆదేశాల మేరకు 2019లోనే సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ ఒక రెగ్యులేషన్ ఇచ్చింది. దాని ప్రకారం రాష్ట్రంలో 18.58 లక్షల వ్యవసాయ సర్వీసులకు స్మార్ట్ మీటర్లు అమర్చాలని 2020లో విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లకు గత ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. దేశ వ్యాప్తంగా తొమ్మిది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో స్మార్ట్ మీటర్ల ప్రక్రియ 50 శాతం నుంచి 100 శాతం వరకూ పూర్తవుతోంది. స్మార్ట్ మీటర్ల వల్ల విద్యుత్ నష్టాలను అరికట్టవచ్చని, సరఫరా వ్యయాన్ని తగ్గించవచ్చని కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ కూడా వెల్లడించింది. ఈ మీటర్లను పెట్టడం వల్ల ఎనర్జీ ఆడిటింగ్, అకౌంటింగ్‌కు అవకాశం ఉంటుందని తెలిపింది.

వ్యవస్థల పాపమే చేనేతల దురవస్థ

సందర్భం



డా॥ మీసాల అప్పలయ్య

చేనేత పరిశ్రమ వ్యవస్థాగత ఉచ్చులో ఇరుక్కుపోయింది. ఈ పరిశ్రమ క్షీణతకు ప్రధాన కారణాలలో ఒకటి సరైన నియంత్రణ లేని వ్యవస్థల పనితీరు. 1996లో జరిగిన జాతీయ చేనేత జనాభా లెక్కల ప్రకారం 65.5 లక్షలు ఉన్న చేనేత కార్మికుల సంఖ్య 2010 నాటికి 43.32 లక్షలకు, 2019–20 నాటికి 35.22 లక్షలకు తగ్గిపోయింది. చేనేత పరిశ్రమలో ఒక కుటుంబానికి లభించిన సగటు పనిదినాలు 2010లో 234 ఉంటే, అవి 2019లో 207కు పడిపోయాయి. 2022లో తెలుగు రాష్ట్రాలలోని 496 మంది చేనేత కార్మికులను సర్వే చేస్తే, అందులో 74.4 శాతం మంది భవిష్యత్ కోసం ఏమీ మిగిలించుకోలేదని చెప్పారు. 77 శాతం మంది ఈ వృత్తిని వదిలిపెడతామని చెప్పారు. 76.2 శాతం మంది ఈ వృత్తి లోకి తమ పిల్లలను ఆహ్వానించడం లేదని చెప్పారు. కాబట్టి యువకులు ఈ వృత్తిలోకి రారు. యువకులు లేని చేనేత పరిశ్రమలో అధునాతన మగ్గాల వాడుక, కొత్త డిజైన్ల ఉత్పత్తి చాలా కష్టం. పైన చెప్పిన అనేక కారణాల వల్ల మాస్టర్ వీవర్లకు, సహకార సంఘాలకు తమ ఉత్పత్తి కార్యకలాపాలను నడిపించడానికి తగినంత మంది చేనేత కార్మికులు దొరకడం లేదు.



నేడు జాతీయ చేనేత దినోత్సవం

వ్యవస్థ అంటే అనేక సంస్థలు, వ్యక్తులు కలిసి చేసే కృషి యొక్క రూపం. ఒకరు లేదా కొద్దిమంది వ్యక్తులు చేసే పని వ్యవస్థ కాదు. చేనేత పరిశ్రమ ఒకప్పుడు వైభవంగా నడవడానికీ, నేడు దీనంగా క్షీణించడానికీ కొన్ని వ్యవస్థలు ఎలా కారణమయ్యాయో మనం అర్థం చేసుకోవాలి.

1. మొదటిది ముడిసరుకుల సరఫరా వ్యవస్థ. చేనేత కార్మికుడు వాడే ముడిసరుకుల ధరలు పెరుగుతూనే ఉంటాయి. కారణం నూలు, రంగులు, రసాయనాల తయారీ పెద్ద కార్పొరేషన్ల చేతిలో ఉంది. అవి తమ లాభ లక్ష్యాలను బట్టి, ఉత్పత్తిని, వాటి ధరలను నిర్ణయిస్తాయి. వీటిని చేనేత పరిశ్రమ శాసించలేదు. నిరంతరమూ పెరుగు తున్న ధరల వలన చేనేతల ఉత్పత్తి ధర పెరిగి అమ్ము కోవడం కష్టమవుతోంది. తక్షణం అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉంటే, చేనేత కార్మికుని కూలీ కోతకు గురవుతుంది.

2. రెండోది ప్రభుత్వ సహాయ వ్యవస్థ. ఆర్థికంగా బలహీనులైన కార్మికులు ఆధారపడ్డ ఈ పరిశ్రమకు ప్రభుత్వం ఎక్కువ సహాయం చెయ్యాలి. కానీ, ప్రభుత్వం చేనేత ఉత్పత్తుల మీద 5 శాతం, వాటి ముడి సరుకుల మీద 18 శాతం వరకు జీఎస్టీ విధిస్తున్నది. దీనితో ఆ ఉత్పత్తుల అమ్మకపు శక్తి తగ్గింది. పైగా, రకరకాల పథకాల కింద చేసే ఆర్థిక సహాయాన్ని ప్రతి ఏటా బడ్జెట్‌లో తగ్గించుకుంటూ వస్తున్నది. ఒకప్పుడు రూ. 2,000 కోట్ల సహాయం ఇప్పుడు రూ. 200 కోట్లకు తగ్గింది. ప్రభుత్వం ఒకప్పుడు దీన్ని కార్మికులకు పని కల్పించే సాధనంగా చూసేది. నేడు ఒక కళగా, సంస్కృతిగా మాత్రమే చూస్తున్నట్లు సహాయ పరిమాణాన్ని బట్టి అర్థమవుతున్నది. పైగా చేనేతలకు గట్టి పోటీనిచ్చే పవర్ లూములను సరిగ్గా నియంత్రించలేక పోతున్నది. పవర్ లూములను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం, అవి చేనేత ఉత్పత్తులను కాపీ కొట్టి, చేనేతల గిరాకీకి గండి కొడుతున్న వైనాన్ని అడ్డుకోలేకపోతున్నది. కొన్ని వస్త్రాలు చేనేత మగ్గాలు మాత్రమే చెయ్యాలని చెప్పిన 1985 నాటి చట్టం అమలు తీరు శక్తిహీనంగా ఉంది.

3. మూడోది ఉత్పత్తి అమ్మకాల వ్యవస్థ. ఇది పేలవంగా నడుస్తూ, చేనేత కార్మికులకు ప్రతికూలంగా పని చేస్తున్నది. రాష్ట్ర స్థాయీ తల్లి సంఘాలలో అమ్మకపు శక్తి బొత్తిగా తక్కువ. గ్రామ స్థాయీ సహకార సంఘాలు చాలా వరకు బోగస్. కృష్ణా, తూర్పు గోదావరి వంటి జిల్లాలలో తప్ప, సహకార సంఘాలన్నీ నిర్వీర్యమైనాయి. మాస్టర్ వీవర్ కింద గానీ, స్వతంత్రంగా నేసుకొనే కార్మికులకు గానీ, వారు పరిశ్రమలో సింహ భాగస్థులైనప్పటికీ, ప్రభుత్వ మార్కెటింగ్ సహాయక పథకాలు అందవు.

4. నాలుగవది నూతన వస్త్ర ఉత్పత్తి వ్యవస్థ. చేనేత పరిశ్రమను దీర్ఘకాలం నడిపించే శక్తినిచ్చే నూతన వస్త్ర ఉత్పత్తి చెయ్యడానికి చేనేత కార్మికునికి అనేకమైన ఇబ్బందులున్నాయి. కొత్త నమూనాల ఉత్పత్తిలో రిస్క్, శ్రమ, ఖర్చు అధికం. ఈ విషయంలో ప్రభుత్వం ఇస్తున్న సహాయం చాలా తక్కువ. కొత్త నమూనాలు నెయ్యడానికి వీలుగా ప్రభుత్వం పుష్కలంగా నమూనాలను అందిస్తూ, వాటిని తయారు చెయ్యడంలోనూ శిక్షణను ఇవ్వ డానికి ప్రభుత్వం సహాయం చెయ్యాలి. అవసరాన్ని బట్టి మగ్గాలను అధునాతన పరచుకోడానికి సహాయం చెయ్యాలి. పోచంపల్లి, ఉప్పాడ, గద్వాల్, ధర్మవరం వంటి ప్రాంతాలలో చేనేత పరిశ్రమ వృద్ధి చెందడానికీ, ఎక్కువ మందికి పని కల్పించగలగడానికీ ప్రధాన కారణం అక్కడ ఎక్కువ విలువగల వస్త్రాలు తయారు కావ డమే. చేనేత పరిశ్రమ ఎక్కువ కాలం మన గలగాలి అంటే ఎక్కువ విలువైన వస్త్రాలను తయారుచేసే స్థితికి ఎదగాలి. ఇందుకు నూతన నమూనాల తయారీ చాలా ముఖ్యం. దీని విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలి. దేశ సంస్కృతికి దన్నుగా ఉంటూ, అనేక లక్షల మందికి ఉపాధిని ఇచ్చే ఈ పరిశ్రమను ఉద్ధరించగలిగే శక్తి ప్రభుత్వాలకే ఉంది.

వ్యాసకర్త డా॥ బీ.ఆర్. అంబేడ్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ అండ్ టెక్నాలజీ మాజీ డైరెక్టర్
మొబైల్: 79939 09371

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, **తిథి:** శు.తదియ రా.7.50 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** పుబ్బ రా.7.35 వరకు, తదుపరి ఉత్తర, **వర్జ్యం:** తె.3.32 నుండి 5.18 వరకు (తెల్లవారితే గురువారం), **దుర్ముహూర్తం:** ఉ.11.40 నుండి 12.31 వరకు, **అమృత ఘడియలు:** ప.12.35 నుండి 2.21 వరకు; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.44, **సూర్యాస్తమయం:** 6.28.

ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే 'తల్లికి వందనం' అమలు చేయాలి

జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



గోకవరం: తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే అమలు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అభిప్రాయపడ్డారు. గోకవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాలయాల్లోనే ఒత్తిడి లేని నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ విద్యాలయాల్లో చదివించాలన్నారు.

టోల్ ప్లాజా వద్ద టీడీపీ నేత హంగామా

- టోల్ కట్టేది లేదంటూ చిందులు
- ఎమర్జెన్సీ గేటు వద్ద కారు అడ్డంగా పెట్టి హల్‌చల్
- ఎన్టీఆర్ జిల్లా కీసర టోల్ ప్లాజా వద్ద ఘటన



సాక్షి నెట్‌వర్క్: "నేను అధికార పార్టీ నాయకుడిని, ఎవ్వడ్రా నా కారాపేది" అంటూ టోల్ ప్లాజా సిబ్బందిపై టీడీపీ నాయకుడు రెచ్చిపోయాడు. ఎమర్జెన్సీ గేట్‌కు 5 గంటల పాటు కారు అడ్డు పెట్టాడు. అంతేకాక పెద్ద పెద్దగా కేకలు వేస్తూ టోల్ ప్లాజా వద్ద చిందులు తొక్కాడు. ఈ ఘటన మంగళవారం ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం కీసర టోల్‌ప్లాజా వద్ద జరిగింది. నందిగామ నియోజకవర్గం చందర్లపాడు మండలం గుడిమెట్ల గ్రామానికి చెందిన అధికార పార్టీ సర్పంచి ఆళ్ల సైదమ్మ కుమారుడు ఆళ్ల రామారావు విజయవాడ వెళ్లేందుకు కారులో బయలుదేరాడు. మండలంలోని కీసర టోల్‌ప్లాజా వద్దకు రాగానే సిబ్బంది కారును ఆపి రుసుం చెల్లించమన్నారు. తన కారుకు టోల్ చెల్లించనవసరం లేదని ఎమ్మెల్యే కార్యాలయం సిబ్బంది తనకు చెప్పారని టోల్ సిబ్బందికి రామారావు తెలిపాడు. అయితే ఎమ్మెల్యే కార్యాలయం నుంచి తమకు 60 కారు నంబర్లు ఇచ్చారని, అందులో ఈ కారు నంబర్ లేదని టోల్ సిబ్బంది ఆయనకు వివరించారు. అయినా తాను రుసుం చెల్లించనంటూ మంకుపట్టుపట్టాడు. తనను వెళ్లనివ్వడంలేదనే కోపంతో ఎమర్జెన్సీ గేట్ వద్ద కారు అడ్డంపెట్టాడు. ఈ సమాచారాన్ని టోల్ సిబ్బంది పోలీసులకు అందించినా వారు స్పందించలేదు. విషయం తెలుసుకున్న కంచకచర్ల మండల టీడీపీ అధ్యక్షుడు కోగంటి వెంకట సత్యనారాయణ టోల్‌ప్లాజా అధికారులకు ఫోన్ చేసి, రామారావును పంపించేయాలని చెప్పటంతో కారును వదలివేశారని విశ్వసనీయ సమాచారం.

నేత.. మళ్లీ గుండెకోత!

పవర్‌లూమ్‌కు 500 యూనిట్లు, హ్యాండ్లూమ్‌కు 200 యూనిట్ల అమలేదీ?

2014లోనూ 25 హామీలు ఇచ్చి ఒక్కటీ సరిగా అమలు చేయని చంద్రబాబు

గత ప్రభుత్వంలో ఒక్క 'వైఎస్సార్ నేతన్న నేస్తం' ద్వారానే రూ.969.77 కోట్ల సాయం

- వివిధ సంక్షేమ పథకాల కింద నేతన్నలకు రూ.3,706 కోట్లు లబ్ధి
- ఇప్పుడూ జగన్ ప్రభుత్వం ఉండి ఉంటే జూలైలోనే రూ.24 వేలు అందేది
- నేడు జాతీయ చేనేత దినోత్సవం

సాక్షి, అమరావతి: మానవాళికి వస్త్రాన్ని అందించి గౌరవాన్ని కల్పించిన నేతన్న బతుకు నేడు ఆధునిక యంత్రాలతో పోటీపడలేక ఛిద్రమవుతోంది. మువ్వన్నెల జెండా నేసిన చేనేతకు చేయూత కరువైంది. మంచి వస్త్రాన్ని నేయడానికి మూడు పూటలూ కష్టపడే నేతన్న నేడు తన బిడ్డలకు ఒక్క పూట కూడా కడుపునిండా తిండి పెట్టలేకపోతున్నాడు. వైఎస్ జగన్ తన పాలనలో గత ఐదేళ్లూ చేనేత రంగానికి సంక్షేమ రంగులు అద్దితే.. చంద్రబాబు మరోసారి అబద్ధాల హామీల అల్లికలతో దగా చేస్తున్న వైనాన్ని నేతన్నలు గుర్తు చేసుకుంటున్నారు. నేడు జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కూటమి కుట్రలకు మగ్గం చిన్నబోతున్న వైనంపై ప్రత్యేక కథనం ఇది..

అలవిగాని హామీలతో అధికారం చేపట్టి, ఆపై చెయ్యివ్వడంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎవరూ సాటిరారు. 2014 ఎన్నికల ముందు ఎలాగైనా అధికారంలోకి రావాలన్న ఆశతో 600కుపైగా అడ్డగోలు హామీలు గుప్పించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా చేనేత రంగానికి ఇచ్చిన 25కుపైగా హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదు. ప్రతి చేనేత కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తానని హామీ ఇచ్చి.. ఐదేళ్లూ కాలయాపన చేశారు. తాజాగా 2024 ఎన్నికల్లోనూ ఇదే తరహాలో ఇచ్చిన ఉచిత విద్యుత్ హామీ అమలుకు ఇంకా అడుగు ముందుకు వేయడం లేదు. మరమగ్గాలు (పవర్ లూమ్స్)కు 500 యూనిట్లు, చేనేత మగ్గాలు (హ్యాండ్‌లూమ్స్)కు 200 యూనిట్ల చొప్పున ఉచిత విద్యుత్ అందిస్తానని ఇటీవల ఎన్నికల్లో హామీ ఇచ్చారు. మొత్తంగా రాష్ట్రంలో చేనేత మగ్గాలు సుమారు 1.60 లక్షలు ఉంటాయని అంచనా. మరమగ్గాలు వీటికి అదనం. వీటిపై ఇప్పటికే ప్రభుత్వం వద్ద తగిన సమాచారం ఉంది. దీంతో ఆయా చేనేత కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందించడానికి ఏ అడ్డంకులూ లేవు. అయినా ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుండటంపై నేతన్నలు మండిపడుతున్నారు. ఇప్పుడూ జగన్ ప్రభుత్వం ఉండి ఉంటే జూలైలోనే ప్రతి నేతన్న కుటుంబానికి రూ.24 వేలు అందేది. దీంతోపాటు వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ లా నేస్తం, జగనన్న అమ్మఒడి, పంటల బీమా, జగనన్న విదేశీ విద్యాదీవెన, వసతి దీవెన పథకాల కింద కూడా ఇప్పటికే లబ్ధి చేకూరేది.

> జాతీయ చేనేత దినోత్సవాన్ని బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్నట్లు చేనేత, జౌళిశాఖ ముఖ్య కార్యదర్శి కె.సునీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చీరాలలో నిర్వహించే రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజరవుతారని తెలిపారు.

జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ మెలికపెట్టిన బాబు

చేనేత వస్త్రాలకు జీఎస్టీ ఎత్తివేయాలన్న డిమాండ్‌ను అడ్డుపెట్టుకుని చంద్రబాబు మోసపూరిత హామీ ఇచ్చారని నేతన్నలు మండిపడుతున్నారు. జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ చేస్తానని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన బాబు.. అది ఎలా చెల్లిస్తారో చెప్పలేదు. చేతి వృత్తులు, గ్రామాల్లో కుటీర పరిశ్రమలపై పన్నులు వేయకూడదని రాజ్యాంగంలోని ఆర్టికల్ 43 చెబుతోంది. అయినప్పటికీ రూ.వెయ్యి లోపు చేనేత వస్త్రాల విక్రయాలపై 5 శాతం జీఎస్టీ, రూ.వెయ్యి దాటితే 12 శాతం జీఎస్టీ వసూలు చేస్తున్నారు. ఇందులో తయారీదారు షాపులకు విక్రయిస్తే.. షాపుల ద్వారా వినియోగదారులకు విక్రయిస్తారు. దీంట్లో వినియోగదారులే (ప్రజలు) జీఎస్టీ చెల్లిస్తారు. ఈ లెక్కన చంద్రబాబు ఎవరికి జీఎస్టీ రీయింబర్స్ చేస్తారు? తయారీదారులు, విక్రయదారులకు ఇవ్వడానికి ప్రభుత్వ నిబంధనలు అనుమతించవు. ఎందుకంటే జీఎస్టీ చెల్లించింది ప్రజలు కాబట్టి. వారే దరఖాస్తు చేసుకోవాలా? రూ.వెయ్యికిపైగా చెల్లించి చేనేత చీర కొనుక్కున్న వినియోగదారుడు రూ.120 (12 శాతం) జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకుంటాడా?

2014లోనూ బాబు దగా..

2014లోనూ చంద్రబాబు నేతన్నలను దగా చేశారు. చేనేత రుణాలు మాఫీ చేస్తానని హామీ ఇచ్చి, దానిపై అధ్యయనానికి కమిటీ వేస్తూ జీవో ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. దీంతో చేనేత కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయి. చేనేత కుటుంబాలకు ఇళ్లు, హెల్త్‌కార్డులు, మగ్గానికి రూ.లక్షన్నర చొప్పున సాయమందిస్తానని మోసం చేశారు. రూ.వెయ్యి కోట్లతో ప్రత్యేక నిధి, వర్షాకాలంలో రెండు నెలలపాటు నేత విరామానికి ఒక్కొక్క చేనేత కార్మికుడికి రూ.4 వేల సాయం, నెలకు వంద యూనిట్ల ఉచిత విద్యుత్ హామీలకు మంగళం పాడారు.



రాష్ట్రంలో చేనేత మగ్గాలు	1.60 లక్షలు
ప్రస్తుతం రూ.వెయ్యిలోపు విక్రయాలపై జీఎస్టీ	5 శాతం
2014-19 వరకు చంద్రబాబు ప్రభుత్వం ఖర్చు చేసిన మొత్తం	రూ.442 కోట్లు
రూ.వెయ్యిపైన అమ్మకాలపై జీఎస్టీ	12 శాతం
2019లో అధికారంలోకి వచ్చాక జగన్ ప్రభుత్వం చెల్లించిన గత ప్రభుత్వ బకాయిలు	రూ.103 కోట్లు
ఒక్కో చేనేత కుటుంబానికి ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం అందించిన మొత్తం	రూ.1.20 లక్షలు
నేతన్నల సంక్షేమానికి ఐదేళ్లలో (2019-24) జగన్ ప్రభుత్వం ఖర్చు చేసిన మొత్తం	రూ.3,706 కోట్లు
వైఎస్సార్ నేతన్న నేస్తం ద్వారా అందించిన మొత్తం	రూ.969.77 కోట్లు

రాష్ట్రంలో ప్రధానంగా చేనేత మగ్గాలపై వస్త్రాలు నేస్తున్న జిల్లాలు..
ఉమ్మడి కృష్ణా
గుంటూరు
ఉభయగోదావరి
వైఎస్సార్

చేనేత మగ్గాలతోపాటు మర మగ్గాలపై వస్త్రాలు నేస్తున్న జిల్లాలు..
అనంతపురం
చిత్తూరు
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
ప్రకాశం జిల్లా

జీఎస్టీ రద్దు చేస్తే నిజంగా మేలు

చంద్రబాబు ప్రకటించిన జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ కంటే జీఎస్టీ రద్దు చేస్తేనే చేనేత రంగానికి నిజంగా మేలు జరుగుతుంది. హామీ ఇవ్వాలి కానీ, అది అమలు కాకూడదు అన్నట్లు ఈ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. చేనేత వస్త్రాలపై జీఎస్టీ రద్దుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గట్టి ప్రయత్నం చేశారు. ఈ విషయమై అప్పట్లో ఎంపీలు వి.విజయసాయిరెడ్డి, వంగా గీత, గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి బృందం ప్రత్యేకంగా కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి విజ్ఞప్తి చేసింది. ఇప్పుడైనా సీఎం చంద్రబాబు ఈ విషయమై చిత్తశుద్ధితో అడుగులు వేయాలి. – బండారు ఆనందప్రసాద్, జాతీయ అధ్యక్షుడు, ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్

బాలుడిపై యువకుల పాశవిక దాడి

- మద్యం మత్తులో చితక్కొట్టి హింసించారు
- వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు
- వైరల్ కావడంతో వెలుగులోకి..
- అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో కేసును నీరుగార్చే ప్రయత్నం





బాలుడిపై బెల్టులు, కర్రలతో దాడి చేస్తున్న యువకులు ఇన్‌సెట్‌లో ఆస్పత్రిలో బాలుడు

చుండూరు (కొల్లూరు): కొందరు యువకులు మద్యం మత్తులో ఓ బాలుడిపై అత్యంత పాశవికంగా దాడికి పాల్పడ్డారు. తీవ్రంగా కొడుతూ వీడియో తీస్తూ పైశాచిక ఆనందం పొందారు. ఆ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలు... బాపట్ల జిల్లా చుండూరు మండలం చినపరిమికి చెందిన బాలుడు(17) ఒంగోలు వెళ్లి తన పెదనాన్న వద్ద ఉంటూ కుట్టుపని నేర్చుకుంటున్నాడు. అతను కొన్ని రోజుల కిందట గ్రామానికి వచ్చి అనారోగ్యం వల్ల ఒంగోలు వెళ్లలేదు. గత నెల 31న ఆ బాలుడి వద్దకు తనతో కలిసి చదువుకున్న స్నేహితుడు సూర్య, మరో యువకుడు బైక్‌పై వచ్చి సరదాగా బయటకు వెళదామని చెప్పి మండూరు చర్చి డొంక రోడ్డులోని నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లారు. అప్పటికే అక్కడున్న మరో ముగ్గురు యువకులు మద్యం తాగి ఆ బాలుడిని కూడా బీరు తాగాలని ఒత్తిడి చేశారు. అందరూ మద్యం తాగుతుండగా, చినగాదెలవర్రుకు చెందిన దయా, అలపాడుకు చెందిన చిన్ను అనే వ్యక్తులు వచ్చి వారితో కలిశారు. కొద్దిసేపటి తర్వాత ఒక్కసారిగా యువకులందరూ కలిసి ఆ బాలుడిని దూషిస్తూ దాడికి పాల్పడ్డారు. కాళ్లు, చేతులు, కర్రలు, బెల్టులతో పైశాచికంగా కొడుతూ అతని చొక్కా చింపేశారు. సుమారు రెండు గంటలు దాడి చేస్తూ వీడియోలు తీశారు.

ప్రమాదమని చెప్పి ఆస్పత్రిలో చేర్పించేందుకు ప్రయత్నం..

తీవ్రంగా గాయపడిన బాలుడిని ఇద్దరు యువకులు ఆటోలో తెనాలి తీసుకువెళ్లి రోడ్డు ప్రమాదం జరిగిందని చెప్పి ఆస్పత్రిలో చేర్పించేందుకు ప్రయత్నించారు. అయితే, ఇది ప్రమాదం కాదని, కొట్టారని, పోలీసులకు ఫిర్యాదు చేయాలని వైద్యులు సూచించారు. దీంతో బాధితుడిని ఆ యువకులు బయటకు తీసుకురాగా, బాలుడికి తెలిసిన వ్యక్తి చూసి ఏమైందని ప్రశ్నించడంతో యువకులు పారిపోయారు. అతను బాధిత బాలుడిని తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు చుండూరు ఎస్‌ఐ మహ్మద్ రఫీ ఈ నెల ఒకటో తేదీన కూచిపూడి, తెనాలి, పరిమి, గాదెలవర్రు, ఆలపాడుకు చెందిన ఏడుగురు యువకులను అదుపులోకి తీసుకుని వారిపై 324 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. అయితే, దాడికి పాల్పడిన యువకులు అధికార పార్టీకి చెందినవారు కావడంతో రాజీ చేయాలని వేమూరుకు చెందిన ముఖ్య నేత, పార్లమెంట్ స్థాయి నేత ఒకరు పోలీసులను ఆదేశించినట్లు తెలుస్తోంది. దీంతో దాడికి పాల్పడినవారికి స్టేషన్ బెయిల్ ఇచ్చేంత చిన్న కేసులు పెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

> **బైక్‌ల చోరీ కేసులలో పట్టించానని కొట్టారు**
>
> జూలై 31వ తేదీన నడుచుకుంటూ ఇంటికి వెళుతుంటే చినపరిమి గ్రామానికే చెందిన నా స్నేహితుడు సూర్య బైక్‌పై ఎక్కించుకెళ్లాడు. మండూరు గ్రామం సమీపంలోకి తీసుకెళ్లి బీరు తాగించి కొట్టడం ప్రారంభించారు. సూర్యతో పాటు చినగాదెలవర్రుకు చెందిన యువకుడు దయ, మరో ఐదుగురు ఉన్నారు. తెనాలిలో నన్ను కాల్వలో పడేద్దామని తీసుకెళుతుంటే మా ఊరి వ్యక్తి కనిపించాడు. ఆయన సాయంతో వైద్యశాలలో చేరాను. గతంలో బైక్‌ల చోరీ విషయంలో దయా అనే వ్యక్తిని పోలీసులకు పట్టించానన్న కక్షతో నన్ను కొట్టారు.
>
> – బాధిత బాలుడు

పుట్టిన మూడు గంటలకే గుండె ఆపరేషన్



అరుదైన శస్త్రచికిత్సతో ప్రాణాలు కాపాడిన వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): సాధారణంగా పిల్లలు పుట్టిన తర్వాత ఆరోగ్య సమస్యలు బయటపడతాయి. కానీ పుట్టకముందే సమస్యలు గుర్తించడం, ఆ వెంటనే పరిష్కరించడం చాలా అరుదు. ఇలాంటి అరుదైన చికిత్స కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చోటు చేసుకుంది. చిన్నపిల్లల గుండె వైద్యనిపుణులు డాక్టర్ కె.మహమ్మద్ ఫారూక్ అందించిన వివరాల మేరకు 'కర్నూలుకు చెందిన ఓ మహిళకు నెలలు నిండిన తర్వాత ఓ ఆస్పత్రిలో స్కాన్ చేయించారు. ఆ సమయంలో శిశువు గుండెలో సమస్య ఉన్నట్లు అనుమానించారు. గత నెల 13న ఆమెను మా ఆసుపత్రికి తీసుకు రాగా పరీక్షల అనంతరం గుండె పనితీరు దారుణంగా దెబ్బతిన్నట్లు గుర్తించాం. సిజేరియన్ చేసి చిన్నారిని బయటకు తీశాం. బాబు పుట్టిన మూడు గంటలకు బెలూన్ యాంజియోప్లాస్టీ చేయాలని నిర్ణయించాం. అదే రోజు బెలూన్ అయోటిక్ వాల్వోటమి చేయడంతో గుండె సాధారణంగా పనిచేయడం ప్రారంభించింది. ఇంత చిన్న పిల్లలకు ఇలాంటి ప్రక్రియలు చేయడమే అరుదు కాగా, ముందుగా గుర్తించడం మరీ అరుదు. బాబు కోలుకోవడంతో గతనెల 20న డిశ్చార్జ్ చేశాం. తిరిగి పరీక్ష చేయించుకోవడానికి మంగళవారం బాబును తీసుకొచ్చారు. ఇప్పుడు పూర్తి ఆరోగ్యంగా ఉన్నాడు' అని ఫారూక్ వివరించారు.

రాష్ట్రంలో మరిన్ని విమానాశ్రయాలు, ఎయిర్ స్ట్రిప్‌లు

- వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన ప్రాజెక్టులు మళ్లీ పట్టాలెక్కాలి
- మౌలిక సదుపాయాలపై సమీక్షలో సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మరో 12 నుంచి 14 చోట్ల ఎయిర్‌పోర్టులు, ఎయిర్ స్ట్రిప్‌లు నిర్మించాలన్నది ప్రభుత్వ ఆలోచన అని సీఎం చంద్రబాబు చెప్పారు. ముందుగా కుప్పం, దగదర్తి, నాగార్జున సాగర్, మూలపేటలో వీటిని నిర్మిస్తామన్నారు. అనంతపురం జిల్లా తాడిపత్రి, కాకినాడ జిల్లా తునిలో కూడా వీటి నిర్మాణాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. మౌలిక సదుపాయాలు, పెట్టుబడులపై మంగళవారం సచివాలయంలో సీఎం సమీక్షించారు. కర్నూలు ఎయిర్‌పోర్టులో ఫ్లయింగ్ ట్రైనింగ్ సంస్థలను తీసుకురావాలని చెప్పారు. విమానాశ్రయాల ద్వారా సరకు రవాణా ప్రాజెక్టులు రూపొందించాలని అన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిలిపేసిన, రద్దు చేసిన అన్ని ప్రాజెక్టులను మళ్లీ పట్టాలెక్కించాలని ఆయన ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ మారిటైం బోర్డు, ఏపీ మారిటైం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, వివిధ ప్రాజెక్టుల్లో స్పెషల్ పర్పస్ వెహికల్స్, ఏపీ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళ్లాలని చెప్పారు. అన్ని పోర్టులు, ఫిషింగ్ హార్బర్లను వేగంగా పూర్తి చేయాలని అన్నారు. ఏపీ మారిటైం మాస్టర్ ప్లాన్‌తో పాటు మారిటైం పాలసీ తెస్తామని తెలిపారు.

జీఏడీ పరిధిలోకి ఏవియేషన్ కార్పొరేషన్

ఏపీ ఏవియేషన్ కార్పొరేషన్‌ను జీఏడీ పరిధిలోకి, డిజిటల్ కార్పొరేషన్‌ను ఐ అండ్ పీఆర్ పరిధిలోకి తేవాలని సీఎం చెప్పారు. ఏపీ టవర్స్ కార్పొరేషన్‌ను స్టేట్ ఫైబర్‌నెట్ లిమిటెడ్‌లో విలీనం చేయాలన్నారు. కంటెంట్ కార్పొరేషన్, డ్రోన్ కార్పొరేషన్, టవర్స్ కార్పొరేషన్, గ్యాస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌లను గాడిలో పెట్టాలని ఆదేశించారు. జిల్లాల్లో ఆర్టీజీ సెంటర్ల నిర్మాణం పూర్తి చేసి, వాటికి సీసీ కెమెరా నెట్‌వర్క్‌ను అనుసంధానం చేయాలని చెప్పారు.

పుంగనూరు ప్రాజెక్టులపై మంత్రికే అవగాహన లేదు

- ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే క్షణాల్లో రైతులకు పరిహారం ఇవ్వొచ్చు
- కేసులతో టీడీపీ నేతలే అవులపల్లె ప్రాజెక్టును అడ్డుకున్నారు
- ప్రాజెక్టుకు అన్ని అనుమతులున్నాయని కేంద్రమే ప్రకటించింది
- మంత్రి రాంప్రసాద్‌రెడ్డిపై రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి ఫైర్
- 'పెప్పర్ మోషన్' కంపెనీ ఏర్పాటును అడ్డుకోవద్దని హితవు



పుంగనూరు (చిత్తూరు జిల్లా): పుంగనూరులోని ప్రాజెక్టులపై ఏమాత్రం అవగాహన లేకుండా.. బాధ్యతా రాహిత్యంగా మాట్లాడుతున్నారని మంత్రి రాంప్రసాద్‌రెడ్డిపై రాజంపేట వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పుంగనూరులో ఎంపీ మిథున్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. 'పుంగనూరు నియోజకవర్గంలోని నేతిగుట్లపల్లె, అవులపల్లె ప్రాజెక్టుల నిర్మాణం ప్రజాహితం కోసం చేపట్టాం. ప్రజలకు సాగునీరు, తాగునీరు అందించేందుకు మా నాయకుడు వైఎస్ జగన్ ఈ ప్రాజెక్టులను మంజూరు చేశారు. నేతిగుట్లపల్లె ప్రాజెక్టు పూర్తి చేసి.. అవులపల్లె ప్రాజెక్టు పనులు ప్రారంభించే సమయంలో టీడీపీ నాయకులు గ్రీన్ ట్రిబ్యునల్‌లో తప్పుడు కేసులు వేసి పనులను అడ్డుకున్నారు. వారు ఆక్రమించిన అటవీ భూముల గురించి బయటపడుతుందనే టీడీపీ వాళ్లు ఇలా చేశారు. నిబంధనల మేరకే పనులు చేపట్టినట్లు కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ సుప్రీంకోర్టులో కౌంటర్ దాఖలు చేసింది. అన్ని అనుమతులతో ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయని వెల్లడించింది. ఈ విషయాన్ని టీడీపీ ప్రభుత్వం కూడా పరిశీలించుకోవచ్చు. నేతిగుట్లపల్లె ప్రాజెక్టు రైతులకు ప్రభుత్వం తలుచుకుంటే పది నిమిషాల్లో నష్టపరిహారం చెల్లించొచ్చు. ఇందుకోసం రూ.54 కోట్లు చెల్లించాలని కోరుతూ కాంట్రాక్టర్ సీఎఫ్ఎంఎస్ ద్వారా ప్రభుత్వానికి బిల్లులు సమర్పించారు. ఆ ఫైల్ ప్రభుత్వం వద్ద ఉంది. అది వదిలేసి మంత్రి మా మీద ఆరోపణలు చేయడం హాస్యాస్పదం. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే రైతులకు పరిహారం ఇవ్వాలి' అని మిథున్‌రెడ్డి డిమాండ్ చేశారు. రిజర్వాయర్ నిర్మాణంలో రైతుల పంటలు నష్టపోకుండా సొంత నిధులు రూ.1.49 కోట్లను నష్టపరిహారంగా పంపిణీ చేశామని ఎంపీ మిథున్‌రెడ్డి తెలిపారు. ఆరడిగుంట, మేలుందొడ్డి వద్ద పెప్పర్ మోషన్ ఎలక్ట్రిక్ బస్సులు, ట్రక్కుల కంపెనీ ఏర్పాటును ప్రభుత్వం అడ్డుకుంటోందని మండిపడ్డారు. ఈ కంపెనీ ఏర్పాటుకు ప్రభుత్వం సహకరించి యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.

రేషన్ బియ్యం నాకే అమ్మాలి

- టీడీపీ ముఖ్యులు చెబితే వచ్చా
- మద్దిపూడి టీడీపీ కార్యాలయంలో రేషన్ డీలర్లతో రైస్ మిల్లర్ రహస్య సమావేశం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: అధికారంలోకి వచ్చిన వెంటనే పేదల బియ్యంపై కన్నేసిన 'పచ్చ' పార్టీ నేతలు ప్రకాశం జిల్లాలో రోజుకో దందాను తెరపైకి తీసుకొస్తున్నారు. తాజాగా ఒంగోలుకు చెందిన ఓ రైసుమిల్లు యజమాని కొండపి నియోజకవర్గం, మద్దిపూడి మండల డీలర్లతో సమావేశమైన విషయం వెలుగులోకి వచ్చింది. టీడీపీ కార్యాలయంలో గుట్టుగా నిర్వహించిన ఈ సమావేశంలో 'పార్టీ ముఖ్యుల ఆదేశాల మేరకు ఇక్కడకు వచ్చా.. మండలంలో ఎంతమంది డీలర్లు ఉన్నారో వారి వద్ద ఎన్ని టన్నులు రేషన్‌బియ్యం ఉన్నాయో, ఆ సరుకంతా నాకు మాత్రమే అమ్మాలి' అంటూ హుకుం జారీ చేశాడు. మండలంలో 24 రేషన్ దుకాణాలు ఉండగా, 24మంది డీలర్లు ఉన్నారు. అందులో ముగ్గురు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు కాగా, మిగతా 21 మంది డీలర్లు టీడీపీ సానుభూతిపరులు. ఈ సమావేశానికి సంబంధించి డీలర్లు అందరూ హాజరు కావాలని మండలానికి చెందిన ఓ బీసీ నాయకుడు ఫోన్ చేశాడు. దీంతో 17 మంది డీలర్లు ఈ సమావేశానికి హాజరైనట్లు సమాచారం. కార్డుదారుల వద్ద ఉన్న రేషన్ బియ్యం ఎంతకైనా కొనుగోలు చేసుకోండి.. ఆ సరుకు మాకు మాత్రమే రూ.15లకు అమ్మాలంటూ రైస్‌మిల్ యజమాని ఆదేశాలు జారీ చేశాడు. దీనికి కొంత మంది డీలర్లు మిన్నకుంటే, మరికొంతమంది ఈ డీల్ కుదరదని తేల్చి చెప్పారు. 'నన్ను అధిష్టానం పంపింది. నేను చెప్పిన ధరకే ఇవ్వాలి. లేదంటే ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మీ రేషన్ దుకాణాలపై దాడులు చేస్తారు'' అని హెచ్చరించినట్లు సమాచారం. దీంతో ఆగ్రహించిన పలువురు డీలర్లు కుర్చీలు విసిరేసి వెళ్లిపోయినట్లు తెలిసింది. ఎన్నడూ లేని విధంగా ప్రత్యేక సమావేశాలు పెట్టి మరీ హెచ్చరికలు జారీ చేస్తున్నారని డీలర్లు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఏపీ విద్యాహక్కు చట్టం అమలు బాగుంది

జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ప్రశంస

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని విద్యాహక్కు చట్టం అమలును జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ప్రశంసించినట్లు ఏపీ విద్యాహక్కు చట్టం నోడల్ అధికారి డి.మధుసూదనరావు తెలిపారు. న్యూఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో సోమవారం జరిగిన జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సమావేశంలో ఏపీ విద్యాహక్కు చట్టం అమలు తీరు, నాణ్యమైన విద్యకు చేపట్టిన చర్యలు, విద్యార్థులకు కల్పిస్తున్న రక్షణ, ప్రైవేట్ పాఠశాలల్లో కల్పించిన ప్రవేశాలపై ప్రజెంటేషన్ ఇచ్చామని తెలిపారు.

పోలీసు శాఖకు 4 వేల కొత్త వాహనాలు

సాక్షి, అమరావతి: కొత్త వాహనాల కొనుగోలుకు పోలీసు శాఖ సిద్ధమవుతోంది. దాదాపు 4వేల వాహనాలను కొనుగోలు చేయాలని నిర్ణయించింది. పోలీసు శాఖకు ప్రస్తుతం 24వేల వాహనాలు ఉన్నాయి. వాటిలో 10వేలు బైక్‌లు ఉండగా మరో 14వేల వరకు జీపులు, కార్లు, ఇతర వాహనాలు ఉన్నాయి. నిర్దేశిత ప్రమాణాల ప్రకారం 15ఏళ్ల జీవితకాలం దాటిన వాహనాలను ఉపయోగించకూడదు. ఆ మేరకు గత ఏడాదే 2,500 వాహనాలను తొలగించగా, మరో 1,500 వాహనాలు కూడా తాజాగా 15 ఏళ్ల జీవితకాలం పూర్తయ్యింది. ఐదేళ్లకోసారి కొత్త వాహనాలను కొనుగోలు చేసేందుకు వెసులుబాటు ఉంది. పోలీసు, రవాణా శాఖ అధికారులతో కూడిన కమిటీ త్వరలోనే ఆ వాహనాలను పరిశీలించి తుది నిర్ణయం తీసుకోనుంది. పోలీసు శాఖ కోసం చివరిసారిగా 2018లో కొత్త వాహనాలను కొనుగోలు చేశారు.

మా చావుకు టీడీపీ వాళ్లే కారణం

- నంద్యాల జిల్లా సొదరదిన్నె వెలుగు వీఓఏ సూసైడ్ లెటర్
- ఉద్యోగం నుంచి తప్పుకోవాలంటూ టీడీపీ నేతలు వేధిస్తున్నారని వెల్లడి
- రోజూ ఇంటికి వచ్చి బెదిరిస్తున్నారని ఆవేదన
- కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ చంద్రబాబుకు లేఖ




కోవెలకుంట్ల: అధికారం అండతో చెలరేగిపోతున్న టీడీపీ నాయకులు.. తాజాగా నంద్యాల జిల్లాలో ఓ మహిళా చిరుద్యోగిపైనా కక్ష కట్టారు. వెంటనే ఉద్యోగం నుంచి తప్పుకోవాలంటూ ఆమెను రోజూ బెదిరిస్తున్నారు. దిక్కుతోచనిస్థితిలో ఆమె టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబుకు సూసైడ్ లెటర్ రాసింది. కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటున్నానని.. తమ చావుకు టీడీపీ వాళ్లే కారణమని పేర్కొంది. వివరాలు.. నంద్యాల జిల్లా సొదరదిన్నె గ్రామానికి చెందిన పద్మజ ఏడాదిన్నర క్రితం వైఎస్సార్ క్రాంతి పథం(వెలుగు)లో వీఓఏ(బుక్ కీపర్)గా విధుల్లో చేరింది. ఆమె భర్త జనార్ధన్‌రెడ్డి పక్షవాతంతో బాధపడుతూ నాలుగేళ్లుగా మంచానికే పరిమితమయ్యాడు. వారి కుమార్తెలు చంద్రవైష్ణవి పదో తరగతి, సౌమ్య చంద్రిక 8వ తరగతి చదువుతున్నారు. పద్మజ ఉద్యోగమే వారి కుటుంబానికి జీవనాధారం. పద్మజ వీఓఏగా విధుల్లో చేరినప్పటి నుంచి గ్రామంలోని పొదుపు సంఘాల బలోపేతానికి కృషి చేస్తోంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆమెకు వేధింపులు మొదలయ్యాయి. గ్రామానికి చెందిన టీడీపీ నేతలు మద్దూరు వెంకటసుబ్బారెడ్డి, ఏరాశి రామచంద్రుడు, కరిముల్లా, దూదేకుల సన్న, డీలర్ మద్దమ్మ తదితరులు.. ఉద్యోగం నుంచి తప్పుకోవాలంటూ పద్మజను బెదిరిస్తున్నారు. ప్రతి రోజూ పద్మజ ఇంటి వద్దకు వెళ్లి హెచ్చరిస్తున్నారు. టీడీపీ నేతల ఒత్తిడి తట్టుకోలేక పద్మజ కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ సీఎం చంద్రబాబు, మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డికి సూసైడ్ లెటర్ రాసి.. వెలుగు అధికారులు, పొదుపు సంఘాల వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్ చేసింది. తమ చావుకు టీడీపీ నాయకులే కారణమని పేర్కొంది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే వీఓఏ పద్మజతో పాటు టీడీపీ నేతలను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారణ జరుపుతున్నారు.

అండగా ఉంటాం..

వీఓఏ పద్మజ కుటుంబానికి అండగా ఉంటామని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చెప్పారు. ఆమెతో ఫోన్‌లో మాట్లాడి భరోసా కల్పించారు. విధి నిర్వహణలో ఏదైనా తప్పు జరిగి ఉంటే ప్రశ్నించాలి గానీ.. ఇలా రాజకీయ కక్ష సాధింపు చర్యలు సరికాదని టీడీపీ నేతలకు హితవు పలికారు. ఆమె కుటుంబానికి ఏదైనా హాని జరిగితే సహించబోమని హెచ్చరించారు.

మానసిక దివ్యాంగురాలిపై లైంగిక దాడికి యత్నం



విడవలూరు: మానసిక దివ్యాంగురాలిపై (19) ఓ వ్యక్తి లైంగిక దాడికి యత్నించిన ఘటనపై శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా విడవలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ వివరాలను ఎస్‌ఐ సాయిప్రసాద్ మంగళవారం వెల్లడించారు. ముదివర్తి గ్రామం గాంధీనగర్ సంఘం ఎస్టీ కాలనీలో ఓ వృద్ధ దంపతులు నివాసం ఉంటున్నారు. వారి కొడుకు, కోడలు అనారోగ్యంతో మృతి చెందడంతో మానసిక దివ్యాంగురాలైన వారి కుమార్తెను ఆ వృద్ధులు పెంచుతున్నారు. సోమవారం మధ్యాహ్నం ఆ బాలిక ఇంట్లో ఒంటరిగా ఉండటం గమనించిన అదే గ్రామానికి చెందిన ఎలేటి శీనయ్య మద్యం మత్తులో ఆమెపై లైంగికదాడికి యత్నించాడు. బాలిక కేకలు వేయడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. బాలిక అవ్వా, తాత జరిగిన విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేయగా, శీనయ్యపై కేసు నమోదు చేశారు. మంగళవారం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

కన్ను కొట్టాడు.. చెప్పుతో చెంపలు పగులకొట్టింది

ఆమె ఓ సాధారణ మహిళ. బస్సు కోసం బస్టాండ్‌లో ఎదురుచూస్తోంది. ఇంతలో అక్కడికి వచ్చాడో యువకుడు. ఆమెను అదేపనిగా చూస్తూ నిలబడ్డాడు. గమనించిన ఆమె అతని వైపు చూసింది. ఇదే సరైన సమయం అన్నట్లు ఆమెకు కన్నుకొట్టాడు. అందరి ముందు గొడవ ఎందుకులే అని సర్దుకుంది ఆమె. దీన్ని అలుసుగా తీసుకున్న సదరు యువకుడు మరో అడుగు ముందుకేసి ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఇక అంతే.. ఆమె ఉగ్రకాళికాదేవిలా మారిపోయింది. కాలి చెప్పుతీసుకుని ఆ యువకుడి రెండు చంపలు పగిలేలా కొట్టింది. ఆమెకు మద్దతుగా నిలిచిన తోటి ప్రయాణికులు అతన్ని చితకబాదారు. దీంతో అతను అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటన కర్ణాటక రాష్ట్రం విజయపుర పట్టణంలోని బస్టాండ్‌లో సోమవారం జరిగింది. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. ఆమె ధైర్యసాహసాలను నెటిజన్లు మెచ్చుకుంటూ కామెంట్లు పెట్టారు. –యశవంతపుర



పోకిరీని చెప్పుతో చితకబాదుతున్న మహిళ

..అదే కల్లోలం



బంగ్లాదేశ్‌లో కొనసాగుతున్న హింస

- దేశవ్యాప్తంగా లూటీలు, విధ్వంసం
- సినీ హీరోను కొట్టి చంపిన మూకలు
- హోటల్‌కు నిప్పు, 24 మంది సజీవ దహనం
- ఇప్పటిదాకా 440 దాటిన మృతులు
- పార్లమెంటు రద్దు, త్వరలో ఎన్నికలు
- అప్పటిదాకా తాత్కాలిక ప్రభుత్వం

ఢాకా: బంగ్లాదేశ్‌లో అరాచకం రాజ్యమేలుతోంది. షేక్ హసీనా ప్రధానిగా తప్పుకోవాలంటూ వెల్లువెత్తిన నిరసనలు ఆమె రాజీనామా చేసినా ఆగడం లేదు. సోమవారం సాయంత్రానికే హసీనా దేశం వీడినా రాత్రి పొడవునా దేశవ్యాప్తంగా దమనకాండ కొనసాగింది. అల్లరి మూకలు యథేచ్ఛగా విధ్వంసానికి దిగాయి. ఇళ్లు, దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయాలకు విచ్చలవిడిగా నిప్పు పెట్టారు. చివరికి పోలీస్ స్టేషన్లను కూడా వదల్లేదు. ఒకచోట ఎస్సైని కొట్టి చంపారు. మరోచోట ప్రముఖ సినీ హీరో ఇంటిపై నిరసనకారులు దాడికి దిగారు. హీరో, ఆయన తండ్రి తుపాకీతో బెదిరించడంతో మరింతగా రెచ్చిపోయారు. ఇద్దరినీ కర్రలతో చితకబాది చంపేశారు. జోషోర్ జిల్లాలో హసీనాకు చెందిన అవామీ లీగ్ పార్టీ నాయకుని హోటల్‌ను తగలబెట్టడంతో 24 మంది సజీవ దహనమయ్యారు! సోమవారం ఢాకాలో పాక్షికంగా ధ్వంసం చేసిన హసీనా తండ్రి, బంగబంధు షేక్ ముజిబుర్ రెహ్మాన్ విగ్రహాన్ని బుల్‌డోజర్లతో కూల్చేశారు. మైనారిటీలైన హిందువులను దేశవ్యాప్తంగా అల్లరి మూకలు లక్ష్యం చేసుకున్నాయి. దేవాలయాలను ధ్వంసం చేశారు. మహిళలపై అకృత్యాలకు పాల్పడ్డారు. హసీనా పలాయనం అనంతరం దేశవ్యాప్తంగా కనీసం 100 మందికి పైగా అల్లర్లకు బలైనట్టు స్థానిక మీడియా పేర్కొంది. గత నెల రోజుల్లో మరణించిన వారి సంఖ్య 440 దాటింది. పోలీసులు, సైన్యం రంగంలోకి దిగడంతో మంగళవారం సాయంత్రానికి పరిస్థితి కాస్త అదుపులోకి వచ్చినట్టు చెబుతున్నారు. మరోవైపు న్యూయార్క్‌లోని బంగ్లాదేశ్ కాన్సులేట్‌పై దాడి జరిగింది. నిరసనకారులు కార్యాలయంలోకి జొరబడి ముజిబుర్ రెహ్మాన్ ఫొటోను, వస్తువులను ధ్వంసం చేశారు. సంబంధిత వీడియో వైరల్‌గా మారింది.

తాత్కాలిక ప్రభుత్వ సారథిగా యూనుస్



నోబెల్ గ్రహీత మహమ్మద్ యూనుస్ సారథిగా సైన్యం కనుసన్నల్లో తాత్కాలిక ప్రభుత్వం కొలువుదీరింది. అధ్యక్ష కార్యాలయం మంగళవారం అర్ధరాత్రి ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. కేసులు, జైలుశిక్ష నేపథ్యంలో యూనుస్ ప్రస్తుతం విదేశాల్లో ఉన్నారు. హసీనా సర్కారు పతనాన్ని ఆయన స్వాగతించారు. ఈ పరిణామాన్ని దేశానికి రెండో విముక్తిగా అభివర్ణించారు. అంతకుముందు, విద్యార్థి సంఘాల అల్టిమేటం నేపథ్యంలో పార్లమెంటును రద్దు చేస్తూ అధ్యక్షుడు మొహమ్మద్ షాబుద్దీన్ నిర్ణయం తీసుకున్నారు. దాంతో మధ్యంతర ప్రభుత్వ ఏర్పాటుకు, సాధారణ ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమమైంది. అనంతరం విద్యార్థి సంఘాల నాయకులతో అధ్యక్షుడు భేటీ అయ్యారు. తాత్కాలిక సర్కారు కూర్పుపై వారితో చర్చించారు. విపక్ష బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) సారథి బేగం ఖలీదా జియా (79)ను గృహనిర్బంధం నుంచి విడుదల చేశారు.

చైనా, ఐఎస్ఐ హస్తం?

హసీనాను దించేందుకు పక్కాగా పావులు

- భారత వ్యతిరేక జియాను ఎలాగైనా గద్దెనెక్కించే లక్ష్యం
- బంగ్లాను ఉగ్రవాద అడ్డాగా మార్చే యత్నం
- విద్యార్థి ఆందోళనల్లోకి ఐఎస్ఐ జేబు సంస్థ జమాత్
- ఘర్షణలను ఎగదోసిన ఐసీఎస్

బంగ్లాదేశ్ కల్లోలం వెనక విదేశీ హస్తముందా? చైనా, పాక్ ఐఎస్ఐ కలిసి పక్కా ప్రణాళికతోనే సంక్షోభాన్ని సృష్టించాయా? భారత్‌పట్ల అనుకూలంగా ఉన్నందుకే షేక్ హసీనా పట్ల అక్కసు పెంచుకున్నాయా? తమ జేబు సంస్థల ద్వారా అరాచకం సృష్టించి ఆమెను గద్దె దించడంలో సఫలమయ్యాయా? రిజర్వేషన్ల ఆందోళన వాటికి అందివచ్చిన ఆయుధంగా మారిందా? అంటే అవుననే సమాధానం వస్తోంది. యువత, విద్యార్థుల ఆందోళనలో ఐఎస్ఐ శక్తులు చేరి పరిస్థితి చేయి దాటేలా చూడటంలో సఫలీకృతమైనట్టు పలు దేశాల నిఘా వర్గాలు నిర్ధారిస్తున్నాయి. వాటి కథనం ప్రకారం... బంగ్లాదేశ్‌లో ఎలాగైనా భారత వ్యతిరేక, చైనా–పాక్ అనుకూల సర్కారు కొలువుదీరేలా చూడటమే లక్ష్యంగా ఐఎస్ఐ పావులు కదిపింది. ఇందుకోసం బంగ్లాలోని ఐఎస్ఐ స్లీపర్‌సెల్స్ రాత్రింబవళ్లూ పని చేశాయి. ముఖ్యంగా ఢాకాలో పరిస్థితులు పూర్తిగా చేయి దాటిపోవడం వెనక ఐఎస్ఐ ముసుగు సంస్థ జమాతే ఇస్లామీ బంగ్లాదేశ్, దాని విద్యార్థి విభాగం ఇస్లామీ ఛాత్ర శివిర్ (ఐసీఎస్) కీలక పాత్ర పోషించాయి. యువత, విద్యార్థులు చేపట్టిన ఆందోళనలను వీలైనంతగా ఎగదోశాయి. ఇందుకోసం జమాత్, ఐసీఎస్ సభ్యులు విద్యార్థుల ముసుగులో పని చేశారు. జమాత్‌కు నిత్యం పాక్, ఐఎస్ఐ నుంచే నిధులందుతాయి. ఎప్పుడు, ఎక్కడ, ఏం చేయాలో ఢాకాలోని పాక్ హై కమిషన్ నుంచి ఎప్పటికప్పుడు నిర్దేశాలు వస్తుంటాయి. ఆ మేరకు జమాత్ సభ్యులు సైలెంటుగా పని చక్కబెడతారని పాక్‌లోని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు మీడియా సంస్థలు కథనాలు వెలువరిస్తున్నాయి.

లండన్‌లో వ్యూహరచన!

హసీనాను వీలైనంత త్వరగా గద్దె దింపి భారత వ్యతిరేకి అయిన మాజీ ప్రధాని బేగం ఖలీదా జియా సారథ్యంలోని విపక్ష బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) అధికారంలోకి వచ్చేలా చూడటమే టాస్క్‌గా ఐఎస్ఐ పావులు కదిపింది. తద్వారా నానాటికీ సుదృఢంగా మారుతున్న భారత్–బంగ్లా సంబంధాలకు బ్రేక్ వేయడంతో పాటు కశ్మీర్ నుంచే గాక బంగ్లా వైపు నుంచి కూడా భారత్‌లోకి ఉగ్రవాదులను చొప్పించే వ్యూహం దీని వెనక దాగుంది. లండన్‌లో ఇందుకు పక్కగా స్కెచ్ తయారైనట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగానే జియా కుమారుడు తారిఖ్ రెహ్మాన్ ఇటీవల ఐఎస్ఐ వర్గాలతో సౌదీ అరేబియాలో భేటీ అయినట్టు సమాచారం. అనంతరం ప్రణాళికను పక్కాగా అమల్లో పెట్టారు. అందులో భాగంగా అల్లర్ల వ్యాప్తికి జూన్‌లోనే ఐసీఎస్ వ్యూహాలు సిద్ధం చేసుకుంది. వీలైనంత అరాచకం సృష్టించడమే లక్ష్యంగా జమాతే, ఐసీఎస్‌లకు ఐఎస్ఐ భారీగా నిధులిచ్చినట్టు వెలుగులోకి వచ్చింది. వాటిలో అత్యధిక మొత్తాలను ఫండింగ్ చేసింది పాక్‌లోని చైనా సంస్థలేనని తేలింది. అంతిమంగా బంగ్లాలోనూ తాలిబన్ తరహా పాలన తేవాలన్నది వాటికి ఐఎస్ఐ, చైనా అప్పగించిన టాస్క్ అని నిఘా వర్గాలు నిర్ధారణకు వచ్చాయి. ఈ మేరకు కొద్ది నెలల క్రితమే ఐసీఎస్ రంగంలోకి దిగింది. ఢాకాతో పాటు పలు నగరాల్లో విద్యార్థులను నయానా భయానా భారీ సంఖ్యలో తమ సానుభూతిపరులుగా మార్చుకుంది. బంగ్లాదేశ్ అంతటా ఘర్షణలు తీవ్ర రూపు దాల్చేలా, పరిస్థితి చేయి దాటిపోయేలా చేయడం వెనక ఈ సంస్థే ప్రధాన పాత్ర పోషించిందని తేలింది. దానికి ఢాకాలోని పాక్ ఎంబసీ అన్నివిధాలా దన్నుగా నిలిచింది. ఈ క్రమంలో, అవసరమైతే తమ కార్యాలయంలో తలదాచుకోవాల్సిందిగా విద్యార్థులకు చెప్పేదాకా వెళ్లిందని దౌత్య వర్గాలంటున్నాయి!

చైనా హస్తం సుస్పష్టం

బంగ్లా కల్లోలం వెనక చైనా విదేశాంగ, భద్రతా వ్యవహారాల శాఖ హస్తం కూడా ఉందని నిఘా వర్గాలు వెల్లడించాయి. తమకంటే భారత్‌కు హసీనా ఎక్కువ ప్రాధాన్యమివ్వడం చైనాకు రుచించని అంశాల్లో ఒకటి. పాక్ అనుకూల సర్కారైతే తన చెప్పుచేతల్లో ఉంటుందన్నది చైనా వ్యూహం. హసీనాను గద్దె దింపడం వెనక కచ్చితంగా విదేశీ హస్తముందని ఆ దేశంలో భారత హైకమిషనర్‌గా చేసిన వీణా సిక్రీ అన్నారు. ''ఇటీవలి చైనా పర్యటన సందర్భంగా హసీనాను ఘోరంగా అవమానించిన తీరే ఇందుకు నిదర్శనం. ఆమెకు కనీస ప్రొటోకాల్ మర్యాద కూడా ఇవ్వలేదు. అధ్యక్షుడు జిన్‌పింగ్ కూడా హసీనాతో వ్యక్తిగతంగా భేటీ కాలేదు. ఆమె సర్కారును కూలదోయడం వెనక పాక్–చైనా ఉమ్మడి వ్యూహం ఉందన్నది స్పష్టమే'' అని వివరించారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఐఐటీ–మద్రాసుకు కృష్ణ చివుకుల రూ.228 కోట్ల విరాళం


సాక్షి, చెన్నై: ఐఐటీ–మద్రాసుకు పూర్వ విద్యార్థి, ఇండో–ఎంఐఎం వ్యవస్థాపకుడు డాక్టర్ కృష్ణ చివుకుల రూ.228 కోట్లు విరాళంగా అందజేశారు. మంగళవారం చెన్నైలోని సంస్థ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఈ మొత్తాన్ని అందించారు. ఈ నిధులతో ఐదు పథకాలను అమలు చేయనున్నారు. ఇది దేశంలోనే అతి పెద్ద విరాళమని ఐఐటీ–మద్రాసు డైరెక్టర్ వి.కామకోటి అన్నారు. ఆయన గౌరవార్థం అకడమిక్ బ్లాక్‌కు కృష్ణ చివుకుల బ్లాక్‌గా పేరు పెట్టినట్టు ప్రకటించారు. ఏపీలోని బాపట్లలో మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన కృష్ణ ఐఐటీ–బాంబే, ఐఐటీ–మద్రాసులో ఏరోస్పేస్ ఇంజనీరింగ్ చేశారు. పారిశ్రామికవేత్తగా ఎదిగారు. అమెరికాలో శివ టెక్నాలజీస్, బెంగళూరులో ఇండో–మెటల్ ఇంజక్షన్ మోల్డింగ్ ప్రారంభించారు. ఎందరికో ఉద్యోగాలిచ్చారు.

బంగ్లా పరిణామాలు ఆందోళనకరం

ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం

పార్లమెంట్‌లో ఎస్.జైశంకర్ ప్రకటన

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌లో హింసాకాండ నేపథ్యంలో అక్కడి మైనార్టీల స్థితిగతులపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ వెల్లడించారు. అక్కడి భారతీయులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు. బంగ్లా పరిణామాలపై ఆయన మంగళవారం పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రకటన చేశారు. ''అక్కడ శాంతిభద్రతల పరిస్థితిపై తీవ్ర ఆందోళన చెందుతున్నాం. సరిహద్దుల్లో అప్రమత్తంగా ఉండాలని భద్రతా దళాలను ఆదేశించాం. సోమవారం ఢాకాలో ఆందోళనలు అదుపు తప్పాక షేక్ హసీనా భద్రతాధికారులతో సమావేశమై, రాజీనామాకు నిర్ణయించుకున్నారు. ఆ వెంటనే ఇండియాకు వస్తానంటూ విన్నవించారు. దాంతో ఆమె విజ్ఞప్తిపై అప్పటికప్పుడు నిర్ణయం తీసుకొని అనుమతించాం'' అని తెలిపారు. అదేసమయంలో షేక్ హసీనా ప్రయాణించే విమానాన్ని అనుమతించాలంటూ బంగ్లాదేశ్ అధికార వర్గాలు విజ్ఞప్తి చేశాయన్నారు. ఆమె సోమవారం సాయంత్రం ఇండియా చేరారని, బంగ్లాదేశ్‌లో పరిస్థితి ఇంకా ఉద్రిక్తంగా ఉందని జైశంకర్ వివరించారు. అక్కడ 19 వేల మంది భారతీయులు ఉండగా, వీరిలో 9 వేల మంది విద్యార్థులు ఉన్నారని చెప్పారు. విద్యార్థుల్లో చాలామంది గత నెలలోనే స్వదేశానికి తిరిగి వచ్చారని వెల్లడించారు. భారత్–బంగ్లాదేశ్ మధ్య దశాబ్దాలుగా బలమైన సంబంధాలు ఉన్నాయని గుర్తుచేశారు. బంగ్లాదేశ్ పరిణామాల విషయంలో భారత ప్రభుత్వం తీసుకొనే నిర్ణయాలకు మద్దతు ఇవ్వాలని విపక్షాలను కోరారు.



జైశంకర్

హసీనాకు సాయం అందిస్తాం

అఖిలపక్ష సమావేశంలో విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్ ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేసి, మన దేశానికి చేరుకున్న షేక్ హసీనాకు భారత ప్రభుత్వం తరఫున అన్ని విధాలా తగిన సాయం అందిస్తామని హామీ ఇచ్చామని విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ చెప్పారు. వివిధ అంశాలపై తమతో మాట్లాడేందుకు, భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం తీసుకొనేందుకు ఆమెకు తగినంత సమయం ఇస్తామన్నారు. దిగ్భ్రాంతి నుంచి హసీనా ఇంకా కోలుకోలేదని వివరించారు. బంగ్లాదేశ్ పరిణామాలపై చర్చించేందుకు మంగళవారం ఢిల్లీలో అఖిలపక్ష సమావేశంలో నిర్వహించారు.అఖిలపక్ష భేటీలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ సహా వివిధ పార్టీల నేతలు అడిగిన ప్రశ్నలకు జైశంకర్ సమాధానమిచ్చారు. బంగ్లాదేశ్‌లో నెలకొన్న అశాంతి వెనుక పాకిస్తాన్ హస్తం ఉందా? అని పలువురు నాయకులు అడిగారు. విదేశీ శక్తుల ప్రమేయాన్ని కొట్టిపారేయలేమని జైశంకర్ బదులిచ్చారు పొరుగుదేశంలో పరిస్థితి ఉద్రిక్తంగానే ఉందని, అక్కడ రోజురోజుకీ మారిపోతున్న పరిణామాలను నిశితంగా గమనిస్తున్నామని తెలిపారు. మైనార్టీలను, మైనార్టీల ఆస్తులు, వ్యాపారాలను నిరసనకారులు లక్ష్యంగా చేసుకుంటున్నారని వెల్లడించారు. అఖిలపక్ష భేటీలో వివిధ పార్టీల నాయకులు మాట్లాడుతూ బంగ్లాదేశ్ అంశంపై భారత ప్రభుత్వానికి తమపూర్తి మద్దతు ఇస్తున్నామని స్పష్టంచేశారు.



మంగళవారం పార్లమెంటు మకరద్వారం వద్ద రాహుల్, శరద్‌పవార్ తదితర విపక్ష సభ్యుల నిరసన

ఆరోగ్య, జీవిత బీమాపై జీఎస్టీని ఎత్తివేయండి

పార్లమెంట్ మకర ద్వారం వద్ద 'ఇండియా' పక్షాల నిరసన

సాక్షి, న్యూఢిల్లీ: ఆరోగ్య, జీవిత బీమా పాలసీలపై 18 శాతం జీఎస్టీ రద్దు డిమాండ్‌తో విపక్ష ఇండియా కూటమి నేతలు మంగళవారం పార్లమెంట్ మకర ద్వారం నిరసన చేపట్టారు. 'పన్ను ఉగ్రవాదం' అని రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు ఎన్సీపీ, ఆమ్ ఆద్మీ పార్టీ, శివసేన(ఉద్ధవ్), తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, జేఎంఎం ఎంపీలు పాల్గొన్నారు. ఆరోగ్య రంగంపై జీఎస్టీ ప్రజలపై పెనుభారమని వారు ఆందోళన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో ప్రజలు నష్టపోతున్నారన్నారు. జీఎస్టీతో బాధితుల కష్టాలు రెట్టింపవుతున్నాయని కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ చెప్పారు. ఇండియా కూటమి ఎంపీల నిరసనపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్లమెంట్ హౌస్ ప్రవేశ ద్వారం వద్ద నిరసనలు, నినాదాలు నిబంధనలకు వ్యతిరేకమన్నారు. ప్రవేశ ద్వారం వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టకూడదన్న నిర్ణయానికి కట్టుబడతామని సభ్యులంతా హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇదిలా ఉండగా, 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఆరోగ్య బీమా ప్రీమియంపై జీఎస్టీ కింద రూ.8,263 కోట్లు వసూలు చేసినట్లు కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్‌లో వెల్లడించింది.

బ్రిటన్ నిరాకరణ!

మరికొద్ది రోజులు భారత్‌లోనే హసీనా • పరిశీలనలో గల్ఫ్ దేశాలు, ఫిన్లండ్

న్యూఢిల్లీ/లండన్: బంగ్లాదేశ్ తాజా మాజీ ప్రధాని షేక్ హసీనాకు రాజకీయ ఆశ్రయం కల్పించేందుకు బ్రిటన్ వెనకాడుతున్నట్టు తెలుస్తోంది. దాంతో ఆమె ఇతర అవకాశాలను పరిశీలిస్తున్నారు. ఈ నేపథ్యంలో మరికొంతకాలం ఆమె భారత్‌లోనే ఉండనున్నారు. రిజర్వేషన్ల రగడ శ్రుతి మించి పరిస్థితి చేయి దాటిపోవడంతో సోమవారం మధ్యాహ్నం ఆమె రాజీనామా చేసి సోదరి షేక్ రెహానాతో కలిసి ఢిల్లీ చేరుకోవడం తెలిసిందే. తాత్కాలిక ఆశ్రయం నిమిత్తం వీలైనంత త్వరగా లండన్ వెళ్లాలని భావించారు. కానీ బంగ్లాతో తాజాగా చెలరేగిన హింసాకాండకు బాధ్యురాలిగా హసీనాపై విచారణ జరిగే పక్షంలో ఆమెను స్వదేశానికి అప్పగించకుండా చట్టపరమైన రక్షణ కల్పించలేమని బ్రిటన్ సంకేతాలిచ్చింది. తాజా హింసాకాండపై ఐరాస సారథ్యంలో స్వతంత్ర దర్యాప్తు జరగాలని బ్రిటన్ ప్రకటన విడుదల చేసింది. ఈ నేపథ్యంలో యూఏఈ, ఖతర్, సౌదీ అరేబియాతో పాటు బెలారస్ వంటి దేశాలకు వెళ్లే అవకాశాలను హసీనా పరిశీలిస్తున్నట్టు సమాచారం. తన కుటుంబ సభ్యులున్న ఫిన్లండ్ వెళ్లే ఆలోచన కూడా ఉన్నట్టు తెలిసింది. ప్రస్తుతం హసీనా, రెహానా ఢిల్లీలోనే రహస్య ప్రాంతంలో ఉన్నారు. రెహానాకు బ్రిటన్ పౌరసత్వముంది. ఆమె కూతురు తులిప్ సిద్దిఖ్ బ్రిటన్‌లో అధికార లేబర్ పార్టీ ఎంపీ కూడా.

దేశం వీడే ముందు...

హసీనా రాజీనామా చేసి బంగ్లాదేశ్‌ను వీడేముందు జరిగిన నాటకీయ పరిణామాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఆమె సోమవారం ఉదయం ఢాకాలో తన అధికారిక నివాసంలో త్రివిధ దళాధిపతులు, ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. ఆందోళనలను అదుపు చేయలేకపోతున్నారంటూ ఆగ్రహించారు. పరిస్థితిని చక్కదిద్దాలన్నారు. ఆ దశ ఎప్పుడో దాటిపోయిందని వారు బదులిచ్చారు. అధికారం వీడేలా హసీనాను ఒప్పించేందుకు నాలుగు గంటల పాటు ప్రయత్నించారు. రాజీనామా చేసి దేశం వీడటమే మార్గమని చెల్లెలు రెహానాతో కూడా చెప్పించారు. అదే సమయంలో విద్యార్థులు, యువకులు కర్ఫ్యూను ధిక్కరించి మరీ ప్రధాని అధికార నివాసాన్ని ముట్టడించేందుకు దేశ చరిత్రలోనే కనీవినీ ఎరగని సంఖ్యలో ఢాకా వీధుల గుండా పోటెత్తసాగారు. దాంతో, ''పరిస్థితి చేయి దాటుతోంది. గంటలోపే జనప్రవాహం వచ్చిపడొచ్చు. 45 నిమిషాల్లో సర్వం సర్దుకుని దేశం వీడా'లంటూ హసీనాకు సైనిక ఉన్నతాధికారులు స్పష్టం చేశారు! విదేశాల్లో ఉన్న కుమారుడు కూడా ఫోన్లో అదే మాట చెప్పిన మీదట ఆమె అంగీకరించారు. ప్రజలనుద్దేశించి చివరగా సందేశమివ్వాలని భావించినా, అంత సమయం లేదని అధికారులు చెప్పడంతో ఆ ఆలోచన విరమించుకున్నారు. సోదరితో కలిసి ఇంటి ఆవరణలో సిద్ధంగా ఉన్న హెలికాప్టర్ ఎక్కారు. అధ్యక్ష నివాసం చేరుకుని ఆయనకు లాంఛనంగా రాజీనామా సమర్పించారు. హుటాహుటిన విమానాశ్రయం చేరుకుని, సిద్ధంగా ఉన్న సైనిక రవాణా విమానమెక్కి దేశం వీడారు.



హమాస్ కొత్త చీఫ్‌గా యాహ్యా సిన్వర్



బీరుట్: గాజా స్ట్రిప్‌లో పాలస్తీనియన్ల హక్కుల కోసం పోరాడుతున్న తమకు నూతన సారథిగా యాహ్యా సిన్వర్ వ్యవహరిస్తారని హమాస్ మంగళవారం ప్రకటించింది. గత ఏడాది అక్టోబర్ ఏడో తేదీన ఇజ్రాయెల్ శివారు గ్రామాలపై హమాస్ మెరుపుదాడికి సిన్వరే సూత్రధారి అని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. నాటి మెరుపుదాడిలో 1,200 మందిని చంపేసిన హమాస్ మిలిటెంట్లు.. 250 మంది ఇజ్రాయెల్ పౌరులను కిడ్నాప్‌చేసి బందీలుగా గాజా స్ట్రిప్‌కు తీసుకెళ్లడం తెల్సిందే. గత వారం ఇరాన్‌లోని టెహ్రాన్ నగరంలో అధికారిక కార్యక్రమంలో పాల్గొని అతిథి గృహానికి విచ్చేసిన హమాస్ రాజకీయ విభాగ చీఫ్ ఇస్మాయెల్ హనియాను గదిలో బాంబు పెట్టి ఇజ్రాయెల్ నిఘా దళాలు హతమార్చిన విషయం విదితమే. దీంతో హమాస్ తమ మరో సీనియర్ నేత అయిన యాహ్యా సిన్వర్‌ను చీఫ్‌గా ఎంపిక చేసింది. గతేడాది అక్టోబర్ 7 మెరుపుదాడి తర్వాత సిన్వర్ ఇంతవరకు బాహ్య ప్రపంచానికి కనిపించలేదు.

రాష్ట్రపతి ముర్ముకు ఫిజీ పౌర పురస్కారం

సువా: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును ఫిజీ ప్రభుత్వం దేశ అత్యున్నత పౌర పురస్కారం 'కంపానియన్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఫిజీ'తో గౌరవించింది. రెండు రోజుల పర్యటనకు గాను ఫిజీ వెళ్లిన రాష్ట్రపతి ముర్ము మంగళవారం ఆ దేశ పార్లమెంట్‌నుద్దేశించి ప్రసంగించారు. భారత్, ఫిజీల మధ్య కొనసాగుతున్న సన్నిహిత సంబంధాలపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. అత్యున్నత పౌర పురస్కారం అందుకోవడం రెండు దేశాల మధ్య ఉన్న బలమైన సంబంధాలకు తార్కాణమని పేర్కొన్నారు. ఫిజీ మరింత బలోపేతమయ్యేందుకు, అభివృద్ధి దిశగా సాగేందుకు భారత్ తోడుగా నిలుస్తుందని వెల్లడించారు. భారత్ ప్రారంభించనున్న ప్రాజెక్టుల్లో ఒకటైన రాజధాని సువాలోని స్పెషాలిటీ కార్డియాలజీ హాస్పిటల్ ఈ ప్రాంత ప్రజల అవసరాలను తీరుస్తుందని ఆమె అన్నారు. 'ఫిజీ అధ్యక్షుడు రటు విలియమ్ మైవలిలి కటొనివెరె మంగళవారం దేశ అత్యున్నత పౌర పురస్కారం 'కంపానియన్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఫిజీ'తో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును గౌరవించారు'అని రాష్ట్రపతి భవన్ ఒక ప్రకటనలో తెలిపింది.


ఒక్క రోజు నా కుర్చీలో కూర్చోండి

- అప్పుడు మా ఒత్తిడి తెలుస్తుంది
- కేసు త్వరగా విచారించాలన్న లాయర్‌పై సీజేఐ ఆగ్రహం

న్యూఢిల్లీ: కేసును వాయిదా కంటే వారం ముందే కేసును విచారించాలని పదేపదే అభ్యర్థిస్తున్న న్యాయవాదిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసుల విచారణ ఒత్తిడి ఏ స్థాయిలో ఉంటుందో తన స్థానంలో కూర్చుంటే తెలుస్తుందని సదరు లాయర్‌తో సీజేఐ వ్యాఖ్యానించారు.

కోపమెందుకొచ్చింది?

మహారాష్ట్రలో శివసేన పార్టీని చీల్చిన ప్రస్తుత సీఎం ఏక్‌నాథ్ షిండే సారథ్యంలోని శివసేన చీలికవర్గమే అసలైన పార్టీ అని మహారాష్ట్ర శాసనసభ స్పీకర్ రాహుల్ నర్వేకర్ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్‌చేస్తూ ఉద్ధవ్ ఠాక్రే వర్గం సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. ఎన్సీపీని చీల్చిన డిప్యూటీ సీఎం అజిత్ పవార్ వర్గమే అసలైన ఎన్సీపీ పార్టీ అంటూ నర్వేకర్ ఇచ్చిన మరో ఉత్తర్వును సవాల్‌చేస్తూ శరద్ పవార్ వర్గం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ కేసులను జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా ధర్మాసనం ఇటీవల విచారించింది. ఈ విషయంలో స్పందన తెలపాలని అజిత్, ఆయన వర్గం 40 మంది ఎమ్మెల్యేలకు కోర్టు నోటీసులిచ్చింది. అయితే స్పందన తెలిపేందుకు మూడు వారాల గడువు కావాలని అజిత్‌పవార్ తరఫు సీనియర్ న్యాయవాది ఎన్‌కే కౌల్ మంగళవారం సుప్రీంకోర్టు ధర్మాసనాన్ని కోరారు. మూడు వారాలకు బదులు కేవలం 10 రోజుల సమయం ఇస్తామని న్యాయస్థానం తెలిపింది. ఇందుకు శివసేన తరఫు లాయర్ ససేమిరా ఒప్పుకోలేదు. సంబంధిత పత్రాల సమర్పణకు 2, 3 రోజులు సరిపోతాయని ఆ 2–3 రోజుల తర్వాత వెంటనే కేసును విచారణకు స్వీకరించాలని ఆయన పదేపదే సీజేఐను కోరారు. త్వరలో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలున్న నేపథ్యంలో ఈ విషయం త్వరగా తేలాల్సిన ఆవశ్యకత ఉందని వాదించారు. దీంతో సీజేఐ ఆగ్రహించారు. '' మాకు ఆదేశాలు ఇవ్వాలని చూడకండి. ఒక్కరోజు నా కుర్చీలో కూర్చొని కేసుల తదుపరి విచారణ తేదీలను నిర్ణయించండి చూద్దాం. అదెంత విపరీతమైన పని ఒత్తిడితో కూడుకున్న పనో మీకే తెలుస్తుంది. ఒక్కసారి ఇక్కడికొచ్చి కూర్చోండి. ఒత్తిడి దెబ్బకు బ్రతుకుజీవుడా అని పారిపోవడం ఖాయం'' అని సీజేఐ అన్నారు.



నా రన్నింగ్‌మేట్ వాల్జ

ప్రకటించిన డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ తరఫున ఉపాధ్యక్ష అభ్యర్థి(రన్నింగ్‌మేట్)గా టిమ్ వాల్జ్‌ను ఎంపికచేస్తున్నట్లు ఆ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్ మంగళవారం ప్రకటించారు. ప్రస్తుతం టిమ్ మిన్నెసొటా గవర్నర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అయితే ఈయన అభ్యర్థిత్వాన్ని డెమొక్రటిక్ పార్టీ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. '' గవర్నర్‌గా, కోచ్‌గా, టీచర్‌గా, సాయుధ బలగాల్లో ఎన్నో విధాలుగా శ్రామికవర్గ కుటుంబాల కోసం ఆయన పనిచేశారు. అలాంటి టిమ్ వాల్జ్‌ను రన్నింగ్‌మేట్‌గా ఎంచుకున్నందుకు గర్వంగా ఉంది'' అని 'ఎక్స్'లో కమలా హారిస్ పోస్ట్‌చేశారు. గెలిస్తే మిన్నెసొటా నుంచి ఉపాధ్యక్షుడైన మూడో వ్యక్తిగా టిమ్ నిలుస్తారు.

కమల అభ్యర్థిత్వం అధికారికంగా ఖరారు

కమలా హారిస్ డెమొక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిత్వం అధికారికంగా ఖరారైంది. పార్టీ నేషనల్ కన్వెన్షన్ ప్రతినిధుల ఐదు రోజుల ఆన్‌లైన్ బ్యాలెట్ రోల్‌కాల్ ఓటింగ్ సోమవారం రాత్రి ముగిశాక ఆమె నామినేషన్ అధికారికంగా ఖరారైంది. అధికారికంగా నామినేషన్ పొందాలంటే కనీసం 1,976 డెలిగేట్ల ఓట్లు సాధించాలి. అయితే ఏకంగా 99 శాతం మంది డెలిగేట్లు అంటే 4,567 మంది డెలిగేట్లు కమలకే ఓటువేయడం గమనార్హం. ఇక లాంఛనమైన రోల్‌కాల్ ఆగస్టులో చికాగోలో పార్టీ నేషనల్ కన్వెన్షన్‌లో జరగనుంది.

బ్రిటన్‌లో 'వలస' రగడ తీవ్రతరం

లండన్: ప్రశాంత బ్రిటన్ భగ్గుమంది. సముద్ర మార్గం ద్వారా బ్రిటన్‌లోకి అక్రమంగా ముస్లింల వలసలు పెరిగాయంటూ కొనసాగుతున్న మితవాద గ్రూపుల ఆందోళనలు ఒక్కసారిగా పెల్లుబికాయి. యూకేలోని పలు నగరాలు, పట్టణాల్లో నిరసనలు ఎక్కువయ్యాయి. ముస్లిం శరణార్థులకు ఆశ్రయం కల్పిస్తున్న మసీదులు, హోటళ్లు, రెస్టారెంట్లను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడ్డారు. పలు ప్రభుత్వ వాహనాలను ధ్వంసం చేసి నిప్పంటించారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ఇప్పటికే 400 మందికిపైగా నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు. మరో 100 మందిపై కేసులు నమోదుచేశారు. బెల్ఫాస్ట్ సిటీలో జరిగిన విద్వేష దాడిలో తీవ్రంగా గాయపడిన 50 ఏళ్ల వ్యక్తి ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతున్నారు. సమాజంలో విద్వేషం పెంచుతున్న నిరసనకారులపై ఉగ్రవాద చట్టాల కింద అభియోగాలు నమోదుచేస్తామని బ్రిటన్ హోంశాఖలోని పబ్లిక్ ప్రాసిక్యూషన్స్ విభాగ డైరెక్టర్ స్టీఫెన్ పార్కిన్‌సన్ హెచ్చరించారు. అరెస్టులతో జైళ్లు నిండిపోతాయన్న ఉద్దేశంతో ముందు జాగ్రత్తగా జైళ్ల సామర్థ్యాన్ని పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. 600 తాత్కాలిక కారాగారాలను నిరసనకారుల కోసం సిద్ధంచేస్తున్నారు. మరోవైపు చిన్న నేరాలకు శిక్ష అనుభవిస్తున్న దోషులను త్వరగా విడుదలచేయాలని గతంలోనే ప్రభుత్వం నిర్ణయించింది. గృహ హింస, అత్యాచార, లైంగికవేధింపుల కేసుల దోషులు, యావజ్జీవ ఖైదీలుమినహా నాలుగేళ్లలోపు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలను విడిచిపెట్టనున్నారు.



మిడిల్స్‌బరోలో నిరసనకారులు కారుకు నిప్పపెట్టిన దృశ్యం

చిన్నారుల మరణంతో మొదలై..

జూలై 29న సౌత్‌పోర్ట్ ముగ్గురు తొమ్మిదేళ్లలోపు చిన్నారులను ఓ 17 ఏళ్ల బాలుడు డ్యాన్స్ క్లాస్‌లో బ్లేడుతో దాడిచేసి చంపేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. నిందితుడు రువాండాకు చెందిన ముస్లిం అని, గతేడాది అక్రమంగా బ్రిటన్‌కు వలసవచ్చాడని ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల్లో పుకార్లు పుట్టించారు. దాంతో ముస్లింల అక్రమ వలసలను గట్టిగా వ్యతిరేకించే మితవాద సంస్థల సభ్యులు వందలాదిగా రోడ్లపైకొచ్చి ఆందోళనలను ఉధృతం చేశారు.

సాక్షి 24|7
కర్ణాటక
KARNATAKA
బుధవారం • 7 • ఆగస్టు • 2024


మంగళవారం బెంగళూరు కార్డ్ రోడ్డులో విరిగి పడిన చెట్టు కొమ్మలు


చిక్కమగళూరు ఏపీఎంసీ మార్కెట్‌కు భారీగా వచ్చిన టమాటాలు. దీంతో రేటు పడిపోయింది

న్యూస్‌రీల్

అలరించే కుటీర మేళా


వస్త్రాలను చూస్తున్న మహిళలు

మైసూరు: నగరంలోని హెబ్బాళులోని జేఎస్ఎస్ మైసూరు అర్బన్ హాత్‌లో ఏర్పాటు చేసిన గాంధీ శిల్ప బజార్ మేళా ప్రజలను అలరిస్తోంది. ఈ మేళాలో సుమారు 60కి పైగా స్టాల్స్‌లో కుటీర కళాకారులు, చేనేతకారుల ఉత్పత్తులు ఆకట్టుకుంటాయి. మేళాలో చెక్కబొమ్మలు, శిల్పకళాకృతులు, మట్టి కుండలు, పేపర్ వస్తువులు, రత్న కంబళ్లు, అనేక అలంకారిక వస్తువులు, జువెలరీలు విక్రయాలు జరుగుతున్నాయి. మహిళలు ఎక్కువసంఖ్యలో మేళాకు తరలివచ్చారు.

ఇద్దరు అన్నదాతల ఆత్మహత్య

హుబ్లీ: ఒకే గ్రామంలో అప్పుల బాధ భరించలేక ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్న ఘటన రాణిబెన్నూరు తాలూకాలో చోటు చేసుకుంది. గంగాపుర గ్రామానికి చెందిన ఆకాశ శివరాజప్ప, (23), బసప్ప శివప్ప (42) ఆత్మహత్య చేసుకున్నారు. ఆకాశ శివరాజప్పకు ఆరు ఎకరాల భూమి ఉంది. సాగు కోసం ఓ బ్యాంకులో రూ. 5 లక్షల అప్పు తీసుకున్నాడు. గత ఏడాది అనావృష్టి, ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ అతివృష్టి వల్ల పంట చేతికి రాలేదు. దీంతో అప్పులు తీర్చే మార్గం కనిపించక పశువుల పాకలో విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మరోరైతు బసప్ప కూడా సాగు కోసం రూ. 6 లక్షల అప్పు చేశాడు. పంటలు సరిగా చేతికి రాకపోవడంతో దిక్కుతోచక ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అక్రమ భవనం కూల్చివేత


ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

మైసూరు: రాజ కాలువలపై అక్రమంగా నిర్మించుకున్న ఇంటిని తాలూకా అధికారులు మంగళవారం కూల్చివేశారు. కురుబరహళ్లి సర్వే నంబర్–4లోని కేసీ బడావణె గుండా వెళ్లిన రాజా కాలువపై అక్రమంగా చంద్రశేఖర్ అనే వ్యక్తి నకిలీ పత్రాలను సృష్టించి అక్రమంగా భవనం నిర్మించుకొని విద్యుత్, నీటి కొళాయి కనెక్షన్లు పొందాడు. బీఎస్ నాగేంద్ర అనే ఆర్‌టీఐ కార్యకర్త తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ మహేష్ కుమార్ పరిశీలించి కట్టడం అక్రమమని తేల్చి నజరబాద్ పోలీసుల బందోబస్తు మధ్య స్వయంగా జేసీబీ యంత్రాలతో కూల్చివేయించారు. సుమారు రూ.కోటి విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు.

గృహలక్ష్మి నగదు జమ చేస్తాం: మంత్రి

మండ్య: గృహలక్ష్మి పథకం ఖాతాలకు సాంకేతిక కారణాల వల్లనే డబ్బు జమ చేసేందుకు వీలు కాలేదని మహిళా శిశు సంక్షేమ శాఖా మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ చెప్పారు. ఆమె మంగళవారం మండ్యలో మీడియాతో మాట్లాడారు. రెండు నెలలుగా లబ్ధిదారుల ఖాతాలకు డబ్బులు జమ కాకపోవడం తన దృష్టికి వచ్చిందన్నారు. సాంకేతికపరమైన ఇబ్బందులను సరిచేశామన్నారు. నేటి నుంచే మహిళల ఖాతాలకు డబ్బు జమ అవుతుందన్నారు.

స్కూటర్ ప్రమాదంలో యువతి మృతి


కవన (ఫైల్)

మైసూరు: రోడ్డు డివైడర్‌ను స్కూటర్ ఢీకొనడంతో ఓ యువతి మరణించగా, మరొకరు గాయపడిన ఘటన నగరంలోని హూటగళ్లిలో జరిగింది. మైసూరులోని కేఆర్ఎస్ రోడ్డు బెమెల్ వద్ద కనకగిరి నివాసి నాగరాజ్ అనే వ్యక్తి కుమార్తె కవన (19), అదే కాలనీ నివాసి రేఖ స్కూటర్‌లో కేఆర్ఎస్ వైపు వెళుతున్నారు. అయితే వేగంలో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని ఎగిరి పడ్డారు. ఈ దుర్ఘటనలో కవన తీవ్ర గాయాలతో ప్రాణాలు కోల్పోగా, రేఖ గాయపడింది. వీరు ఓ ప్రైవేటు కాలేజీలో డిగ్రీ విద్యార్థులని సమాచారం. వీవీ పురం ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

అదృశ్యాల మిస్టరీ

- ఆరునెలల్లో.. 7,550 మంది మహిళల మిస్సింగ్
- రాష్ట్రంలో పెను సామాజిక సమస్య
- 20 శాతం మంది శాశ్వతంగా దూరం



సాక్షి, బెంగళూరు: రాష్ట్రంలో బాలికలు, యువతులు, మహిళల అదృశ్యం సంఘటనలు నానాటికీ అధికమవుతున్నాయి. గత ఆరు నెలల్లో 7,550 మంది ఇలా కనిపించకుండా పోయారు. అందులో 5,855 మందిని పోలీసులు గుర్తించి ఇళ్లకు చేర్చారు. అయితే ఇంకా 1,695 మంది వనితల జాడ లేదు. గత మూడేళ్లలో ఈ ఏడాదే అత్యధిక మంది మహిళలు అదృశ్యమైనట్లు హోం శాఖ గణాంకాలతో తెలిపింది. తల్లి, లేదా కూతురిని కోల్పోయిన వారు ఆవేదనతో మిగిలిపోతున్నారు.

బెంగళూరులో అత్యధికం

➢ మిస్సింగ్‌లు ఐటీ సిటీ, రాజధాని బెంగళూరులోనే నమోదవుతుండడం విచారకరం.

➢ ఉద్యాన నగరిలో అత్యధికంగా 429 మంది కనిపించకుండా పోయారు.

➢ ఆ తర్వాత స్థానాల్లో మైసూరు– 109, బెళగావి– 87, శివమొగ్గ– 84, తుమకూరు– 75, విజయపుర– 59, రామనగర– 51, చిత్రదుర్గ– 48, కోలారు– 47, దావణగెరె– 42 ఉన్నాయి.

➢ గడచిన మూడేళ్లలో కర్ణాటకలో మొత్తం 42,237 మంది మహిళలు కనిపించకుండా పోయారు. ఇందులో మొత్తం 39,389 మంది ఆచూకీని గుర్తించారు.

➢ మిగిలిన 2,848 మంది ఆచూకీ ఇంకా దొరకలేదు. కుటుంబాలకు వేదనే మిగిలింది.


మిస్సింగ్ ఘటనలతో కుటుంబాలలో సంక్షోభం

మూడేళ్లలో మహిళల మిస్సింగ్‌లు

ఏడాది	మిస్సింగ్‌లు	ఆచూకీ లభ్యం	అపరిష్కృతం
2021	10,081	9,820	261
2022	11,214	10,884	330
2023	13,392	12,830	562
2024 జూన్	7,550	5,855	1,695

సోషల్ మీడియా, అక్రమ రవాణా..

ప్రేమ, ఇష్టంలేని పెళ్లిళ్లు, కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యలకు తోడు కిడ్నాప్, మహిళల అక్రమరవాణా, సామాజిక మాధ్యమాల్లో అపరిచితుల ప్రభావం తదితర కారణాలతో మహిళలు కనిపించకుండా పోతున్నట్లు పోలీసులు తెలిపారు. సోషల్ మీడియాలో క్షణాల్లో పరిచయాలు పెరిగిపోవడం పెద్ద కారణంగా ఉంటోంది. మహిళల అక్రమ రవాణా దందా తీవ్రంగా జరుగుతోందని తెలిపారు. ఆ ముఠాలు సోషల్ మీడియా ద్వారా వల వేస్తుంటాయి. అలాంటి కేసుల్లో నిందితులను గుర్తించి పట్టుకోవడం ఎంతో సవాలుగా మారిందని పోలీసులు తెలిపారు. మహిళల భద్రతపై స్వయం సేవాసంఘాలు, మహిళా సంఘాలు పాఠశాలలు, కళాశాలలు, పబ్లిక్ ప్రాంతాల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతో ఉందని తెలిపారు.



రాజ్‌భవన్ చుట్టూ రాజకీయం

- గవర్నరుతో పిటిషనర్ అబ్రహాం చర్చలు
- రాజ్‌భవన్‌కు వెళ్లిన మంత్రి సుధాకర్
- పరిణామాలపై ఉత్కంఠ


సీఎం సిద్దుకు మద్దతుగా బెళగావిలో ధర్నా

శివాజీనగర: ముడా ఇళ్ల స్థలాల క్రమాల కేసులో వేగంగా పరిణామాలు సాగుతున్నాయి. సీఎం సిద్దరామయ్యపై ఫిర్యాదు చేసిన సామాజిక కార్యకర్త టీజే అబ్రహాం మంగళవారం రాజ్‌భవన్‌కు వెళ్లారు. అక్కడ గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్‌ను భేటీ చేసి, ముడా అక్రమాల గురించి చర్చించినట్లు తెలిసింది. ముడా కేసులో సంజాయిషీ ఇవ్వాలంటూ సీఎం సిద్దరామయ్యకు గవర్నర్ నోటీసులు జారీ చేయడం తెలిసిందే. అలాగే సీఎం ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇవ్వాలా, వద్దా అనేది కూడా గవర్నర్ పరిశీలనలో ఉంది. ఈ తరుణంలో అబ్రహాంను పిలిపించి వివరాలను తీసుకున్నట్లు సమాచారం.

గవర్నర్‌కు మరో ఫిర్యాదు

సీఎం సిద్దరామయ్యకు మరో ఇబ్బంది ఎదురైంది. సిద్దరామయ్యపై కేసు నమోదు చేయాలని మైసూరుకు చెందిన స్నేహమతి కృష్ణ అనే వ్యక్తి గవర్నర్ గెహ్లాట్‌కు పలు ఆధారాల సమేతంగా ఫిర్యాదు చేశారు. 1979లో అక్రమంగా భూమిని స్వాధీనం చేసుకున్నారని పలు ఆరోపణలు చేశారు.

గవర్నర్‌తో మంత్రి భేటీ


గవర్నర్ గెహ్లాట్ నిర్ణయంపై అందరి చూపు

మంత్రి ఎంసీ సుధాకర్ రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌ను భేటీ చేశారు. గవర్నర్ 2వ నోటీస్ పంపేందుకు సిద్ధమవుతుండగా ఈ సందర్శన చోటు చేసుకుంది. సుధాకర్ సీఎంకు ఆప్త వర్గంలో ఉన్నారు. ఈ భేటీపై ఏ వైపు నుంచి కూడా ప్రకటన ఏదీ రాలేదు. గవర్నర్‌తో మంత్రి ఏం మాట్లాడారు అన్నది సస్పెన్స్‌గా మారింది. రాజీ ప్రస్తావన ఏదైనా తీసుకెళ్లారా? అనే సందేహాలూ ఉన్నాయి. ఇక సీఎంకు మద్దతుగా పలు చోట్ల ధర్నాలు కొనసాగాయి.

గడ్డివాము కింద కొండచిలువ


కొండచిలువతో స్నేక్ కిరణ్, స్థానికులు

శివమొగ్గ: శివమొగ్గలో భారీ కొండచిలువ లభించింది. సుహాస్ అనే వ్యక్తి ఇంటి ముందు ఉన్న గడ్డివాము కింద తలదాచుకున్న ఆ ప్రాణిని పాముల సంరక్షకుడు స్నేక్ కిరణ్ సురక్షితంగా పట్టుకున్నాడు. వివరాలు.. మంగళవారం ఉదయం గడ్డివాము వద్ద కొండచిలువ తిరుగుతూ స్థానికులను చూసి తిరిగి రంధ్రంలోకి వెళ్లి దాక్కుంది. దీంతో వారు కిరణ్‌కు సమాచారమిచ్చారు. హుటాహుటిన అక్కడకు చేరుకున్న స్నేక్ కిరణ్ సుమారు అర్ధ గంటసేపు శ్రమించి కొండచిలువను సజీవంగా పట్టుకున్నాడు. సుమారు ఏడున్నర అడుగుల పొడవు, 7 కేజీలకు పైగా బరువు ఉంది. అటవీ సిబ్బంది సమక్షంలో దూరంగా అడవిలో వదిలిపెట్టినట్లు స్నేక్‌కిరణ్ తెలిపాడు. పాములు ప్రకృతిలో భాగమని, అవి జనావాస ప్రాంతాల్లో కనిపించినప్పుడు చంపకుండా తనకు సమాచారమిస్తే వచ్చి పట్టుకుని సంరక్షిస్తానని ఆయన తెలిపారు.

వర్షం.. బ్యాటరీ బస్సు దగ్ధం

- ప్రయాణికులు సురక్షితం

యశవంతపుర: బెంగళూరు నగరంలో సోమవారం రాత్రి భారీ వాన పడింది. నీటి మధ్యలో నాగవార సమీపంలోని మాన్యత టెక్‌పార్క్ వద్ద బీఎంటీసీ ఎలెక్ట్రిక్ బస్ అగ్నికి ఆహుతైంది. అదృష్టవశాత్తు ప్రయాణికులు బస్ దిగి ప్రాణాలను రక్షించుకున్నారు. నాగవార హెబ్బాళ సర్వీసు రోడ్డులో వాన నీరు చేరటంతో అదే మార్గంలో వెళ్లిన బ్యాటరీ బస్సులో పొగలు వచ్చాయి. డ్రైవర్ బస్సును నిలిపివేయడంతో ప్రయాణికులు హాహాకారాలు చేస్తూ కిందికి దిగిపోయారు. వెంటనే మంటలు రాజుకున్నాయి. ప్రమాదంలో బస్సు కాలిపోగా, ప్రయాణికులు ఎవరికీ అపాయం కలగలేదు. ఫైర్ సిబ్బంది వచ్చేలోగా బస్సు రేకులు మాత్రమే మిగిలాయి.

బస్సులో నీళ్లు చేరి షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిన్నట్లు అనుమానిస్తున్నారు. మంటల వల్ల నాగవార జంక్షన్ నుంచి లుంబిని గార్డెన్ వరకు సుమారు మూడు కిలోమీటర్లు దూరం ట్రాఫిక్ స్తంభించిపోయింది. ట్రాఫిక్‌లో ఫైర్ శకటం చిక్కుకుని రావడం ఆలస్యమైంది.


కాలిపోతున్న బీఎంటీసీ ఎలెక్ట్రిక్ బస్సు

అండర్‌పాస్‌లో చిక్కిన కంటైనర్

మరోవైపు మహారాణి కాలేజీ అండర్‌పాస్‌లో ఓ కంటైనర్ లారీ చిక్కుకోవడంతో ఆ మార్గంలో వాహనాల సంచారం పూర్తిగా నిలిచిపోయింది. వాన కారణంగా అండర్‌పాస్‌లో నీరు చేరడంతో డ్రైవర్ పొరపాటు వల్ల అది ఇరుక్కుంది. దానిని బయటకు లాగడానికి పోలీసులు, స్థానికులు చాలా ఇబ్బంది పడ్డారు.

మంటల్లో ఆర్టీసీ బస్సు


మంటల్లో కాలిపోతున్న బస్సు

శివమొగ్గ: భట్కళ నుంచి బెంగళూరుకు ప్రయాణికులతో వెళుతున్న వాయువ్య కర్ణాటక ఆర్టీసీ బస్సు మంటల్లో ఆహుతైన ఘటన మంగళవారం ఉదయం జిల్లాలోని సాగరలోని ఎల్‌బీ కాలేజీ సమీపంలో జరిగింది. వివరాలు.. ఆర్టీసీ బస్సు భట్కళ నుంచి బెంగళూరుకు బయలుదేరింది. మార్గమధ్యంలో సాగర వద్దకు చేరుకోగానే బస్సులో మంటలు వ్యాపించాయి. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ బస్సును రోడ్డు పక్కన ఆపివేసి బస్సులోని 14 మంది ప్రయాణికులను దించివేశాడు. బస్సు పూర్తిగా మంటల్లో తగలబడింది, అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పివేశారు. పోలీసులు తనిఖీ చేసి ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టారు.

ప్రొఫెసర్ సన్యాసదీక్ష

మైసూరు: వర్సిటీ ప్రొఫెసర్ ఒకరు సన్యాస దీక్షను స్వీకరించిన ఘటన నగరంలో చోటుచేసుకుంది. అశోకపురం నివాసి, ధార్వాడ కర్ణాటక విశ్వవిద్యాలయం తత్వశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా, యోగా అధ్యయన విభాగం డైరెక్టర్ అయిన ప్రొ. రమేష్ సన్యాస దీక్ష స్వీకరించారు. నగరంలోని అశోక సర్కిల్ వద్ద ఉన్న బుద్ధవిహార ఆవరణలో వేడుకలో అశోకపురం ఆది కర్ణాటక (చలవాది) మహాసంస్థాన గురుపీఠం నూతన పీఠాధిపతిగా నియమితులయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి నుంచి సమాజ అభివృద్ధికి అంకితమవుతానన్నారు. ఒక ప్రొఫెసర్‌గా రాష్ట్ర వ్యాప్తంగా సంచరించి పొందిన అనుభవాలను సమాజ శ్రేయోభివృద్ధికి వినియోగిస్తానన్నారు. అంబేడ్కర్ ఘనతను కాపాడే దిశలో పని చేస్తానన్నారు. మాజీ మేయర్ పురుషోత్తం, మాజీ ఎమ్మెల్యే ఎంకే సోమశేఖర్, మాజీ ఉప మేయర్ సిద్దరాజు, అజయ్, రామస్వామి, గోవిందరాజు, రచయిత సిద్దస్వామి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సిద్దు దిగిపోక తప్పదు

- బీజేపీ నేత విజయేంద్ర జోస్యం
- మండ్యలో పాదయాత్ర సభ

మండ్య: కాంగ్రెస్ సర్కారుకు, సీఎం సిద్దరామయ్యకు వ్యతిరేకంగా బీజేపీ, జేడీఎస్ చేపట్టిన పాదయాత్ర మండ్యకు చేరింది. అధికార దాహంతో కాదు, అవినీతి ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రభుత్వాన్ని పునాదులతో సహా పెకలించాలనే ఉద్దేశంతో యాత్ర చేపట్టామని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బీవై విజయేంద్ర పేర్కొన్నారు. పట్టణంలోని పేటె వీధిలోని శ్రీరామ మందిరం పార్క్ వద్ద మంగళవారం సభలో మాట్లాడారు. కాంగ్రెస్ వారు అధికారంలోకి వచ్చేందుకు ఎన్నో హామీలను ఇచ్చారన్నారు. గత 16 నెలల్లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధోగతికి చేరిందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయన్నారు. రైతులకు పాల ప్రోత్సాహధనం ఇవ్వడం లేదన్నారు. ఇలాంటి అవినీతి ముఖ్యమంత్రి మనకు అవసరమా? అని ప్రశ్నించారు. సిద్దరామయ్య సీఎం అయిన తర్వాత ముడాలో రూ.5 వేల కోట్ల అవినీతి జరిగిందన్నారు. వాల్మీకి మండలిలో రూ.187 కోట్ల కుంభకోణం జరిగినా సిద్దరామయ్య నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయకుండా అధికార వ్యామోహంతో ఇంకా కొనసాగుతుండటం సిగ్గుచేటని అన్నారు. ఏ క్షణంలోనైనా ముఖ్యమంత్రి సిద్దరామయ్య తన పదవికి రాజీనామా చేయక తప్పదన్నారు. జేడీఎస్ యువజన రాష్ట్రాధ్యక్షుడు నిఖిల్ కుమారస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అవినీతి, కుంభకోణాల్లో నిండా మునిగిందన్నారు. రాహుల్‌గాంధీ వెంటనే సీఎం సిద్దరామయ్యతో రాజీనామా చేయించాలని సవాల్ చేశారు. మాజీ మంత్రి డీసీ తమ్మణ్ణ, మన్‌ముల్ డైరెక్టర్ ఎస్‌పీ స్వామి, ప్రతిపక్ష నేత ఆర్.అశోక్, జేడీఎస్ ఎల్‌పీ నాయకుడు సురేష్‌బాబు, మాజీ మంత్రులు సీటీ రవి సహా పెద్దసంఖ్యలో నాయకులు పాల్గొన్నారు.


బీజేపీ, జేడీఎస్ నేతలకు గజమాలతో సత్కారం

అది పాపవిమోచన పాదయాత్ర

- బీజేపీ, జేడీఎస్‌లపై డిప్యూటీ సీఎం ధ్వజం
- మండ్యలో జనాందోళన సభ

మండ్య: బీజేపీ, జేడీఎస్ నేతలు నిర్వహిస్తున్నది పాదయాత్ర కాదు, వారి అవినీతి పాపాల నుంచి విమోచన పొందేందుకు చేస్తున్న యాత్ర అని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఎద్దేవా చేశారు. మంగళవారం నగరంలోని డాక్టర్ రాజ్‌కుమార్ బడావణె మైషుగర్ మైదానంలో జిల్లా కాంగ్రెస్ జనాందోళన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. విపక్షాలు నిర్వహిస్తున్న పాదయాత్ర సిద్దరామయ్య, శివకుమార్‌లకు వ్యతిరేకంగా కాదు, గ్యారంటీ పథకాలను నిలిపివేసి ప్రభుత్వాన్ని కూల్చేందుకు చేస్తున్న కుట్ర అన్నారు. శికారిపురలో కాంగ్రెస్ కృపతో విజయేంద్ర గెలుపొందాడని అన్నారు. అక్కడ నాగరాజేగౌడకు టికెట్ ఇచ్చి ఉంటే నీవు అసెంబ్లీలోకి అడుగు పెట్టేవాడివే కాదని హేళన చేశారు. ఇక కేంద్రమంత్రి కుమారస్వామి గురించి క్షణానికొక మాట, క్షణానికొక రంగు మార్చే యూటర్న్ కుమార అని డీకే దుయ్యబట్టారు. ఐదు నిమిషాల్లో మేకెదాటు పథకానికి ప్రధాని నుంచి అనుమతి ఇప్పిస్తానన్నావు, ఇప్పుడేమో నేను అసలు ఆ మాటే అనలేదని అంటున్నావు? అని నిలదీశారు. మండ్య జిల్లాలో 10 వేల మంది యువతకు ఉద్యోగాలు కల్పిస్తానన్న కుమారస్వామికి ఏం సహకారం కావాలన్నా అందిస్తామన్నారు. ఈ సందర్భంగా బైక్ ర్యాలీలో డీకే, మంత్రులు పాల్గొన్నారు.


జనాందోళన సమావేశాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పుష్ప రంజితం

- 8వ తేదీ నుంచి లాల్‌బాగ్‌లో పంద్రాగస్టు ఫ్లవర్ షో
- ఈసారి అంబేడ్కర్, పార్లమెంటు థీమ్


ఫ్లవర్ షో పోస్టర్ విడుదల

బనశంకరి: మనసుదోచే పూల రూపాలు, దేశ విదేశీ పుష్పరాజాలు నగరవాసులకు సాంత్వననివ్వబోతున్నాయి. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా నగరంలో లాల్‌బాగ్ ప్రతి ఏటా మాదిరిగానే ఈ సారి కూడా గ్లాజ్ హౌస్‌లో భారీ ఎత్తున ఫల పుష్ప ప్రదర్శన జరగబోతోంది. ఈదఫా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, పార్లమెంటు భవనం థీమ్‌తో ఫ్లవర్ షో కనువిందు చేయనుంది. ఈ నెల 8వ తేదీ నుంచి 19వ తేదీ వరకు 12 రోజుల పాటు ఫ్లవర్ షో జరుగుతుంది.

లక్షలాది పుష్పాలతో అలంకారం

మంగళవారం లాల్‌బాగ్‌లో ఉద్యానవనశాఖ కార్యదర్శి డాక్టర్ శమ్లా ఇక్బాల్ ఫ్లవర్ షో వివరాలను వెల్లడించారు. గ్లాజ్‌హౌస్‌లో 216 వ ఫల పుష్ప ప్రదర్శనలో 6 లక్షల పూలతో అంబేడ్కర్ చైత్య భూమి, పార్లమెంటు ఆకృతులను రూపొందిస్తున్నట్లు తెలిపారు. అలంకరణల కోసం దేశ విదేశాలను నుంచి 85 రకాల పూలను లక్షలాదిగా తెప్పించినట్లు తెలిపారు. అంబేడ్కర్ జీవితంలో 15 ప్రముఖ అంశాలను ఫ్లవర్ షోలో ఆకృతులుగా మలుస్తున్నారు. లాల్‌బాగ్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.జగదీశ్ మాట్లాడుతూ 10 లక్షలకు పైగా పర్యాటకులు ఫ్లవర్ షోకు విచ్చేసే అవకాశం ఉందని, పార్కింగ్, భద్రత, సీసీ టీవీ నిఘా తదితర వ్యవస్థలు కల్పించామన్నారు. యూనిఫాం, గుర్తింపు కార్డు కలిగిన విద్యార్థులకు ప్రవేశం ఉచితం. మిగతావారిలో పెద్దలకు టికెట్ ధర రూ.80, పిల్లలకు రూ.30 గా నిర్ణయించామని తెలిపారు. మరోవైపు ప్రదర్శనకు కొన్ని గంటలే మిగిలి ఉండగా గ్లాస్‌హౌస్‌లో పనులు జోరుగా సాగుతున్నాయి.


పుష్ప ప్రదర్శన అంటే నగరవాసులకు ఎక్కడలేని మక్కువ



పూలతో ఏర్పాటవుతున్న పార్లమెంటు ఆకృతి, అంబేడ్కర్ ప్రతిమలు

క్లుప్తంగా

72 మంది డ్రైవర్లపై కేసులు

బనశంకరి: బెంగళూరు నగరంలో మద్యం సేవించి స్కూల్ బస్సులు నడుపుతున్న 72 మంది డ్రైవర్లపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదుచేశారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా జనవరి నుంచి ఇప్పటి వరకు మొత్తం 12,165 వాహనాలను తనిఖీలు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కామ్రేడ్ భీమసి కలాదగి మృతి


భీమసి కలాదగి

దొడ్డబళ్లాపురం : సీనియర్ నేత, రైతుపర పోరాటయోధుడు కామ్రేడ్ భీమసి కలాదగి మృతిచెందారు. భీమసి మృతికి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సంతాపం తెలియజేశారు. 50 ఏళ్లపాటు సుదీర్ఘంగా పోరాటాలు చేసిన ఆయన ఇక లేరనే విషయం జీర్ణించుకోలేకపోతున్నానన్నారు. భీమసి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు సీఎం పేర్కొన్నారు.

వర్షం కోసం పాదయాత్ర


పాదయాత్రగా వెళ్తున్న గ్రామస్తులు

చింతామణి: వరుణదేవుడి కరుణ కోసం తాలూకాలోని గంజూరు గ్రామస్తులు మంగళవారం కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి పాదయాత్ర చేపట్టారు. గ్రామ పంచాయతీ అధ్యక్షుడు అంజనప్ప మాట్లాడుతూ వర్షాలు లేక విత్తనాలు వేయలేని పరిస్థితి నెలకొందన్నారు. స్వామివారిని దర్శించుకొని పూజలు చేస్తే వర్షాలు కురుస్తాయనే నమ్మకంతో పాదయాత్రగా వెళ్తున్నట్లు తెలిపారు. దాదాపు 300 మంది పాల్గొన్నారు.

పోలీసులనే లంచం అడిగి కటకటాల పాలు

శివాజీనగర: పోలీసులకు వ్యతిరేకంగా మానవ హక్కుల కమిషన్‌లో ఇచ్చిన ఫిర్యాదును ఉపసంహరించుకోవటానికి రూ.25 వేలు వసూలు చేసిన ఆరోపణపై సయ్యద్ సర్ఫరాజ్ అహమ్మద్ (35) అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. జులై 24న శివాజీనగర పోలీస్ స్టేషన్‌లో శస్త్రాస్త్ర యాక్ట్ కింద నమోదైన కేసులో మహమ్మద్ ఇర్షాద్ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహమ్మద్ ఇర్షాద్‌ను అక్రమంగా అదుపులోకి తీసుకున్నట్లు సర్ఫరాజ్ అనే వ్యక్తి మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు ఉపసంహరించుకోవాలని పోలీసులు కోరగా సర్ఫరాజ్ రూ.50 వేలు డిమాండ్ చేసి రూ.25వేలు తీసుకున్నాడు.దీంతో శివాజీనగర పోలీసు పోలీసులు సర్ఫరాజ్‌ను అరెస్ట్ చేశారు.

నేడు వార్షిక తపస్సిద్ధి ఉత్సవాలు

బనశంకరి: జేపీ నగర మూడో ఫేజ్ శ్రీ శివబాలయోగి మహరాజ్ ఆశ్రమంలో 63వ వార్షిక తపస్సిద్ధి ఉత్సవాలను బుధవారం నిర్వహిస్తామని ఆశ్రమం కార్యాధ్యక్షుడు డీ.రాంబాబు తెలిపారు. ఉదయం 9 గంటలకు స్వామి సమాధి పూజతో కార్యక్రమాలు ప్రారంభమై రాత్రి 9 గంటల వరకు కొనసాగుతాయని తెలిపారు. త్రిమూర్తి ఆలయంలో గిరిజాకల్యాణోత్సవం, ప్రసాదం వితరణచేస్తామని డీ.రాంబాబు తెలిపారు.

11న క్రీడా పోటీలు

చింతామణి: స్వాతంత్ర్య దినాన్ని పురస్కరించుకుని మంత్రి సుధాకర్ అభిమానులు ఈనెల 11న పట్టణంలోని ఝాన్సీ మైదానంలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. మంత్రి సుధాకర్ నివాసంలో మంగళవారం పోస్టర్లు విడుదల చేశారు. డాక్టర్ అమర్, నాయకులు కృష్ణమూర్తి, నారాయణస్వామి, బీడా శ్రీనివాస్, రఘునాథరెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు


బహుమతులు అందిస్తున్న అతిథులు

బాగేపల్లి: శివమొగ్గలోని నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఇంటర్నేషనల్ ఓపెన్ చాంపియన్‌షిప్–2024 పోటీల్లో పట్టణంలోని ఉర్దూ పాఠశాల ఆవరణలోని శుభూకాయి కరాటే పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. వీరికి తాలూకా వైద్యాధికారి డాక్టర్ సీఎస్ సత్యనారాయణరెడ్డి బహుమతులు అందజేశారు. కరాటే రియాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వారపు సంతను ప్రారంభించండి

బాగేపల్లి: కరోనా సమయంలో పట్టణంలోని 16వ వార్డు సంత మైదానంలో నిలిపివేసిన వారపు సంతను పునరుద్ధరించాలని కరవే నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం పురసభ ముఖ్యాధికారి శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. బాబాజాన్, పురసభ మాజీ అధ్యక్షుడు బీఆర్ నరసింహయ్య, సభ్యుడు మూర్తి, కరవే తాలూకా ప్రధాన కార్యదర్శి రవీంద్ర, బాగేపల్లి తాలూకా కార్యాధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి, నగర శాఖ అధ్యక్షుడు సురేష్ బాబు పాల్గొన్నారు.

తగ్గుతున్న టమాటా ధరలు

- కోస్తా, కేరళలో వర్షాల కారణంగా నిలిచిపోయిన రవాణా
- రైతుల్లో ఆందోళన


టమాటాలను లారీలలో లోడ్ చేస్తున్న దృశ్యం


కోలారు ఏపీఎంసీ మార్కెట్‌కు రైతులు తీసుకువచ్చిన టమాటాలు

కోలారు: టామాటా పంట అంటేనే రైతులతో దోబుచులాడే పంట. ఒకసారి ఆకాశానికెత్తేస్తుంది. మరోసారి అథఃపాతాళానికి దిగజారుస్తుంది. తాజా పరిస్థితులు టమాటా రైతులకు ఆశాజనకంగా లేవు. పంట దిగుబడి బాగానే ఉన్నా రవాణా దెబ్బతీస్తోంది. కేరళలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల టమాటా ఎగుమతి కష్టంగా మారింది. దీంతో ధరలు తగ్గుతున్నాయి. కోలారులోని టోకు మార్కెట్‌లో గత 15 రోజుల క్రితం కిలో రూ. 60 ఉన్న ధరలు నేడు ఉన్నఫళంగా తగ్గిపోయి రెండు కిలోలు రూ. 50లకు పడిపోయింది. కోస్తా, మలెనాడు, ఉత్తర కర్ణాటక, పాత మైసూరు ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఢిల్లీతో పాటు ఉత్తర భారత దేశంలోని పలు రాష్ట్రాలలో కూడా ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తుండటంతో టమాటాల రవాణాకి అడ్డంకిగా మారింది. దీంతో ఆయా ప్రాంతాల నుంచి టమాటాలకు డిమాండ్ తక్కువగా ఉంది. మైసూరు ఏపీఎంసీ మార్కెట్ నుంచి కేరళకు టమాటాలు తరలిస్తారు. అయితే వయనాడ్‌లో భూమి కుంగిపోతున్న కారణంగా రవాణా ఆగిపోయింది. కోలారు నుంచి ఆ ప్రాంతానికి వెళుతున్న టమాటాలు మార్కెట్లోనే నిలిచిపోయాయి. టమాటాలు విక్రయాలలో అసియాలోనే అతి పెద్ద మార్కెట్ అయిన కోలారు ఏపీఎంసీ నుంచి బెంగుళూరు మాత్రమే కాకుండా దేశంలోని సుమారు 15 నుంచి 20 రాష్ట్రాలకు టమాటాలు రవాణా అవుతోంది. టమాటాలు లారీలలో రవాణా చేసినా ఆ ప్రాంతాలలో టమాటాలు విక్రయాలు తగ్గడం వల్ల వ్యాపారులు టమాటాలు కొనుగోలు చేయడానికి ఆసక్తి కనపర్చడం లేదు. మహారాష్ట్రలో కూడా ప్రస్తుతం అధిక మొత్తంలో టమాటాలు పండిస్తున్నారు. అక్కడి రైతులు వాటిని ఉత్తర భారతానికి తరలిస్తున్నారు. దీనివల్ల కోలారు మార్కెట్‌లో టమాటాలకు ధరలు తగ్గాయని ఏపీఎంసీ మార్కెట్ కార్యదర్శి కిరణ్ తెలిపారు.

రైతుల్లో నిరాశ :

జిల్లాలో ఏప్రిల్, మేనెలలో విత్తిన టమాటాలు ఇప్పుడు కోతకు వచ్చాయి. కోలారు ఏపీఎంసీ మార్కెట్‌కు నిత్యం గత 15 రోజుల నుంచి 2 లక్షలకు పైగా బాక్సులు వస్తున్నాయి. చిత్రదుర్గ, చెళ్లకెరె ప్రాంతాల నుంచి కూడా ఇక్కడకు టమాటాలు వస్తున్నాయి. వేలంలో 15 కిలోల టమాటాలు బాక్సుధర 15 రోజుల క్రితం రూ. 1100 ఉంది. అయితే నేడు రూ. 350 పడిపోవడం టమాటాలు పండించిన రైతులకు తీవ్ర నిరాశను కలగజేస్తోంది.

కోలారు జిల్లాలో గత ముంగారులో 6 వేల హెక్టార్లలో టమాటాలు పండించారు. ప్రస్తుత ముంగారులో కూడా ఇంతే విస్తీర్ణంలో టమాటాలు పండించారు. అయితే ఆకుముదురు రోగం తదితర కారణాల వల్ల టమాటాలు నాణ్యత తగ్గిందని హార్టికల్చర్ శాఖ అధికారులు చెబుతున్నారు.

ఎగుమతి కష్టంగా మారింది

కోలారు ఏపీఎంసీ మార్కెట్‌కు టమాటాలు దిగుబడి పెరిగింది. వివిధ ప్రాంతాలలో వానల కారణంగా ఎగుమతికి ఇబ్బంది కలుగుతోంది. వానల కారణంగా కొన్ని చోట్ల అన్‌లోడ్ కావడం లేదు. దీని కారణంగా టమాటాలు ధరలు తగ్గాయి.

కిరణ్, కార్యదర్శి, ఏపీఎంసీ

హెచ్చుతగ్గులు సహజం

టమాటాలు ధరలలో హెచ్చుతగ్గులు వాటి దిగుబడి, రవాణాపై ఆధారపడి ఉంటుంది. గతంలో పెరిగిన ధరలు నేడు తగ్గాయి. రైతులు డిమాండ్‌కు అనుగుణంగా టమాటాలు పండిస్తున్నారు.

కుమారస్వామి, డిప్యూటీ డైరెక్టర్, హార్టికల్చర్ శాఖ

అలరించిన నాటక ప్రదర్శన


నాటకంలోని ఒక ఘట్టం

బొమ్మనహళ్లి : బెంగళూరు నగరం నయనా హల్‌లో రాజేష్ కళ్యాప్ దర్శకత్వంలో డాక్టర్ శివరామ్ అసుండి స్వరపరిచిన నీరా హేనా అనే రేడియో నాటకాన్ని రంగవినూతన ట్రస్టు ఆధ్వర్యంలో ప్రదర్శించారు. సంపత్ కుమార్,మధు సూదన్ , శ్రీనాథ్, అంజన రావు, రాజేష్‌కళ్యాప్ భాగ్యశ్రీ, తదితర కళాకారులు అద్భుతంగా నటించి ఆకట్టుకున్నారు.

చదువు, సంస్కారం ముఖ్యం


ప్రతిభావంత విద్యార్థులకు సన్మానం

బొమ్మనహళ్లి: విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారం కూడా చాలా అవసరమని రిటైర్డు ప్రిన్సిపాల్ జీ.కే.రామారావు అన్నారు. నగర శివార్లలో అత్తిబెలెలో ఉన్న నంజుండేశ్వర సముదాయ భవనంలో గాయత్రీ విప్ర బృందంచే శంకర జయంతి, శారదాపూజ, ప్రతిభావంత విద్యార్థులకు సన్మానం నిర్వహించారు. చదువుకుంటూ సంప్రదాయాలతో కూడిన సంస్కారం నేర్చుకుంటే జీవితంలో ఉన్నతమైన స్థాయికి చేరుకుంటారని, సమాజంలో మంచి గౌరవం కూడా లభిస్తుందని అన్నారు.

లారీ డ్రైవర్ దౌర్జన్యం

దొడ్డబళ్లాపురం: ఓ లారీ డ్రైవర్ దేవనహళ్లి తాలూకా నల్లూరు టోల్ వద్ద దౌర్జన్యం చేశాడు. సదరు డ్రైవర్... టోల్‌గేట్ వద్ద వాహనాన్ని పార్కింగ్ చేయగా సిబ్బంది అభ్యంతరం వ్యక్తం చేశారు. అయినా డ్రైవర్ లెక్కచేయలేదు. సిబ్బంది లారీలోకి ఎక్కి వాదిస్తుండగా డ్రైవర్ వారికి లాంగ్ చూపించి లారీని డ్రైవ్ చేసుకుంటూ వెళ్లిపోయాడు. పోలీసులు వెంబడించి సిబ్బందిని రక్షించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఎమ్మెల్యేను అరెస్ట్ చేయాలి

మైసూరు: ఎస్ఐ పరశురాం అనుమానాస్పద మృతికి సంబంధించి ఎమ్మెల్యే పదవి నుంచి చెన్నారెడ్డి పాటిల్‌ని డిస్మిస్ చేసి అరెస్ట్ చేయాలని జేడీఎస్ కార్యాధ్యక్షుడు, మాజీ మంత్రి సా.రా.మహేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే, అతని కుమారుడి లంచం వేధింపులు తాళలేక ఎస్ఐ సూసైడ్ నోట్ రాసి పెట్టి ఆత్మహత్య చేసుకున్నాడంటే రాష్ట్రంలో పాలన ఎలా ఉందో ఆలోచించాలన్నారు.

4 కేజీల గంజాయి స్వాధీనం


శ్రీధరాచారి(ఫైల్)

చింతామణి: గంజాయి విక్రయాలపై పోలీసులు కొరడా ఝుళిపించారు. తాలూకాలోని కైవార మండలం ముత్తకదహళ్లి గ్రామానికి చెందిన శ్రీధరాచారి చింతామణిలోని మేదర వీధిలో గంజాయి విక్రయిస్తుండగా డీఎస్పీ మురళీధర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. నిందితుడినుంచి 4కేజీల గంజాయి, బైక్ స్వాధీనం చేసుకున్నారు. ఏపీ నుంచి గంజాయి తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు.

సాగుజలాలు విడుదల చేయాలని ధర్నా


అధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు

మండ్య: జిల్లాలోని మద్దూరు, మళవళ్లి, కేఎం దొడ్డి, కొప్ప పరిధిలోని కాలువలకు సాగు జలాలు అందించాలని కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం కార్యకర్తలు, కేఆర్ఎస్ ఆయకట్టు ఉద్యమించారు. ఈమేరకు మంగళవారం కావేరి నీటిపారుదల మండలి కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఆందోళనకారులు మాట్లాడుతూ ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో నీరు వదిలే పద్ధతిని వీడాలన్నారు. జిల్లాలోని చెరువులను నింపాలని, చివరి ఆయకట్టు కాలువలకు సక్రమంగా నీరు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం కావేరి నీటిపారుదల మండలి సూపరింటెండింట్ ఇంజినీర్ రఘురాంకు వినతి పత్రం అందజేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఇండువాళు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి ఎస్.మంజేష్‌గౌడ, ప్రముఖులు బోరలింగేగౌడ, వెంకటేష్ పణ్ణెదొడ్డి, ప్రకాష్, కాంతయ్య, చంద్రణ్ణ తదితరులు పాల్గొన్నారు.

మండ్య శివార్లలో గజ సంచారం


చెరుకు తోటలో సంచరిస్తున్న ఏనుగులు

మండ్య: రెండు ఏనుగులు మండ్య వైపు చొచ్చుకు వచ్చి నగర శివార్లలోని చెరుకు తోటలో మకాం పెట్టాయి. మండ్య–కిరుగావలు మార్గంలో సదివ్యా పాఠశాల వద్ద చెరుకు తోటలో రెండు ఏనుగులు కనిపించాయి. ఏనుగులను చూసేందుకు జనం గుమికూడారు. శ్రీరంగపట్టణ తాలూకాలోని కొన్ని గ్రామాల్లో, మండ్య తాలూకా మొత్తహళ్లి గ్రామంలో కనిపించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిన రెండు ఏనుగులు ప్రస్తుతం సోమవారం రాత్రి నుంచి నగరంలోని కల్లహళ్లిలో సద్విద్యా పాఠశాల వద్ద కనిపించాయి. మొదట కల్లహళ్లి వీవీ నగర ప్రాంతంలో కనిపించిన ఏనుగులను చూసిన కుక్కలు మొరగడంతో అప్రమత్తమైన స్థానికుల సమాచారంతో అటవీ శాఖ అధికారులు ఆ వైపు ఎవరూ వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకుని అక్కడే మకాం పెట్టారు. ముత్తత్తి అడవిలోకి తోలేందుకు ప్రయత్నాలు చేపట్టారు.

కొడుకు కాదు.. మృగాడు

- కన్నతల్లిపై అఘాయిత్యం



చిక్కబళ్లాపురం: కామంతో కళ్లుమూసుకుపోయిన ఓ వ్యక్తి తల్లి అనే స్పృహ లేకుండా మృగం మాదిరిగా ప్రవర్తించాడు. జిల్లాలోని గుడిబండ తాలూకా చిన్నహళ్లి గ్రామంలో తల్లిపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. తాగిన మైకంలో ఈ ఘాతుకానికి పాల్పడి తరువాత ఆమెను ఇంటి పక్కనున్న చెత్తకుప్పలోకి పడేశాడు. తరువాత అతని తండ్రి, స్థానికులు చూసి ఆమెను ఆస్పత్రికి తరలించారు. ఇతని వేధింపులను తట్టుకోలేక భార్య వెళ్లిపోయింది. ఇంట్లో తల్లిదండ్రులు కలిసి ఉంటున్నాడు. ఏ పనీ చేయకుండా రోజూ తాగి వచ్చి గలాటా చేసేవాడు. గుడిబండ డీఎస్పీ శివకుమార్ ఘటనాస్థలిని పరిశీలించారు. పోలీసులు కేసు దాఖలు చేసుకొని కిరాతకుడు అశోక్‌ను బంధించారు.

బాలికపై తరచూ దారుణం

బనశంకరి: బెంగళూరులో బాలిక (15)పై ఓ దుండగుడు పదేపదే అత్యాచారానికి పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చింది. సోషల్ మీడియాలో రీల్స్ చేస్తూ హల్‌చల్ చేసే సాద్ ముసైబ్నా అనే యువకుడు ఈ దారుణానికి పాల్పడ్డాడు. డీజే హళ్లికి చెందిన బాలికను మభ్యపెట్టి ఇంటికి తీసుకెళ్లి నిరంతరం అత్యాచారం చేశాడని బాలిక తల్లిదండ్రులు ఆరోపించారు. బాలిక తండ్రికి తెలిసి ప్రశ్నించగా కామాందుడు బెదిరింపులకు పాల్పడేవాడు. ఈ నేపథ్యంలో బాలిక ఆత్మహత్యకు కూడా యత్నించింది. ఫిర్యాదు మేరకు డీజే.హళ్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

యువతి ఆచూకీ లభ్యం

యశవంతపుర: దక్షిణ కన్నడ జిల్లా బిజై పట్టణంలోవారం రోజుల క్రితం అదృశ్యమైన యువతి కార్కళలో స్నేహితుడి ఇంట్లో దర్శనమిచ్చింది. బిజైకి చెందిన కెలిస్కా ఫెరావో(18) జులై 30న ఇంటినుంచి వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోయింది. పోలీసులు సీసీ కేమరాలను పరిశీలించగా ఆటోలో వెళ్లిన ఆనవాళ్లు లభించాయి. పబ్‌జీ గేమ్‌కు అలవాటు పడినందు వల్ల సెల్‌ఫోన్‌ను ట్రాక్ చేశారు. కార్కళ గజేంద్ర బైల్‌కు చెందిన యువకుడి ఇంటిలో ఉన్నట్లు గుర్తించారు. అనంతరం ఇద్దరిని స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేయగా పరస్పరం ప్రేమించుకుంటున్నట్లు తెలిసింది.

విచ్చలవిడిగా ములాఖత్‌లు

దొడ్డబళ్లాపురం: దర్శన్ ములాఖత్‌ల విషయంలో జైలు అధికారులు నిబంధనలను అతిక్రమిస్తున్నారని ఆర్టీఐ కార్యకర్త నరసింహమూర్తి ఆరోపించారు. దర్శన్‌ను కలవడానికి కుటుంబ సభ్యులు, బంధువులకు మాత్రమే అవకాశం ఉంటుందని, అయితే ఎవరు వచ్చినా ములాఖత్ ఇస్తున్నారన్నారు. ఇటీవల సమత అనే మహిళ దర్శన్‌ను కలిసినట్టు, ఆమె దర్శన్‌కు చెల్లెలు అవుతుందని నమోదు చేశారన్నారు. దర్శన్‌కు సమత అనే చెల్లెలు లేదని, జైలు అధికారులు అసత్యపు రికార్డులు సృష్టిస్తున్నారని పై అధికారులు తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలన్నారు.

చిరుత కళేబరం లభ్యం



మండ్య: నాగమంగల పట్టణ శివార్లలోని బళపద మంటికొప్పలు గ్రామ సమీపంలోని మాగడి– జలసూరు రాష్ట్ర రహదారి పక్కన వెదురు పొదలో మంగళవారం కుళ్లిన స్థితిలో చిరత కళేబరం లభించింది. ఏసీఎఫ్ శివరాము, మంజునాథ్, మంజు, రంగ పరిశీలించారు. ఒకటిన్నర సంవత్సరాల వయస్సు ఉంటుందని, నాలుగైదు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెంది ఉంటుందని నిర్ధారించారు. పోస్టుమార్టం తర్వాత ఖననం చేశారు.

పగలే వెన్నెల



కెజీఎఫ్ : తాలూకాలోని ఎన్‌జి హుల్కూరు గ్రామ పంచాయతీ పరిధిలో పగటి పూట వెలుగుతున్న స్ట్రీట్ లైట్ .

మహిళ అనుమానాస్పద మృతి

యశవంతపుర: గుర్తు తెలియని మహిళ ఓ అపార్ట్‌మెంట్ ఆవరణలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈఘటన మల్లేశ్వర మార్గ్రిసా రోడ్డులోని సాయతి రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో జరిగింది. మహిళ ఉరివేసుకున్న స్థితిలో ఉన్న విషయాన్ని మంగళవారం ఉదయం 7:30 గంటల సమయంలో అపార్ట్‌మెంట్‌వాసులు గమనించి భయాందోళనకు గురయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ జగదీష్, పోలీసు సిబ్బంది వచ్చి పరిశీలించగా మృతురాలి వయస్సు 45 సంవత్సరాలు ఉంటుందని అంచనా వేశారు. ఉదయం 6:30 గంటలకు మెజిస్టిక్ నుంచి బస్సులో వచ్చినట్లు ఆమె బ్యాగ్‌లో ఉన్న బస్ టికెట్‌ను బట్టి తేలింది. నవరంగ థియేటర్‌లో సినిమా చూసినట్లు టికెట్ లభించింది. ఆమె వద్ద టికెట్లు తప్ప ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఏ ప్రాంత మహిళ అనేది తెలియరాలేదు. చుట్టు పక్కల సీసీకెమెరాలను పరిశీలించారు. ఆమె మెడకు బిగుసుకున్న తాడు కొత్తదిగా ఉన్నట్లు గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని కెసీ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఆమె జతలో ఎవరైనా వచ్చారా? ఆమెది ఆత్మహత్య? లేక ఇతర కారణాలు ఉన్నాయా? ఆమె ఏ ప్రాంతవాసి అనేది విచారణలో తేలాల్సి ఉందని డీసీపీ సైదులు అడావత్ తెలిపారు.

ఏటీఎంల వద్ద వంచకులు

- ముగ్గురి అరెస్ట్, 69 కార్డులు స్వాధీనం

బనశంకరి: ఏటీఎం కేంద్రాలకు వచ్చే వారిని మభ్యపెట్టి కార్డులను మార్చివేసి వంచనకు పాల్పడుతున్న ముగ్గురు వంచకులు పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి 69 ఏటీఎం కార్డులు, రూ.11,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. చిక్కలసంద్ర నివాసి ఉత్తరహళ్లి మెయిన్‌రోడ్డులో ఉన్న కెనరా బ్యాంక్‌లో రూ.1.50 లక్షలు డ్రా చేశాడు. ఏటీఎం కేంద్రంలో పిన్ నెంబర్ మార్చేందుకు వెళ్లాడు. అక్కడ ఉన్న ఇద్దరిని సహాయం కోరి ఏటీఎం కార్డు అందించి పిన్‌కోడ్ తెలిపాడు. పిన్‌నెంబర్ చేంజ్ చేసిన అనంతరం వంచకులు అతడికి వేరే కార్డు అందించారు. తరువాత వంచకులు మరో ఏటీఎం కేంద్రానికి వెళ్లి రూ.75వేలు డ్రాచేశారు. బాధితుడి సెల్ ఫోన్‌కు మెసేజ్ రావడంతో సుబ్రహ్మణ్యపుర పోలీసులకు ఫిర్యాదు చేశారు. వాడు గాలింపు చేపట్టి బిహార్ రాష్ట్రానికి చెందిన ఇద్దరిని అరెస్ట్ చేశారు. పలు బ్యాంకులకు చెందిన 37 ఏటీఎంకార్డులు, రూ.7,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. బేగూరు మెయిన్‌రోడ్డు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వద్ద అమాయకులను వంచిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేశారు. అతని వద్దనుంచి 32 ఏటీఎం కార్డులు, రూ.4 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

కోలారు వార్తలు...

కోచిముల్‌కు ఎన్నికలు నిర్వహించండి

కోలారు : కోచిముల్ పాలక మండలికి ఎన్నికలు నిర్వహించాలని మాజీ అధ్యక్షుడు కెవి నాగరాజ్ మంగళవారం కలెక్టర్ అక్రం పాషాకు వినతి పత్రం సమర్పించారు. మూడు నెలల్లోగా ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత పాలక మండలిని రద్దు చేసి ఎన్నికలు నిర్వహించాలన్నారు. చిక్కబళ్లాపురం జిల్లా జేడీఎస్ అధ్యక్షుడు మునియప్ప తదితరులు ఉన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానన్నారు.

దేశ ఐక్యతను కాపాడాలి


పుస్తకాన్ని విడుదల చేస్తున్న దృశ్యం

మాలూరు : జాతీయ కవి కువెంపు ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ దేశ ఐక్యతను కాపాడే బాధ్యతలను తీసుకోవాలని కసాప తాలూకా అధ్యక్షుడు ఎంవి హనుమంతయ్య తెలిపారు. మంగళవారం పట్టణ కన్నడ సాహిత్య పరిషత్ సభాంగణంలో రాష్ట్ర అనికేతన సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ భావైక్యత సమావేశంలో కె మునికృష్ణప్ప రచించిన బెళకిన భావనెగళు పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. సీనియర్ సాహితీవేత్త డాక్టర్ నా మునిరాజు, రాష్ట్ర అనికేతన సంస్కృతిక వేదిక అధ్యక్షుడు కె మునికృష్ణప్ప, దళిత సాహిత్య పరిషత్ జిల్లా అధ్యక్షుడు చంద్ర, హాస్య సాహితీవేత్త ఎస్ఎస్ వడశెట్టి పాల్గొన్నారు.

కన్నడ జ్యోతి రథయాత్రకు స్వాగతం



విజయపుర: కర్ణాటకగా నామకరణం జరిగి 50 ఏళ్లు నిండిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా సంచరిస్తున్న కన్నడ జ్యోతి రథం మంగళవారం పట్టణానికి చేరింది. జిల్లా కసాప అధ్యక్షుడు కృష్ణప్ప పురసభ, కన్నడ అభిమానులతో కలిసి స్వాగతం పలికి మాట్లాడారు. పురసభ ముఖ్యాధికారి సంతోష్ కుమార్, టౌన్ కసాప అధ్యక్షుడు జేఎన్ శ్రీనివాస్, పురసభ సభ్యుడు అనీఫుల్లా, మాజీ ఉపాధ్యక్షుడు కేశవప్ప, సభ్యులు రాజణ్ణ, బసవరాజ్, పరమేష్, కరవే చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఆధారంగా పదోన్నతి ఇవ్వాలి


వినతిపత్రం సమర్పిస్తున్న ఉపాధ్యాయులు

కోలారు : అర్హులైన ఉపాధ్యాయులకు 2016కు ముందు తరహాలోనే అర్హత ఆధారంగా ఉన్నత పాఠశాలకు పదోన్నతి కల్పించడంతో పాటు వివిధ డిమాండ్లు పరిష్కరించాలని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్, బీఈఓలకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు ఎస్ నారాయణస్వామి, ప్రధాన కార్యదర్శి చంద్రప్పలు మాట్లాడుతూ... డిగ్రీ పూర్తి చేసిన సీనియారిటీ ఆధారంగా పదోన్నతి కల్పించాలన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు ఎస్ నారాయణస్వామి, జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు జి శ్రీనివాస్, దైహిక ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ చైడప్ప తదితరులు పాల్గొన్నారు.

డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

కోలారు: మాలూరు తాలూకా దొడ్డశివారు గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయురాలిని అగ్రవర్ణాలకు చెందిన టీచర్లు కులం పేరుతో వేధిస్తున్నారని ఆరోపిస్తూ దళిత సంఘాల కార్యకర్తలు మంగళవారం నగరంలోని డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. టీచర్ రాధమ్మను అదే పాఠశాలలో పనిచేస్తున్న టీచర్లు మమత, ఛాయాదేవి, బీఈఓ చంద్రకళలు కులం పేరుతో దూషించారని ఆరోపించారు. వారిని సస్పెండ్ చేయాలని డీఈఓ కృష్ణమూర్తికి వినతి పత్రం సమర్పించారు. విజయ కుమార్, కర్ణాటక దళిత నాగరిక సమితి నేత యల్లప్ప, మంజుల పాల్గొన్నారు.

కేరళ బాధితులను ఆదుకోండి

కోలారు : ప్రకృతి వైపరీత్యాలు ఎప్పుడు ఎలా సంభవిస్తాయో తెలియదు. అనూహ్యంగా వరదల కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న కేరళ బాధితులను ప్రతి ఒక్కరూ ఆదుకోవాలని దేవరాజ అరస్ మెడికల్ కళాశాల ట్రస్టు అధ్యక్షుడు జిహెచ్ నాగరాజ్ తెలిపారు. మంగళవారం సంస్థ సభాంగణంలో వయనాడ్ బాధితులకు ట్రస్టు నుంచి రూ. కోటి చెక్కును జిల్లా కలెక్టర్ అక్రం పాషాకు అందించి మాట్లాడారు. కేరళలోని వయనాడ్‌లో కొండలు కుంగడం వల్ల కలిగిన పెను విధ్వంసం జరిగిందని, ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. కేరళకు చెందిన పలువురు విద్యార్థులు తమ కళాశాలలో వైద్యవిద్యను అభ్యసిస్తున్నారన్నారు. ఉద్యోగులు ఒక రోజు వేతనం రూ. 30 లక్షలు, తమ సంస్థ నుంచి 70 లక్షలు మొత్తం కోటి రూపాయల పరిహారం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కార్యదర్శి హనుమంతరాజు, ఉప కులపతి డాక్టర్ బి వెంగమ్మ, కులపతి డాక్టర్ సి మునినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కురుబ సంఘం ఆందోళన


కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కోలారు : ముఖ్యమంత్రి సిద్దరామయ్యపై గవర్నర్ అనుసరిస్తున్న వైఖరిని ఖండిస్తూ మంగళవారం కోలారు జిల్లా కురుబర సంఘం ఆధ్వర్యంలో నగరంలోని బస్టాండు సర్కిల్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కురుబర సంఘం జిల్లా అధ్యక్షుడు తంబళ్లి మునియప్ప మాట్లాడుతూ... ముఖ్యమంత్రి సిద్దరామయ్య పట్ల గవర్నర్ అనుసరిస్తున్న వైఖరి సరికాదని, వెంటనే నోటీసు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ చేస్తున్న కుట్రల కారణంగానే ఇదంతా జరుగుతోందన్నారు. ఇదే విషయంపై ఈనెల 7న రాష్ట్ర కురుబ సంఘం బెంగుళూరులోని ఫ్రీడం పార్కులో నిర్వహిస్తున్న బృహత్ ధర్నాకు కోలారు కురుబర సంఘం పాల్గొంటుందని తెలిపారు. అనంతరం కలెక్టర్ అక్రంపాషాకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం సమర్పించిన వారిలో కురుబర సంఘం అంజిని సోమణ్ణ, కెఎన్ సరస్వతి, కనక భవన, కనకదాస విద్యార్థి నిలయ అధ్యక్షుడు మునియప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు సి సోమశేఖర్, ఆర్ వెంకటేశమూర్తి, వివిధ తాలూకాకు చెందిన సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా హోంమంత్రి జన్మదిన వేడుక



మంత్రి జి. పరమేశ్వర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు, కార్యకర్తలు

తుమకూరు: రాష్ట్ర హోం మంత్రి డాక్టర్ జీ.పరమేశ్వర్ 73వ జన్మదిన వేడుకలు నగరంలోని హెగ్గెరె సమీపంలోని గొల్లహళ్లిలోని ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను ఆయన కత్తరించి పంచిపెట్టారు. అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. బౌద్ధ మత గురువులు వచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వచనాలు అందించారు. జిల్లాధికారిణి శుభ కల్యాణ్, జెడ్పీ సీఈఓ జీ.ప్రభు, జిల్లా ఎస్పీ కేవీ అశోక్, పాలికె కమిషనర్ బీవీ అశ్విజ, ఏడీసీ తిప్పేస్వామి, తుమకూరు పాల సమాఖ్య పాలనాధికారులు, ఎండీ శ్రీనివాస్ హోంమంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రి ఇంటి ముందు కూలిన చెట్టు

శివాజీనగర: హోం మంత్రి జీ.పరమేశ్వర్ బెంగళూరు సదాశివనగరలోని నివాసంలో మంగళవారం పుట్టిన రోజు వేడుకలు కోలాహలంగా జరిగాయి. ఈ సందర్భంగా ఇంటి ముందు షామియానా వేసి అభిమానులు గుమిగూడారు. ఈ సమయంలో ఓ టెంకాయ చెట్టు వాన పెనుగాలులు వచ్చి వేళ్లతో సహా టెంట్‌పై కూలిపడింది. టెంట్‌ఉండడం వల్ల అందరూ క్షేమంగా బయటపడ్డారు. భారీ వర్షం, గాలి వీచటంతో టెంట్ కింద ఉన్న వారు అప్పుడే ఇంటిలోపలికి వెళ్లారు. ఇంటి ముందున్న టెంకాయ చెట్టు బుడంతో పాటు కూలిపోయింది. ఈ సంఘటనతో అభిమానులు ఆందోళనకు గురయ్యారు.

గోశాల వద్ద చిరుత కలకలం



చిరుత దాడిలో గాయపడ్డ దూడ

దొడ్డబళ్లాపురం: ప్రసిద్ధ ఘాటి సుబ్రహ్మణ్య ఆలయం సమీపంలో ఉన్న గోశాల పరిసరాల్లో చిరుత సంచారం కలకలం రేపుతోంది. మంగళవారం మధ్యాహ్నం గోశాలలోని 250 జీవాలను మేత కోసం సమీపంలోని అటవీ ప్రాంతంలోకి తోలుకెళ్లిన సమయంలో ఒక చిరుత హళ్లికార్ జాతికి చెందిన దూడపై దాడిచేసి గొంతు కొరికి పరారైంది. తక్షణం గోశాల సిబ్బంది జీవాలను గోశాలకు తరలించారు. చిరుతనుంచి రక్షణ కల్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

అధిక లాభాలంటూ వంచన

మైసూరు: ఎక్కువ లాభాలు గడించాలనే ఆశతో నకిలీ కంపెనీలో పెట్టుబడి పెట్టిన ఓ మహిళ లక్షల రూపాయలు కోల్పోయింది. ఈ ఘటన నగరంలో జరిగింది. యరగనహళ్లికి చెందిన ఒక మహిళ మొబైల్‌కు పార్ట్ టైం జాబ్ ఉందనే వాట్సప్ మెసేజ్ వచ్చింది. హోటళ్లకు గూగుల్ రివ్యూ ఇవ్వడం ద్వారా కూర్చొన్న చోట నుంచే డబ్బు సంపాదించవచ్చనే ఆఫర్ ఇచ్చారు. ఆ తర్వాత ట్రేడింగ్‌లో పెట్టుబడి పెట్టాలని సలహా ఇచ్చారు. వారి మాటలను నమ్మిన ఆ మహిళ తన బ్యాంకు ఖాతా నుంచి రూ.1.20 లక్షలను పెట్టుబడి పెట్టడమేగాకుండా తన తల్లి ఖాతా నుంచి రూ.3.02 లక్షలను పెట్టుబడి పెట్టించింది. ఆ తర్వాత తాము నకిలీ ట్రేడింగ్ నెట్‌వర్క్‌తో మోసపోయినట్లు గ్రహించి ఆలనహళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దేశభక్తి అలవర్చుకోవాలి



పోటీలను ప్రారంభిస్తున్న నరేంద్రకుమార్

బొమ్మనహళ్లి : దేశ సేవ, దేశభక్తిని పెంపొందించుకోవాలని భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ బెంగళూరు నగర జిల్లా కార్యదర్శి ఏ.ఎస్. నరేంద్రకుమార్ అన్నారు. ఆనేకల్ తాలూకా హెబ్బగోడిలో ఉన్న కెనరా గురుకుల పబ్లిక్ పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్, రోవర్స్, రేంజర్‌లకు మంగళవారం ఏర్పాటు చేసిన దేశభక్తి గీతాల ఆలపన పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతో మంది ప్రాణ త్యాగం చేశారని, వారిని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు.

మద్యం షాపు తొలగించాలని ధర్నా

మైసూరు: నగరంలోని బండిపాళ్య ఏపీఎంసీ గేట్ ముందు భాగంలోని మద్యం దుకాణాన్ని తొలగించాలని కర్ణాటక దళిత సంఘర్ష సమితి ఆధ్వర్యంలో నగరంలో అబ్కారీ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఇప్పటికే బండిపాళ్య ఏపీఎంసీ చుట్టుపక్కల చాలా మద్యం దుకాణాలు ఉండగా, కొత్తగా మరొక షాపు తెరిచారన్నారు. దీంతో ఏపీఎంసీలో పని చేసేందుకు వచ్చే పేదలు, కూలికార్మికులు తాగుడుకు బానిసలవుతున్నారన్నారు. తక్షణం ఆ షాపును మూసివేయాలని, లేనిపక్షంలో అహోరాత్రి ధర్నా చేస్తామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షుడు శంకర్‌తో పాల్గొన్నారు.

వృత్తికి విరామం లేదు.. ఎడ్లకు భారం లేదు

- ఇప్పటికీ గ్రామాల్లో కొనసాగుతున్న లాళం కొట్టే వృత్తి



ఎద్దులకు లాళాలు కొడుతున్న అల్లాబకాష్



గౌరిబిదనూరు: ఆధునికత పెరిగేకొద్దీ సమాజంలో కొన్ని వస్తువులు, కులవృత్తులు కనుమరుగు అవుతున్నాయి. ముఖ్యంగా వ్యవసాయ రంగానికి సంబంధించి గతంలో అత్యంత ఆదరణ ఉన్న వృత్తుల్లో చాలా వరకు ఇప్పుడు కనిపించడం లేదు. అయితే ఎడ్ల గిట్టలకు కొట్టే లాళం, గుర్రాలకు ఉపయోగించే నాడ ఇప్పటికీ కొనసాగుతోంది. మన పాదాలకు చెప్పులు ఉన్నట్లుగానే ఎద్దు, గుర్రాలకు లాళాలు, నాడ ఉంటాయి. పశువులకు ఒక్కో కాలుకు రెండు గిట్టలుంటాయి. ఒక్కో గిట్టకు రెండు లాళాలు దానికి 8 మేకులు ఉంటాయి. సేద్య రంగంలో యంత్రాలు, ఆధునిక సాంకేతిక వచ్చినా ఎడ్లను పోషించేవారు ఇప్పటికీ లాళాలు కొట్టిస్తున్నారు. ఎద్దులు, ఆవులు, దున్నపోతులు(మగ ఎనుములు), గుర్రాలకు లాళాలు కొడుతుంటారు. గతంలో ఈ లాళాలు గ్రామీణ ప్రదేశాలలో కొలిమి పని చేసే కమ్మరులు ఇనుముతో చేసే వారు. ప్రస్తుతం ఇవి సైతం ఫ్యాక్టరీలలో తయారవుతున్నాయి.


మూడు తరాలుగా అదే వృత్తిలో

నదీగట్టు ఆంజినేయస్వామి ఆలయం పక్కన అల్లాబకాష్ అనే వ్యక్తి మూడు తరాలుగా లాలాలు కొట్టే వృత్తిలో కొనసాగుతున్నాడు. 1955లో జన్మించిన ఈయన 7వ తరగతి చదివాడు. తర్వాత వంశపార్యం పరంగా వచ్చిన లాలాలు కొట్టే వృత్తిని ఎంచుకొని కొనసాగిస్తున్నాడు. తండ్రి వద్దనుంచి ఈ వృత్తిలో శిక్షణ పొందానని అప్పట్లో ఎద్దుకు సుమారుగా రూ. 5 ఇస్తుండే వారని. ప్రస్తుతం మేము కొనుక్కొనే లాలాలు ధరలు పెరిగినందున ఎద్దుకు రూ. 500 తీసుకుంటున్నామని ఆయన తెలిపాడు. జత ఎద్దులకు వెయ్యి రూపాయలు, దూర ప్రాంతాలకు వెళ్తే బైక్‌కు పెట్రోలుకు ప్రత్యేకంగా ఛార్జ్ చేస్తారు' అని అల్లాబకాష్ అంటున్నారు.

ముంగారులో మంచి గిరాకీ

ఎడ్లకు ఒక్కో గిట్టకు రెండు లాళాలు దానికి 8 మేకులు కావాల్సి వస్తుంది. లాళాలకన్నా దానికి కొట్టిన మేకులు తొందరగా దెబ్బతింటాయి. పట్టణ ప్రాంతాల్లో తారు, సిమెంటు రోడ్లపై సంచరించే పశువుల లాళాలు త్వరగా అరిగిపోతాయి. నెలకొకమారు కొత్త లాళాలు కొట్టించాల్సి వస్తుంది. భూములను దున్నే ఎడ్లకు లాళాలు మూడు నెలల కొకమారు కొట్టించాలి. ముంగారు వర్షాల సమయంలో పోలం పనుల్లో ఎడ్లకు పని ఎక్కువ.ఆ సమయంలో లాళాలకు గిరాకీ ఉంటుంది. ఘాటీ, విదురాశ్వత్థం, అలకాపుర వంటి ప్రాంతాల్లో ఎద్దుల జాతర సమయంలో గిరాకీ బాగా లభిస్తుంది.

గిట్టల రక్షణకు లాళాలు



పశువులకు లాళాలు కొట్టించడం వల్ల గిట్టలకు రక్షణగా ఉంటుంది. లాళాలులేకపోతే గిట్టల్లో రక్తం కారి పశువులకు రోగాలు వస్తాయి. పశువులు నడిచేటపుడు రాళ్ల ఒత్తిడి లేకుండా సుజావుగా నడిచేందుకు లాళాలు తప్పని సరి

–రైతు సతీశ్ కుమార్, కోటాలదిన్నె

మంజునాథ స్వామి సన్నిధిలో యశ్



ఆలయంలో కుటుంబ సభ్యులతో యశ్

యశవంతపుర: శాండల్‌వుడ్ నటుడు యశ్ మంగళవారం తన కుటుంబ సభ్యుతో కలిసి ధర్మస్థళ మంజునాథస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ధర్మాధికారి వీరేంద్రహెగ్డేను కలిశారు. అనంతరం సూర్యశ్రీసదాశివ ఆలయంలో పూజలు నిర్వహించారు. కాగా యశ్ పంచకట్టుతో మంగళూరు విమానశ్రయం నుంచి బయటకు వస్తున్న వీడియో వైరల్‌గా మారింది.

నగదు, నగలు చోరీ

యశవంతపుర: దక్షిణకన్నడ జిల్లా విట్ల తాలూకా సాలెత్తూరులో చోరీ జరిగింది. దొంగలు ఓ ఇంటిలోకి చొరబడి నగలు, నగదు చోరీ చేశారు. ఇక్కడ నివాసం ఉంటున్న జగన్నాథ్ అనే వ్యక్తి విదేశాలకు వెళ్లగా అతని భార్య విజయ పిల్లలతో కలిసి ఉంటోంది. ఆనెల 3న తన పిల్లలతో కలిసి ఈశ్వరమంగళ పంచోడిలోని పుట్టింటికి వెళ్లింది. ఇంటిలో ఎవరూ లేరని పసిగట్టిన దొంగలు లోపలకు చొరబడి 34 గ్రాముల బంగారు నగలు, రూ. 6 వేల నగదు చోరీ చేశారు. ఈనెల 4న విజయ ఇంటికి రాగా ఈ ఘటన వెలుగు చూసింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని రైతు మృతి

మైసూరు: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ పాదచారి దుర్మరణం పాలైన ఘటన జిల్లాలోని టీ.నరసీపుర తాలూకాలో కొళ్లెగాల జాతీయ రహదారిపై జరిగింది. టీ.నరసీపుర తాలూకా ఆలగూడు గ్రామానికి చెందిన మహదేవస్వామి(46) అనే వ్యక్తి దమ్మయ్యనబోరె వద్ద ఉన్న తన పొలానికి వెళ్లి తిరిగి గ్రామం వైపు నడుచుకుంటూ వస్తుండగా కొళ్లెగాల వైపు నుంచి అతి వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొంది. తీవ్రంగా గాయపడిన మహదేవస్వామిని టీ.నరసీపురలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మైసూరుకు తరలించారు. చికిత్స పొందుతూ మహదేవస్వామి మృతి చెందినట్లు టీ.నరసీపుర టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

వయనాడ్ బాధితులకు ఆపన్నహస్తం



నిత్యావసరాలు తరలించే లారీలతో డీసీఎం శివకుమార్, మంత్రి రామలింగారెడ్డి తదితరులు

బనశంకరి: కేరళలోని వయనాడ్ బాధితులకు మంత్రి రామలింగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సౌమ్యారెడ్డి ఆపన్నహస్తం అందించారు. కొండచరియలు విరిగి పడి సర్వం కోల్పోయిన వారిని ఆదుకునేందుకు 9 ట్రక్కుల్లో నిత్యావసరవస్తువులను తరలించి మానవత్వం చాటుకున్నారు. రూ.1కోటీ 32 లక్షల విలువైన నిత్యావసరాలతోపాటు బీటీఎం లేఔట్, జయనగర వాసుల నుంచి సేకరించిన వస్తుసామగ్రిని తరలించే వాహనాలకు మంగళవారం జయనగరలో డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్, మంత్రి రామలింగారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. చీరలు, టీషర్టులు, టూత్‌పేస్ట్, బ్రష్, సబ్బులు, బిస్కెట్, బియ్యం, కందిపప్పు, సాంబారు పౌడరు, టార్పలిన్. టవల్, జంకానా, వంటనూనె , ప్లేట్లు తదితర వస్తువులను మాజీ ఎమ్మెల్యే సౌమ్యారెడ్డి, మాజీ మేయర్ మంజునాథరెడ్డి, మాజీ కార్పొరేటర్లు నాగరాజు, జీ. మంజునాథ్‌లు వయనాడుకు వెళ్లి బాధితులకు అందజేస్తారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు రామోజీగౌడ, యుబీ.వెంకటేశ్, కృష్ణంరాజు, కేపీసీసీ కోశాధికారి బీ.మల్లికార్జున్, చంద్రప్ప, ఆనంద్, మంజులాసంపత్, ఆడుగోడి బీ.మోహన్, గోవర్ధనరెడ్డి మునిరాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మైసూరు: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం జిల్లాలోని టీ.నరసీపుర–మండ్య ప్రధాన రహదారిలో తాలూకాలోని నాగల గెరె సమీపంలో జరిగింది. టీ.నరసీపుర తాలూకాలోని బూదహళ్లి గ్రామానికి చెందిన ఎస్.మనోజ్(26) వాకింగ్‌కు వెళ్లిన సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన మనోజ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై టీ.నరసీపుర టౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

గంజాయి మత్తులో రౌడీషీటర్ హల్‌చల్

బనశంకరి: రోడ్లలో సంచరించేవారిపై చాకుతో దాడికి ప్రయత్నించిన కిరిక్‌కౌశిక్ అనే రౌడీషీటర్‌ను చిక్కమగళూరు పోలీసులు అరెస్ట్‌చేశారు. సదరు రౌడీషీటర్ గంజాయికి బానిసయ్యాడు. మంగళూరులోని బేలూరురోడ్డులో మంగళవారం కత్తి తీసుకొని హల్‌చల్ చేశాడు. దారిన వెళ్లేవారిపై చాకుతో పొడిచేందుకు యత్నించాడు. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు అక్కడకు చేరుకోగా వారిపైనా దాడికి యత్నించాడు. దీంతో పోలీసులు అతన్ని అరెస్ట్ చేశారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

దొడ్డబళ్లాపురం: మడివాళలోని జక్కసంద్ర శ్మశానం వద్ద గంజాయి విక్రయిస్తుండగా పక్కా సమాచారంతో మడివాళ పోలీసులు దాడిచేశారు. కగ్గలీపురకు చెందిన శేఖర్ నాయుడు అనే విక్రేతను అరెస్ట్ చేసి రూ.4లక్షల విలువైన గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా యలహంకలోని పూర్ణప్రజ్ఞ పాఠశాల వద్ద గంజాయి విక్రయిస్తున్న ఒడిశాకు చెందిన వ్యక్తి పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడినుంచి 2కేజీల 600 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఒడిశానుంచి గంజాయి దిగుమతి చేసుకుంటున్నట్లు విచారణలో తేలిందని యలహంక పోలీసులు తెలిపారు.

లైంగిక దాడికి యత్నం.. నలుగురి అరెస్ట్

యశవంతపుర: యువతిపై లైంగిక దాడికి యత్నించిన ఘటన మంగళూరులో జరిగింది. పాండేశ్వరలోని ఒక మాల్ పబ్‌కు స్నేహితులతో కలిసి వెళ్లిన యువతిపై నలుగురు యువకులు లైంగిక దాడికి యత్నించారు. బాధితురాలు తప్పించుకొని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పుత్తూరుకు చెందిన వినయ్(33), మహేశ్(27), ప్రీతేశ్(34), నితేశ్(33)లను పోలీసులు అరెస్ట్ చేశారు.

లక్షల ఆస్తి ఐదేళ్లలో కోట్లకు చేరిందా?

- సీఎంను ప్రశ్నించిన ప్రతిపక్ష నేత ఆర్.అశోక్

శివాజీనగర: సీఎం సిద్ధరామయ్య 2013 ఎన్నికల అఫిడవిట్‌లో తన సతీమణి ఆస్తి వివరాలపై తప్పుడు సమాచారం ఇచ్చారని, 2018లో ఆస్తుల విలువ రూ.25 లక్షలుగా నమోదు చేశారని, 2024లో ఆ ఆస్తి విలువ రూ.63 కోట్లు కావటానికి ఎలా సాధ్యమని శాసనసభ ప్రతిపక్ష నాయకుడు ఆర్.అశోక్ ప్రశ్నించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ప్రశ్నలు సంధించారు. ఇదే మైనా రాహుల్‌గాంధీ బంగాళదుంప వేసి బంగారు తీసే పథకం భాగ్యమా? అని ఎద్దేవాచేశారు. 50:50 నిష్పత్తిలో అభివృద్ధి పరిచిన స్థలాలను పరిహారం రూపంలో ఇవ్వరాదని నగరాభివృద్ధి శాఖ ఆదేశాలున్నా దానిని ఉల్లంఘించి ముడా అధ్యక్షుడు మరిగౌడ అక్రమాల తలుపులను తీసింది ఎందుకు? దీని వెనుక ఎలాంటి ప్రభావం పని చేసిందో సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంత్రి నాగేంద్ర మౌఖిక ఆదేశాల ప్రకారం అవినీతి జరిగిందని వాల్మీకి అభివృద్ధి మండలి అధికారి చంద్రశేఖరన్ తన డెత్ నోట్‌లో పేర్కొన్నా సిట్ సమర్పించిన జాబితాలో మాజీ మంత్రి నాగేంద్ర, ఎమ్మెల్యే బసవరాజ దద్దల్ పేర్లను తొలుత ఎందుకు చేర్చలేదని, దీని వెనుక ఎవరి హస్తం ఉందని ప్రశ్నించారు.

నగరసభ రిజర్వేషన్లు ఖరారు

చిక్కబళ్లాపురం : చిక్కబళ్లాపురం నగరసభ అధ్యక్ష, ఉపాధ్యక్షుల రిజర్వేషన్లను ప్రభుత్వం ప్రకటించింది. అధ్యక్ష స్థానాన్ని సామాన్య వర్గాలకు, ఉపాధ్యక్ష స్థానాన్ని ఎస్సీ, ఎస్టీలకు రిజర్వు చేసింది. నగరసభలో మొత్తం 31 మంది సభ్యులు ఉండగా కాంగ్రెస్ 16, బీజేపీ 9 జేడీఎస్ 2, ఇండిపెండెంట్లు నలుగురు ఉన్నారు.

కరెంటు షాక్‌తో మృతి

హోసూరు: విద్యుత్ తీగ తగిలి కేబుల్ ఆపరేటర్ మృతి చెందిన ఘటన మహారాజగడ వద్ద జరిగింది. వివరాల మేరకు క్రిష్ణగిరి సమీపంలోని మల్లినాయనపల్లి గ్రామానికి చెందిన కేబుల్ ఆపరేటర్ వినోద్ (31), సోమవారం ఇంట్లో విద్యుత్ సరఫరా కట్ కావడంతో మరమ్మతు పనులు చేపట్టాడు. ఈ సమయంలో విద్యుత్ తీగను తాకడంతో షాక్ కొట్టి అక్కడికక్కడే చనిపోయాడు. మహారాజగడ పోలీసులు చేరుకొని శవాన్ని ఆస్పత్రికి తరలించారు.

ఊరికి వెళ్తే.. ఇంట్లో చోరీ

హోసూరు: ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు తాళాలు పగులగొట్టి నగలు దోచుకెళ్లిన ఘటన పట్టణంలో జరిగింది. వివరాల మేరకు పట్టణంలోని రైల్వేస్టేషన్ ప్రాంతానికి చెందిన భూపతి (45), రెండురోజుల క్రితం కుటుంబంతో కలిసి వడలూరులోని వళ్లలర్ ఆలయానికెళ్లారు. సోమవారం రాత్రి తిరిగి రాగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలో ఉన్న 60 పౌన్ల బంగారు నగలు, 2 కిలోల వెండి నగలను దొంగలు దోచుకెళ్లినట్లు తెలిసింది.ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

నూతన ఆసుపత్రికి వచ్చే నెలలో శంకుస్థాపన

- మంత్రి శరణ ప్రకాశ్ పాటిల్

శివాజీనగర: శివాజీనగరలో నేలమట్టం చేసిన బౌరింగ్ ఆస్పత్రి స్థానంలో కొత్తగా 500 పడలతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి వచ్చే నెల శంకుస్థాపన చేయనున్నట్లు వైద్యవిద్యాశాఖ మంత్రి డాక్టర్ శరణ ప్రకాశ్ పాటిల్ తెలిపారు. అటల్ బిహారి వాజపేయి మెడికల్ కళాశాల, పరిశోధనా సంస్థను మంగళవారం ఆయన సందర్శించారు. డెంగీ వార్డులోకి వెళ్లి బాధితులను పరామర్శించారు. వైద్య చికిత్సలపై ఆరాతీశారు. అల్పాహారం, భోజనం సమయానికి అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం శివాజీనగరలోని చరక ఆసుపత్రిని సందర్శించారు. ఈ ఆస్పత్రిని కొన్ని రోజుల్లో జాతికి అంకితం చేస్తామన్నారు. కార్డియాక్, న్యూరో తదితర అన్ని చికిత్సలు ఇక్కడ అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ ఆస్పత్రిలో బీపీఎల్ కార్డుదారులకు ఉచిత చికిత్స అందజేస్తామన్నారు. శివాజీనగర ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనలో అపశృతి

యశవంతపుర: ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పర్యటనలో అపశృతి చోటు చేసుకుంది. సీఎంను చూసేందుకు వచ్చిన యువకుడు కరెంటు తీగలు తగలి గాయపడ్డాడు. వివరాలు.. వరద పీడిత ప్రాంతాల పరిశీలనకు వెళ్లిన సీఎం... బెళగావి జిల్లా కారవాళ తాలూకా జుగుళ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశమై వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. ఆక్రమంలో మహేశ్ హుణ్ణరగి(22) అనే యువకుడు సీఎంను చూసేందుకు మేడపైకి ఎక్కాడు. మిద్దెపై వెళ్లిన కరెంటు తీగలు తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతన్ని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

దళిత నేతల సంబరాలు

బాగేపల్లి: సుప్రీంకోర్టు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేయాలని తీర్పు ఇవ్వడం సంతోషకరమని పట్టణంలో దళిత సంఘాల నాయకులు తెలిపారు. మంగళవారం సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ మిఠాయిలు పంచిపెట్టారు. గత 40 ఏళ్లుగా అంతర్గత రిజర్వేషన్ల కోసం చేపట్టిన పోరాటానికి సుప్రీంకోర్టులో విజయం దక్కిందన్నారు. కోర్టు ఆదేశాల మేరకు రాష్ట్రప్రభుత్వం వెంటనే అంతర్గత రిజర్వేషన్లను అమలు చేయాలని కోరారు. పత్రికాగోష్టిలో డీఎస్ఎస్ జిల్లా సంచాలకుడు బీవీ వెంకటరమణ, దళిత నాయకులు శివప్ప, ఆదినారాయణ, జయంత్, నాగప్ప, గోపి, నరసింహప్ప పాల్గొన్నారు.

యువకుడు హత్య



హతుడు రంజిత్‌కుమార్(ఫైల్)

దొడ్డబళ్లాపురం : గడ్డి కోసుకునే విషయంలో జరిగిన ఘర్షణలో యువకుడు హత్యకు గురయ్యాడు. ఈ ఘటన చెన్నపట్టణ తాలూకా దొడ్డనహళ్లి గ్రామంలో చోటుచేసుకుంది. ప్రైవేటు పాఠశాల స్కూల్ బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్న రంజిత్‌కుమార్(29) గడ్డి కోసుకునే విషయంలో తన చిన్నాన్న, పిన్నితో వాగ్వాదానికి దిగాడు. ఈగొడవ తారస్థాయికి చేరడంతో ఓ దశలో రంజిత్‌పై చిన్నాన్న, పిన్నిలు దాచేయగా అతను తీవ్ర గాయాలతో మృతి చెందాడు. నాగరాజు, మంగళమ్మ దంపతులతో పాటు వీరి కుమారుడు సునీల్ పోలీసుల వద్ద లొంగిపోయారు. చెన్నపట్టణ గ్రామీణ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

హోసూరు వార్తలు..

జోలార్‌పేటకు రైలుమార్గం వేయాలి: ఎంపీ

హోసూరు: హోసూరు– జోలార్‌పేట రైలు మార్గాన్ని ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజల చిరకాల కోరికను కేంద్ర ప్రభుత్వం, రైల్వే శాఖ నెరవేర్చాలని పార్లమెంట్‌లో క్రిష్ణగిరి ఎంపీ కే.గోపినాథ్ కోరారు. పారిశ్రామిక రంగంలో పురోగమిస్తున్న హోసూరు నుంచి జోలార్‌పేటకు రైలు మార్గం ఏర్పాటు చేయాలన్నది స్థానిక ప్రజల చిరకాల కోరిక అని తెలిపారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద క్యాటిల్‌ఫాం హోసూరు కార్పొరేషన్ పరిధిలోని మత్తిగిరిలో ఉందని, ఈ క్యాటిల్‌ఫాం చుట్టూ సుమారు 15 కిలోమీటర్ల మేర ప్రహరీ గోడ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరారు.

ఆ చెరువు పట్టణ పంచాయతీదే

కెలమంగలం: కెలమంగలం సమీపంలోని చిన్నట్టి గ్రామం వద్ద ఉన్న జంబుగాన్ చెరువును కెలమంగలం పట్టణ పంచాయతీలో విలీనం చేశారు. గత 35 ఏళ్ల క్రితం ఈ చెరువు కట్ట తెగిపోవడంతో స్థానిక ప్రజలు పట్టణ పంచాయతీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. చెరువు తమ ఆధీనంలో లేదని అధికారులు పట్టించుకోవడం లేదు. చెరువు కట్టను బాగు చేయడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని స్థానిక కౌన్సిలర్ ప్రభజయరామన్ తళి ఎమ్మెల్యే టి. రామచంద్రన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన తహసీల్దార్, కలెక్టర్‌లతో చర్చించారు. అధికార్లు పరిశీలించి చెరువు కెలమంగలం పట్టణ పంచాయతీకే చెందుతుందని నిర్ధారించారు. కెలమంగలం బీడీవో కార్యాలయంలో చైర్మన్ కేశవమూర్తి అధ్యక్షతన కమిటీ సమావేశమై చెరువును పట్టణ పంచాయతీకి అప్పగిస్తూ తీర్మానం చేశారు.

మేయర్‌కు సమస్యల వెల్లువ

హోసూరు: హోసూరు మేయర్ ఎస్.ఏ.సత్య పట్టణంలోని చిన్నయలసగిరి, కేసీసీ నగర్, ఊ.వా.సి.నగర్, తదితర ప్రాంతాల్లో తనిఖీ చేశారు. ఊవాసి నగర్ ప్రాంతంలో శిథిలావస్థకు చేరుకొన్న వర్షపునీటి కాల్వకు మరమ్మత్తులు చేపట్టాలని, కేసీసీ నగర్ లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు వెళ్లే కాల్వలను శుద్ధీకరించాలని, పారిశ్రామిక ప్రాంతం చిన్నయలసగిరి ప్రాంతంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న బోరుబావి ఏర్పాటు, పైప్‌లైన్ ఏర్పాటు పనులను త్వరగా పూర్తి చేయాలని ప్రజలు మేయర్‌ను కోరారు. త్వరగా పరిష్కరిస్తామని మేయర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య శాఖాధికారి ప్రభాకరన్, ఇంజినీర్లు, కార్పొరేటర్లు మేయర్ వెంట ఉన్నారు.

రెండు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

హోసూరు: హోసూరు– క్రిష్ణగిరి హైవేలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో మహిళ, మరొకరు చనిపోయారు. వివరాల మేరకు క్రిష్ణగిరి సమీపంలోని పూజారిపట్టి గ్రామానికి చెందిన శక్తివేల్ భార్య తమిళరసి (19) సోమవారం సాయంత్రం మామ పెరుమాళ్‌తో కలిసి బైక్‌లో హైవేలో మేలుమలై వద్ద వెళుతుండగా ఏదో వాహనం ఢీకొని వెళ్లిపోయింది. తీవ్ర గాయాలేర్పడిన తమిళరసి అక్కడే మృతి చెందింది.

సూళగిరి సమీపంలోని మేలుమలై ప్రాంతానికి చెందిన చూడప్ప (51). సోమవారం సాయంత్రం జాతీయ రహదారిపై నడిచి వెళుతుండగా వాహనం ఢీకొనడంతో మరణించాడు. ఈ ఘటనలపై సూళగిరి పోలీసులు కేసు నమోదు చేశారు.

గ్యాంగ్‌రేప్ కేసులో 10 మందికి బెయిల్

శివాజీనగర: హావేరి జిల్లా హానగల్ తాలూకాలో గత జనవరిలో మహిళపై చోటు చేసుకున్న సామూహిక అత్యాచార కేసులో అరెస్ట్ అయిన 19 మంది నిందితుల్లో 10 మందికి మంగళవారం ధార్వాడ హైకోర్టు ధర్మాసనం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఇమ్రాన్ జీకినకట్టి (ఏ–5), రెహాన్ వాలీకార (ఏ–6), ముఫీద్ ఓణకేరి (ఏ–9), ఇబ్రహీం బంకాపుర (ఏ–10), ఇస్మాయిల్ హుబ్లీ (ఏ–12), నియాజ్ దర్గా (ఏ–14), మహమ్మద్ సాధిక్ కుసనూర్ (ఏ–16), ఇస్మాయిల్ ఓణికేరి (ఏ–17) ఆసిఫ్ ఖాన్ పఠాన్, ఖానవర్ (ఏ–18), ముజామిల్ ఇమ్ముసాబనవర్ (ఏ–19)కు బెయిల్ మంజూరైంది. రూ.2 లక్షల షూరిటీ ఇవ్వాలని, విచారణకు తప్పకుండా హాజరుకావాలని, సాక్షులను బెదిరించరాదని కోర్టు షరతులు విధించింది. కాగా ఈకేసులో 7 మంది నిందితులకు బెయిల్ లభించలేదు.

కేసు నేపథ్యం:

హావేరి జిల్లా హానగల్ సమీపంలోని లాడ్జ్‌లో ఓ జంట ఉండేది. ఈ విషయం తెలుసుకొన్న కొందరు యువకులు లాడ్జిలోకి చొరబడి ఆ జంటపై దాడి చేశారు. ఇద్దరినీ బయటికి లాక్కొచ్చి బెదిరించారు. మహిళను హానగల్ సమీపంలోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి సామూహిక అత్యాచారం చేశారు. బాధితురాలి వాంగ్మూలంతో నిందితుల అరెస్ట్‌కు న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

అటవీ భూమిని కబ్జా చేసి లేఔట్



అటవీప్రాంతంలో రోడ్డు వేసిన దృశ్యం



ఆక్రమణకు గురైన అటవీ ప్రాంతం



జేసీబీ యంత్రాలు

క్రిష్ణగిరి: అటవీ ప్రాంతంలో అటవీ శాఖకు చెందిన స్థలాన్ని ఆక్రమించి చదును చేసి రోడ్లు, లేఔట్‌లు ఏర్పాటు చేస్తున్నారు. వెంటనే దీనిని జిల్లా యంత్రాంగం అడ్డుకోవాలని, ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిపై చర్యలు చేపట్టాలని అంకొండపల్లి గ్రామస్తులు కోరారు. వివరాల మేరకు సూళగిరి తాలూకా అంకొండపల్లి ప్రాంతానికి చెందిన కౌస్ బాషా, ఫైజు కలిసి అంకొండపల్లి ప్రాంతంలో అటవీశాఖకు చెందిన ఏడు ఎకరాల స్థలాన్ని బుల్డోజర్లు, జేసీబీలతో చదును చేసి లేఔట్‌లు ఏర్పాటు చేశారు. గుట్టలను చదును చేసి వందలాది చెట్లను కొట్టివేశారు అని గ్రామస్తులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో ప్రజలే మూకుమ్మడిగా లేఔట్ పనులను అడ్డుకుని జేసీబీ తదితర యంత్రాలను స్వాధీన పరుచుకొన్నారు. ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

'కడుపు'పై కొట్టారు

రాష్ట్రవ్యాప్తంగా చిరుద్యోగులను తొలగిస్తూ సరికొత్త పాలన

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్ : కాకినాడ జిల్లా కోటనందూరు (అల్లిపూడి) కేజీబీవీలో 2017 ఫిబ్రవరిలో నియమితులైన ఆయా కాళ్ల సత్యవతి(బీసీ)ని టీడీపీ నేతలు తొలగించారు. భర్త లేని ఆమె ఈ వేతనంతోనే కుటుంబాన్ని నెట్టుకొచ్చేది. ఇదే కేజీబీవీలో రెండేళ్ల నుంచి వంటమనిషిగా పని చేస్తున్న దారా ఆదిలక్ష్మి(ఎస్సీ)ని సైతం గురువారం టీడీపీ నేతలు తొలగించి, తమ మనిషిని నియమించు న్నారు. ఇలా ఒక్క చోట కాదు.. రాష్ట్ర వ్యాప్తంగా ఏ ఊళ్లో చూసినా దుర్మార్గపు తొలగింపులు పరిపాటిగా మారాయి. ఏళ్ల తరబడి పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెం ట్లు, రేషన్ డీలర్లు, ప్రభుత్వ పాఠశాల్లో మధ్యాహ్న భోజనం వండే వంట మనుషులు, హెల్పర్లు, పాఠశాలల్లో మరుగుదొడ్లు శుభ్రం చేసే కార్మికులు, నైట్ వాచ్‌మెన్‌ల వరకూ అందరినీ తొలగించాలం టూ టీడీపీ నేతలు అధికారులకు అల్టిమేటం జారీ చేస్తున్నారు. తొలగించిన వారి స్థానంలో తాము సూచించిన వారినే నియమిం చాలని ఆదేశిస్తున్నారు.

ముడుపులు దండుకుంటున్న 'పచ్చ' నేతలు

తొలగించిన వారి స్థానంలో నియమిస్తామంటూ ఆశావహుల నుంచి భారీ ఎత్తున ముడుపులు దండుకుంటున్నారు. వైద్య ఆరోగ్య శాఖలో నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన అభ్యర్థులను ఉద్యోగాల్లో నియమిం చకూడదంటూ అధికారులను టీడీపీ నేతలు బెదిరిస్తున్నారు. 10, 15 ఏళ్ల నుంచి పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లతోపాటు.. 2005లో గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రారంభమైనప్పటి పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెం ట్లను కూడా తొలగిస్తున్నారు. ఆ స్థానంలో తాము సూచించిన వారినే నియమించాలని ఉపాధి హామీ అధికారులపై టీడీపీ నేతలు ఒత్తిడి తెస్తున్నారు. ఆ ఒత్తిళ్లకు తాళలేక ఇప్పటికే 2,360 మంది ఫీల్డ్ అసిస్టెం ట్లను అధికారులు తొలగించారు. టీడీపీ నేతల వేధింపులు తాళలేక నలుగురు ఫీల్డ్ అసిస్టెంట్లు ఆత్మహత్య చేసుకున్నారని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ నేతలు ఆం దోళన వ్యక్తం చేస్తున్నారు.

బెదిరింపులు.. తొలగింపులు..

ప్రభుత్వ బడుల్లో, కేజీబీవీల్లో పార్ట్‌టైమ్ ఉద్యోగులుగా పని చేస్తున్న మధ్యాహ్న భోజనం వంట కార్మికులు, ఆయాలు, స్వీపర్లను బెదిరిం చి బలవంతంగా తొలగిస్తున్నారు. రాష్ట్రంలోని 45 వేల పాఠశాలల్లో అన్ని విభాగాల్లోనూ పార్ట్‌టైమ్ సిబ్బంది సుమారు 20 వేల మంది వరకు ఉన్నారు. వీరిలో చాలా మంది 14 ఏళ్ల నుంచి సేవలు అందిస్తు న్నారు. వీరి నియామకం రాష్ట్ర విద్యా శాఖ ఆదేశాల మేరకు జిల్లాలో కలెక్టర్, డీఈవో ఆధ్వర్యంలో జరిగింది. ఇప్పుడు తొలగింపు మాత్రం స్థానిక టీడీపీ నాయకులు చేస్తున్నారు. సిబ్బంది కొరత ఉన్న చోట కొత్త వారి నియామకానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఇటీవల ఉన్నతాధికారులు డీఈవోలు, ఏపీడీలను ఆదేశించారు. ఇదే అదనుగా టీడీపీ వారు గతంలో నుంచి పని చేస్తున్న వారిని తొలగించి, తమ వారిని నియమించి ఆ వివరాలను ఉన్నతాధికారులకు పంపి ఆమోదించుకుంటున్నారు. పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు కూడా రాజీనామా చేయాలని ఒత్తిడి చేస్తున్నారు.



అన్ని జిల్లాల్లోనూ కన్నీటి గాథలే..

- విజయనగరం జిల్లా బొబ్బిలిలో రాణి మల్లమ్మదేవి, యుద్ధ స్తంభం, డివైడర్ల మధ్య ఉన్న మొక్కల సంరక్షణ బాధ్యతలు చూస్తున్న 16 మంది చిరు ఉద్యోగులను తొలగించారు. గంట్యాడ మండలం కొటారుబిల్లి కేజీబీవీలో 2019 నుండి పని చేస్తున్న వంట మనిషి రొంగలి శ్రీలక్ష్మి, వాచ్‌మెన్ ఆర్.దుర్గను తొలగించి, తమ వాళ్లను పెట్టుకున్నారు. చీపురుపల్లి నియోజకవర్గం గరివిడి మండలంలోని చుక్కవలస, ఏనుగువలస, వెదుళ్లవలస, మెరకముడిదాం మండలంలో బైరిపురం, గర్భాం, కొత్తవీధి, శ్యామయావలస రేషన్ డీలర్లను తొలగించారు. చీపురుపల్లిలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికోన్నత పాఠశాలలు, మెరకముడిదాం మండలంలోని రామయవలస, గుర్ల, తెట్టంగి, పెనుబర్తి గ్రామాలోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులను తొలగించారు. చీపురుపల్లి మండలం పేరిపిలో వేధింపులు భరించలేక ఓ ఫీల్డ్ అసిస్టెంట్ రాజీనామా చేశారు. గుర్ల మండలం శేషుపేటలో ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించారు.
- పల్నాడు జిల్లా నరసరావుపేట పురపాలక సంఘంలో ఐదేళ్ల నుంచి పని చేస్తున్న సుమారు 50 మంది ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ కార్మికులను (ఆప్కాస్) టీడీపీ నాయకుల ఒత్తిళ్ల మేరకు అధికారులు తొలగించారు. వీరు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబును కలిసినా, వారిని ఉద్యోగాల్లో తీసుకునేందుకు అంగీకరించలేదు.
- వైఎస్సార్ జిల్లా కాశినాయన మండలంలోని గొంటువారిపల్లె, బాలాయపల్లె, గంగనపల్లె, ఓబులాపురం, ఉప్పలూరులో రేషన్ డీలర్లను తొలగించారు. కలసపాడు మండలంలో పలువురు డీలర్లను తొలగింపుకు రంగం సిద్ధం చేశారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పలువురు లబ్ధిదారుల పింఛన్ తొలగించాలని ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.
- కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గం ఉంగుటూరు మండలం పొనుకుమాడు గ్రామంలోని డ్వాక్రా గ్రూప్ బుక్‌కీపర్ కె శివనాగేంద్రమ్మను తొలగించారు. పెనమలూరు నియోజకవర్గంలో వీవోఏగా విధులు నిర్వహిస్తున్న నలుగుర్ని తొలగించారు.
- ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలంలో 10 మంది వీవోఏలను, కందుల భవాని, మరో ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించారు. జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు మండలాల్లో 20 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను, జయంతిపురం గ్రామంలో 20 ఏళ్లుగా మధ్యాహ్న భోజనం అందిస్తున్న ఏజెన్సీదారులను తొలగించారు.
- ఏలూరు జిల్లాలో అంగన్‌వాడీలు, మధ్యాహ్నభోజన కార్మికులు, డ్వాక్రా రిసోర్స్ పర్సన్స్, డీఆర్‌డీఏలో ఉండే విలేజ్ ఆర్గనైజేషన్ అడ్మినిస్ట్రేటర్లు ఇలా 67 మంది మహిళల ఉద్యోగాలు తొలగించారు. ఏలూరు నగరంలో అధికార పార్టీ వేధింపులు తాళలేక డ్వాక్రా రిసోర్స్ పర్సన్ పిల్లి విజయలక్ష్మి, ఉంగుటూరు మండలంలో పి.కనకదుర్గలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతున్నారు.
- ప్రకాశం జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా 300 మంది వీవోఏలు, 370 మంది మధ్యాహ్న భోజన కార్మికులు, 200 మంది ఫీల్డ్ అసిస్టెంట్‌లు, వంద మంది మున్సిపల్ కార్మికులు, 50 మంది ప్రభుత్వ పాఠశాలల స్వీపర్లు, 20 మంది పంచాయతీ కార్మికులు, 15 మంది స్వచ్ఛభారత్ కార్మికులను తొలగించారు.

2.65 లక్షల వలంటీర్లకు ఉద్వాసనే..

2.65 లక్షల మంది గ్రామ, వార్డు వలంటీర్లను కూటమి ప్రభుత్వం ఇప్పటికే పక్కన పెట్టింది. రాష్ట్రంలో ప్రభుత్వ సేవలను ఇంటి గుమ్మం వద్దే ప్రజలకు అందించడానికి గ్రామ, వార్డు సచివాలయాలు–వలంటీర్ల వ్యవస్థను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. తాము అధికారంలోకి వస్తే వలంటీర్లకు నెలకు రూ.పది వేల వేతనం ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. కానీ.. అధికారంలోకి వచ్చాక మాట మార్చి వారిని పక్కన పెట్టారు.

దేవుడి సాక్షిగా తొలగింపు

అరసవిల్లి సూర్యనారాయణస్వామి దేవాలయంలో ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న 48 మంది దినసరి ఉద్యోగులపై వేటు వేస్తున్నట్టు తాజాగా ఆదేశాలు జారీ చేశారు. 80 మంది మధ్యాహ్న భోజనం కార్మికులను తొలగించారు. పలువురు రేషన్ డీలర్లను తొలగించారు. మిగతా చోట్ల కూడా తొలగించి, వారి స్థానంలో తమ వాళ్లను వేసుకోవడానికి జాబితాలు తయారు చేశారు. ప్రైవేటు కంపెనీలనూ వదలడం లేదు. స్థానికంగా కంపెనీలు నడపాలంటే తమకు కప్పం కట్టడంతో పాటు తాము చెప్పిన వారినే కార్మికులుగా పెట్టుకోవాలని హుకుం జారీ చేస్తున్నారు. రణస్థలంలోని యూబీ బీర్ల కంపెనీలో ఏం జరిగిందో అందరూ చూశారు. కూటమికి అనుకూలంగా లేని కార్మికులను తొలగించారు. మూలపేట పోర్టులోనూ అదే జరిగింది. వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులను ఉద్యోగాల నుంచి తొలగించే ప్రయత్నం చేశారు. గ్రామస్తులంతా పోర్టు వద్ద పెద్ద ఎత్తున నిరసన చేయడమే కాకుండా కార్యకలాపాలకు అడ్డు తగలడంతో తాత్కాలికంగా వెనక్కి తగ్గారు.

ఫోర్జరీ సంతకాలతో డీలర్ల తొలగింపు

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటగిరి నియోజకవర్గం కలువాయి మండలం దాచూరులో పొదుపు గ్రూపులకు సంబంధించిన వీఓఏ (విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్)గా పని చేస్తున్న మహిళను తొలగించి ఆ స్థానాన్ని రెండుగా విభజించి టీడీపీకి చెందిన కార్యకర్తలను నియమించాలని డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డికి స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సిఫార్సు లేఖ పంపారు. కోవూరు నియోజకవర్గం గంగవరంలో రేషన్ షాపు డీలర్‌ను తొలగించి ఆ పోస్టును స్థానిక టీడీపీ నాయకుడు లక్ష్మీనరసారెడ్డి (బాబురెడ్డి) బేరం పెట్టి రూ.2 లక్షలకు వేరొక వ్యక్తికి కట్టబెట్టాడు. కందుకూరులో 16 రేషన్‌షాపు డీలర్లను తొలగించేందుకు టీడీపీ నేతలు కుట్రపన్నారు. స్థానిక డిప్యూటీ తహసీల్దారుతో కుమ్మక్కై డీలర్లకు తెలియకుండానే వారి సంతకాలు ఫోర్జరీ చేసి రాజీనామా చేసినట్లు లేఖలు పంపడం సంచలనంగా మారింది. తాము రాజీనామాలు చేయలేదని, తమ సంతకాలు ఫోర్జరీ చేశారంటూ డీలర్లు గగ్గోలు పెడుతున్నారు. కందుకూరు, కావలిలలో వైన్‌షాపులలో పనిచేసే 70 మంది సేల్స్‌మెన్‌లు, సూపర్‌వైజర్లను తొలగించి వారి స్థానంలో టీడీపీ కార్యకర్తలను పెట్టాలని స్థానిక టీడీపీ నేతలు ఎక్సైజ్ శాఖకు ఆదేశాలు ఇచ్చారు. కందుకూరులో 50 మందిని తొలగించి వారి స్థానంలో ఆ పోస్టులకు మామూళ్లు దండుకుని టీడీపీ కార్యకర్తలకు ఇచ్చేలా జాబితా తయారైంది. మున్సిపాల్టీ, అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిటీల్లో దాదాపు 15 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపునకు ఆదేశాలిచ్చారు. ఆత్మకూరు నియోజకవర్గంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించేందుకు ఏకంగా స్థానిక టీడీపీ నేతలు ఉపాధి హామీ పనులను నిలిపివేశారు. కోవూరు నియోజకవర్గం విడవలూరు, కొడవలూరు మండలాల పరిధిలో పొదుపు గ్రూపులకు సంబంధించిన 10 మంది వీఓఏలను తొలగించి, వారి స్థానంలో టీడీపీ కార్యకర్తలను నియమించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఒక్కో పోస్టుకు రూ.2 లక్షల వరకు వసూలు చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

192 మంది ఫీల్డ్ అసిస్టెంట్‌లతో బలవంతపు రాజీనామాలు

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పని చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఆశా వర్కర్లు, పారిశుద్ధ్య కార్మికులు, డీలర్లు, సంఘమిత్రలు, ఆర్‌పీలను తప్పుడు ఫిర్యాదుల ద్వారా టీడీపీ నేతలు తొలగిస్తున్నారు. పలుచోట్ల అధికారులు తలొగ్గి చిరుద్యోగులకు నోటీసులు ఇస్తున్నారు. ఆయాలు, అంగన్‌వాడీ కార్యకర్తలను బెదిరింపులకు గురి చేస్తున్నారు. పాలు, సరుకులు ఇవ్వడం లేదని, కేంద్రాలు తెరవడం లేదని, పిల్లలు రావడం లేదని తప్పుడు ఫిర్యాదు చేసి వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఆర్‌పీలు, సంఘమిత్రల తొలగింపునకు గ్రామాల్లో డ్వాక్రా సంఘాలను రెచ్చగొట్టి వీధుల్లోకి లాగుతున్నారు. తిరుపతి జిల్లాలో 192 మంది ఫీల్డ్ అసిస్టెంట్‌లను రాజీనామా చేయించారు. రేషన్ డీలర్లు 190 మంది, సంఘమిత్రలు 65 మందిని తొలగించారు. చిత్తూరు జిల్లాలో 86 మంది ఫీల్డ్ అసిస్టెంట్‌లను అడ్డగోలుగా తొలగించారు. 126 మందిని పని చేయనివ్వకుండా అడ్డుకున్నారు. 34 మందికి నోటీసులు ఇచ్చారు. 47 మంది సంఘమిత్రలను తొలగించాలని అధికారులకు సిఫార్సులు వెళ్లాయి. ఆశావర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది 112 మందిపై వేటు వేయాలని చూస్తున్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఊస్టింగ్

ఏపీఐఐసీలో 170 మందిపై వేటుకు రెడీ • ఇదే బాటలో ఏపీ మారిటైమ్ బోర్డు

సాక్షి, అమరావతి : రాజకీయాలతో ఎటువంటి సంబంధంలేని ఉద్యోగులపై కొత్తగా అధికారం చేపట్టిన టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ప్రభుత్వం కక్షగట్టింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నియమించారన్న ఏకైక కారణంతో వివిధ ప్రభుత్వ కార్పొరేషన్లలో పనిచేస్తున్న వారిని తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా పావులు కదుపుతోంది. ఇందులో భాగంగా.. రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ ఏపీఐఐసీ, ఏపీ మారిటైమ్ బోర్డు వంటి కీలక సంస్థల్లో గత ప్రభుత్వ హయాంలో నియమితులైన ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించి వారి స్థానంలో కొత్తగా తమ వారిని నియమించుకునేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇందుకు కూటమి ప్రభుత్వ పెద్దలకు అనుకూలంగా ఉన్న ఏపీఐఐసీలోని జీఎం స్థాయి అధికారి వేగంగా పావులు కదుపుతున్నారు. 2019 జూన్ తర్వాత నియమించిన ఔట్ సోర్సింగ్ సిబ్బందిని తొలగించాలంటూ ఇటీవల కొంత మంది పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ మేరకు ఆ వెంటనే ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వివరాలు ఇవ్వాలంటూ ఆ ఉన్నతాధికారి జీఎంలకు లేఖలు రాసి, వివరాలు తెప్పించారు. ఇప్పటికే నెల జీతం రూ.40,000 పైన ఉన్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించిన ఏపీఐఐసీ, తాజాగా ఇప్పుడు అంతకంటే తక్కువ జీతం ఉన్న వారిని కూడా తొలగించడానికి రంగం సిద్ధం చేసింది. ఇలా సుమారు 170 నుంచి 180 మంది ఉన్నట్లు గుర్తించారు. కాగా, ఏపీ మారిటైమ్ బోర్డు, దాని అనుబంధ సంస్థల్లోని ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను తొలగిస్తూ ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులను జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఏపీ మారిటైమ్ బోర్డు కింద ఉన్న రామాయపట్నం పోర్టు, మచిలీపట్నం పోర్టు, మూలపేట పోర్టు లిమిటెడ్‌లో రూ.40 వేలకు పైగా జీతం ఉన్న ఉద్యోగులను తొలగించారు. త్వరలోనే అంతకంటే తక్కువ జీతం ఉన్న ఉద్యోగుల తొలగింపు ప్రక్రియ కూడా మొదలు కావచ్చని చెబుతున్నారు.

డీలర్లను అన్యాయంగా తొలగిస్తున్నారు



ప్రభుత్వ చౌకధాన్యపు డిపో డీలర్లను అన్యాయంగా తొలగిస్తున్నారు. ఐదేళ్ల పాటు ఎటువంటి రిమార్కు లేకుండా ప్రజలకు రేషన్ పంపిణీ చేశాం. కూటమి ప్రభుత్వం రాగానే డీలర్ షిప్‌లకు రాజీనామా చేయాలని అధికారుల ద్వారా ఒత్తిడి తెస్తున్నారు. రెండు నెలలుగా కమీషన్ కూడా ఇవ్వలేదు. మా బాధలను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు.

– పాటిల్ ప్రకాష్‌రెడ్డి, పెద్దకోట్ల, తాడిమర్రి మండలం, శ్రీసత్యసాయి జిల్లా

మా ఉసురు తప్పక తగులుతుంది



మధ్యాహ్న భోజన పథకం కార్మికురాలిగా పథకం పుట్టినప్పటి నుంచి పని చేస్తున్నా. గతంలో ఎన్ని ప్రభుత్వాలు మారినా మమ్మల్ని కొనసాగించారు. కానీ ఇప్పుడు ఉన్నఫళంగా మార్చేశారు. నాపై ఎలాంటి ఆరోపణలూ లేవు. అయినా నువ్వు వంట చేయొద్దంటూ నా వంట పాత్రలన్నీ బయట పడేశారు. ఎలాంటి నోటీసు ఇవ్వకుండా తప్పించారు. ప్రభుత్వ విధానం మార్చుకోవాలి. లేదంటే మాలాంటి వారి ఉసురు తగులుతుంది.

– ఎస్.సరస్వతి, మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ కార్మికురాలు, గంగవరం, బికుగుప్ప మండలం, అనంతపురం జిల్లా

సంఘాల మద్దతున్నా తొలగించారు



నేను 18 మహిళా స్వయం శక్తి సంఘాల సభ్యుల మద్దతుతో తుంగాన పుట్టుగ గ్రామైక్య సంఘానికి వీఓఏగా ఎన్నికయ్యాను. నా బాధ్యతల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా చేసిన సేవల్ని గుర్తించిన అధికారులు మహిళా దినోత్సవం నాడు జ్ఞాపికతో సత్కరించారు. కానీ కూటమి ప్రభుత్వం రాగానే నన్ను అకారణంగా తొలగించారు. 18 సంఘాల వారు నన్ను కొనసాగించాలని చెబుతున్నా నిర్దాక్షిణ్యంగా వ్యవహరించారు. నా జీతం బకాయి కూడా ఇవ్వలేదు.

– తుంగాన అంజలి, తుంగానపుట్టుగ గ్రామైక్య సంఘం వీఓఏ, కవిటి మండలం, శ్రీకాకుళం జిల్లా

బలవంతంగా రాజీనామా చేయించారు



గతంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ చేసిన ఉపాధి అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. అధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో విచారించి సరైన ఆధారాలు దొరకడంతో తొలగించారు. ఆ స్థానంలో ఉపాధి కూలీగా పనిచేస్తున్న నా అనుభవం, విద్యార్హత చూసి ఫీల్డ్ అసిస్టెంట్‌గా అవకాశం కల్పించారు. ఏటా నిర్వహించే సామాజిక తనిఖీలో నాపై ఎలాంటి రికవరీలు లేవు. అయితే టీడీపీ అధికారంలోకి రావడంతో వారికి అనుకూలమైన వ్యక్తిని పెట్టుకోవాలని నాతో బలవంతంగా రాజీనామా చేయించారు. ఇలా చిరుద్యోగుల కడుపు కొట్టడం సరికాదు.

– మునెయ్య, కందాడు, ఏర్పేడు మండలం, తిరుపతి జిల్లా

నా జీవనం ప్రశ్నార్థకంగా మారింది



గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వాచ్‌మెన్‌గా రెండేళ్లుగా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నా. ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే నేను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశాననే నెపంతో నన్ను విధుల నుంచి తొలగించారు. నా కుటుంబ పోషణ ప్రశ్నార్థకంగా మారింది. ఇలా అన్యాయంగా పొట్ట కొట్టడం సరికాదు.

– మాలాజీ ఏసుబాబు, జయంతి, వీరులపాడు మండలం, ఎన్టీఆర్ జిల్లా

ఆస్పత్రుల్లో ఉద్యోగాల భర్తీనే అడ్డుకున్న టీడీపీ నేతలు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది పోస్టులకు కొరత లేకుండా ఉండేలా గత ప్రభుత్వంలో జీరో వేకెన్సీ పాలసీని అమలు చేశారు. ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయిన జిల్లా స్థాయి డీఎస్సీ పోస్టుల భర్తీ ప్రక్రియను ప్రస్తుత చంద్రబాబు ప్రభుత్వం నిలిపేసింది. ప్రభుత్వ వైద్య కళాశాలలతో పాటు, ఇతర ఆస్పత్రుల్లో ఫార్మాసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్ వంటి పారామెడికల్‌తో పాటు ఇతర పోస్టులను ఉమ్మడి 13 జిల్లాల్లో జిల్లాకు 200 నుంచి 250 చొప్పున భర్తీ చేయడానికి సార్వత్రిక ఎన్నికలకు ముందు నోటిఫికేషన్లు ఇచ్చారు. దరఖాస్తులను స్వీకరించి, వాటి పరిశీలన, మెరిట్ జాబితాలను సిద్ధం చేశారు. అభ్యర్థులను ఎంపిక చేసి, పోస్టింగ్ ఉత్తర్వులు ఇచ్చేలోగా సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఒక్క విజయనగరం జిల్లాలో మాత్రమే కోడ్ కంటే ముందే పోస్టుల భర్తీ పూర్తి చేశారు. మిగిలిన జిల్లాల్లో మెరిట్ లిస్ట్ ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేసి, పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉండగా, ఆ నియామకాలను కూటమి ప్రభుత్వం నిలిపివేసింది. పాడేరు, మార్కాపురం, మదనపల్లె, ఆదోని, పులివెందుల వైద్య కళాశాలలకు అనుబంధంగా ఉన్న బోధనాస్పత్రులకు స్టాఫ్ నర్స్ పోస్టులను గత ప్రభుత్వం మంజూరు చేసింది. ఒక్కో కళాశాలలో 200 పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. అయితే గతేడాది సెప్టెంబర్‌లో విడుదల చేసిన స్టాఫ్ నర్స్ నోటిఫికేషన్‌లోని మెరిట్ లిస్ట్ ఆధారంగా తొలుత పాడేరుకు 60, మార్కాపురానికి 47, ఆదోని, పులివెందుల, మదనపల్లె కళాశాలలకు కలిపి 206 పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించారు. దీనికోసం 313 మంది అభ్యర్థులను ఎంపిక చేసినట్లు ఈ ఏడాది జూన్‌లో కడప, విశాఖపట్నం, గుంటూరు రీజినల్ డైరెక్టర్ (ఆర్డీ) కార్యాలయాల్లో సెలక్షన్ లిస్ట్ విడుదల చేశారు. అదే నెల 6న కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు ఇస్తామని ప్రకటించారు. కాగా, అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరవ్వాల్సిన ముందు రోజే అర్ధంతరంగా కౌన్సెలింగ్‌ను రద్దు చేసినట్టు వైద్య శాఖ ప్రకటించింది. గత ప్రభుత్వంలోని నోటిఫికేషన్‌లో ఎంపిక చేసిన అభ్యర్థులకు ఉద్యోగాలు ఇస్తుండటంపై వైఎస్సార్ జిల్లాకు చెందిన టీడీపీ ఎమ్మెల్సీ అభ్యంతరం వ్యక్తం చేయడంతో పాటు, వివిధ జిల్లాల నుంచి కూడా కూటమి నేతలు పోస్టింగ్‌లు ఇవ్వొద్దని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చినట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి.

346 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపు

శ్రీసత్యసాయి జిల్లాలో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన కార్మికులు, ఏజెన్సీల నిర్వాహకులు, రేషన్ షాపుల డీలర్లు, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, పాఠశాలల వాచ్‌మెన్లు, వలంటీర్లను బలవంతంగా తొలగించారు. జిల్లా వ్యాప్తంగా 520 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను, 7,836 మంది వలంటీర్లను తీసేశారు. 346 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించారు. 1,438 మధ్యాహ్న భోజన ఏజెన్సీలను మార్చేశారు. 1,730 మంది మధ్యాహ్న భోజన పథకం కార్మికులను వీధిన పడేశారు. 97 మంది వాచ్‌మెన్లను తొలగించారు. 1,367 మంది రేషన్ డీలర్లను మార్చేశారు. అనంతపురం జిల్లా వ్యాప్తంగా 1,125 రేషన్ డీలర్లను మార్చేశారు. 420 మంది యానిమేటర్లను తప్పించారు. 677 స్కూళ్లలో మధ్యాహ్న భోజన ఏజెన్సీలను మార్చేశారు. 1,300 మందికి పైగా కార్మికులను తొలగించారు. 274 మంది వాచ్‌మెన్లు, మరుగుదొడ్లు శుభ్రం చేసే ఆయాలు 450 మందికి పైగా తొలగించారు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా 100 మంది ఫీల్డ్ అసిస్టెంట్లతో రాజీనామా చేయించారు. స్వచ్ఛందంగా రాజీనామా చేసేలా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, స్కూళ్లలో టాయ్‌లెట్స్ క్లీన్ చేసే ఆయాలు, నైట్ వాచ్‌మెన్లపై టీడీపీ నేతలు ఒత్తిడి తెస్తున్నారు. చౌక డిపో డీలర్లు అత్యధిక శాతం టీడీపీ వారే ఉన్నారు. ప్రతి పది షాపులకు ఒకరిని ఇన్‌చార్జ్‌గా నియమిస్తున్నారు. వారి ద్వారా మామూళ్లు ఇచ్చేలా ఒప్పందాలు చేసుకుంటున్నారు.

జగన్ ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



బస్ సర్వీసులను ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

తిరుపతి అర్బన్/తిరుమల: ఆర్టీసీ కార్మికులకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం అలిపిరి డిపోలో ఆర్టీసీ రెండు కొత్త ఎక్స్‌ప్రెస్ సర్వీసులను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులను తాము అధికారంలోకి వస్తే ప్రభుత్వంలో విలీనం చేసి ఉద్యోగులను చేస్తామని ఇచ్చిన హామీ మాత్రమే వైఎస్ జగన్ అమలు చేశారని చెప్పారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఇతర హామీలపై మాట్లాడుతూ రాబోవు కాలంలో అమలు చేస్తామని చెప్పారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై విమర్శలు చేశారు. అలాగే తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న మంత్రి మీడియాతో మాట్లాడారు. శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్యకు అనుగుణంగా ఎలక్ట్రిక్ బస్సులను నడిపేలా నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఆర్టీసీలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు.

వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌పై టీడీపీ మూకల దాడి

- కారు, బైక్‌లపై వచ్చి ఇనుపరాడ్లతో దాడి
- తిరగబడ్డ జనం.. నలుగురిని పట్టుకుని దేహశుద్ధి
- పోలీసులకు అప్పగింత
- అనపర్తి ఎమ్మెల్యే, ఆయన కుమారుడి నుంచి ప్రాణహాని : సర్పంచ్



లొల్ల భద్రంను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు : అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలం ఇల్లపల్లిలో వైఎస్సార్‌సీపీ సర్పంచ్ లొల్ల భద్రంపై టీడీపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అనుచరులు సోమవారం అర్ధరాత్రి దాడి చేశారు. అనపర్తి మండలం రామవరానికి చెందిన 12 మందికి పైగా ఎమ్మెల్యే అనుచరులు కారు, నాలుగు బైకులపై వచ్చి చెరువుల విషయమై మాట్లాడాలి బయటకు రమ్మని సర్పంచ్‌ను పిలిచారు. ఆ సమయంలో తాను బయటికి రాను.. అని చెప్పడంతో వారు సర్పంచ్‌ను దౌర్జన్యంగా లాక్కుని కారు వద్దకు తీసుకువెళ్లి వెంట తెచ్చుకున్న ఇనుప రాడ్లతో దాడి చేశారు. గంజాయి తాగి సర్పంచ్ ఇంటి వద్ద గలాటా చేస్తూ, ఆయనపై దాడి చేయడాన్ని గమనించిన స్థానికులు ఒక్కసారిగా దుండగులపై తిరగబడడంతో కొంతమంది పరారయ్యారు. కొందరిని వెంబడించగా మర్రిపూడిలో సబ్బెళ్ల మురళీ కృష్ణారెడ్డి, తాడి శివరామకృష్ణారెడ్డి, పులగం దయాకిరణ్‌రెడ్డి, కర్రి రమాకాంత్‌రెడ్డిలు వారికి చిక్కారు. వీరికి దేహశుద్ధి చేసిన గ్రామస్తులు పోలీసులకు అప్పగించారు. అయితే పోలీసులు వ్యక్తిగత పూచీకత్తుపై వారిని విడుదల చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతన్నాయి. తీవ్ర గాయాలపాలైన సర్పంచ్ భద్రంను అనపర్తి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆస్పత్రికి వెళ్లి బాధిత సర్పంచ్‌తో మాట్లాడి ధైర్యం చెప్పారు. సర్పంచ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు బిక్కవోలు ఎస్‌ఐ బుజ్జిబాబు తెలిపారు.

ఆ కక్షతోనే దాడి : సర్పంచ్

చికిత్స పొందుతున్న సర్పంచ్ భద్రం మీడియాతో మాట్లాడుతూ రాజకీయ కక్షతో ఎమ్మెల్యే అనుచరులు ఈ దాడి చేసినట్టు తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి భార్య మహాలక్ష్మి భారీగా జనాన్ని వెంటబెట్టుకుని పోలింగ్ కేంద్రానికి వస్తుండగా తాను అభ్యంతరం వ్యక్తం చేశానని, అప్పటి నుంచి కక్ష పెంచుకున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, ఆయన తనయుడు మనోజ్ నుంచి తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు. ఎమ్మెల్యే తనయుడు నల్లమిల్లి మనోజ్ ఒక ముఠాను ఏర్పాటు చేసి నియోజకవర్గం వ్యాప్తంగా సెటిల్‌మెంట్లతో పాటు దాడులకు తెగబడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

కట్టెతో కొట్టి.. కాళ్లకు మొక్కించి..

వాల్మీకి సామాజికవర్గ యువకులపై డోన్ ఎమ్మెల్యే దాష్టీకం

తీవ్రంగా కొట్టి, అవమానించిన 'కోట్ల' • సోషల్ మీడియాలో వీడియో వైరల్



వాల్మీకి యువకులపై కట్టెతో దాడిచేస్తున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి


డోన్ : ఆయనో ఎమ్మెల్యే.. గతంలో కేంద్ర మంత్రిగానూ చేశారు. అంతేకాదు, మాజీ సీఎం దివంగత కోట్ల విజయభాస్కర్‌రెడ్డికి కుమారుడు. అయితేనేం.. ఆ హుందాతనాన్ని మరిచి, వాల్మీకి సామాజికవర్గానికి చెందిన ఇద్దరు యువకుల పట్ల అమానుషంగా ప్రవర్తించారు. వారిని కట్టెతో తీవ్రంగా కొట్టి.. తన కాళ్లు మొక్కించుకున్నారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. స్వయంగా ఆయనే కట్టెతో కొట్టడం, చివరకు వారితో తన కాళ్లకు మొక్కించుకోవడం కూడా ఆ వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. ఈ ఘటన కోడుమూరు నియోజకవర్గంలోని ఆయన స్వగ్రామం లద్దగిరిలో ఇటీవల జరిగినట్టుగా భావిస్తున్నారు. వాల్మీకి యువకులపై ప్రకాష్‌రెడ్డి అమానుష దాడిపై వాల్మీకి సామాజికవర్గ నేతలు ఆయనపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వాల్మీకులను బానిసలుగా భావించడం 'కోట్ల'కు తగదు..

ఈ దాడిని మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజా సమితి తీవ్రంగా ఖండిస్తోందని ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పులికొండ హెచ్చరించారు. యావత్ వాల్మీకి జాతినే బానిసలుగా భావించి అమానుషంగా దాడి చేయడం ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డికి తగదని, వెంటనే వాల్మీకులకు ఆయన క్షమాపణలు చెప్పాలని డోన్ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు డిమాండ్ చేశారు.

నిబంధనలు సరళీకృతం చేస్తాం

పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో లేఅవుట్లు, భవన నిర్మాణాల అనుమతుల నిబంధనలను సరళీకృతం చేస్తామని పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ చెప్పారు. మంగళవారం ఏపీలో బిల్డర్ల అసోసియేషన్ ప్రతినిధులతో విజయవాడలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో మంత్రి సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రతివారం ఒక మున్సిపాల్టీలో టౌన్ ప్లానింగ్ దరఖాస్తుల పరిష్కారానికి డ్రైవ్ చేపడతామన్నారు. బిల్డర్లకు ఇబ్బందులు లేకుండా టౌన్ ప్లానింగ్ విభాగాన్ని రిజిస్ట్రేషన్ విభాగంతో అనుసంధానం చేస్తామన్నారు. అనధికార లేఅవుట్ల విషయంలో కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అమరావతిలో జంగిల్ క్లియరెన్స్ పనులు బుధవారం నుంచి ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. ఆర్–5 జోన్‌లో గతంలో స్థలాలు పొందిన వారికి వారి సొంత ప్రాంతాల్లో స్థలాలు లేదా టిడ్కో ఇళ్లు ఇస్తామని, సీఆర్డీఏలో లబ్ధిదారులు ఉంటే వారికి అక్కడే ఇళ్లు కేటాయిస్తామని అన్నారు. సమావేశంలో సీఆర్డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్ పర్సన్ లక్ష్మీ పార్థసారథితో పాటు క్రెడాయ్, నరెడ్కో, బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అసోసియేషన్ ప్రతినిధులు హాజరయ్యారు.

15 నుంచి అన్న క్యాంటీన్లు ప్రారంభం

రాష్ట్రంలో తొలుత 33 మున్సిపాలిటీల్లో 100 అన్న క్యాంటీన్లు అందుబాటులోకి తెస్తామని, ఆగస్టు 15 నుంచి అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తామని మంత్రి నారాయణ తెలిపారు. మంగళవారం అన్న క్యాంటీన్ల భవనాల నిర్మాణం, మురుగు కాల్వల్లో పూడికతీత పనులపై వెలగపూడిలోని సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష నిర్వహించారు.

అదర్ సైడ్



మను బాకర్

గెలుపు, ఓటములకు అతీతంగా కొన్ని విషయాలు ఆసక్తికరంగా ఉంటాయి. ఆట అంటే 'గెలుపు' లేదా 'ఓటమి' మాత్రమే కాదు. గెలుపుకు ముందు, గెలిచిన తరువాత, ఓటమికి ముందు ఓటమికి తరువాత విషయాలు కూడా పసందుగా ఉంటాయి. 'షూటర్ మను బాకర్ పారిస్ ఒలింపిక్స్‌లో భోజనం చేయలేదు' అనే విషయం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అరె మనకు పతకాలు తెచ్చిన అమ్మాయి భోజనం చేయలేదా? ఎందుకు చేయలేదు?

ఒట్టు... మను బాకర్ భోజనమే చేయలేదు!



తల్లిదండ్రులతో మను బాకర్

పారిస్ ఒలింపిక్స్‌లో వ్యక్తిగత విభాగంలో కాంస్యం, మిక్స్‌డ్ టీమ్ విభాగంలో మరో కాంస్యాన్ని గెలుచుకొని రికార్డ్ సృష్టించింది షూటర్ మను బాకర్. 'ఇది మను ఒలింపిక్స్' అంటూ క్రీడాభిమానుల ప్రశంసలు అందుకుంది. 25 మీటర్ల విభాగంలో మూడో పతకం కొద్దిలో చేజారింది.

హిస్టారిక్ మెడల్ హ్యాట్రిక్ మిస్ అయిన తరువాత ఆమె ఏం ఆలోచించిందనే విషయానికి వస్తే... మొదటిది... నాలుగు సంవత్సరాల తరువాత లాస్ ఏంజెల్స్‌లో జరగనున్న ఒలింపిక్స్ గురించి. రెండోది... భోజనం గురించి. మొదటి విషయం సరే, రెండో విషయమే అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది.

ఆడి ఆడి అలిసిపోయిన మను బాకర్‌ను విశ్రాంతి గురించి అడిగినప్పుడు... 'నేను చేసే మొదటి పని ఇంటి భోజనం చేయడం. ఇన్ని రోజులు నేను భోజనం చేయలేదు. విలేజ్‌లో బ్రేక్ ఫాస్ట్ చేసి, షూటింగ్ రేంజ్‌కు వచ్చేదాన్ని. అక్కడ స్నాక్స్ తినేదాన్ని. విలేజ్‌లో మధ్నాహ్న భోజనం ఉంటుంది. ప్రాక్టీస్ తర్వాత 3 లేదా 5 గంటల మధ్య మాత్రమే తిరిగి భోజనశాలకు రావడానికి వీలయ్యేది. ఆ సమయానికి మధ్యాహ్న భోజనం అయిపోయేది. దాంతో సాయంత్రం ఏదో తినేదాన్ని' అని ఒక ఇంటర్వ్యూలో చెప్పింది మను బాకర్.

డైట్ రొటీన్

భోజనానికి సంబంధించి వ్యక్తిగత ఇష్టాయిష్టాలు వేరు. క్రీడాకారిణిగా వేరు. శాకాహారి అయిన మను బాకర్ 'డైట్ రొటీన్' విషయానికి వస్తే... హెల్తీ ఫ్యాట్స్, లో-జీఐ కార్బోహైడ్రేడ్స్‌తో కూడిన సింపుల్ డైట్‌కు ప్రాధాన్యత ఇస్తుంది. అలసట, గాయాలకు దూరంగా ఉండడానికి డైట్‌లో హైడ్రేషన్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తుంది. మను డైట్‌లో రకరకాల పండ్లు, విటమిన్ సి అధికంగా ఉండే కూరగాయలు ఉంటాయి. హై-ఎనర్జీ, షుగర్ ఫుడ్స్‌కు దూరంగా ఉంటుంది. ఆహారానికి ఎంత ప్రాధాన్యత ఇస్తుందో కంటినిండా నిద్రకు అంతే ప్రాధాన్యత ఇస్తుంది. యోగా, జిమ్ తరువాత ప్రతిరోజూ ఏడు నుంచి ఎనిమిది గంటలు షూటింగ్ ప్రాక్టీస్ చేస్తుంది. మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని పెయింటింగ్స్ వేస్తుంటుంది. మైండ్ ఫోకస్డ్‌గా ఉండడానికి క్రియేటివ్ వర్క్ ఉపయోగపడుతుందని చెబుతుంది మను బాకర్.

మను మధ్యాహ్న భోజనానికి దూరమైన విషయం ఆమె తల్లి సుమేధకు కూడా తెలిసిపోయింది.

కుమార్తె విజయం కోసం రోజూ ప్రార్థనలు చేసిన ఆమె ఇలా అన్నది...'మను ఇంటికి తిరిగి రాగానే వేడి వేడి ఆలూ పరోటా తినిపిస్తాను. మనుకు ఆలూ పరోటా అంటే ఎంతో ఇష్టం'

'కుమార్తె గెలుపు వార్త మాత్రమే వినాలి... తన ఓటమిని చూడలేను' అనుకుందో ఏమో మను బాకర్ లైవ్ మ్యాచ్‌లు చూడడానికి ఇష్టపడేది కాదు సుమేధ.

'మా అమ్మ నన్ను ఛాంపియన్ చేయడం కోసం ఎంతో కష్టపడింది. అమ్మా... నువ్వు ఎప్పుడు ఆయురారోగ్యాలతో ఉండాలి' అంటున్న మను బాకర్ అమ్మ చేతి వంట కోసం ఎదురు చూస్తోంది.

'ఏదైనా సరే, మా ఇంట్లో అమ్మ చేతివంట తినడం అంటే ఎంతో ఇష్టం. ఐ రియల్లీ లవ్ ఆలూ పరోటా. ఆలూ పరోటా తినక నాలుగు నెలలు అవుతోంది' అంటుంది మను బాకర్

మనకు విజయాలు మాత్రమే కనిపిస్తాయి. ఆ విజయాల వెనుక ఎన్ని సర్దుబాట్లు ఉంటాయో చెప్పడానికి మను బాకర్ ఒక ఉదాహరణ.

ఒకటి రెండు రోజులంటే ఫరవాలేదుగానీ ఎన్నో రోజులు మధ్నాహ్న భోజనం లేకుండా గడిపింది మను. ఆ సమయంలో ఆమెకు కోపం రాలేదు. ఎందుకంటే మను బాకర్ 'గెలుపు' ఆకలితో ఉంది. రెండు పతకాలతో ఆ ఆకలి తీరింది.



భర్త సజిన్‌తో భావన

ఈ తల్లి ఒక అద్భుతం

ప్రకృతి ప్రమాదాలు సంభవించినప్పుడు పాత బట్టలు, గిన్నెలు తీసుకుని బయల్దేరతారు కొందరు. కానీ, తల్లిని కోల్పోయి పాలకోసం ఏడుస్తున్న చంటిపిల్లలకు తన పాలు ఇవ్వడానికి బయల్దేరింది ఆ తల్లి.

ప్రకృతి ప్రకోపంతో వయనాడు తల్లడిల్లితే ఆ విషాదంలో కొందరు శిశువులు తల్లిపాలు లేక అల్లాడారు. అయితే ఆ వార్త తెలిసిన వెంటనే ఇడుక్కికి చెందిన భావన బాధిత శిబిరాల దగ్గరకు వెళ్లి తన పాలు అందించింది. నాలుగేళ్ల వయసు, నాలుగు నెలల వయస్సు గల ఇద్దరు పిల్లలు ఆమెకు ఉన్నారు. ఆమె భర్త సజిన్ డ్రైవర్‌గా పనిచేస్తాడు. సేవా కార్యక్రమాలు కూడా చేస్తాడు. వయనాడ్‌లోని పసికందుల అవస్థను భార్యకు చెప్పి తల్లి పాలు ఇచ్చేందుకు ప్రోత్సహించాడు. ఇడుక్కిలోని వారి ఇంటి నుండి పికప్ ట్రక్‌లో కేరళలోని వయనాడ్ కొండలపైకి వెళ్లి మెప్పాడిలోని శిబిరాల్లో కుటుంబాలకు సేవ చేసిన తర్వాత ఇడుక్కికి తిరిగి వచ్చారు ఆ దంపతులు.

'మేం కొన్ని శిబిరాలు, హాస్టళ్లను సందర్శించాం. నేను ఆరు నెలల కంటే తక్కువ వయస్సు ఉన్న కొంత మంది పిల్లలకు నా పాలు ఇచ్చాను. కొందరికి ఆహారాన్ని తినిపించాను. కొండచరియలు విరిగిపడి గాయపడిన తల్లులు కోలుకున్న వెంటనే తమ పిల్లల బాధ్యతలు స్వీకరించారు. మేం ఒక కుటుంబంగా పిల్లల్ని చూసుకున్నాం. నేను చేస్తున్న పని తెలిసి చాలా మంది మెచ్చుకున్నారు. కొందరు మా ట్రిప్‌ను స్పాన్సర్ చేస్తామన్నారు. కానీ, ఆ మాత్రం ఖర్చును భరించలేమా? నేను తల్లిని, పిల్లలకు తల్లి పాలు ఉత్తమమని నాకు తెలుసు. అందుకే, వాటిని కొందరికైనా అందించాలనుకున్నాను' అని భావన చెప్పింది.

వయనాడ్ వారియర్స్

స్త్రీని కాబట్టి వెనక్కు తగ్గాలా?

ప్రమాదం జరిగినప్పుడు స్త్రీలను అక్కడకు వెళ్లనివ్వరు. చాలామంది స్త్రీలు తమ భర్త, కొడుకులను సహాయానికి పంపడానికి సంశయిస్తారు. కాని వయనాడ్ వరద బీభత్సం సంభవించినప్పుడు ఒక అంగన్‌వాడి టీచర్ రక్షణ దళాలతో సమానంగా రంగంలో దిగింది. సహాయక చర్యల్లో పాల్గొంది. 'ఇంత దారుణ పరిస్థితిలో అందరూ ఉంటే స్త్రీని కాబట్టి నేను వెనక్కు తగ్గాలా?' అని ప్రశ్నించిందామె.

వయనాడ్‌లోని చిన్న పల్లె ముప్పెనాడ్. అక్కడ అంగన్‌వాడి టీచర్‌గా పని చేస్తోంది 36 ఏళ్ల విజయకుమారి. జూలై 30 తెల్లవారుజామున నాలుగు గంటలకు ఫోన్ కాల్ అందుకుంది. వాళ్ల పల్లె నుంచి 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న చూరల్‌మలను వరద చుట్టుముట్టిందని అందరూ ప్రమాదంలో ఉన్నారని. ఆమె అంగన్‌వాడి టీచర్. ప్రమాదస్థలంలో ఆమెకు ఏ విధమైన విధులు లేవు ఒక ఉద్యోగిగా. ఒక పౌరురాలిగా ఎలాంటి నిర్బంధం లేదు సేవకు. కాని ఆమె ఆగలేకపోయింది. వెంటనే బయల్దేరడానికి ఇంటి నుంచి బయటకు వచ్చింది. బయట భారీ వర్షం. హోరు గాలి. కన్ను పొడుచుకున్నా కానరాని చీకటి. అయినా సరే తన టూ వీలర్ తీసి చూరల్‌మలకు బయలుదేరింది. తెల్లవారుజాము ఐదు అవుతుండగా అక్కడకు చేరుకుంది.

కాని అక్కడ కనిపించిన దృశ్యం ఆమెను అవాక్కు చేసింది. తనకు బాగా పరిచయమైన ప్రాంతం, జనావాసం ఇప్పుడు కేవలం బురద దిబ్బ. ఎవరు ఏమయ్యారో తెలియదు. సహాయ బృందాలు వచ్చి అప్పుడప్పుడే సహాయక చర్యలు మొదలెట్టాయి. విజయకుమారి ఏమీ ఆలోచించ లేదు. వెంటనే రంగంలో దిగింది. వారికి తనను పరిచయం చేసుకుని అగ్నిమాపక బృందం వారి షూస్, ఇనుపటోపి పెట్టుకుని రంగంలో దిగింది. ఆ తర్వాత ఆమె చేసినదంతా ఎవరూ చేయలేనంత సేవ.

'నా ఎదురుగా మహా విపత్తు. ప్రాణం పోయిన వారు ఎందరో. ఇలాంటి సందర్భంలో స్త్రీగా వెనక్కు తగ్గాలా? అనిపించింది. కాని మనిషిగా ముందుకే వెళ్లాలని నిశ్చయించుకున్నాను. సహాయక చర్యల్లో పాల్గొన్నాను. తెల్లవారుజాము 5 నుంచి 8 లోపు ఎన్నో మృతదేహాలను వెలికి తీసి రవాణా చేయడంలో సాయపడ్డాను' అందామె.



పనికి వచ్చిన కరాటే

విజయకుమారికి పోలీసు కావాలని చిన్నప్పటి నుంచి కోరిక. పోలీసు కావాలని కరాటే నేర్చుకొని బ్రౌన్ బెల్ట్ వరకూ వెళ్లింది. అంతేకాదు పరీక్షలు రాసి పోలీస్‌గా సెలెక్ట్ అయ్యింది కూడా. కాని వాళ్ల నాన్నకు ఆమె ఆ ఉద్యోగం చేయడం ఇష్టం లేదు. అపాయింట్‌మెంట్ లెటర్ చింపేశాడు. ఆమె అంగన్‌వాడి టీచర్‌గా మిగలాల్సి వచ్చింది. 'పోలీస్ కావాలని నేను తీసుకున్న కరాటే శిక్షణ, చేసిన ఎక్సర్‌సైజులు నాకు ఈ సమయంలో తోడు వచ్చాయి. రక్షణ దళాలతో సమానంగా నేను కష్టపడ్డాను. మనిషికి మనిషి సాయం చేయాల్సిన సమయం ఇది. ముఖ్యంగా ఈ సమయంలో ఎందరో స్త్రీలు దుఃఖంతో స్పృహ తప్పారు. సహాయక బృందాల్లో అందరూ మగవారే ఉంటారు. వారు ఓదార్చలేరు. కాని నేను స్త్రీని కావడం వల్ల వారిని దగ్గరకు తీసుకొని ఓదార్చగలిగాను. ఇలాంటి సందర్భాల్లో స్త్రీలు ఉండాలి స్త్రీల కోసం' అంటుంది విజయకుమారి. ఆమె సేవలను అందరూ మెచ్చుకుంటున్నారు.

సినిమా

మొదలైంది... తెలుసు కదా



● సిద్ధు జొన్నలగడ్డ

''మొదలైంది... తెలుసు కదా' అంటున్నారు సిద్ధు జొన్నలగడ్డ. ప్రముఖ కాస్ట్యూమ్ డిజైనర్ నీరజ కోన దర్శకురాలిగా పరిచయం అవుతున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'తెలుసు కదా'. ఈ చిత్రంలో సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తుండగా, రాశీ ఖన్నా, శ్రీ నిధి శెట్టి హీరోయిన్లుగా నటిస్తున్నారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ మంగళవారం ప్రారంభమైంది. దాదాపు ముప్పై రోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో కొంత టాకీ పార్టుతో పాటు పాటలనూ చిత్రీకరించనున్నారు. ''తొలి రోజు సిద్ధు, రాశీ కాంబినేషన్‌లోని సన్నివేశాల చిత్రీకరణను ప్రారంభించాం'' అని చిత్రబృందం తెలిపింది.

మరో హాలీవుడ్ అవకాశం?



● ధనుష్

హాలీవుడ్ మూవీ 'అవెంజర్స్' సిరీస్‌లో తమిళ నటుడు ధనుష్ భాగమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. మార్వెల్ ఫ్రాంచైజీలోని 'అవెంజర్స్' సిరీస్‌లో తర్వాతి చిత్రాలుగా 'అవెంజర్స్: డూమ్స్ డే, అవెంజర్స్: సీక్రెట్ వార్' రానున్నాయని, 'అవెంజర్స్: ఎండ్ గేమ్' చిత్రానికి దర్శకత్వం వహించిన రూసో బ్రదర్స్ (ఆంథోనీ రూసో, జోసెఫ్ రూసో) ఈ చిత్రాలను తెరకెక్కించనున్నారని మార్వెల్ సంస్థ ప్రకటించింది. 'అవెంజర్స్: డూమ్స్ డే'లో రాబర్ట్ డౌనీ జూనియర్ ఓ లీడ్ రోల్‌లో నటించనున్నారు. మరో లీడ్ రోల్‌లో ధనుష్ నటించనున్నారనే టాక్ వినిపిస్తోంది. రూసో బ్రదర్స్ దర్శకత్వం వహించిన హాలీవుడ్ మూవీ 'ది గ్రే మ్యాన్'లో ధనుష్ ఓ లీడ్ రోల్ చేశారు. మరి... 'అవెంజర్స్: డూమ్స్ డే'లోనూ ఈ ఇండియన్ హీరో నటిస్తారా? వేచి చూడాలి.

సినిమా చూసి కన్నీళ్లొచ్చాయి - వరుణ్ తేజ్

''కమిటీ కుర్రోళ్ళు' సినిమా చూశాను. చాలా బాగుంది. నాకు పాత రోజులు గుర్తొచ్చాయి.. చాలా చోట్ల కన్నీళ్లు పెట్టుకున్నాను. ప్రేక్షకులకు కూడా అలాంటి అనుభూతి కలుగుతుందనిపిస్తోంది. ఇంతమంది ప్రతిభ ఉన్న నటీనటులను ఇండస్ట్రీకి అందిస్తున్న మా చెల్లి నిహారికను చూస్తుంటే గర్వంగా ఉంది'' అని హీరో వరుణ్ తేజ్ అన్నారు. నూతన నటీనటులతో యదు వంశీ దర్శకత్వం వహించిన చిత్రం 'కమిటీ కుర్రోళ్ళు'. నిహారిక కొణిదెల సమర్పణలో పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 9న విడుదలవుతోంది. తెలుగు రాష్ట్రాల్లో వంశీ నందిపాటి విడుదల చేస్తున్నారు. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హీరోలు వరుణ్ తేజ్, సాయి దుర్గ తేజ్, అడివి శేష్, దర్శకుడు వెంకీ అట్లూరి అతిథులుగా హాజరయ్యారు. సాయి దుర్గ తేజ్ మాట్లాడుతూ– ''కమిటీ కుర్రోళ్ళు' టైటిల్ విన్నప్పుడే నాకు చిన్ననాటి రోజులు గుర్తొచ్చాయి. ట్రైలర్ చాలా నచ్చింది'' అని పేర్కొన్నారు. ''ఈ చిత్రం ట్రైలర్ చూడగానే ఓ జీవితాన్ని చూసినట్టుగా అనిపించింది'' అన్నారు అడివి శేష్.



● వరుణ్ తేజ్, నిహారిక, సాయి దుర్గ తేజ్, వంశీ, అడివి శేష్

సస్పెన్స్... థ్రిల్

శివ రామచంద్రపు, చైతన్య పసుపులేటి, రషీద భాను లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'సంఘర్షణ'. చిన్న వెంకటేశ్ దర్శకత్వంలో వల్లూరి శ్రీనివాస రావ్ తెలుగు, తమిళ భాషల్లో నిర్మించిన ఈ సినిమా ఈ నెల 9న విడుదల కానుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేశారు. వల్లూరి శ్రీనివాస రావ్ మాట్లాడుతూ– ''సస్పెన్స్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'సంఘర్షణ'. ఈ చిత్రంలో ఫ్యామిలీలోని అన్ని రకాల భావోద్వేగాలతో పాటు ప్రేమ కూడా ఉంటాయి. వన్ మీడియా ద్వారా పార్థు రెడ్డి మా సినిమాను విడుదల చేస్తున్నారు'' అన్నారు.



● రషీద భాను



ఫైట్స్ చేయడం సవాల్‌గా అనిపించింది - కావ్యా థాపర్

''నేనిప్పటివరకూ వైవిధ్యమైన పాత్రలు చేశాను. తొలిసారి 'డబుల్ ఇస్మార్ట్' చిత్రంలో యాక్షన్ సీన్స్ చేశాను. మొదటిసారి ఫైట్స్ చేయడం, పాటల్లో ఫుల్ జోష్‌తో డ్యాన్స్ చేసే అవకాశం రావడం సవాల్‌గా అనిపించింది'' అని హీరోయిన్ కావ్యా థాపర్ అన్నారు. రామ్ పోతినేని హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వం వహించిన చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్ నిర్మించిన ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ నెల 15న ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా కావ్యా థాపర్ పంచుకున్న విశేషాలు.

- పూరి జగన్నాథ్‌గారి దర్శకత్వంలో నటించాలని ఉండేది. 'ఇస్మార్ట్ శంకర్'కి ఆడిషన్ ఇచ్చాను కానీ కుదరలేదు. 'డబుల్ ఇస్మార్ట్'కి నా ఆడిషన్స్ నచ్చి పూరి సార్, ఛార్మీగారు చాన్స్ ఇచ్చారు. ఇప్పుడు డబుల్ ఫన్, ఎంటర్‌టైన్మెంట్ ఉండే ఈ సినిమాలో అవకాశం రావడం మరింత హ్యాపీగా ఉంది. పూరీగారు గొప్ప డైరెక్టర్. ఆయన్నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను.
- ఈ మూవీలో నా క్యారెక్టర్ చాలా బోల్డ్ అండ్ స్ట్రాంగ్‌గా ఉంటుంది. అలాగే చిన్న అమాయకత్వం కూడా ఉంటుంది. రామ్ గారితో సాంగ్ షూట్‌లో ఫస్ట్ డే మార్నింగ్ సిక్ అయ్యాను. చాలా ఎనర్జీ, పవర్ కావాల్సిన సాంగ్ అది. అయినా సెట్‌కి వెళ్లాను. ఛార్మీగారు హాస్పిటల్‌కి తీసుకెళ్లారు. నన్ను చాలా జాగ్రత్తగా చూసుకున్నారు. మూడు రోజుల తర్వాత డబుల్ ఎనర్జీతో డిస్‌చార్జ్ అయ్యాను... నా బెస్ట్ డ్యాన్స్ ఇచ్చాను.
- మణిశర్మగారు లెజండరీ కంపోజర్. ఆయన సాంగ్స్‌కి డ్యాన్స్ చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. 'డబుల్ ఇస్మార్ట్' నేరుగా హిందీలో రిలీజ్ కావడం చాలా ఎగ్జయిటింగ్‌గా ఉంది. నాకు యాక్షన్ రోల్స్, అడ్వెంచరస్ మూవీస్ చేయాలని ఉంది. ప్రస్తుతం గోపీచంద్‌గారితో 'విశ్వం' చిత్రంలో నటిస్తున్నాను. మరికొన్ని ప్రాజెక్ట్స్ చర్చల్లో ఉన్నాయి.

యాక్షన్... రియాక్షన్



● విశ్వక్ సేన్

ఐపీఎస్ ఆఫీసర్‌గా విశ్వక్ సేన్ చార్జ్ తీసుకోనున్నారు. విశ్వక్ సేన్ హీరోగా శ్రీధర్ గంటా దర్శకత్వంలో విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో ఓ పొలిటికల్ యాక్షన్ డ్రామా తెరకెక్కనుంది. 'ఎవ్రీ యాక్షన్ హైర్స్ ఎ రియాక్షన్' అనేది ఉపశీర్షిక. సుధాకర్ చెరుకూరి ఈ సినిమాను నిర్మించనున్నారు. కాగా విశ్వక్ సేన్ కెరీర్‌లోని ఈ 13వ చిత్రాన్ని మంగళవారం ప్రకటించి, ఫ్రీ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ సినిమాకు సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, కెమెరా: కిశోర్ కుమార్.

మార్టిన్ వస్తున్నాడు



● ధ్రువ్ సర్జా

దసరాకు థియేటర్స్‌కు వస్తున్నాడు 'మార్టిన్'. ధ్రువ్ సర్జా హీరోగా నటించిన కన్నడ చిత్రం 'మార్టిన్'. వైభవీ శాండిల్య హీరోయిన్‌గా నటించారు. నటుడు అర్జున్ సర్జా కథ అందించిన ఈ సినిమాకు ఏపీ అర్జున్ దర్శకుడు. ఉదయ్ కె. మెహతా, సూరజ్ ఉదయ్ మెహతా నిర్మించిన ఈ చిత్రం తొలి ట్రైలర్ రిలీజ్ వేడుకను ముంబైలో నిర్వహించి, సినిమాను అక్టోబరు 11న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. ఈ సినిమాను పదమూడు భాషల్లో (తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ, బెంగాలీ, ఇంగ్లిష్, అరబిక్, జపనీస్, చైనీస్, కొరియన్, స్పానిష్, రష్యన్) విడుదల చేయనున్నట్లుగా చిత్రబృందం తెలిపింది. ఈ సందర్భంగా ధ్రువ్ సర్జా మాట్లాడుతూ – ''యూనివర్సల్ అప్పీల్ ఉన్న స్టోరీ 'మార్టిన్'. ఈ చిత్రంలో కొత్త తరహా యాక్షన్‌ను ప్రేక్షకులు అనుభూతి చెందుతారు'' అన్నారు. అర్జున్ మాట్లాడుతూ– ''ధ్రువ్ కోసం 'మార్టిన్' కథ రాశాను. కొన్నిసార్లు అతని అంకితభావం చూసి ప్రేరణ పొందుతుంటాను'' అని తెలిపారు. ''ప్రేక్షకులను తప్పక అలరించే చిత్రం ఇది'' అన్నారు ఏపీ అర్జున్. ''టీజర్ విడుదల చేసిన తర్వాత 'మార్టిన్' సినిమా గురించి నన్ను చాలా మంది అడిగారు. దీంతో ప్రపంచవ్యాప్త ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని ఈ సినిమాను ఇతర దేశ భాషల్లోనూ రిలీజ్ చేస్తున్నాం'' అని నిర్మాతలు పేర్కొన్నారు.

పాగల్ ప్రేమకథ



● విజయ్ శంకర్, విషిక


విజయ్ శంకర్, విషిక జంటగా రాజేశ్ ముదునూరి దర్శకత్వం వహించిన చిత్రం 'పాగల్ వర్సెస్ కాదల్'. బ్రహ్మాజీ, 'షకలక' శంకర్, ప్రశాంత్ కూఛిబొట్ల, అనూహ్య సారిపల్లి ఇతర కీలక పాత్రల్లో నటించారు. పద్మాన మన్మథరావు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 9న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో విజయ్ శంకర్ మాట్లాడుతూ– ''రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'పాగల్ వర్సెస్ కాదల్'. ఇందులో కార్తీక్ అనే అమాయకుడి పాత్రలో నటించాను. ప్రేమలో ఉన్నవారందరూ రిలేట్ చేసుకునేలా మా సినిమా ఉంటుంది'' అన్నారు. ''అనుమానంతో బాయ్‌ఫ్రెండ్‌ని ఇబ్బందులు పెట్టే ప్రియ అనే పాత్ర చేశాను. నేను నటించిన 'కమిటీ కుర్రోళ్ళు, పాగల్ వర్సెస్ కాదల్' సినిమాలు ఒకేరోజు రిలీజ్ కానుండటం నా కెరీర్‌లో మర్చిపోలేని సందర్భం'' అని విషిక తెలిపారు.

ఓటీటీ

ఇది చూడొచ్చు

నేను నా కథకు బానిసను

- 'మోడ్రన్ మాస్టర్స్'లో ఎస్ఎస్ రాజమౌళి



ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతున్న వాటిలో ప్రముఖ దర్శకుడు రాజమౌళిపై రూపొందిన 'మోడ్రన్ మాస్టర్స్' డాక్యుమెంటరీ ఒకటి. ఈ డాక్యుమెంటరీ గురించి తెలుసుకుందాం.

నెట్ ఫ్లిక్స్ వేదికగా ఇటీవల విడుదలైన డాక్యుమెంటరీ 'మోడ్రన్ మాస్టర్స్: ఎస్.ఎస్. రాజమౌళి'. నెట్ ఫ్లిక్స్ అనేది అమెరికా దేశపు ప్రముఖ ఓటీటీ సంస్థ. అమెరికా ఎంటర్‌టైన్మెంట్ మార్కెట్‌లో దాదాపు 25 శాతం కలిగి, భారతదేశంలో దాదాపు 12 కోట్లకు పైగా సబ్‌స్క్రైబర్స్ కలిగిన నెట్ ఫ్లిక్స్ ఓ తెలుగు దర్శకుడి మీద డాక్యుమెంటరీ విడుదల చేయడం ఇదే తొలిసారి.

దాదాపు గంటా 54 నిమిషాల నిడివితో ప్రముఖ వ్యాఖ్యాత అనుపమా చోప్రా నిర్మించిన డాక్యుమెంటరీ 'మోడ్రన్ మాస్టర్స్: ఎస్.ఎస్. రాజమౌళి'. రాఘవ్ కన్నా, తన్వి దర్శకులు. 'నేను నా కథకు బానిసను. నా ఆడియన్స్ విషయంలో అత్యాశపరుణ్ణి. నా కథను చూడ్డానికి ఎక్కువమంది ఆడియన్స్ కావాలి'... ఇలా తన అభిలాషను ఈ డాక్యుమెంటరీలో వెలిబుచ్చారు రాజమౌళి. తెలుగు చిత్రపరిశ్రమలో దర్శకుడు రాజమౌళి ఓ సంచలనం. 'స్టూడెంట్ నెం.1' చిత్రం నుండి 'ఆర్ఆర్ఆర్' సినిమా వరకు దర్శకుడిగా రాజమౌళి ప్రయాణంతో పాటు ప్రముఖుల విశ్లేషణలతో ఉంటుందీ డాక్యుమెంటరీ. ప్రభాస్, ఎన్టీఆర్, రామ్‌చరణ్, రానా, కీరవాణిలు రాజమౌళితో తమ అనుబంధాన్ని ఈ డాక్యుమెంటరీలో పంచుకున్నారు. ''రాజమౌళికి కావాలనుకున్నట్టుగా మనం ఇమిడిపోతే ఆయనే మనలను తనకు తగ్గట్టుగా మలుచుకుంటాడు'' అని చెప్పారు ఎన్టీఆర్. ''రాజమౌళికి సినిమా అంటే పిచ్చి. సీన్ ఎవరైనా వివరిస్తారు. కాని ఆ సీన్‌లో ముందు ఆయన నటించి తరువాత మనతో చేయిస్తాడు. అందుకే రాజమౌళితో చేయడం అదృష్టంగా భావిస్తున్నాను'' అని ప్రభాస్ తెలిపారు. వీరితో పాటు రాజమౌళి కుటుంబ సభ్యులు ఆయనతో తమ అనుభవాలు పంచుకున్నారు. తన సినిమాలలో హీరోలు ఆయుధాలని, దర్శకుడు ఆయుధాలను వదిలే సాధనం అని రాజమౌళి చెబుతూ... ''తనకు రాముడు కన్నా రావణుడు ఇష్టమని, అందుకే తన చిత్రాలలో ప్రతినాయకుడు ప్రత్యేకంగా కనిపించేలా చూసుకుంటాను'' అని వివరించారు. చిన్న పిల్లాడు అడుగులు వేసేటప్పుడు తడబడతాడు. అప్పుడు తల్లిదండ్రులు ప్రోత్సహించి మరో రెండు అడుగులు వేయిస్తే కొన్ని రోజులయ్యాక పరిగెడతాడు. ఆ కోవలోనే విజయం కోసం కృషి, పట్టుదల, ప్రోత్సాహంతో ఎంతో సాధన చేయాలి. ఈ విషయాన్ని డాక్యుమెంటరీలో లోతుగా వివరించారు రాజమౌళి. డాక్యుమెంటరీ మొత్తంలో చిన్న లోపం ఏంటంటే తెలుగులో దీనికి డబ్బింగ్ వేరొకరితో చెప్పించడం. అందుకే ఇంగ్లీషులో చూడడం శ్రేయస్కరం.

- ఇంటూరు హరికృష్ణ




నేడు భారత క్రీడాకారుల షెడ్యూల్

రెజ్లింగ్
మహిళల ఫ్రీస్టయిల్ 53 కేజీలు: అంతిమ్ పంఘాల్ X జైనెప్ యెట్గిల్ (మధ్యాహ్నం గం. 3.05 నుంచి)

వెయిట్‌లిఫ్టింగ్
మహిళల 49 కేజీల (పతక పోరు): మీరాబాయి చాను (రాత్రి గం. 11:00 నుంచి)

అథ్లెటిక్స్
మిక్స్‌డ్ మారథాన్ వాక్: ప్రియాంక గోస్వామి, సూరజ్ పన్వర్ (ఉదయం గం. 11:00 నుంచి). పురుషుల హైజంప్ (క్వాలిఫికేషన్): సర్వేశ్ (మధ్యాహ్నం గం. 1:35 నుంచి). మహిళల జావెలిన్ త్రో (క్వాలిఫికేషన్): అన్ను రాణి (మధ్యాహ్నం గం. 1:55 నుంచి). మహిళల 100 మీటర్ల హర్డిల్స్: జ్యోతి యర్రాజీ (హీట్-4) (మధ్యాహ్నం గం. 2:09 నుంచి). పురుషుల ట్రిపుల్ జంప్ (క్వాలిఫికేషన్): ప్రవీణ్ చిత్రావెల్, అబ్దుల్లా అబూబాకర్ (రాత్రి గం.10:45 నుంచి). పురుషుల 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్ (అవినాశ్ సాబ్లే; అర్ధరాత్రి గం. 1:13 నుంచి)



విజయీ 'వినేశ్' తిరంగా ప్యారా!

స్వర్ణ పతక పోరుకు భారత మహిళా స్టార్ రెజ్లర్

- వరుసగా మూడు బౌట్‌లలో గెలుపు
- తొలి రౌండ్‌లో ఒలింపిక్, ప్రపంచ చాంపియన్‌పై సంచలన విజయం
- నేడు అమెరికా రెజ్లర్ సారా హిల్డెబ్రాంట్‌తో ఫైనల్
- విజయం సాధిస్తే ఒలింపిక్స్ క్రీడల్లో పసిడి పతకం గెలిచిన తొలి భారతీయ క్రీడాకారిణిగా వినేశ్ ఘనత

పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు నాలుగో పతకం ఖరారైంది. మహిళల ఫ్రీస్టయిల్ రెజ్లింగ్ 50 కేజీల విభాగంలో భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. భారత్ ఖాతాలో చేరేది స్వర్ణమా, రజతమా అనేది నేడు రాత్రి తేలనుంది. ఈరోజు రాత్రి 11 తర్వాత అమెరికా రెజ్లర్ సారా హిల్డెబ్రాంట్‌తో జరిగే ఫైనల్లో వినేశ్ విజయం సాధిస్తే ఒలింపిక్స్ క్రీడల చరిత్రలో స్వర్ణ పతకం సాధించిన తొలి భారతీయ క్రీడాకారిణిగా చరిత్ర సృష్టిస్తుంది. ఒకవేళ ఓడిపోయినా రజత పతకం నెగ్గిన తొలి భారతీయ మహిళా రెజ్లర్‌గా ఆమె గుర్తింపు పొందుతుంది.



పారిస్: విశ్వ క్రీడల్లో తమ 'పట్టు'ను నిలబెట్టుకుంటూ వరుసగా ఐదో ఒలింపిక్స్‌లో రెజ్లింగ్ క్రీడాంశంలో భారత్‌కు పతకం ఖరారైంది. మహిళల ఫ్రీస్టయిల్ 50 కేజీల విభాగంలో వినేశ్ ఫొగాట్ ఫైనల్లోకి ప్రవేశించింది. మంగళవారం జరిగిన 50 కేజీల ఈవెంట్‌లో వినేశ్ వరుసగా మూడు బౌట్‌లలో విజయం సాధించి స్వర్ణ-రజత పోరుకు అర్హత సాధించింది. సెమీఫైనల్లో వినేశ్ 5-0తో పాన్ అమెరికన్ గేమ్స్ చాంపియన్ యుస్నెలిస్ గుజ్మాన్ లోపెజ్‌పై గెలిచింది. మూడు నిమిషాల నిడివి గల తొలి భాగం ముగిసేసరికి వినేశ్ 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. మూడు నిమిషాల నిడివి గల రెండో భాగంలోనూ వినేశ్ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. తన అనుభవాన్నంతా రంగరించి పోరాడిన వినేశ్ ఈ భాగంలో నాలుగు పాయింట్లు స్కోరు చేసింది. వినేశ్ డిఫెన్స్‌ను ఛేదించలేక క్యూబా రెజ్లర్ ఒక్క పాయింట్ కూడా సాధించలేకపోయింది.

యూరోపియన్ మాజీ విజేతను ఓడించి...



క్వార్టర్ ఫైనల్లో వినేశ్ 7-5 పాయింట్ల తేడాతో 2018 ప్రపంచ చాంపియన్‌షిప్ రజత పతక విజేత, 2019 యూరోపియన్ చాంపియన్ ఒక్సానా లివాచ్ (ఉక్రెయిన్)ను ఓడించింది. ఆద్యంతం హోరాహోరీగా సాగిన ఈ బౌట్‌లో వినేశ్ ఆరంభంలోనే 2-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత ఉక్రెయిన్ రెజ్లర్ కోలుకొని స్కోరును సమం చేసింది. అయితే చివర్లో వినేశ్ దూకుడుగా వ్యవహరించి రెండు పాయింట్లు గెలిచి విజయాన్ని ఖాయం చేసుకుంది.

ప్రపంచ, ఒలింపిక్ చాంపియన్‌ను మట్టికరిపించి...



అంతకుముందు తొలి రౌండ్‌లో వినేశ్ పెను సంచలనం సృష్టించింది. 50 కేజీల విభాగంలో ప్రస్తుత ఒలింపిక్ చాంపియన్, మూడుసార్లు ప్రపంచ చాంపియన్ సుసాకి యుయి (జపాన్)పై 3-2తో గెలిచి రెజ్లింగ్ ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. 25 ఏళ్ల సుసాకి ఈ బౌట్‌కు ముందు తన అంతర్జాతీయ కెరీర్‌లో ఒక్క పరాజయం కూడా చవిచూడలేదు. తాను పోటీపడిన 82 బౌట్‌లలోనూ సుసాకి విజేతగా నిలిచింది. టోక్యో ఒలింపిక్స్‌లో సుసాకి తన ప్రత్యర్థులకు ఒక్క పాయింట్ కూడా ఇవ్వకుండా విజేతగా నిలిచి స్వర్ణ పతకాన్ని సాధించింది. వినేశ్‌తో పోరులో సుసాకి ఫేవరెట్ అని అందరూ భావించారు. బౌట్ కూడా అలాగే సాగింది. ఐదు నిమిషాల 49 సెకన్లు ముగిసే వరకు సుసాకి 2-0తో ఆధిక్యంలో నిలిచి విజయం అంచుల్లో నిలిచింది. ఈ దశలోనే వినేశ్ అద్భుతం చేసింది. అందివచ్చిన అవకాశాన్ని వదలకుండా ఒక్కసారిగా సుసాకిని కిందపడేసి మూడు పాయింట్లు సాధించి అనూహ్య విజయాన్ని అందుకుంది.

సాక్షి తర్వాత వినేశ్...

2008 బీజింగ్ ఒలింపిక్స్ నుంచి భారత్‌కు పతకాలు లభిస్తున్నాయి. 2008 బీజింగ్‌లో సుశీల్ కుమార్ (66 కేజీలు) కాంస్యం గెలిచాడు. 2012 లండన్‌లో సుశీల్ కుమార్ (66 కేజీలు) రజత పతకం నెగ్గగా... యోగేశ్వర్ దత్ (60 కేజీలు) కాంస్య పతకం సాధించాడు. 2016 రియో ఒలింపిక్స్‌లో మహిళా రెజ్లర్ సాక్షి మలిక్ (58 కేజీలు) కాంస్య పతకం సొంతం చేసుకుంది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో బజరంగ్ (65 కేజీలు) కాంస్యం... రవి కుమార్ (57 కేజీలు) రజతం గెల్చుకున్నారు. సాక్షి మలిక్ తర్వాత ఒలింపిక్స్‌లో పతకం సాధించిన రెండో భారతీయ మహిళా రెజ్లర్‌గా వినేశ్ గుర్తింపు పొందనుంది.


డిఫెండింగ్ ఒలింపిక్, ప్రపంచ చాంపియన్ సుసాకిపై గెలిచిన వేళ...

'పట్టు' వీడని పోరాటం

అసాధారణం వినేశ్ ఫొగాట్ ఒలింపిక్ పతక ప్రస్థానం

'ఈ అమ్మాయిని పోలీసు దెబ్బలతో అణచివేశారు... ఈ అమ్మాయిని తన దేశంలోనే రోడ్లపై ఈడ్చుకెళ్లారు... కానీ ఇదే అమ్మాయి ఇప్పుడు ప్రపంచాన్ని గెలుస్తోంది... పోరాటంలో ఎక్కడా తగ్గని మా వినేశ్ సివంగిలాంటిది. ఆమె విజయాలు చూస్తుంటే ఆనందిస్తున్నామో, కన్నీళ్లు వస్తున్నాయో కూడా తెలియడం లేదు. ఆమె ఆడుతున్న తీరు చూస్తే వినేశ్ ఒక్కతే కాదు... దేశంలోని ప్రతీ మహిళ పోరాడుతున్నట్లుగా ఉంది'... భారత మాజీ రెజ్లర్, టోక్యో ఒలింపిక్స్ పతక విజేత బజరంగ్ పూనియా మంగళవారం వినేశ్ ఫొగాట్ గురించి భావోద్వేగంతో చేసిన వ్యాఖ్య ఇది.

నిజం... వినేశ్ సాధించిన ఘనత ఇప్పుడు ఒలింపిక్ పతకం మాత్రమే కాదు, అంతకుమించి దానికి విలువ ఉంది. ఆటలో కాకుండా మ్యాట్ బయట ఆమె ఎదుర్కొన్న అవమానం, బాధలు, కన్నీళ్లు ఈ పతకం వెనక ఉన్నాయి. ఏడాదిన్నర ముందు ఆమె ఈ పతకం గెలిచి ఉంటే ఒక ప్లేయర్‌గానే ఆమె గొప్పతనం కనిపించేది. కానీ ఇప్పుడు అన్ని ప్రతికూల పరిస్థితులను దాటి సాధించిన ఈ గెలుపు అసాధారణం.



ఢిల్లీ వీధుల్లో ఆమె జీవితంలో అతి పెద్ద సవాల్‌ను ఎదుర్కొంది. పోలీసు దెబ్బలు, అరెస్ట్, బహిరంగంగా అవమానాలు, చంపేస్తామనే బెదిరింపులు, అవార్డులను వెనక్కి ఇచ్చే పరిస్థితులు రావడం, గెలిచిన పతకాలన్నీ గంగా నదిలో పడేసేందుకు సిద్ధం కావడం... ఇలా ఇలా ఒకటేమిటి ఎన్నో రకాలుగా వినేశ్ వేదన అనుభవించింది. తమకు జరిగిన అన్యాయం గురించి ప్రశ్నించడం వల్లే, సహచర మహిళా రెజ్లర్లు ఎదుర్కొన్న లైంగిక వేధింపులకు కారణమైన వ్యక్తిపై చర్య తీసుకోమని కోరడం వల్లే ఇదంతా జరిగింది. ఈ మొత్తం వ్యవహారంలో వినేశ్ తన కెరీర్‌ను పణంగా పెట్టింది. రిటైర్మెంట్‌కు చేరువైంది కాబట్టే ఇలా చేస్తోందంటూ వినిపించిన వ్యాఖ్యానాలను ఆ తర్వాత బలంగా తిప్పి కొట్టింది. మళ్లీ రెజ్లింగ్‌పై దృష్టి పెట్టింది. తీవ్ర గాయం నుంచి కోలుకొని మరీ పోరాడింది. ఆరు నెలల ముగిసేలోపు తానేంటో నిరూపించుకుంటూ పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. వరుసగా మూడు ఒలింపిక్స్ ఆడిన భారత రెజ్లర్‌గా బరిలోకి దిగి మూడో ప్రయత్నంలో తన అద్భుత కెరీర్‌లో లోటుగా ఉన్న ఒలింపిక్ పతకాన్ని సాధించి సగర్వంగా నిలిచింది. కెరీర్‌లో ఎన్నోసార్లు గాయాలతో సహవాసం చేసి కోలుకోగానే మళ్లీ మ్యాట్‌పై సంచలనాలు సృష్టించిన వినేశ్‌పై ఢిల్లీ ఉదంతం తీవ్ర ప్రభావం చూపించింది. శరీరానికి తగిలిన గాయాలకంటే మనసుకు తగిలిన ఈ గాయం బాధ చాలా పెద్దది అంటూ కన్నీళ్ల పర్యంతమైంది. బ్రిజ్‌భూషణ్ శరణ్‌పై పోరాటం తర్వాత మళ్లీ ఆటలోకి అడుగు పెట్టే క్రమంలో కూడా అడ్డంకులు ఎదురయ్యాయి. సెలక్షన్ ట్రయల్స్‌కు హాజరు కాకుండా సీనియార్టీ ద్వారా అడ్డదారిలో వెళ్లేందుకు ప్రయత్నిస్తోందంటూ మళ్లీ విమర్శలు. ఈ మనో వేదన వెంటాడినా వినేశ్ బేలగా మారిపోలేదు. మళ్లీ పట్టుదలతో నిలబడింది. కెరీర్ ఆరంభం నుంచి 53 కేజీల కేటగిరీలోనే పోటీ పడిన ఆమె తప్పనిసరి పరిస్థితుల్లో 50 కేజీలకు మారాల్సి వచ్చింది. రెజ్లింగ్‌లో ఇలా కేటగిరీ మారడం... అందులోనూ తక్కువ బరువుకు మారి రాణించడం అంత సులువు కాదు. కానీ ఎక్కడైనా నెగ్గగలననే పట్టుదల తనను నడిపించగా ఈ సవాల్‌ను వినేశ్ అధిగమించింది.



2016 రియోలో తొలిసారి ఒలింపిక్స్ బరిలోకి దిగిన వినేశ్ క్వార్టర్ ఫైనల్ వరకు చేరినా... చైనా రెజ్లర్‌తో బౌట్‌లో ఎడమకాలు విరిగి కన్నీళ్లపర్యంతమై నిష్క్రమించింది. స్ట్రెచర్‌పై ఆమెను బయటకు తీసుకుపోవాల్సి వచ్చింది. 2020 టోక్యో ఒలింపిక్స్ సమయంలో అద్భుత ఫామ్‌తో అడుగు పెట్టినా క్వార్టర్ ఫైనల్లోనే ఓటమి ఎదురైంది. దీనికి తోడు టీమ్ యూనిఫామ్ ధరించలేదని, గేమ్స్ విలేజ్ బయట ఉందని, భారత సహచరులతో కలిసి సాధన చేయలేదని క్రమశిక్షణా చర్యలు తీసుకుంటూ ఫెడరేషన్ ఆమెపై సస్పెన్షన్ విధించింది. కొన్నాళ్లకు దానిని ఎత్తివేయడంతో మళ్లీ ఆటలోకి అడుగు పెట్టినా... గత ఏడాది యాంటీరియర్ క్రూషియేట్ లిగమెంట్ (ఏసీఎల్) గాయంతో దెబ్బ పడింది. ఆపై మళ్లీ శస్త్రచికిత్స, రీహాబిలిటేషన్. మళ్లీ కోలుకొని మ్యాట్‌పై అడుగు పెట్టిన వినేశ్ ఒలింపిక్ పతకం సాధించే వరకు విశ్రమించలేదు. కొన్నాళ్ల క్రితం తన ఇన్‌స్టాగామ్ ప్రొఫైల్‌లో ఒక స్ఫూర్తిదాయక వాక్యం రాసుకుంది. 'ఖుదీ కో కర్ బులంద్ ఇత్‌నా కే హర్ తఖ్దీర్ సే పహ్‌లే ఖుదా బందేసే ఖుద్ పూఛే బతా తేరీ రజా క్యా హై' (నిన్ను నువ్వు ఎంత బలంగా మార్చుకో అంటే అదృష్టం అవసరం పడే ప్రతీ సందర్భంలో నీకు ఏం కావాలని దేవుడే స్వయంగా అడగాలి). దీనికి తగినట్లుగా ఇప్పుడు వినేశ్ తన రాతను తానే మార్చుకొని రెజ్లింగ్‌లో కొత్త చరిత్ర సృష్టించింది. - సాక్షి క్రీడా విభాగం

వచ్చాడు... విసిరాడు... ఫైనల్ చేరాడు


నీరజ్ చోప్రా

- జావెలిన్ త్రోలో పతక పోరుకు నీరజ్ చోప్రా
- తొలి ప్రయత్నంలోనే 89.34 మీటర్లు దూసుకెళ్లిన నీరజ్ జావెలిన్
- క్వాలిఫయింగ్‌లో 'టాప్'లో నిలిచిన భారత స్టార్
- 12 మంది మధ్య రేపు ఫైనల్

అనూహ్యమేమీ కాదు...అలవాటు లేనిదేమీ కాదు... అడుగు పెడితే చాలు జావెలిన్‌తో అద్భుతంగా ఆడుకునే భారత స్టార్ నీరజ్ చోప్రా ఒలింపిక్ వేదికపై మళ్లీ తన బంగారు వేటను మొదలు పెట్టాడు. అసలు పోరుకు ముందు అర్హత సమరంలో తనదైన శైలిలో అదరగొట్టాడు. క్వాలిఫయింగ్ పోరులో ఒకే ఒక్క త్రో విసిరి అలా అలవోకగా ముందంజ వేశాడు... మరో మాటకు తావు లేకుండా అగ్ర స్థానంతో దర్జాగా ఫైనల్లోకి అడుగు పెట్టి ఒక లాంఛనం ముగించాడు... ఎక్కడా తడబాటు లేదు, కాస్త ఉత్కంఠ పెంచినట్లుగా కూడా కనిపించలేదు. రోజూ చేసే పని ఇదేగా అన్నట్లుగా క్షణాల వ్యవధిలో త్రో పూర్తి చేసి వెనక్కి తిరిగి చూడకుండా నడుచుకుంటూ వెళ్లిపోయాడు... ఇదే తరహా ప్రదర్శనను రేపు జరిగే ఫైనల్లోనూ చూపిస్తే మన బంగారు బాలుడి ఒడిలో వరుసగా రెండో ఒలింపిక్స్‌లో మరో పసిడి పతకం పరుగెత్తుకుంటూ వచ్చి వాలడం ఖాయం!

పారిస్: కోట్లాది భారత అభిమానుల పసిడి ఆశలను మోస్తూ బరిలోకి దిగిన జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ఫైనల్స్‌కు అర్హత సాధించాడు. టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణంతో సత్తా చాటిన నీరజ్ ఈసారి కూడా అదే జోరును కొనసాగించే లక్ష్యంతో మైదానంలోకి అడుగు పెట్టాడు. మంగళవారం జరిగిన క్వాలిఫయింగ్ ఈవెంట్ గ్రూప్ 'బి'లో నీరజ్ తన జావెలిన్‌ను 89.34 మీటర్ల దూరం విసిరి క్వాలిఫై అయ్యాడు. ఫైనల్ చేరేందుకు అర్హత మార్కు 84 మీటర్లు కాగా... తన తొలి ప్రయత్నంలోనే అంతకంటే ఎక్కువ దూరం బల్లెం విసరడంతో నీరజ్‌కు మళ్లీ త్రో చేయాల్సిన అవసరమే రాలేదు. గ్రూప్ 'ఎ', గ్రూప్ 'బి' రెండూ కలిపి నీరజ్‌దే అత్యుత్తమ ప్రదర్శన. వ్యక్తిగతంగా కూడా ఈ దూరం నీరజ్ కెరీర్‌లో రెండో స్థానంలో నిలుస్తుంది. 2022లో అతను జావెలిన్‌ను 89.94 మీటర్లు విసిరాడు. ప్రస్తుత ప్రపంచ చాంపియన్ కూడా అయిన నీరజ్‌తో హోరాహోరీగా తలపడేందుకు సిద్ధమైన అండర్సన్ పీటర్స్ (గ్రెనడా), జూలియన్ వెబర్ (జర్మనీ) జావెలిన్‌ను 88.63 మీటర్లు , 87.76 మీటర్లు వరుసగా రెండు, మూడు స్థానాలతో ముందంజ వేశారు. పాకిస్తాన్‌కు చెందిన అర్షద్ నదీమ్ (86.59 మీటర్లు) కూడా ఫైనల్స్‌కు క్వాలిఫై అయ్యాడు. 84 మీటర్లు విసిరిన లేదా రెండు గ్రూప్‌లలో కలిపి 12 మంది అత్యుత్తమ స్కోరర్లు ఫైనల్స్‌కు అర్హత సాధిస్తారు. క్వాలిఫయింగ్‌లో 9 మంది 84 మీటర్ల మార్క్‌ను అందుకొని ముందంజ వేయగా, మరో ముగ్గురికి మాత్రం టాప్-12లో రావడంతో అవకాశం లభించింది. పోటీలో నిలిచిన మరో భారత జావెలిన్ త్రోయర్ కిషోర్ జెనా తీవ్రంగా నిరాశపరిచాడు. జావెలిన్‌ను 80.73 మీటర్లు మాత్రమే విసిరిన అతను గ్రూప్ 'ఎ'లో తొమ్మిదో స్థానానికే పరిమితం కావడంతో ఫైనల్ అవకాశం చేజారింది. గత ఏడాది ఆసియా క్రీడల్లో జావెలిన్‌ను 87.54 మీటర్ల దూరం విసిరి పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన కిషోర్... అసలు సమయంలో కనీస ప్రదర్శన కూడా ఇవ్వలేకపోయాడు. మరోవైపు మహిళల 400 మీటర్ల పరుగులో భారత అథ్లెట్ కిరణ్ పహాల్ నిరాశపర్చింది. ఈ ఈవెంట్‌లో ఆమె సెమీఫైనల్ చేరడంలో విఫలమైంది. ఆరుగురు పాల్గొన్న రెపిచాజ్ హీట్-1లో మొదటి స్థానంలో నిలిస్తేనే సెమీస్ చేరే అవకాశం ఉండగా... 52.59 సెకన్లలో పరుగు పూర్తి చేసిన కిరణ్ ఆరో స్థానంతో ముగించింది.

> ఎప్పుడైనా తొలి ప్రయత్నమే మెరుగ్గా ఉండాలని భావిస్తా. ప్రతీసారి అది సాధ్యం కాకపోవచ్చు. అలా జరిగింది కూడా. నేను ఇప్పుడు పూర్తి ఫిట్‌గా ఉన్నా. ఎలాంటి ఇబ్బంది లేదు. ఫైనల్లో అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చేందుకు ప్రయత్నిస్తా. అయితే క్వాలిఫయింగ్‌కంటే ఫైనల్లో పరిస్థితి భిన్నంగా ఉంటుంది. కాబట్టి సన్నద్ధత కూడా చాలా బాగుండాలి. నేను చాలా ఆత్మవిశ్వాసంతో ఉన్నా. ఫైనల్ సాయంత్రం జరుగుతుంది కాబట్టి వాతావరణం కాస్త చల్లగా ఉండవచ్చు. అయితే దానికి అనుగుణంగానే సిద్ధమవుతా. ఫైనల్ చేరిన వారంతా బలమైన ప్రత్యర్థులే కాబట్టి ఎవరితోనూ ప్రత్యేకంగా పోటీ ఉండదు. -నీరజ్ చోప్రా

పతకాల పట్టిక



ర్యాంక్	దేశం	స్వ	ర	కాం	మొ
1	అమెరికా	22	30	29	81
2	చైనా	22	20	15	57
3	ఆస్ట్రేలియా	14	12	9	35
4	ఫ్రాన్స్	13	16	19	48
5	బ్రిటన్	12	15	18	45
6	దక్షిణ కొరియా	11	8	7	26
7	జపాన్	11	6	11	28
8	ఇటలీ	9	10	6	25
9	నెదర్లాండ్స్	8	5	6	19
10	జర్మనీ	8	5	4	17
11	కెనడా	5	4	8	17
60	భారత్	0	0	3	3

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం. స్వర్ణాల సంఖ్య ఆధారంగా ర్యాంక్ వరుస క్రమాన్ని నిర్ణయిస్తారు.


హర్మన్‌ప్రీత్

సెమీస్‌లో భారత హాకీ జట్టు ఓటమి

- టీమిండియాపై 3-2తో నెగ్గి ఫైనల్ చేరిన జర్మనీ
- రేపు కాంస్యం కోసం స్పెయిన్‌తో భారత్ పోరు

పారిస్: నాలుగు దశాబ్దాల తర్వాత వరుసగా రెండోసారి ఒలింపిక్స్ సెమీఫైనల్‌కు చేరిన భారత పురుషుల జట్టు.. తుదిపోరుకు అర్హత సాధించడంలో మరోసారి విఫలమైంది. మంగళవారం హోరాహోరీగా సాగిన రెండో సెమీఫైనల్లో ఆరంభం నుంచి ఆధిక్యంలో ఉండి.. టీమిండియా 2-3 గోల్స్‌తో జర్మనీ చేతిలో పరాజయం పాలైంది. భారత్ తరఫున హర్మన్‌ప్రీత్ సింగ్ (7వ నిమిషంలో), సుఖ్‌జీత్ సింగ్ (36వ నిమిషంలో) చెరో గోల్ చేశారు. జర్మనీ తరఫున పైలాట్ గోంజాలో (18వ నిమిషంలో), రుహెర్ క్రిస్టోఫర్ (27వ నిమిషంలో), మిల్కావు మార్కో (54వ నిమిషంలో) తలా ఒక గోల్ సాధించారు. ఆధిక్యం చేతులు మారుతూ సాగిన పోరులో ఆట మరో ఆరు నిమిషాల్లో ముగుస్తుందనగా.. జర్మనీ అనూహ్య గోల్‌తో ముందంజ వేయగా.. చివర్లో గోల్‌కీపర్‌ను తప్పించి అదనపు అటాకర్‌తో ప్రయత్నించినా భారత్ స్కోరు సమం చేయలేకపోయింది. టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక పోరులో జర్మనీపై విజయంతోనే మెడల్ దక్కించుకున్న టీమిండియా... ఈసారి మాత్రం అలాంటి ప్రదర్శన కనబర్చలేకపోయింది. మరో సెమీఫైనల్లో నెదర్లాండ్స్ 4-0తో స్పెయిన్‌పై విజయం సాధించి ఫైనల్‌కు చేరింది.

సాక్షి బిజినెస్

బుధవారం
7-8-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
166	63
78,593	23,993

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	16,562	△	362
డోజోన్స్	39,264	△	594
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,027	△	18
డాక్స్	17,354	△	15
షాంఘై	2,867	△	7
నికాయ్	34,675	△	3,217

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)		
69,117	▽	65
బంగారం (99.5 స్వచ్ఛత)		
68,840	▽	65
వెండి (కిలో)		
78,950	△	208

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.46	84.48
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	106.06	108.63
€	యూరో	ఎస్‌బీఐ	90.79	93.17
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	56.94	58.24
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.76	55.68
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	61.01	65.70
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.49	23.05
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.97	23.75
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.86	12.68

ఎస్‌బీఐ చైర్మన్‌గా శెట్టి నియామకానికి ఆమోదం



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) కొత్త చైర్మన్‌గా చల్లా శ్రీనివాసులు శెట్టి (సీఎస్ శెట్టి) నియామకానికి కేంద్రం మంగళవారం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించి ఆర్థిక సేవల విభాగం పంపిన ప్రతిపాదనకు నియామకాల క్యాబినెట్ కమిటీ (ఏసీసీ) ఆమోదముద్ర వేసినట్లు అధికారిక ప్రకటనలో వెల్లడైంది. ఆగస్టు 28న ప్రస్తుత చైర్మన్ దినేశ్ కుమార్ ఖారా పదవీ విరమణ అనంతరం ఆయన స్థానంలో శెట్టి బాధ్యతలు స్వీకరిస్తారు. ఆయన పదవీకాలం మూడేళ్లు ఉంటుంది. తెలంగాణలోని జోగులాంబ గద్వాల్ జిల్లాకు చెందిన శెట్టి ప్రస్తుతం ఎస్‌బీఐ మేనేజింగ్ డైరెక్టర్లలో అత్యంత సీనియర్‌గా ఉన్నారు. బీఎస్సీ చేసిన ఆయన 1988లో ప్రొబేషనరీ ఆఫీసరుగా ఎస్‌బీఐలో కెరియర్ ప్రారంభించారు. మరోవైపు, ప్రస్తుతం డీఎండీగా ఉన్న రాణా అశుతోష్ కుమార్ సింగ్‌ను ఎస్‌బీఐ ఎండీగా కేంద్రం నియమించింది. ఎస్‌బీఐలో ఒక చైర్మన్, నలుగురు ఎండీలు ఉంటారు.

ఇల్లు అమ్మినా.. పన్ను సునామీ!



ఇల్లు విక్రయంపై దీర్ఘకాల మూలధన లాభాల పన్నును 12.5 శాతానికి తగ్గిస్తూ 2024–25 బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. కాకపోతే ఇండెక్సేషన్ (ద్రవ్యోల్బణ వ్యయం) ప్రయోజనాన్ని తొలగించారు. దీనివల్ల చెల్లించాల్సిన పన్ను భారం పెరిగిపోతుందని ఆందోళన చెందక్కర్లేదు. దీర్ఘకాల మూలధన లాభాలపై గతం నుంచి ఉన్న పన్ను మినహాయింపులను ప్రభుత్వం కొనసాగించింది.

– సాక్షి, బిజినెస్ డెస్క్

2024 జూలై 23లోపు ఇంటిని కొని మూడేళ్లు నిండిన తర్వాత విక్రయించగా వచ్చిన లాభాన్ని దీర్ఘకాల మూలధన లాభం (ఎల్‌టీసీజీ)గా, మూడేళ్లలోపు విక్రయిస్తే వచ్చిన లాభాన్ని స్వల్పకాల మూలధన లాభం (ఎస్‌టీసీజీ)గా పరిగణించేవారు. దీర్ఘకాల మూలధన లాభాల పన్ను నుంచి ద్రవ్యోల్బణ ప్రభావాన్ని (ఇండెక్సేషన్) తీసివేసి, మిగిలిన పన్నుపై 20 శాతం పన్ను చెల్లించాల్సి వచ్చేది.

2024 జూన్ 23 నుంచి.. రెండేళ్లు నిండిన తర్వాత విక్రయిస్తే ఎల్‌టీసీజీగా పరిగణిస్తున్నారు. ఆలోపు విక్రయిస్తే ఎస్‌టీసీజీ కిందకు వస్తుంది. రెండేళ్ల తర్వాత విక్రయించగా వచ్చిన లాభంపై ఇక మీదట 20 శాతానికి బదులు 12.5 శాతం పన్ను చెల్లించాలి. ఇండెక్సేషన్ ప్రయోజనం ఉండదు. రెండేళ్లలోపు విక్రయిస్తే వచ్చిన లాభాన్ని తమ ఆదాయానికి కలిపి చూపించి పన్ను చెల్లించాలి.

మూలధన లాభాల పన్నులో మార్పులు



సెక్షన్ 54ఈసీ

దీర్ఘకాల మూలధన లాభంపై పన్ను మినహాయింపు కోసం ఇల్లు కాకుండా సెక్షన్ 54ఈసీ కింద.. ఆర్ఈసీ, పీఎఫ్‌సీ, ఐఆర్ఎఫ్‌సీ బాండ్లలో గరిష్ఠంగా రూ.50 లక్షల వరకు ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఈ బాండ్లలో పెట్టుబడులకు ఐదేళ్ల లాకిన్ పీరియడ్ ఉంటుంది. ఇల్లు లేదా స్థలాన్ని విక్రయించిన వారు సైతం ఈ సెక్షన్ కింద పన్ను మినహాయింపు పొందొచ్చు.

సెక్షన్ 54



ఇంటి విక్రయంపై ఎల్‌టీసీజీ వద్దనుకుంటే సెక్షన్ 54లో చెప్పిన విధంగా.. మరో ఇంటిపై ఇన్వెస్ట్ చేయాలి. ఇందుకు మూడు షరతులు ఉన్నాయి. విక్రయించిన తేదీ నుంచి రెండేళ్ల లోపు మరో ఇంటిపై ఇన్వెస్ట్ చేయాలి. లేదా మూడేళ్లలోపు ఇంటి నిర్మాణంపై ఖర్చు చేయాలి. లేదా ఇంటిని విక్రయించడానికి ముందు ఏడాదిలోపు మరో ఇంటిని కొనుగోలు చేసి ఉండాలి. జీవితంలో ఒకరు ఒక్కసారే ఈ ప్రయోజనాన్ని వినియోగించుకోగలరు.

- దీర్ఘకాల మూలధన లాభం రూ.2 కోట్లు మించకపోతే.. ఆ మొత్తంతో రెండు ఇళ్లు కొనుగోలు చేసినా పన్ను మినహాయింపునకు అర్హులే. లాభం రూ.2 కోట్లకు మించి ఉంటే ఆ మొత్తంతో ఒకే ఇంటిని కొనుగోలు చేయాలి.
- ఈ సెక్షన్ కింద గరిష్ఠ పన్ను ప్రయోజనం రూ.10 కోట్లు.
- పన్ను మినహాయింపు కోసం కొనుగోలు చేసిన ఇంటిని మూడేళ్ల తర్వాతే విక్రయించాలి. ఆలోపు విక్రయిస్తే పన్ను మినహాయింపు కోల్పోవాల్సి వస్తుంది.
- నిబంధనల మేరకు మరో ఇంటిని కొనుగోలు చేసే వరకు లేదా ఇంటిని నిర్మించుకునే వరకు ఆ మొత్తాన్ని బ్యాంక్‌లో 'క్యాపిటల్ గెయిన్స్ అకౌంట్ స్కీమ్' (సీజీఏఎస్)లో డిపాజిట్ చేయాలి. ఇంటిని విక్రయించిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆదాయపన్ను రిటర్నులు దాఖలు చేసే లోపే ఈ డిపాజిట్ చేయాలి.

పన్ను ఊరట

న్యూఢిల్లీ: ఇళ్ల విక్రయంపై బడ్జెట్‌లో చేసిన దీర్ఘకాల మూల ధన పన్ను ప్రతిపాదనలపై పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తం కావడంతో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. 2024 జూన్ 23 (బడ్జెట్)కు ముందు ఇల్లు కొనుగోలు చేసిన వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు (హెచ్‌యూఎఫ్).. వాటిని విక్రయించినప్పుడు పాత విధానంలో ఇండెక్సేషన్ ప్రయోజనాన్ని వినియోగించుకుని 20% పన్ను చెల్లించొచ్చు. లేదా కొత్త విధానంలో ఇండెక్సేషన్ లేకుండా 12.5% పన్ను చెల్లించేలా ఫైనాన్స్ బిల్లు 2024లో సవరణలను ప్రభుత్వం తాజాగా ప్రతిపాదించింది. సంబంధిత కాపీలను లోక్‌సభ సభ్యులకు అందించింది.

సెక్షన్ 54ఎఫ్

ఇల్లు కాకుండా ఇతర క్యాపిటల్ అసెట్స్ (షేర్లు, మ్యూచువల్ ఫండ్స్ సహా) విక్రయించినప్పుడు వచ్చిన దీర్ఘకాల మూలధన లాభంపై పన్ను మినహాయింపు ఎలా అన్నది సెక్షన్ 54 ఎఫ్ వివరిస్తోంది. షేర్లు, మ్యూచువల్ ఫండ్స్ తదితర క్యాపిటల్ అసెట్స్‌ను విక్రయించగా వచ్చిన మూలధన లాభంతో రెండేళ్లలోపు ఇంటిని కొనుగోలు చేయాలి. లేదా మూడేళ్లలో ఇంటి నిర్మాణంపై వ్యయం చేయాలి. లేదా విక్రయించడానికి ముందు ఏడాదిలోపు ఇంటిని కొనుగోలు చేసి ఉండాలి. ఇక్కడ కూడా గరిష్ఠ పన్ను మినహాయింపు రూ.10 కోట్లకే పరిమితం. అలాగే, క్యాపిటల్ అసెట్స్ విక్రయించగా వచ్చిన మొత్తాన్ని ఇంటిపై వెచ్చించేంత వరకు క్యాపిటల్ గెయిన్స్ అకౌంట్ స్కీమ్‌లో ఇన్వెస్ట్ చేయాలి.

రెండు రకాల ప్రయోజనాలు



ఈ సెక్షన్ల కింద ఒకటికి మించిన ప్రయోజనానికి అర్హులే. ఉదాహరణకు ఇంటిపై దీర్ఘకాల మూలధన లాభం రూ.10.5 కోట్లు వచ్చిందని అనుకుందాం. అప్పుడు రూ.10 కోట్లతో మరో ఇంటిని కొనుగోలు చేసి సెక్షన్ 54 కింద పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకున్న తర్వాత మరో రూ.50 లక్షలు మిగిలి ఉంటాయి. అప్పుడు సెక్షన్ 54ఈసీ కింద ఆర్ఈసీ, పీఎఫ్‌సీ, ఐఆర్ఎఫ్‌సీ క్యాపిటల్ గెయిన్ బాండ్లలో రూ.50 లక్షలు ఇన్వెస్ట్ చేయడం ద్వారా పన్ను లేకుండా చూసుకోవచ్చు.

నిఫ్టీ 24,000 దిగువకు

- ఆరంభ లాభాలు ఆవిరి
- సూచీలకు మూడోరోజూ నష్టాలు



ముంబై: ఆసియా మార్కెట్ల రికవరీ, జపాన్ ఇండెక్స్ నికాయ్ బౌన్స్‌బ్యాక్‌తో ఉదయం ఉవ్వెత్తున ఎగసిన దేశీయ స్టాక్ సూచీలు ఆరంభ లాభాలు నిలుపుకోవడంలో విఫలమయ్యాయి. ఆర్‌బీఐ ద్రవ్య పాలసీ సమావేశ ప్రారంభం నేపథ్యంలోనూ ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. ఫలితంగా మంగళవారం సెన్సెక్స్ 166 పాయింట్లు కోల్పోయి 78,593 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 63 పాయింట్లు పతనమై 24000 స్థాయి దిగువన 23,993 వద్ద నిలిచింది. ప్రథమార్థంలో కనిష్ఠ స్థాయిల వద్ద కొనుగోళ్ల వద్ద లభించడంతో సూచీలు భారీ ర్యాలీ చేశాయి. ఎఫ్‌ఎంసీజీ, ఐటీ, మెటల్ షేర్లు రాణించడంతో ఒక దశలో సెన్సెక్స్ 1093 పాయింట్లు పెరిగి 79,852 వద్ద, నిఫ్టీ 327 పాయింట్లు బలపడి 24,383 వద్ద ఇంట్రాడే గరిష్టాలు తాకాయి. అయితే మిడ్‌సెషన్ నుంచి బ్యాంకులు, టెలికం, ఇంధన, ఫైనాన్స్ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో ఆరంభ లాభాలన్నీ ఆవిరయ్యాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి. సూచీలు 3 రోజుల్లో 4% పతనం కావడంతో ఇన్వెస్టర్లకు రూ.22.01 లక్షల కోట్ల నష్టం వాటిల్లింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలోని లిస్టెడ్ కంపెనీల మొత్తం విలువ రూ.439.59 లక్షల కోట్లకు తగ్గింది.

మార్కెట్ అస్థిరతలోనూ అకుమ్స్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ లిస్టింగ్ విజయవంతమైంది. బీఎస్ఈలో ఇష్యూ ధర (రూ.679) పోలిస్తే 7% ప్రీమియంతో రూ.725 వద్ద లిస్టయ్యింది. కొనుగోళ్ల మద్దతుతో 17% పెరిగి ఇంట్రాడే గరిష్టం రూ.797 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.12,534 కోట్లుగా నమోదైంది.



జీవితకాల కనిష్టం నుంచి రూపాయి రికవరీ అయ్యింది. డాలర్ మారకంలో మంగళవారం 17 పైసలు బలపడి 83.92 వద్ద స్థిరపడింది. ఆర్‌బీఐ జోక్యంతో రూపాయి విలువ కనిష్టాల నుంచి కోలుకున్నట్లు ఫారెక్స్ నిపుణులు భావిస్తున్నారు.

ఐదేళ్లలో రద్దు చేసిన రుణాలు రూ. 9.9 లక్షల కోట్లు

కేంద్ర మంత్రి పంకజ్ చౌదరి వెల్లడి



న్యూఢిల్లీ: గడిచిన ఐదు ఆర్థిక సంవత్సరాల్లో బ్యాంకులు రూ. 9.90 లక్షల కోట్ల రుణాలను రైటాఫ్ చేసినట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి మంగళవారం రాజ్యసభకు తెలిపారు. 2019–20లో అత్యధికంగా రూ. 2.34 లక్షల కోట్లు రైటాఫ్ చేయగా ఆ తర్వాత సంవత్సరంలో ఇది రూ. 2.02 లక్షల కోట్లకు, 2021–22లో రూ. 1.74 లక్షల కోట్లకు తగ్గింది. తర్వాత సంవత్సరంలో ఇది తిరిగి రూ. 2.08 లక్షల కోట్లకు పెరగ్గా, గత ఆర్థిక సంవత్సరం రూ. 1.70 లక్షల కోట్లకు పరిమితమైంది. రైటాఫ్ చేసినంత మాత్రాన బాకీలను పూర్తిగా రద్దు చేసి రుణగ్రహీతలకు మేలు చేసినట్లు కాదని, వారు వాటిని చెల్లించాల్సి ఉంటుందని మంత్రి వివరించారు. బ్యాలెన్స్ షీట్‌ను మెరుగుపర్చుకునేందుకు, పన్ను ప్రయోజనాలు పొందేందుకు, మూలధనాన్ని మెరుగ్గా ఉపయోగించుకునేందుకు నిర్దిష్ట నిబంధనలకు లోబడి బ్యాంకులు మొండి బాకీలను రైటాఫ్ చేస్తుంటాయని పేర్కొన్నారు. ఆ మొత్తాన్ని రాబట్టేందుకు బ్యాంకుల చర్యలు కొనసాగుతాయని తెలిపారు. గత అయిదేళ్లలో రూ. 1.84 లక్షల కోట్లు రికవర్ అయినట్లు మంత్రి చెప్పారు.

వేదాంతా లాభం జూమ్



న్యూఢిల్లీ: ఈ ఆర్థిక సంవత్సరం(2024–25) తొలి త్రైమాసికంలో ప్రయివేట్ రంగ మైనింగ్ దిగ్గజం వేదాంతా లిమిటెడ్ ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. ఏప్రిల్–జూన్(క్యూ1)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 37% జంప్‌చేసి రూ. 3,606 కోట్లను తాకింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 2,640 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 34,279 కోట్ల నుంచి రూ. 36,698 కోట్లకు ఎగసింది. వివిధ బిజినెస్‌లను ఆరు లిస్టెడ్ కంపెనీలుగా విడదీసే ప్రతిపాదనలు అనుకున్న విధంగానే కొనసాగుతున్నట్లు తెలియజేసింది. వేదాంతా షేరు స్వల్ప లాభంతో రూ. 414 వద్ద ముగిసింది.

బేసిక్ ఖాతాల్లో మినిమం బ్యాలెన్స్ అక్కర్లేదు: సీతారామన్



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి జన్ ధన్ ఖాతాలు, బేసిక్ పొదుపు ఖాతాల్లో కనీస బ్యాలెన్స్‌ను పాటించాల్సిన అవసరం లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ఇతరత్రా ఖాతాల్లో నిబంధనలకు అనుగుణంగా కస్టమర్లు నిర్దిష్ట బ్యాలెన్స్ ఉంచడంలో విఫలమైతేనే బ్యాంకులు పెనాల్టీ విధిస్తాయని పేర్కొన్నారు. ఖాతాదార్లు మినిమం బ్యాలెన్స్ పాటించనందుకు గాను ప్రభుత్వ రంగ బ్యాంకులు గత అయిదేళ్లలో రూ. 8,500 కోట్ల మొత్తాన్ని పెనాల్టీ కింద వసూలు చేయడంపై రాజ్యసభలో జరిగిన చర్చలో మంత్రి ఈ మేరకు వివరణ ఇచ్చారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

ఆ ఇండెక్స్‌లో చోటుతో షేర్ల పరుగు	టాటా పవర్ రికార్డు లాభం

సాక్షి స్పోర్ట్స్

బీసీసీఐ జీఎస్టీ చెల్లింపులు రూ.2038 కోట్లు



న్యూఢిల్లీ: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) గత రెండేళ్లుగా రూ. 2038.55 కోట్లను జీఎస్టీ రూపంలో చెల్లించినట్లు రాజ్యసభలో తెలిపారు. మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎగువసభలోని ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సమాధానమిచ్చారు. ఐపీఎల్ నిర్వహణ ద్వారా 2022-23, 2023-24 ఈ రెండు ఆర్థిక సంవత్సరాలకు గాను 28 శాతం జీఎస్టీ రూపంలో బోర్డు స్థూలంగా రూ. 2038.55 కోట్లు చెల్లించిందని రాజ్యసభలో తెలిపారు. ఆదాయపన్ను శాఖ నుంచి చారిటీలకు వర్తింపచేస్తున్న మినహాయింపును బీసీసీఐకి తొలగించడంతో ఈ మేరకు బోర్డు చెల్లించిందని మంత్రి వివరించారు. బీసీసీఐ 'తమిళనాడు సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టం 1975'కు లోబడి రిజిస్టరైన సంస్థ. అయితే ఇన్నాళ్లు చారిటీల గొడుగుకింద సెక్షన్ 11 ప్రకారం పన్ను మినహాయింపు పొందేది. అయితే ప్రస్తుతం ఈ వివాదం కోర్టు పరిధిలో ఉందని ఆయన చెప్పారు.

40 ఏళ్ల తర్వాత...

ఒలింపిక్స్ ఫుట్‌బాల్ ఫైనల్లో ఫ్రాన్స్



రెండోసారి ఒలింపిక్ చాంపియన్‌గా నిలిచేందుకు ఫ్రాన్స్ పురుషుల ఫుట్‌బాల్ జట్టు విజయం దూరంలో నిలిచింది. స్వదేశంలో జరుగుతున్న పారిస్ ఒలింపిక్స్ క్రీడల్లో ఫ్రాన్స్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. సోమవారం అర్ధరాత్రి దాటాక జరిగిన సెమీఫైనల్లో ఫ్రాన్స్ 3–1 గోల్స్‌తో ఈజిప్ట్ జట్టుపై విజయం సాధించి 1984 తర్వాత మళ్లీ ఒలింపిక్స్ క్రీడల్లో టైటిల్ పోరుకు అర్హత పొందింది. ఫ్రాన్స్ తరఫున మెటిటా జీన్ ఫిలిప్ (83వ, 99వ నిమిషాల్లో) రెండు గోల్స్‌తో మెరవగా... మైఖేల్ ఒలీస్ (108వ నిమిషంలో) ఒక గోల్ సాధించాడు. ఈజిప్ట్ తరఫున మహమూద్ సాబెర్ (62వ నిమిషంలో) ఏకైక గోల్ చేశాడు. ఒలింపిక్స్ చరిత్రలో ఫ్రాన్స్ ఫుట్‌బాల్ జట్టు ఫైనల్ చేరడం ఇది మూడోసారి. 1900 పారిస్ క్రీడల్లో రన్నరప్‌గా నిలిచిన ఫ్రాన్స్ ఆ తర్వాత 1984 లాస్‌ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో విజేతగా నిలిచి స్వర్ణ పతకాన్ని సాధించింది. శుక్రవారం జరగనున్న ఫైనల్లో స్పెయిన్‌తో ఫ్రాన్స్ అమీతుమీ తేల్చుకోనుంది.

భారత టీటీ జట్టు నిష్క్రమణ



పారిస్ ఒలింపిక్స్ టేబుల్ టెన్నిస్ (టీటీ) పురుషుల టీమ్ ఈవెంట్‌లో భారత జట్టు కథ ముగిసింది. మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో భారత్ 0–3తో చైనా చేతిలో ఓడింది. తొలి మ్యాచ్‌లో హర్మీత్ దేశాయ్–మానవ్ ఠక్కర్ జోడీ 2–11, 3–11, 7–11తో మా లాంగ్–వాంగ్ జంట చేతిలో 0–1తో వెనుకబడింది. రెండో మ్యాచ్‌లో ఐదోసారి ఒలింపిక్స్‌లో ఆడుతున్న ఆచంట శరత్ కమల్ 11–9, 7–11, 7–11, 5–11తో ఫాన్ జెన్‌డాంగ్ చేతిలో ఓడిపోయాడు. తొలి గేమ్ గెలిచి ఆశలు రేకెత్తించిన శరత్ అదే జోరు చివరి వరకు కొనసాగించ లేకపోయాడు. మూడో మ్యాచ్‌గా జరిగిన సింగిల్స్ రెండో పోరులో మానవ్ ఠక్కర్ 9–11, 6–11, 9–11తో వాంగ్ చేతిలో పరాజయం పాలవడంతో భారత ఓటమి ఖరారైంది.

సమం చేస్తారా... సమర్పిస్తారా!



నేడు శ్రీలంకతో భారత్ మూడో వన్డే

- టీమిండియా గెలిస్తే సిరీస్ సమం
- ఓడిపోతే సిరీస్ శ్రీలంక వశం
- మధ్యాహ్నం గం. 2:30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

కొలంబో: టి20 సిరీస్‌ను సులువుగా గెలుచుకున్న టీమిండియాకు వన్డే సిరీస్ గెలుపు కూడా లాంఛనమే అనిపించింది. కానీ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లితో ఉన్న పూర్తిస్థాయి టీమిండియాకు వన్డేల్లో ఎవరూ ఊహించని సవాళ్లు ఎదురయ్యాయి. తొలి వన్డేను గెలుపు మెట్టుపై 'టై' చేసుకున్న రోహిత్ బృందం రెండో మ్యాచ్‌లో లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో 97/0తో పటిష్టస్థితిలో ఉండి కూడా... లంక స్పిన్ మాయాజాలానికి అనూహ్యంగా కుప్పకూలింది. ఈ రెండు మ్యాచ్‌ల్లోనూ భారత్ ఆలౌటైంది. బంతులు మాత్రం మిగిలిపోయాయి. అంటే మన బ్యాటర్లు క్రీజులో నిలువడమే కష్టమైపోతోంది. కోహ్లి, రాహుల్‌లాంటి సీనియర్లపై కూడా ఆతిథ్య స్పిన్ బౌలింగ్ ఆధిపత్యం చలాయిస్తోంది. ఇది జట్టును కలవరపెడుతోంది. మరోవైపు 1–0తో సిరీస్‌లో ఆధిక్యంలో ఉన్న శ్రీలంక ఇప్పుడు ఇదే ఉత్సాహంతో ఆఖరి పోరులో గెలిచి సిరీస్‌ను కైవసం చేసుకోవాలని పట్టుదలతో ఉంది.

మన బ్యాట్‌లకు పని చెప్పాల్సిందే!

ఈ పర్యటనలో భారత్ ఇప్పటి వరకు ఐదు మ్యాచ్‌లాడింది. మూడు టి20లు సహా, గత రెండు వన్డేల్లోనూ బౌలర్లు ప్రతాపం చూపారు. కానీ బ్యాటర్లే ఆ రేంజ్‌లో రాణించలేకపోతున్నారు. ముఖ్యంగా వన్డేల్లో చక్కని శుభారంభాలు వచ్చినా... కెప్టెన్ రోహిత్ శర్మ ధాటైన బ్యాటింగ్‌తో లక్ష్యాన్ని సులువుగా మారుస్తున్నా... తర్వాత వచ్చిన బ్యాటర్లు మిగిలిన లక్ష్యాన్ని ఛేదించలేకపోవడమే పెద్ద సమస్యగా మారింది. దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారించిన టీమ్ మేనేజ్‌మెంట్ ఆఖరి పోరులో తమ బ్యాటింగ్ దళాన్ని సన్నద్ధం చేస్తోంది. రోహిత్ ఆడినట్లే టాపార్డర్‌లో కోహ్లి, మిడిలార్డర్‌లో కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్ ఏ కాస్తోకూస్తో ఆడినా... కొన్ని ఓవర్లు క్రీజులో పాతుకుపోయినా ఎంతటి స్పిన్నరయినా తుత్తునీయలు చేయొచ్చు.

జోరు మీదున్న లంక

టి20 సిరీస్‌లో క్లీన్‌స్వీప్‌తో పల్లెకెలెలో పోగొట్టుకున్న పరువును కొలంబోలో కొల్లగొట్టాలని ఆతిథ్య శ్రీలంక పట్టుదలతో ఉంది. చక్కగా స్పిన్‌కు అనుకూలించే పిచ్‌పై బౌలర్లు మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. పటిష్టమైన ప్రత్యర్థి బ్యాటింగ్ లైనప్‌ను తేలిగ్గా కూల్చేస్తున్నారు. పైగా 1–0తో ఉన్న శ్రీలంక ఇప్పుడు సిరీస్ కోల్పోలేని స్థితిలో ఉంది. ఒత్తిడేమో భారత్‌పై ఉంది. దీన్ని సద్వినియోగం చేసుకొని తమ స్పిన్‌తో తిప్పేయాలని వాండెర్సే, అసలంక పిడికిలి బిగిస్తున్నారు. కొలంబో వేదికపై లక్ష్యఛేదన మ్యాచ్ సాగేకొద్దీ కష్టతరమవుతోంది కాబట్టి టాస్ గెలిస్తే మాత్రం మరో మాటకు తావులేకుండా ఏ జట్టయినా బ్యాటింగే ఎంచుకోవడం ఖాయం.

పిచ్, వాతావరణం

కొలంబో పిచ్ స్పిన్‌కు స్వర్గధామం. దీనివల్లే ఆతిథ్య స్పిన్నర్లు చెలరేగుతున్నారు. బ్యాటర్లు జాగ్రత్త పడాల్సిందే! వర్ష సూచన ఉన్నా... మ్యాచ్‌కైతే ఇబ్బంది ఉండకపోవచ్చు.

మీరా ఔరా అనిపించేనా?

- నేడు మహిళల వెయిట్‌లిఫ్టింగ్ 49 కేజీల విభాగం బరిలో భారత స్టార్
- గత టోక్యో ఒలింపిక్స్‌లో రజతం నెగ్గిన మీరాబాయి
- రాత్రి గం.11:00 నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం



పారిస్: మూడేళ్ల క్రితం టోక్యో వేదికగా జరిగిన ఒలింపిక్స్‌లో... పోటీలు ప్రారంభమైన తొలి రోజే భారత్‌కు పతకం అందించి సంబరాల్లో ముంచెత్తిన భారత స్టార్ వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను... బుధవారం 'పారిస్' క్రీడల బరిలోకి దిగనుంది. 49 కేజీల విభాగంలో గత ఒలింపిక్స్‌లో 202 కేజీలు (87 కేజీలు+115 కేజీలు) బరువెత్తి రజతం గెలిచిన మీరాబాయిపై ఈసారి కూడా భారీ అంచనాలు ఉన్నాయి. అయితే కొంతకాలంగా ఫిట్‌నెస్ సమస్యలతో ఇబ్బంది పడుతున్న చాను.. ఎలాంటి ప్రదర్శన కనబరుస్తుందనేది ఆసక్తికరం. ఒలింపిక్స్ వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో ఇప్పటి వరకు భారత్‌కు రెండు పతకాలు దక్కగా... ఆ రెండూ మహిళా లిఫ్టర్లే గెలిచారు. 2000 సిడ్నీ ఒలింపిక్స్‌లో దిగ్గజ లిఫ్టర్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కరణం మల్లీశ్వరి కాంస్య పతకం సాధించగా... టోక్యోలో మీరాబాయి రజతం నెగ్గింది. గత ఒలింపిక్స్‌లో మెరుపులు మెరిపించిన మీరాబాయి.. ఆ తర్వాత గాయాల బారిన పడి అదే స్థాయి ప్రదర్శన కొనసాగించలేకపోయింది. 2022 కామన్వెల్త్ క్రీడల్లో మాత్రమే 200 కేజీల మార్కు దాటగలిగింది. ఇక తాజాగా 'పారిస్' క్రీడల్లో మీరాబాయి ఎంట్రీ వెయిట్ 200 కేజీలుగా నమోదు చేసుకుంది. ఒలింపిక్ డిఫెండింగ్ చాంపియన్ హో జీహుయి (చైనా), డెలాక్రజ్ (అమెరికా), సురోచన ఖామ్‌బో (థాయ్‌లాండ్), మిహేలా కామ్‌బెయి (రొమేనియా) మీరాకన్నా మెరుగైన ఎంట్రీ వెయిట్ నమోదు చేసుకున్నారు. ఈసారి పోటీల తీవ్రతను బట్టి చూస్తే.. మీరాబాయి తన అత్యుత్తమ ప్రదర్శన (205 కేజీలు) కనబర్చగలిగితేనే పతకం రేసులో నిలిచే అవకాశాలు ఉన్నాయి. చైనా లిఫ్టర్ హో జీహుయి మరోసారి స్వర్ణంపై గురి పెట్టింది. మీరాబాయి గాయం నుంచి పూర్తిగా కోలుకుందని కోచ్ విజయ్ శర్మ పేర్కొన్నారు. 'మీరా 200 కేజీలు సునాయాసంగా దాటగలదు. టోక్యో ఒలింపిక్స్‌లో ఎత్తిన 202 కేజీల బరువును మించిన ప్రదర్శన చేస్తుంది. సవాలు స్వీకరించేందుకు చాను సిద్ధంగా ఉంది' అని విజయ్ శర్మ అన్నాడు.

ఏ బిడ్డా... ఇది నా అడ్డా!

సర్ఫింగ్ సెమీస్‌కు అతిథిగా తిమింగలం



తిహుపో (తాహిటి): పారిస్ ఒలింపిక్స్‌లో భాగంగా సర్ఫింగ్ పోటీలు పసిఫిక్ మహాసముద్రంలో జరుగుతున్నాయి. బ్రెజిల్‌కు చెందిన తాతియానా వెస్టన్ వెబ్, కోస్టారికా సర్ఫర్ బ్రిసా హెన్నెస్సిల మధ్య సెమీఫైనల్స్ జరుగుతోంది. పారిస్‌కు సుమారు పదివేల మైళ్ల దూరంలో ఉన్న తాహిటిలో ఈ పోటీలు జరుగుతుండగా... ఓ తిమింగలం అక్కడ చక్కర్లు కొట్టింది. ఓ కంట ఉలిక్కిపాటుతో మరో కంట కేరింతలతో ప్రేక్షకులు ఈ అనుకోని అతిథిని తమ కెమెరాల్లో, స్మార్ట్‌ఫోన్‌లలో బంధించారు. వెస్టన్, బ్రిసాలకు కాస్త దూరంలో అది నీటిపై తేలియాడింది. అయితే సర్ఫర్లు ఇద్దరు సురక్షిత దూరంలోనే ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దీవుల మధ్యలో ఫ్రాన్స్ ఆధీనంలో తాహిటి ఉంది. ఇది సర్ఫింగ్‌కు ప్రసిద్ధి. క్రీడాకారులే కాదు ఔత్సాహికులు సర్ఫింగ్‌తో సంద్రానికి ఎదురీదుతారు. అయితే సర్ఫింగ్ చేసే ప్రతీచోటా కూడా వైల్డ్ యానిమల్స్ దర్శనమివ్వడం పరిపాటి. తిమింగలాలు, సీల్స్, షార్క్‌లు సర్ఫర్లను అప్పుడపుడు భయపెడుతుంటాయి.

ఈ నెల 15, 16 తేదీల్లో పీకేఎల్ వేలం



ముంబై: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్ ప్రారంభానికి ముందు ఈ నెల 15, 16తేదీల్లో ప్లేయర్ల వేలం జరగనుంది. పవన్ షెరావత్, ప్రదీప్ నర్వాల్, మణిందర్ సింగ్, ఫజల్ అత్రాచలీ, మొహమ్మద్ రెజా వంటి పలువురు స్టార్ ప్లేయర్లు ఈసారి వేలంలో పాల్గొంటున్నారు. 88 మంది ప్రధాన ప్లేయర్లను రీటెయిన్ చేసుకున్న 12 ఫ్రాంచైజీలు.. యువ ఆటగాళ్లను దక్కించుకునేందుకు సిద్ధమవుతున్నాయి. వేలంలో పాల్గొంటున్న ప్లేయర్లను నాలుగు కేటగిరీలుగా విభజించారు. 'ఎ' కేటగిరీలో ఉన్న ప్లేయర్ల కనీస ధర రూ. 30 లక్షలు కాగా.. 'బి' కేటగిరీలో ఉన్న వాళ్ల బేస్ ప్రైజ్ రూ. 20 లక్షలు. 'సి' కేటగిరీ ప్లేయర్లకు రూ.13 లక్షలు, 'డి' కేటగిరీ ఆటగాళ్లకు రూ. 9 లక్షలు ప్రాథమిక ధరగా నిర్ణయించారు. వేలంలో 500 మందికి పైగా ప్లేయర్లు పాల్గొననుండగా.. ఒక్కో ఫ్రాంచైజీ ఐదు కోట్లు ఖర్చు చేయనుంది.

హక్కుల కోసం పోరాటాలు ఉధృతం

వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య



సాక్షి, న్యూఢిల్లీ: దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలను కేంద్రంలో అధికారంలోకి వస్తున్న పార్టీలన్నీ తీవ్రంగా మోసం చేస్తున్నాయని వైఎస్సార్ సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని, రూ.2లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించాలని, విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని తదితర డిమాండ్లతో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. ఇప్పటి వరకు కేంద్ర పెద్దలకు ఎన్నో అభ్యర్థనలు చేసి విసిగిపోయామని, ఇకపై ఉధృతమైన పోరాటాలను చూస్తారంటూ హెచ్చరించారు. ఏపీలో గత ఐదేళ్లలో అప్పటి సీఎం వైఎస్ జగన్ అన్ని విషయాల్లోనూ బీసీలకు పెద్దపీట వేశారని కితాబిచ్చారు. వైఎస్సార్‌సీపీ ఎంపీలు బీద మస్తాన్‌రావు, గొల్ల బాబురావు తదితరులు ధర్నాకు మద్దతు పలికారు.

‘సుజలధార’కు గండి

ఉద్దానం ప్రాంతంలో ఆగిపోయిన నీటి సరఫరా

కంచిలి: కూటమి ప్రభుత్వం అనాలోచిత చర్యలతో శ్రీకాకుళం జిల్లా పరిధిలోని ఉద్దానం ప్రాంతంలోని కిడ్నీ వ్యాధి ప్రభావిత గ్రామాల ప్రజలు తాగునీరు అందక అల్లాడిపోతున్నారు. స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయడం ద్వారా వ్యాధి తీవ్రతను నిరోధించవచ్చనే ఉద్దేశంతో.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన వైఎస్సార్ సుజలధార నీటి పథకం ద్వారా నీటి సరఫరా నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండు నెలలు గడిచే లోపే బృహత్తర పథకానికి తూట్లు పొడిచారు. సుజలధార పథకం పరిధిలో సంప్‌లు, పంప్ హౌస్‌లు, ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నిర్వహణలో కీలకంగా వ్యవహరిస్తూ పనిచేస్తున్న పంప్ ఆపరేటర్లు, వాల్వ్ ఆపరేటర్లకు నాలుగు నెలలుగా జీతాలు చెల్లించడం లేదు. వీరికి ఏప్రిల్, మే, జూన్, జూలై నెలల జీతాలు ఇంతవరకు చెల్లించలేదు. దీంతో వారంతా సహాయ నిరాకరణకు దిగారు. తత్ఫలితంగా జిల్లాలోని ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాలతోపాటు పాతపట్నం నియోజకవర్గ పరిధిలోని మెళియాపుట్టి మండలం పరిధిలో నీరందిస్తున్న ఈ ప్రాజెక్టు పరిధిలో 876 గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ గ్రామాల పరిధిలో ఉండే సుమారు 10 లక్షల మంది ప్రజలు తాగునీటి ఇబ్బందితో అల్లాడిపోతున్నారు.

23 నుంచి ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

మహారాణిపేట (విశాఖ జిల్లా): జిల్లాలో ఈనెల 23 నుంచి సెప్టెంబర్ 5 వరకు జరగనున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి పక్కా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అధికారులకు ఆదేశించారు. ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి సంబంధించి ఆర్మీ, జిల్లా అధికారులతో సమన్వయ సమావేశాన్ని మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్కయ్యపాలెం పోర్ట్ ట్రస్ట్ డైమండ్ జూబ్లీ స్టేడియంలో ఈనెల 23 నుంచి వచ్చే నెల 5 వరకు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ జరగనుందని తెలిపారు. రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన 8వేల మంది యువత పాల్గొననున్నారని, ర్యాలీ సాఫీగా జరిగేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమ ఏర్పాట్ల పర్యవేక్షణ, సమన్వయం కోసం సెట్విస్ సీఈవో డి.కీర్తి, డీఎస్డీవో జూన్ గ్యాలియేట్‌ను నోడల్ అధికారులుగా నియమించినట్లు చెప్పారు. ర్యాలీ జరిగే సమయంలో స్టేడియం వద్ద తాగునీరు, పారిశుధ్యం, లైటింగ్, మొబైల్ టాయిలెట్స్, డస్ట్ బిన్స్ ఏర్పాట్లు చేయాలని జీవీఎంసీ కమిషనర్‌ను కోరారు. ఆర్మీ అధికారులు, జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకునేందుకు ఒక సీనియర్ అధికారిని నియమించాలని ఆదేశించారు. వేదిక వద్ద పటిష్ట బందోబస్తు, ట్రాఫిక్ మళ్లింపు వంటి చర్యలు చేపట్టాలని డీసీపీని కలెక్టర్ ఆదేశించారు. అభ్యర్థుల రెసిడెన్సీ, నేటివిటీ సర్టిఫికెట్లను పరిశీలించేందుకు ఉప తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లను నియమించాలని విశాఖ, భీమిలి ఆర్డీవోలను ఆదేశించారు. ఆర్మీ పర్సనల్స్ ఉండేందుకు వీలుగా వసతి ఏర్పాటు చేయాలని డీవైవోను ఆదేశించారు.

ఎన్టీటీపీఎస్‌లో నిలిచిన విద్యుత్ ఉత్పత్తి

ఇబ్రహీంపట్నం: సాంకేతికలోపం కారణంగా ఎన్టీటీపీఎస్ ఐదు యూనిట్లలో మంగళవారం రాత్రి విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. యూనిట్లలో బస్ పుల్‌అవుట్ (విద్యుత్ తీగల విభాగంలో లోపం) కావడంతో మొత్తం 2,560 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాల్సి ఉండగా 1,668 మెగావాట్ల ఉత్పత్తి నిలిచిపోయింది. కేవలం 892 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. సంస్థ ఇంజినీర్లు మరమ్మతులు చేపట్టారు. ఉన్నతాధికారులు మాట్లాడుతూ.. నాలుగు, ఐదు యూనిట్లలో వార్షిక మరమ్మతుల కోసం ఇప్పటికే ఉత్పత్తి నిలిపేశామని తెలిపారు.


ఓడీ చెరువు మండలం కొండకమర్ల వద్ద సాగు చేసిన సజ్జ పంట


అమడగూరు వద్ద సాగు చేసిన రాగి పంట


మడకశిర వద్ద సాగు చేసిన కొర్ర పంట

చిరుధాన్యాల సాగుపై మక్కువ

- జిల్లాలో పెరిగిన సాగు విస్తీర్ణం
- 4,220 ఎకరాల్లో చిరుధాన్యాల సాగు

పుట్టపర్తి అర్బన్: సంప్రదాయ పంటల సాగును వదిలి చాలా మంది రైతులు చిరుధాన్యాల సాగుతో లాభాలు గడిస్తున్నారు. కొంత కాలంగా వేరుశనగలో వివిధ రకాల విత్తనాలు సాగు చేస్తున్నా చీడపీడలతో ఆశించినంతగా పంట దిగుబడులు రాలేదు. కంది, మొక్కజొన్న, పొద్దుతిరుగుడుకు సైతం చీడపీడలు అధికంగా వస్తుండడం, సకాలంలో వర్షాలు కురవక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో నీటి లభ్యత ఉన్న రైతులు రాగి, కొర్ర, సజ్జ వంటి పంటల సాగు చేపట్టారు. పుట్టపర్తి, కదిరి నియోజక వర్గాల్లో సజ్జ పంటను అధికంగా సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో సాధారణ సాగు విస్తీర్ణం 2,500 ఎకరాలు కాగా, కేవలం సజ్జ పంట ఒక్కటే 1,415 ఎకరాల్లో సాగులోకి రావడం గమనార్హం. సజ్జ క్వింటా రూ.2800 నుంచి రకాన్ని బట్టి రూ.4వేల వరకూ ధర పలుకుతోంది. పుట్టపర్తి నియోజకవర్గంలోని నల్లమాడ, ఓడీ చెరువు మండలాల్లో విస్తారంగా సీడు సజ్జ సాగు చేస్తున్నారు. కొన్ని కంపెనీలు సీడు ఇచ్చి పంట పూర్తయిన తరువాత కొనుగోలు చేసేలా ఒప్పందం చేసుకున్నాయి. దీంతో ఆ ప్రాంతంలో సీడు సజ్జ సాగు విస్తీర్ణం పెరిగింది.

10 వేల ఎకరాల్లో రాగి సాగు లక్ష్యం..

చిరుధాన్యాల్లో ప్రతి ఒక్కరికీ అత్యవసరమైనది, అత్యంత ఆరోగ్యకరమైనదిగా రాగులకు గుర్తింపు ఉంది. గత ప్రభుత్వం సైతం రాగి పంట విస్తీర్ణం పెంచాలనే లక్ష్యంతో గిట్టుబాటు ధరలు కల్పించడంతో రైతులు ఆ దిశగా ఆలోచించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా 10 వేల ఎకరాల్లో రాగి పంట సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకోగా ఇప్పటి వరకూ 2,580 ఎకరాల్లో పంట వేశారు. ఈ విస్తీర్ణం మరింత పెరిగే అవకాశముందని వ్యవసాయాధికారులు అంటున్నారు. రాగుల ధర సుమారు రూ.4 వేల వరకూ పలుకుతోంది.

224 ఎకరాల్లో కొర్ర.

అత్యంత ఆరోగ్యకరమైన మరో చిరుధాన్యం కొర్ర పంటను జిల్లాలో ఇప్పుడిప్పుడే సాగు చేస్తున్నారు. వ్యవసాయాధికారులు అవగాహన కల్పిస్తుండడంతో కొర్ర పంటను అధికంగా ముదిగుబ్బ, మడకశిర, పెనుకొండ తదితర మండలాల్లో సాగు చేస్తున్నారు. 1,667 ఎకరాల సాగు లక్ష్యంగా నిర్దేశించుకోగా, ఇప్పటి వరకూ 225 ఎకరాల్లో కొర్ర సాగు అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం క్వింటా కొర్రలు సుమారు రూ.10 వేల వరకూ అమ్ముడుపోతోంది. తక్కువ నీటికే పంట పూర్తి కానుండడంతో కొర్ర సాగుకు రైతులు ముందుకు రావాలని అధికారులు పిలుపునిస్తున్నారు.



ఏటా సజ్జ పంటనే...



నాకున్న 4 ఎకరాల్లో ఏటా సజ్జ పంటనే సాగు చేస్తుంటా. దిగుబడి కూడా అధికంగా ఉంటోంది. ఈ సారి సీడు సజ్జకు మంచి గిట్టుబాటు ధరనిస్తున్నారు. పక్షుల బెడద తప్పా ఇంకా ఏ ఇతర ఇబ్బందులూ ఉండవు. ప్రస్తుతం క్వింటా సజ్జ మార్కెట్‌లో రూ.2,800 నుంచి రూ.4 వేల వరకూ అమ్ముడుపోతోంది.

– నరసింహ, మీసాలవాండ్లపల్లి, నల్లమాడ మండలం

అధిక ఆదాయం



చిరుధాన్యాల సాగుతో లాభాలు పుష్కలంగా ఉంటాయి. చిరుధాన్యాల సాగుపై రైతులు అవగాహన పెంచుకోవాలి. వీటికి చీడపీడలు బెడద ఉండదు. ప్రస్తుతం ప్రజలు కూడా బియ్యానికి బదులు చిరుధాన్యాల వంటలనే ఎక్కువగా ఇష్టపడుతున్నారు.

– సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి, పుట్టపర్తి

విశాఖలోకి మోస్ట్ వాంటెడ్ క్రిమినల్స్ !

- పశ్చిమ బెంగాల్ నుంచి రాక
- వారిని పట్టుకునేందుకు రంగంలోకి ఆక్టోపస్ బలగాలు
- శనివారం రాత్రి సినిమా తరహాలో ఆపరేషన్
- అప్పటికే వారు వెళ్లిపోయినట్టు నిర్ధారణ

విశాఖ సిటీ : ప్రశాంత విశాఖలో ఒక్కసారిగా అలజడి రేగింది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన మోస్ట్ వాంటెడ్ క్రిమినల్స్ విశాఖలోకి చొరబడ్డారని పశ్చిమ బెంగాల్ పోలీస్ అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు విశాఖ పోలీసులు అప్రమత్తమయ్యారు. మూడు రోజుల కిందట రహస్యంగా సెర్చ్ ఆపరేషన్ నిర్వహించిన విషయం ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. పశ్చిమ బెంగాల్‌లో ముగ్గురు క్రిమినల్స్ ఆయుధాలు చూపించి అక్కడి వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేశారు. మరికొంత మందిని డబ్బులు డిమాండ్ చేసినట్లు అక్కడి పోలీసులకు ఫిర్యాదులు అందాయి. దీనిపై పోలీసులు వారి కోసం గాలింపు చేపట్టారు. అయితే క్రిమినల్స్ అక్కడి నుంచి విశాఖకు వచ్చారని.. రామ్‌నగర్‌లోని ఓ హాస్టల్లో తిష్టవేశారని సాంకేతికత ఆధారంగా పశ్చిమ బెంగాల్ పోలీసులు తెలుసుకున్నారు. వెంటనే విశాఖ పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. క్రిమినల్స్ వద్ద ఆయుధాలు ఉన్నాయన్న సమాచారంతో ఆక్టోపస్ సాయుధ బలగాలను రంగంలోకి దింపారు. పశ్చిమ గోదావరి పోలీసులు, ఆక్టోపస్ బలగాలు శనివారం రాత్రి రామ్‌నగర్ ప్రాంతంలోని హాస్టల్ పరిసర ప్రాంతాలను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. సినిమా తరహాలో బిల్డింగ్‌లు, గోడలు ఎక్కి సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. సుమారు రెండు గంటల పాటు ఈ ఆ ఆపరేషన్ సాగింది. అయితే క్రిమినల్స్ ఇక్కడి నుంచి కొద్ది రోజుల కిందటే వెళ్లిపోయినట్లు తెలుసుకున్నారు. అయితే సాయుధ బలగాల సెర్చ్ ఆపరేషన్ చూసిన స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పోలీసులు కూడా ఈ ఆపరేషన్‌ను రహస్యంగా ఉంచారు. ప్రస్తుతం ఆ క్రిమినల్స్ విశాఖ నుంచి విజయవాడకు వెళ్లినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా

ఎయిడ్స్‌పై ప్రచారాందోళన చేపట్టాలి



మాట్లాడుతున్న సురేంద్రబాబు

రాయచూరు రూరల్: సమాజాన్ని పట్టి పీడిస్తున్న ఎయిడ్స్ మహమ్మారిపై యువత జాగృతి కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా ఆరోగ్య శాఖ అధికారి సురేంద్రబాబు పిలుపునిచ్చారు. మంగళవారం మహాత్మ గాంధీ క్రీడా మైదానంలో జిల్లాధికార యంత్రాంగం, జిల్లా పంచాయతీ, ఆరోగ్య శాఖ, ఎయిడ్స్ సంస్థ యువజన శాఖ ఆధ్వర్యంలో మారథాన్‌ను ప్రారంభించి మాట్లాడారు. ఈ వ్యాధి సోకిన వారి పట్ల వివక్ష చూపకూడదన్నారు. ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ వ్యాధిపై గ్రామస్థాయి నుంచి అవగాహన కల్పించాలన్నారు. జాతాలో ఎయిడ్స్ నోడల్ అధికారి షాకీర్, యువజన శాఖ అధికారి సంతోష్ పాల్గొన్నారు.

నగరసభ అధ్యక్ష స్థానం ఎస్సీ మహిళకు కేటాయింపు

రాయచూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం సోమవారం సాయంత్రం అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు రిజర్వేషన్లు ప్రకటించింది. దీంతో రాయచూరు నగరసభ అధ్యక్ష పదవి ఎస్సీ మహిళకు, ఉపాధ్యక్ష పదవి బీసీఏకు రిజర్వు చేసింది. ఈ నేపథ్యంలో రాయచూరులో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పదవుల కోసం పావులు కదుపుతున్నారు. బీజేపీ నుంచి ఉమా పేరు, కాంగ్రెస్ పార్టీ నుంచి నరసమ్మ పేర్లు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటంతో స్థానిక మంత్రి బోసురాజ్ మద్దతుదారుగా నరసమ్మకు ముందు వరుసలో ఉన్నారు. అదే విధంగా నగర ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ మద్దతుదారులు కూడా పోటీలో వున్నారు.

తల్లీ బిడ్డల ఆస్పత్రి ప్రారంభానికి చర్యలు తీసుకోండి



అధికారులతో మాట్లాడుతున్న డీసీ

రాయచూరు రూరల్: నగరంలో తల్లీ బిడ్డల ఆస్పత్రి ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని జిల్లాధికారి నితీశ్ ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ఆస్పత్రి పూర్తయిన నేపథ్యంలో మంగళవారం నగరంలోని తల్లి బిడ్డల ఆస్పత్రిని సందర్శించి జిల్లారోగ్య శాఖాధికారి సురేంద్ర బాబుతో ఆస్పత్రికి కావాల్సిన సిబ్బంది, వైద్యులు, పడకలు, యంత్రోపకరణాలు, ఇతర సౌలభ్యాలపై చర్చించారు. తాలుకా ఆరోగ్య శాఖ అధికారి ప్రజల్వ్, ఇతర అధికారులు ఉన్నారు.

రాయచూరులో వర్షం

రాయచూరు రూరల్: నగరంలో సోమవారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో కొన్ని చోట్ల వర్షపు నీరు నిలిచిపోయి రహదారులు బురదమయంగా మారాయి. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మూన్నూరు వాడి, గాంధీచౌక, మహవీర చౌక్‌లో వర్షపు నీరు పెద్ద ఎత్తున నిలిచిపోయింది.

మంచాలమ్మ దేవికి విశేష పూజలు



పూజలు చేస్తున్న స్వామీజీ

రాయచూరు రూరల్: మంత్రాలయం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థ శ్రీపాదంగల్ చాతుర్మాస దీక్షలో భాగంగా శ్రావణ మాసం సందర్భంగా మంగళవారం మంచాలమ్మ దేవికి విశేష పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సంస్కారంతో జీవన విధానం మారాలి



కార్యక్రమంలో బసవరాజ్, స్వామీజీ తదితరులు

రాయచూరు రూరల్: సంస్కారంతో మానవుడి జీవన విధానం మారాలని కేంద్ర మాజీ మంత్రి బసవరాజ్ పాటిల్ అన్నారు. సోమవారం రాత్రి మఠంలో నెల రోజులు ఆధ్యాత్మిక ప్రవచన పఠనం కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి మాట్లాడారు. చిన్నతనంలో పిల్లలకు పాండిత్యం, సంస్కృతి, సంప్రదాయం, ఆచార, వ్యవహారాలను బోధించాలన్నారు. ప్రవచన పఠనం వల్ల మానవుడు శాంతి జీవనం గడపడానికి వీలుంటుందన్నారు. కార్యక్రమంలో కిల్లే బ్రహన్మఠాధిపతి శాంతమల్ల శివాచార్య, చేగుంట క్షీరలింగేశ్వర శరణు, మిట్టమల్కాపూర్ నిజానంద స్వామీజీ, వీరశైవ సమాజం అధ్యక్షులు శరణు భూపాల్, చంద్రశేఖర్, దరూరు బసవరాజ్, నిజగుణ జవళి, రేణుక స్వామి, కేశవమూర్తి, వీరేష్ పాల్గొన్నారు.

తగ్గుతున్న టమాటా ధరలు

- కోస్తా, కేరళలో వర్షాల కారణంగా నిలిచిపోయిన రవాణా
- రైతుల్లో ఆందోళన



టమాటాలను లారీలలో లోడ్ చేస్తున్న దృశ్యం



కోలారు ఏపీఎంసీ మార్కెట్‌కు రైతులు తీసుకువచ్చిన టమాటాలు

కోలారు: టామాటా పంట అంటేనే రైతులతో దోబుచులాడే పంట. ఒకసారి ఆకాశానికెత్తేస్తుంది. మరోసారి అథఃపాతాళానికి దిగజారిపోతుంది. తాజా పరిస్థితులు టమాటా రైతులకు ఆశాజనకంగా లేవు. పంట దిగుబడి బాగానే ఉన్నా రవాణా దెబ్బతీస్తోంది. కేరళలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల టమాటా ఎగుమతి కష్టంగా మారింది. దీంతో ధరలు తగ్గుతున్నాయి. కోలారులోని టోకు మార్కెట్‌లో గత 15 రోజుల క్రితం కిలో రూ. 60 ఉన్న ధరలు నేడు ఉన్నఫళంగా తగ్గిపోయి రెండు కిలోలు రూ. 50లకు పడిపోయింది. కోస్తా, మలెనాడు, ఉత్తర కర్ణాటక, పాత మైసూరు ప్రాంతంలో భారీ వర్షాల కురుస్తున్నాయి. ఢిల్లీతో పాటు ఉత్తర భారత దేశంలోని పలు రాష్ట్రాలలో కూడా ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తుండటంతో టమాటాల రవాణాకి అడ్డంకిగా మారింది. దీంతో ఆయా ప్రాంతాల నుంచి టమాటాలకు డిమాండ్ తక్కువగా ఉంది. మైసూరు ఏపీఎంసీ మార్కెట్ నుంచి కేరళకు టమాటాలు తరలిస్తారు. అయితే వయనాడ్‌లో భూమి కుంగిపోతున్న కారణంగా రవాణా ఆగిపోయింది. కోలారు నుంచి ఆ ప్రాంతానికి వెళుతున్న టమాటాలు మార్కెట్లోనే నిలిచిపోయాయి. టమాటాలు విక్రయాలలో అసియాలోనే అతి పెద్ద మార్కెట్ అయిన కోలారు ఏపీఎంసీ నుంచి బెంగుళూరు మాత్రమే కాకుండా దేశంలోని సుమారు 15 నుంచి 20 రాష్ట్రాలకు టమాటాలు రవాణా అవుతోంది. టమాటాలు లారీలలో రవాణా చేసినా ఆ ప్రాంతాలలో టమాటాలు విక్రయాలు తగ్గడం వల్ల వ్యాపారులు టమాటాలు కొనుగోలు చేయడానికి ఆసక్తి కనపర్చడం లేదు. మహారాష్ట్రలో కూడా ప్రస్తుతం అధిక మొత్తంలో టమాటాలు పండిస్తున్నారు. అక్కడి రైతులు వాటిని ఉత్తర భారతానికి తరలిస్తున్నారు. దీనివల్ల కోలారు మార్కెట్‌లో టమాటాలకు ధరలు తగ్గాయని ఏపీఎంసీ మార్కెట్ కార్యదర్శి కిరణ్ తెలిపారు.

రైతుల్లో నిరాశ :

జిల్లాలో ఏప్రిల్, మేనెలలో విత్తిన టమాటాలు ఇప్పుడు కోతకు వచ్చాయి. కోలారు ఏపీఎంసీ మార్కెట్‌కు నిత్యం గత 15 రోజుల నుంచి 2 లక్షలకు పైగా బాక్సులు వస్తున్నాయి. చిత్రదుర్గ, చెళ్లకెరె ప్రాంతాల నుంచి కూడా ఇక్కడకు టమాటాలు వస్తున్నాయి. వేలంలో 15 కిలోల టమాటాలు బాక్సుధర 15 రోజుల క్రితం రూ. 1100 ఉంది. అయితే నేడు రూ. 350 పడిపోవడం టమాటాలు పండించిన రైతులకు తీవ్ర నిరాశను కలగజేస్తోంది.

కోలారు జిల్లాలో గత ముంగారులో 6 వేల హెక్టార్లలో టమాటాలు పండించారు. ప్రస్తుత ముంగారులో కూడా ఇంతే విస్తీర్ణంలో టమాటాలు పండించారు. అయితే ఆకుముడురు రోగం తదితర కారణాల వల్ల టమాటాలు నాణ్యత తగ్గిందని హార్టికల్చర్ శాఖ అధికారులు చెబుతున్నారు.

ఎగుమతి కష్టంగా మారింది

కోలారు ఏపీఎంసీ మార్కెట్‌కు టమాటాలు దిగుబడి పెరిగింది. వివిధ ప్రాంతాలలో వానల కారణంగా ఎగుమతికి ఇబ్బంది కలుగుతోంది. వానల కారణంగా కొన్ని చోట్ల అన్‌లోడ్ కావడం లేదు. దీని కారణంగా టమాటా ధరలు తగ్గాయి.

కిరణ్, కార్యదర్శి, ఏపీఎంసీ

హెచ్చుతగ్గులు సహజం

టమాటాలు ధరలలో హెచ్చుతగ్గులు వాటి దిగుబడి, రవాణాపై ఆధారపడి ఉంటుంది. గతంలో పెరిగిన ధరలు నేడు తగ్గాయి. రైతులు డిమాండ్‌కు అనుగుణంగా టమాటాలు పండిస్తున్నారు. **కుమారస్వామి, డిప్యూటీ డైరెక్టర్, హార్టికల్చర్ శాఖ**

విద్యార్హతలను బట్టి పదోన్నతి కల్పించాలని



తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన చేస్తున్న దృశ్యం

హొసపేటె: సర్వీస్, ఉన్నత విద్యార్హతలు ఉన్న ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల పోస్టులకు పదోన్నతి కల్పించాలని ఉపాధ్యాయ సంఘం నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం ఉపాధ్యాయులు తాలూకా కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ శ్రుతికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. సీ- ఆర్ రూల్ 2017 అమలులో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు అన్యాయం జరిగిందని, ప్రభుత్వం 2017లో సీఆర్‌వో నిబంధనను సవరించి 2016 కంటే ముందు నియమితులైన ఉపాధ్యాయులకే వర్తింపజేయడంతో ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులకు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల పోస్టులకు అవసరమైన అర్హతలు ఉండి సీనియారిటీ ఉన్నప్పటికి పదోన్నతులు పొందడం లేదన్నారు. ప్రధానోపాధ్యాయులకు పదోన్నతి కల్పించకుండానే ప్రధానోపాధ్యాయులు పదవి విరమణ చేయడం బాధాకరమన్నారు. మెరిట్ ఆధారంగా లబ్ధి పొందేందుకు వీధుల్లోకి వెళ్లి పోరాడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఆగస్టు 7న జిల్లా స్థాయిలో, 12న బెంగళూరులోని ఫ్రీడం పార్క్ వద్ద లాంఛనంగా దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రధాన కార్యదర్శి మల్లయ్య మాట్లాడుతూ... ఉపాధ్యాయుల విద్యార్హతలు, సర్వీస్ ఎక్స్‌లెన్స్ ఆధారంగా పదోన్నతులు కల్పించాలని సూచించారు. ఉపాధ్యాయుల డిమాండ్లన్ని న్యాయమైనవేనని, వెంటనే న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఉపాధ్యాయులు సంఘం నేతలు మార్గదప్ప, కుబేర ఆచారి, సుధాదేవి, కడ్లీ వీరభద్రప్ప, ప్రకాష్, రిజ్వానా, నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు



మాట్లాడుతున్న సీఈఓ రాహుల్ శరణప్ప

బళ్లారిటౌన్: విద్యార్థులు విద్యతో పాటు ఆరోగ్యం పట్ల కూడా అవగాహన కలిగి ఉండాలని జిల్లా పంచాయతీ ఈసీఓ రాహుల్ శరణప్ప సంకనూరు పేర్కొన్నారు. జిల్లా పాలన జిల్లా పంచాయతీ జిల్లా ఆరోగ్య సంక్షేమ తదితర శాఖల ఆధ్వర్యంలో తాలూకాలోని కొళగల్లు గ్రామంలో గల ఏకలవ్య మోడల్ వసతి పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన ఆరోగ్య సించన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో బళ్లారి జిల్లాలో ఈ పథకంలో అన్ని తాలూకాలోని 713 పాఠశాలలో 7 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న అన్ని పాఠశాలలోను ఈ ఆరోగ్య జాగృతి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేటి యువత సదృఢంగా ఉండాలంటే పాఠశాల దశలోనే ఆరోగ్యం పట్ల ఎక్కువ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో డీహెచ్‌ఓ రమేష్‌బాబు మాట్లాడుతూ... విద్యార్థులు డెంగీ, క్షయ, కుష్ఠ రోగాలు, బాల్య వివాహాలు తదితర వాటిపై అవగాహన కలిగి ఉండి ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ఆరోగ్యంపై వివిధ 17 వీడియో క్లిపింగ్‌లను చూపించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు విజయ్‌కుమార్, ఈశ్వర్ దానప్ప, హెలె నాగప్ప స్థానిక ప్రిన్సిపల్ డాక్టర్.మంజునాథ జౌలి, డాక్టర్.దివ్య రామశెట్టి తదితరులు పాల్గొన్నారు.

పీజీ హాస్టల్‌కు మెరుగులు



పరిసరాలను శుభ్రం చేస్తున్న దృశ్యం



సాక్షి ఎఫెక్ట్..

రాయచూరు రూరల్: రాయచూరు విశ్వ విద్యాలయం అనుబంధంగా ఉన్న పీజీ హాస్టల్ నిర్వహణపై ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. ఈనెల 5న అంబేడ్కర్ హాస్టల్‌పై 'నిర్వహణ లోపం.. విద్యార్థులకు శాపం' శీర్షికతో సాక్షి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. వెంటనే స్పందించిన వర్సిటీ అధికారులు ఆగమేఘాల మీద వర్సిటీ హాస్టల్‌కు హంగులు చేపట్టారు. సిబ్బందిని పంపించి గదులను శుభ్రం చేయించారు. అదే విధంగా విద్యుత్ వైర్లను సరిచేశారు. ఫ్యాన్లు ఏర్పాటు చేసి, కిటికీలను అద్దాలను బిగించారు. దీంతో విద్యార్థులు సాక్షి పత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.

కుడితిని బంద్ విజయవంతం



దుకాణాలు మూసి వేసిన దృశ్యం

బళ్లారి అర్బన్: వివిధ పరిశ్రమల స్థాపనకు కేఐడీబీ స్వాధీనం చేసుకున్న భూములకు సుప్రీంకోర్టు ఆదేశం మేరకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం భూములు కోల్పోయిన రైతులు తాలూకాలోని కుడితిని పట్టణంలో చేపట్టిన బంద్ విజయవంతమైంది. కర్ణాటక ప్రాంత రైతు సంఘం, సీఐటీయూతో పాటు వివిధ సంఘ సంస్థల సహకారంతో భూ బాధితుల ప్రాంత రైతు సంఘం నాయకుడు యూ.బసవరాజ్ నేతృత్వంలో ఉదయం 6 గంటల నుంచి పట్టణ బంద్ చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం నేతలు మాట్లాడుతూ... రెండేళ్లుగా ఆందోళన చేస్తున్న ప్రభుత్వం స్పందించలేదని మండిపడ్డారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కుడితినిలోని విద్యా సంస్థలు, బ్యాంకులు తదితరాలను బంద్ చేశారు. రాస్తారోకో చేయడంతో వాహనాల సంచారం నిలిచిపోయింది. దీంతో కంప్లికి వెళ్లే వాహనాలు బైపాస్ రోడ్డు నుంచి అంబేడ్కర్ సర్కిల్ వైపు వెళ్లాయి. కుడితిని చుట్టు పక్కల 7 గ్రామాల్లోని 10 వేల ఎకరాలకు పైగా భూమిని కేఐడీబీ స్వాధీనం చేసుకొని 14 ఏళ్లు గడిచిన పరిశ్రమలు మాత్రం ప్రారంభం కాలేదు. స్వాధీనం చేసుకున్న భూమిని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పరిహారం చెల్లించండి లేదా స్వాధీనం చేసుకున్న భూములను అభివృద్ధి చేసి 50 శాతం భాగం బాధితులకు అప్పగించాలని ప్రభుత్వానికి ప్రతిపాదించారు. రెండేళ్ల నుంచి పోరాటం చేస్తున్న ప్రభుత్వం స్పందించడం లేదని దీంతో బంద్ చేపట్టి ప్రభుత్వాన్ని హెచ్చరించినట్లు ఆ సంఘం నేతలు బసవరాజ్, సత్యబాబు తెలిపారు. ఆందోళనలో బాధిత రైతులు తిప్పేస్వామి, జంగ్లిసాబ్, శివరామ్, రేణుకరాజ్, దొడ్డబసప్ప తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

చట్టాలను తెలుసుకోవాలి

హొసపేటె: తాలూకా న్యాయ సేవా కమిటీ, న్యాయవాదుల సంఘం హొస్పేట్, పోలీస్ శాఖ, మహిళ శిశు అభివృద్ధి శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ వారి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని జేసీస్ పాఠశాలలో బాల్య వివాహాల నిషేధం, లైంగిక నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, తాలూకా లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ హేమలత కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. దేశ పౌరులుగా మన దేశ చట్టాన్ని తెలుసుకోవాలి, వాటి అనుగుణంగా సమాజంలో నడుచుకోవాలన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులకు భంగం కలిగించకూడదన్నారు. అనంతరం గౌరవ ప్రధాన సివిల్ జడ్జి, తాలూకా న్యాయ సేవా కమిటీ సభ్య కార్యదర్శి ప్రశాంత్ నాగలాపూర్ మాట్లాడుతూ.. హైకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని తాలూకాలలో లీగల్ సర్వీస్ కమిటీని ఏర్పాటు చేసి న్యాయపరమైన అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలోని చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేబీ.లింగప్ప తదితరులు పాల్గొన్నారు.

డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా



డీఈఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

కోలారు: మాలూరు తాలూకా దొడ్డశివారు గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఇంగ్లిష్ ఉపాధ్యాయురాలిపై అగ్రవర్ణాలకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయినులు కులం పేరుతో వేధిస్తున్నారని ఆరోపిస్తూ దళిత సంఘాల కార్యకర్తలు మంగళవారం నగరంలోని డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. వివరాలు...టీచర్ రాధమ్మపై అదే పాఠశాలలో పనిచేస్తున్న మరో ఇద్దరు మహిళా ఉపాధ్యాయినులు, బీఈఓ కులం పేరుతో దూషించారని ఆరోపించారు. ఉపాధ్యాయురాలు రాధమ్మను వేధిస్తున్న ఇద్దరు ఉపాధ్యాయినులను వెంటనే సస్పెండు చేసి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు డీఈఓ కృష్ణమూర్తికి వినతి పత్రం సమర్పించారు. అదే విధంగా ఆనేపుర గ్రామానికి బదిలీ చేసిన ఉపాధ్యాయురాలు రాధమ్మను తిరిగి దొడ్డశివారు గ్రామంలోనే నియమించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో సంగసంద్ర విజయకుమార్, కర్ణాటక దళిత నాగరిక సమితి రాష్ట్ర అధ్యక్షుడు పురహళ్లి జి యల్లప్ప, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి ముందు ఆందోళన

- యువకుడి మృతిపై ఆగ్రహం



ఆస్పత్రి ముందు బైఠాయించిన దృశ్యం

హొసపేటె: వైద్యుల నిర్లక్ష్యం వల్లే యువకుడు మృతి చెందాడని ఆరోపిస్తూ మృతుని బంధువులు మంగళవారం మరియమ్మనహళ్లి పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. మరియమ్మనహళ్లి 11వ వార్డుకు చెందిన నలబండి సలీం (28) మృతి చెందాడు. ఉదయం 8 గంటల ప్రాంతంలో సలీం అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యాడు. దీంతో ఆందోళన చెందిన కుటుంబీకులు వెంటనే పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి ఫోన్ చేశారు. అయితే కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్యుడు లేక పోవడంతో హాస్పిటల్‌లోని 100 పడకల ఆస్పత్రికి తరలిస్తుండగా అంబులెన్స్‌లోనే సలీం మృతి చెందాడు. దీంతో ఆగ్రహించిన మృతుడి బంధువులు, స్థానికులు మరియమ్మనహళ్లి పట్టణంలోని ఆరోగ్య కేంద్రం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. దీనిపై సమాచారం అందుకున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్.శంకర్‌నాయక్ సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడి నిరసన విరమింపజేశారు.

డిమాండ్లు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న ఉపాధ్యాయులు

కోలారు : అర్హులైన ఉపాధ్యాయులకు 2016కు ముందు తరహాలోనే అర్హత ఆధారంగా ఉన్నత పాఠశాలకు పదోన్నతి కల్పించడంతో పాటు వివిధ డిమాండ్లు పరిష్కరించాలని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్, బీఈఓలకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు ఎస్ నారాయణస్వామి, ప్రధాన కార్యదర్శి చంద్రప్పలు మాట్లాడుతూ... డిగ్రీ పూర్తి చేసిన సీనియారిటీ ఆధారంగా పదోన్నతి కల్పించాలన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు ఎస్ నారాయణస్వామి, జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు జి శ్రీనివాస్, దైహిక ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ చైడప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీ జాప్యంపై నిరసన



జిల్లాధికారితో మాట్లాడుతున్న కూలీలు

హొసపేటె: నరేగా కూలీల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాధికారి కార్యాలయం ముందు నిరసనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సంఘం నేతలు హులిగమ్మ, భాగమ్మ బసవరాజు మాట్లాడుతూ.. ఎన్ఆర్ఈజీఏ చట్ట ప్రకారం, వేతనాలు 15 రోజుల్లోపు వేతనాలను అందించాలి కానీ రెండు నెలలు జరుగుతున్న ఇంతవరకు కూలీ అందలేదన్నారు. ఎన్ఆర్ఈజీఏ కింద పని చేసిన 2 నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని ఎన్నికల ప్రవర్తనా నియమావళి, సాంకేతిక సమస్య సాకుతో కొత్త జాబ్ కార్డుల సౌకర్యం కల్పించలేదు. వెంటనే జాబ్‌కార్డు జారీ చేయాలన్నారు. అనంతరం వినతిపత్రాన్ని జిల్లాధికారి దివాకర్‌కు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి



చిన్నారి మంజునాథ్ (ఫైల్) ప్రమాద దృశ్యం

హుబ్లీ: విజయపురలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదేళ్ల బాలుడు మృతి చెందాడు. అంగనవాడీ పాఠశాలకు వెళ్లడానికి రోడ్డుదాటుతుండగా జరిగిన ప్రమాదంలో ఈ బాలుడు ప్రాణాలను కోల్పోయాడు. బసవరాజ మంజునాథ్ బోపడే (5) మృతుడు. రోడ్డు దాటుతుండగా ఉన్న ఫలంగా ఓ స్కూల్ వాహనం ఢీకొనింది. కిందపడ్డ బాలుడిపై చక్రాలు దూసుకెళ్లాయి. ఎస్ఐ శివానంద పాటిల్ సదరు స్కూల్ వాహనాన్ని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. బాలుడి మృతదేహాన్ని చూసిన తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు.

పాదయాత్రకు 2 వేల మంది కార్యకర్తలు

హుబ్లీ: మైసూరు నుంచి బెంగళూరు వరకు బీజేపీ, జేడీఎస్ నిర్వహిస్తున్న పాదయాత్రకు మద్దతుగా ధార్వాడ నుంచి 2 వేల మంది కార్యకర్తలు వస్తున్నారని హుబ్లీ ధార్వాడ సెంట్రల్ ఎమ్మెల్యే మహేష్ టెంగినకాయి తెలిపారు. నగరంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ముడా కుంభకోణంకు సంబంధించి సీఎం సిద్దరామయ్య రాజీనామా డిమాండ్ చేస్తూ మిత్రి పార్టీలు పాదయాత్ర ప్రారంభించాయని, గ్రామీణ, నగర జిల్లాల 2 వేల మందిపైగా కార్యకర్తలు పాల్గొనడానికి ఉత్సాహం చూపుతున్నారన్నారు. ఈ సందర్భంగా మేయర్ రామన్న బడిగేర, బీజేపీ నగర అధ్యక్షుడు తిప్పణ్ణ మజ్జిగి, కార్పొరేటర్లు వీరన్న సవడి, సంతోష్ చవాన్, డిప్యూటీ మేయర్ దుర్గమ్మ బెజవాడ పాల్గొన్నారు.

ఇద్దరు బైక్ దొంగలు అరెస్ట్

హుబ్లీ: ద్విచక్ర వాహనాలను అపహరిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసిన హుబ్లీ ఉపనగర పోలీసులు వీరి నుంచి రూ.2 లక్షలు విలువైన ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు హావేరి జిల్లా తడస గ్రామం రమేశ్, షరీఫ్‌లుగా గుర్తించారు. ఇటీవల ఉపనగర పోలీస్ స్టేషన్ పరిధిలో బైక్‌ల చోరీ కేసులు నమోదయ్యాయి. దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు.

చిన్నారి ప్రతిభ

హుబ్లీ: స్థానిక నవనగర్ సరస్వతి విద్యాలయం నర్సరీ విద్యార్థిని ఐరా మంజునాథ పాటిల్ (3) ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో స్థానం సాధించింది. మంచి జ్ఞాపక శక్తితో అందరిని ఆశ్చర్యపరుస్తోంది. చిన్నారి ఐరా జంతువుల పేర్లు, ఫలాల పేర్లు అదే విధంగా 15 దేశాల జాతీయ చిహ్నాలు, మానవ శరీరంలోని అవయవాలు తదితర వాటిపై చిన్నారి టకటక చెప్పేస్తుంది. బాలిక ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు సాధించడంతో పాఠశాల యాజమాన్యం అభినందించింది.

దుర్గమ్మ గుడి ఆలయ హుండీలో మంటలు

సాక్షి,బళ్లారి: నగర ఆరాధ్య దైవం కనకదుర్గమ్మ ఆలయ హుండీకి మంటలు వ్యాపించాయి. సోమవారం సాయంత్రం హుండీ పక్కన అగరబత్తి ద్వారా రవ్వలు ఎగిరి హుండీలో పడటంతో హుండీ నుంచి పొగలు, మంటలు రావడం గమనించిన భక్తులు, సిబ్బంది వెంటనే అప్రమత్తమై మంటలను ఆర్పివేశారు. అయితే ప్రమాదం జరిగినప్పటికి హుండీ తెరవకపోవడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు, ఆలయ ఈఓ హనుమంతప్ప, జిల్లా ఉన్నతాధికారులకు ప్రమాద దృశ్యాల వీడియోలను పంపించారు.

పాదయాత్రకు తరలిన కార్యకర్తలు



పాదయాత్రకు వెళుతున్న బీజేపీ మోర్చా నేతలు

బళ్లారిఅర్బన్: ముడా కేసులో సీఎం రాజీనామాను డిమాండ్ చేస్తూ బీజేపీ, జేడీఎస్ ఆధ్వర్యంలో జరుగుతున్న పాతయాత్రకు బళ్లారి జిల్లా నుంచి కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ ఆధ్వర్యంలో బీజేపీ రైతు మోర్చా ముందుగా స్థానిక దుర్గమ్మ దేవస్థానంలో పూజలు చేశారు. మోర్చా అధ్యక్షుడు గణపాల్ ఐనాథ్ రెడ్డి సారథ్యంలో బళ్లారి నుంచి మైసూరుకు బస్సు ద్వారా 45 మందికి పైగా కార్యకర్తలు బయలుదేరారు. పాదయాత్రకు పార్టీ ప్రముఖులు శ్రీనివాస్‌రెడ్డి, రామచంద్రయ్య, శివరుద్రగౌడ, బసవరాజ్ పాటిల్, హొన్నరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, జాహి ప్రకాష్ రెడ్డి, దాసరెడ్డి, రామణ్ణగౌడ, శివ తదితర కార్యకర్తలు తరలివెళ్లారు.